

'రాష్ట్రంలో అన్ని ప్రాంతాలు కళకళలాడాలి. పాడిపంటలతో పులకించిపోవాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50



3 నగరాలు 4 దేశాలు

- తొలిదశలో హైదరాబాద్ దొంగల నుంచి స్థానిక వ్యాపారుల వద్దకు
- రెండోదశలో ప్రత్యేక వ్యక్తులతో చెన్నై, ముంబై, కోల్‌కతాకు..
- మూడో దశలో ప్రత్యేక పద్ధతిలో సూడాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు రవాణా
- ఈ ముఠాలపై నగర పోలీసుల దృష్టి
- మూలాలను కనిపెట్టే దిశగా దర్యాప్తు

సీ ఫుడ్ ముసుగులో దేశం దాటిపోతున్న చోరీ సెల్‌ఫోన్లు

సెల్‌ఫోన్ చోరీకి గురైందంటే ఒకటీ రెండు రోజులు బాధపడతాం. కాస్త విలువైన ఫోన్ అయితే పోలీసులకు ఫిర్యాదు చేస్తాం. దొరికితే దొరుకుతుంది లేదా కొద్దిరోజుల తర్వాత మర్చిపోతాం. కానీ ఈ సెల్‌ఫోన్ల చోరీ వెనుక పెద్ద వ్యవస్థీకృత దందా దాగి ఉందంటే మాత్రం విస్తుపోక తప్పదు. హైదరాబాద్‌తో పాటు దేశంలోని వివిధ మెట్రో నగరాల్లో దొంగల ముఠాల ద్వారా చోరీ అవుతున్న సెల్‌ఫోన్లు సీ ఫుడ్ ముసుగులో ఏకంగా దేశం దాటేస్తున్నాయి. ప్రధానంగా మూడు నగరాల మీదుగా నాలుగు దేశాలకు తరలిపోతున్నాయి. ఈ నెట్‌వర్క్‌లో స్థానికుల నుంచి విదేశీయుల వరకు ఉంటున్నారు. వాట్సాప్ గ్రూపుల ద్వారా చోరీ ఫోన్ల ఫొటోలు షేర్ చేసుకుని, క్రయవిక్రయాలు జరుపుతున్నారు. ఓడ రేవుల్లో కార్యకలాపాలు సాగించే వారితో పాటు ఆయా దేశాల సరిహద్దు గ్రామాలకు చెందిన ప్రజలు సైతం ఈ స్మగ్లింగ్‌లో కీలకంగా వ్యవహరిస్తున్నారనే అనుమానాలున్నాయి. ఈ మొత్తం దందా మూడు దశల్లో కొనసాగుతోంది. తొలుత దొంగల నుంచి స్థానిక వ్యాపారుల వద్దకు చేరుతున్న సెల్‌ఫోన్లు, అక్కడి నుంచి మెట్రో నగరాలకు చేరుకుని ఆ తర్వాత దేశ సరిహద్దులు దాటిపోతున్నాయి.

- సాక్షి, హైదరాబాద్

ఫస్ట్ స్టేజ్..



→ నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన చిన్న చిన్న ఉద్యోగులు, చిరు వ్యాపారులు, ఆటోడ్రైవర్లు కలిసి ముఠాలుగా ఏర్పడుతున్నారు. బస్సుల్లో, బస్టాపులు, వైన్ షాపులు, బహిరంగ సభలు జరిగే చోట్ల, ఇతర రద్దీ ప్రాంతాల్లో సెల్‌ఫోన్లు దొంగిలిస్తున్నారు. ఈ చోరీ ఫోన్లను అబిడ్స్‌లోని జగదీశ్ మార్కెట్ సహా వివిధ ప్రాంతాల్లో ఉన్న సెల్‌ఫోన్ మార్కెట్లలోని కొందరు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ఈ ఫోన్లు అన్‌లాక్ చేయడం కోసం ప్రత్యేకంగా కొందరు టెక్నీషియన్లు పని చేస్తుంటారు. వీళ్ల చోరీ ఫోన్లు అన్‌లాక్ చేయడంతో పాటు అవసరమైన వాటి ఐఎంఈఐ నంబర్లు ట్యాంపరింగ్ చేస్తారు. నగరంలో చోరీ ఫోన్లు ఖరీదు చేస్తున్న వ్యాపారులు ముంబై, చెన్నై, కోల్‌కతాల్లో ఉన్న 'హోల్‌సేల్ వ్యాపారులకు' కలిపి ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఉంటున్నాయి. ఇక్కడ ఫోన్లు కొంటున్న వ్యాపారులు తమ వద్ద అందుబాటులో ఉన్న ఫోన్ల ఫొటోలను వాటిల్లో పోస్టు చేస్తున్నారు.

సెకండ్ స్టేజ్..



→ వాట్సాప్ గ్రూపుల్లో ఉన్న ఇతర నగరాలకు చెందిన వ్యాపారులు తమకు నచ్చిన, అవసరమైన సెల్‌ఫోన్లను ఆ ఫొటోల ద్వారా ఎంపిక చేసుకుంటున్నారు. బేరసారాల తర్వాత ఇక్కడి వ్యాపారులు అక్కడి వారు కోరిన వాటిని పార్శిల్ చేసి తమ మనుషులకు ఇచ్చి పంపిస్తున్నారు. ఇలా ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా నగరాల్లోని వ్యాపారుల వద్దకు చోరీ సెల్‌ఫోన్లు చేరుతున్నాయి. సూడాన్, శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్‌లో ఉన్న వ్యాపారులు, ఈ నగరాల్లోని వ్యాపారులకు ఉమ్మడి వాట్సాప్ గ్రూపులు ఉంటున్నాయి. వాటిలో పోస్టు అవుతున్న ఫొటోల ఆధారంగా విదేశీ వ్యాపారులు ఫోన్లు సెలెక్ట్ చేసుకుంటున్నారు.

థర్డ్ స్టేజ్..

→ చోరీ సెల్‌ఫోన్లు సూడాన్, శ్రీలంకలతో పాటు బంగ్లాదేశ్, నేపాల్‌లకు ఎక్కువగా వెళ్తున్నాయి. విదేశీ వ్యాపారులు ఎంపిక చేసుకున్న సెల్‌ఫోన్లను ఇక్కడి వ్యాపారులు ప్రత్యేక పద్ధతిలో ప్యాక్ చేస్తున్నారు. ఐదేసి ఫోన్లు చొప్పున తొలుత ట్రాన్స్‌పరెంట్ బాక్సుల్లో పార్శిల్ చేస్తున్నారు. తర్వాత ఇలాంటి 20 నుంచి 25 బాక్సులను థర్మా కోల్ పెట్టెల్లో ప్యాక్ చేస్తున్నారు. సీ ఫుడ్‌గా చెబుతూ ఓడ రేవుల ద్వారా సూడాన్, శ్రీలంక దేశాలకు పంపిస్తున్నారు. బంగ్లాదేశ్, నేపాల్ దేశాలకు మాత్రం థర్మాకోల్ పెట్టెల్లోనే పార్శిల్ చేసి సరిహద్దు గ్రామాలకు చెందిన వారి ద్వారా స్మగ్లింగ్ చేస్తున్నారు. రెండు వైపులా ఉండే సరిహద్దు గ్రామాలకు చెందిన కమీషన్ ఏజెంట్లు ఈ వ్యవహారం పర్యవేక్షిస్తున్నారు. కోల్‌కతా నుంచి తమ వద్దకు వస్తున్న ఫోన్లను ఆవలి వైపు ఉన్న వారికి చేరవేస్తూ కమీషన్లు తీసుకుంటున్నారు. దీనికోసం సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేకంగా కొన్ని ముఠాలు పనిచేస్తున్నాయి. వీరికి ఒక్కో ఫోన్‌కు దాని మోడల్ ఆధారంగా రూ.100 నుంచి రూ.500 వరకు కమీషన్‌గా లభిస్తోంది. సీ ఫుడ్ పేరుతో వెళ్తున్న థర్మాకోల్ బాక్సుల్ని తనిఖీ చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చూపిస్తు న్నారా? లేక స్మగ్లర్లతో మిలాఖత్ అయ్యారా? తేలాల్సి ఉందని నగర పోలీసులు చెబుతున్నారు. ఈ విషయంలో కేంద్ర ఏజెన్సీలతో కలిసి పని చేయాల్సి ఉంటుందని, ఇప్పటివరకు తాము పట్టుకున్న ముఠాల విచారణలో వెలుగులోకి వచ్చిన వివరాలను ఆయా ఏజెన్సీలకు పంపిస్తామని పేర్కొంటున్నారు.


ఐదు ఫోన్లు చొప్పున ఇలాంటి ట్రాన్స్‌పరెంట్ బాక్సుల్లో ప్యాక్ చేస్తారు


తర్వాత 20-25 చొప్పున వాటిని థర్మాకోల్ బాక్సుల్లో పంపిస్తారు

వరుస అరెస్టులతో అదుపులోకి చోరీలు

→ నగరంలో సెల్‌ఫోన్ చోరీలు పెరగడంతో పాటు కొన్ని సందర్భాల్లో ఫోన్ల కోసం దోపిడీలు, బందిపోటు దొంగతనాలతో పాటు హత్యలూ జరిగాయి. వీటిని పరిగణనలోకి తీసుకున్న నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి టాస్క్‌ఫోర్స్ పోలీసులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. నగరంలో వ్యవస్థీకృతంగా సాగుతున్న సెల్‌ఫోన్ చోరీలకు చెక్ పెట్టాలని స్పష్టం చేశారు. దీంతో పక్కా ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్లిన దక్షిణ మండల టాస్క్‌ఫోర్స్ పోలీసులు మూడు ముఠాలను

మిగతా IIవ పేజీలో ▶

సరిహద్దుల్లో పేలనున్న సిటీ తుపాకీ

- ఆర్మీ నుంచి హైదరాబాద్‌కు చెందిన లోకేశ్ మిషన్స్‌కు ఆర్డర్
- 550 'అస్మి' సబ్‌మెషీన్ గన్ల తయారీకి కాంట్రాక్టు పొందిన సంస్థ
- బీఎస్ఎఫ్ నుంచి కూడా పైలట్ ఆర్డర్
- ఇప్పటికే ప్రయోగాత్మకంగా ఆర్మీ, ఎన్ఎస్‌జీ, అసోం రైఫిల్స్‌కు అందజేత

వివరాలు IIలో



హై కాస్ట్ సిటీ

- జీవన వ్యయంలో ఖరీదైన నగరం
- కాస్ట్ ఆఫ్ లివింగ్‌లో సిటీకి 5వ స్థానం
- అత్యంత ఖరీదైన నగరంగా ముంబై
- మెర్సర్ అధ్యయనంలో వెల్లడి

వివరాలు 7లో








మానవా... మారవా?

ఉప్పల్ స్కైవాక్‌ను పట్టించుకోని పాదచారులు..

పెరుగుతున్న ట్రాఫిక్ నగర పాదచారికి అంత భద్రం కాదనేది జగమెరిగిన సత్యం. జీబ్రా క్రాసింగ్, పెలికాన్ సిగ్నల్స్ వంటివి పక్కాగా లేకపోవడం, ఫుట్‌పాత్‌లు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు అవసరమైన సంఖ్యలో అందుబాటు లోకి రాకపోవడమే దీనికి కారణం. అయితే పలుచోట్ల మౌలిక వసతులున్నా నగరవాసులు వినియోగించుకోవట్లేదు. ఉప్పల్‌లో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన స్కైవాక్ దీనికి ఉదాహ రణ. అన్ని వయసుల వారికీ ఉపకరించే విధంగా దీన్ని నిర్మించారు. మెట్లు, ఎస్కలేటర్, ఎలివేటర్... ఇలా ఎవరికీ ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు ఏర్పాటు చేశారు. పాదచారులు రోడ్డు దాటడానికి స్కైవాక్ ఉపయోగించాలంటూ ప్రకటనలూ చేస్తున్నారు. అయినప్పటికీ అనేక మంది రహదారినే వినియోగిస్తున్నారు. దీన్ని గమనించిన అధికారులు డివైడర్ దగ్గర బారికేడ్లు, ముళ్ల కంచె, సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. అయినప్పటికీ పాదచారులు ప్రమాదకరంగా రహదారి మధ్య నుంచే రోడ్డు దాటుతున్నారు. డివైడర్ వద్ద ఏర్పాటు చేసిన ముళ్ల కంచెను పైకెత్తేసి మరీ దాని కింద నుంచే రోడ్డు దాటుతున్నారు. ఇది ప్రమాదహేతువని, వాహన చోదకులకు ఇబ్బందికరమని అధికారులు చెప్తున్నా పెడచెవిన పెడుతున్నారు.





తాను డిజైన్ చేసిన సబ్‌మెషీన్ గన్‌తో లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ బన్సోడ్

ఆర్మీ నుంచి నగరానికి చెందిన లోకేశ్ మిషన్స్‌కు ఆర్డర్

550 ‘అస్మి’ సబ్‌మెషీన్ గన్ల తయారీ కాంట్రాక్టు పొందిన సంస్థ

సరిహద్దుల్లో పేలనున్న సిటీ తుపాకీ

సాక్షి, హైదరాబాద్

భారత సరిహద్దుల్లో కాపుకాసే ఆర్మీ జవాన్ల చేతిలో ‘సిటీ తుపాకీ’ పేలనుంది. ‘అస్మి’ పేరుతో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ) డిజైన్ చేసిన ఈ మొట్టమొదటి భారతీయ సబ్ మెషీన్‌గన్ తయారీ కాంట్రాక్టును హైదరాబాద్‌కు చెందిన లోకేశ్ మిషన్స్ లిమిటెడ్ దక్కించుకుంది. తొలి విడతలో ఆర్మీ నార్తర్న్ కమాండ్ కోసం రూ.4.26 కోట్లతో 550 తుపాకులు తయా రు చేసి సరఫరా చేయనున్నారు. ఇజ్రాయెల్, జర్మనీల్లోని ఆయుధ కర్మాగారాలకు దీటుగా నగరానికి చెందిన ఓ చిన్న సంస్థ ఈ ప్రతి ష్టాత్మక కాంట్రాక్టు దక్కించుకోవడం గమనార్హం. ఈ తుపాకీని సరిహద్దు భద్రతా దళాలతో పాటు కేంద్ర పోలీసు బలగాలూ వినియోగించనున్నాయి. ప్రముఖుల భద్రత కోసం వినియోగించడానికీ ‘అస్మి’ అనువుగా ఉంటుంది.

→ పుణేలోని డీఆర్‌డీఓలో అంతర్భాగమైన అర్మా మెంట్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఆర్మీ సంయుక్తంగా ఆత్మనిర్భర్ భారత్ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పరిశోధనతో ‘అస్మి’ రూపుదిద్దుకుంది. నాగ్‌పూర్‌కు చెందిన లెఫ్టినెంట్ కల్నల్ ప్రసాద్ బన్సోడ్ దీన్ని డిజైన్ చేశారు. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) ప్రమాణాలకు లోబడి, దేశీయ పరిస్థితులకు అనుగుణంగా తయారు చేశారు. సంస్కృతంలో అస్మిత అంటే ధైర్యం, గర్వం (ప్రైడ్) అని అర్థం. దీన్ని సంక్షిప్తీకరించిన ప్రసాద్ ఈ తుపాకీకి ‘అస్మి’ అని పేరు పెట్టారు. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన ఇజ్రాయెల్ వెపన్ ఇండస్ట్రీస్ తయారు చేసే ఉజీ, జర్మనీలో తయారయ్యే హెక్లర్, కోచ్ ఎంపీ–5 ఆయుధాలకు దీటుగా ‘అస్మి’ పని చేస్తుందని డీఆర్డీఓ ప్రకటించింది.

ఉజీ, హెక్లర్‌లకు దీటుగా..

హైదరాబాద్‌లోని బాలానగర్ కేంద్రంగా కార్యకలాపాలు సాగించే లోకేశ్ మిషన్స్ లిమిటెడ్ సంస్థ చిన్న పరిమాణంలో ఆయుధాలు తయారు చేస్తుంది. అయితే అంతర్జాతీయ పోటీని తట్టుకున్న ఈ సంస్థ ‘అస్మి’ తయారీ కాంట్రాక్టు దక్కించుకుంది. ఇప్పటికే పది చొప్పున తుపాకులు తయారు చేసి ఆర్మీతో పాటు నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ (ఎన్ఎస్‌జీ), అసోం రైఫిల్స్‌కు అందించింది. నాణ్యతపై వాళ్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేయడంతో తొలి విడతలో ఆర్మీ నార్తర్న్ కమాండ్ 550 తుపాకుల తయారీకి ఆర్డర్ ఇచ్చింది. ఈ ఏడాది సెప్టెంబర్ 28 నాటికి వీటిని అందించడానికి లోకేశ్ మెషీన్స్ లిమిటెడ్ సన్నాహాలు చేస్తోంది. మరోపక్క బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్) నుంచి ఈ సంస్థకు పైలట్ ఆర్డర్ వచ్చింది. ‘అస్మి’ ఈ తరహాకు చెందిన ఇతర ఆయుధాల కంటే 10–15 శాతం తక్కువ బరువుతో ఉంటుంది. దీన్ని ఆపకుండా 2,400 రౌండ్ల వరకు కాల్చే అవకాశం ఉంది.

అంతర్జాతీయ పోటీని తట్టుకుని..

‘అస్మి’ వివరాలివీ..



పేరు: అస్మి
స్వరూపం: సబ్ మెషీన్ గన్
ఖరీదు: ఒక్కోటి రూ.50 వేలు
బరువు: 2.4 కేజీలు

పొడవు: 382 మిల్లీమీటర్లు
క్యాలిబర్: 9 X19 ఎంఎం
రేంజ్: 100 మీటర్లు
మ్యాగ్‌జైన్: 32 తూటాలు
సామర్థ్యం: నిమిషానికి 800 తూటాలు
పరిశోధనకు పట్టిన సమయం: మూడేళ్ల లోపు

ఒక్క ఛాన్స్

విశ్వ.. నట... నగరంగా హైదరాబాద్



ప్రొఫెషన్‌తో పనిలేదు.. యాక్టింగే ప్యాషన్

సిటిజనుల్లో పెరిగిన నటనాభిరుచి

ఓటీటీలు, యూట్యూబ్‌ల రాకతో ఓవర్‌టైమ్ యాక్టింగ్‌కు సై..

- వివరాలు 11లో

3 నగరాలు.. 4 దేశాలు

▶ మొదటి పేజీ తరువాయి

పట్టుకున్నారు. మే ఆఖరి వారంలో 17 మందిని అరెస్టు చేసి 703 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. గత నెల మొదటి వారంలో ముగ్గురిని పట్టుకుని 43 సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. దీనికి కొనసాగింపుగా ఇటీవల 31 మందిని అరెస్టు చేసి 713 ఫోన్లు సీజ్ చేశారు. ఈ వరుస అరెస్టులతో నగరంలో సెల్‌ఫోన్ చోరీలు అదుపులోకి వచ్చాయి. దీంతో ఈ వ్యవస్థీకృత ముఠాల వెనుక ఉన్న వారిని గుర్తించడంపై అధికారులు దృష్టి పెట్టారు. ఈ దిశగా ముమ్మర దర్యాప్తు జరుపుతున్నట్లు ఓ ఉన్నతాధికారి చెప్పారు.




క్రేజీ కట్స్..

సిటీలో స్టైలిష్ హెయిర్ కట్‌కు క్రేజ్

విస్తరిస్తున్న అంతర్జాతీయ ఫ్యాషన్ సెలూన్స్

నెలలో ఒక్క అంతర్జాతీయ హెయిర్ స్టైలిస్ట్‌కైనా ఆహ్వానం..

సినీతారలకు ధీటుగా ఔత్సాహికులు



11లో


'ప్రతి రైతూ వాణిజ్యవేత్తగా మారాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 17
సంచిక: 88

బుధవారం 19-6-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




విండీస్ ధనాధన్

టి20 ప్రపంచకప్‌లో అఫ్గానిస్తాన్‌పై 104 పరుగులతో గెలుపు -14లో



రికార్డుల ర్యాలీ

77 వేల స్థాయిపై ముగిసిన సెన్సెక్స్, జీవిత కాల గరిష్ఠానికి ఇన్వెస్టర్ల సంపద -15లో



0.001 శాతం నిర్లక్ష్యమున్నా..

నీట్‌–యూజీ పరీక్ష విధానం, నిర్వహణలో 0.001% లోపం తలెత్తినా సరే సకాలంలో పరిష్కరించాలని సుప్రీం పేర్కొంది.

వివరాలు 6లో ▸



గంగమ్మ దత్తత తీసుకుంది

గంగామాత తనను దత్తత తీసుకున్నట్లుందని ప్రధాని మోదీ అన్నారు. మూడోసారి గెలిచాక తొలిసారి వారణాసిలో పర్యటించారు.

వివరాలు 6లో ▸



ఆంక్షలపై సమష్టి సమరం

అమెరికా సారథ్యంలో కొనసాగుతున్న ఆంక్షలను ఉత్తర కొరియాతో కలిసి సమష్టిగా ఎదుర్కొంటామని పుతిన్ అన్నారు.

వివరాలు 6లో ▸



వలసదారులకు భారీ ఆఫర్

తమ పౌరులను పెళ్లాడి కనీసం పదేళ్లుగా నివసిస్తున్న వారికి పౌరసత్వం ఇవ్వాలని అమెరికా ప్రభుత్వం నిర్ణయించింది.

వివరాలు 6లో ▸

నైపుణ్యానికే భవిష్యత్తు

సర్టిఫికెట్లు చూసి ఉద్యోగాలు ఇచ్చే రోజులు పోయాయి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాభివృద్ధికి రాష్ట్ర సర్కారు కార్యాచరణ
- రూ.2,324 కోట్లతో ఆధునిక శిక్షణా సంస్థలుగా ఐటీఐల అభివృద్ధి
- ఏటీసీల్లో రోబో టెక్నాలజీతో పాటు ఇతర సాంకేతిక ట్రేడ్‌లలో శిక్షణ
- ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కల్పనకే ప్రభుత్వ ప్రాధాన్యత
- తొలుత 4 ఐటీఐలు ఏటీసీలుగా ఆధునీకరణ
- మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్‌లో నూతన భవనాలకు సీఎం శంకుస్థాపన



సాక్షి, హైదరాబాద్: సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికే ఇకపై ఉద్యోగాలు దక్కుతాయని రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. సర్టిఫికెట్లు చూసి ఉద్యోగాలు ఇచ్చే రోజులు పోయాయన్నారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానం విస్తృతమవుతోందని, సాంకేతిక నైపుణ్యం ఉన్న వారికే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ఈ నేపథ్యంలోనే విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాభివృద్ధి దిశగా రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక కార్యాచరణకు శ్రీకారం చుట్టిందని వెల్లడించారు. రాష్ట్రంలోని పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్ (ఏటీసీ)లుగా ఆధునీకరిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం నాలుగు ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తూ నూతన భవన నిర్మాణాల కోసం ఐటీఐ మల్లేపల్లి క్యాంపస్‌లో సీఎం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

ప్రపంచంతో పోటీ పడేలా నైపుణ్యాభివృద్ధి

'ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసమే తెలంగాణ ఉద్యమం జరిగింది. ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాత ప్రభుత్వ శాఖల్లో నియామకాలు జరుగుతాయని నిరుద్యోగులు ఆశించారు. కోచింగ్ సెంటర్లకు

మిగతా 2వ పేజీలో ▶

స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు చర్యలు

మంత్రి శ్రీధర్‌బాబు



పరిశ్రమలు, నైపుణ్య సంస్థల మధ్య అంతరాన్ని తొలగించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. ఇందులో భాగంగా ఏటీసీల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని చెప్పారు. ప్రపంచ దేశాలతో పోటీ పడే విధంగా ఏటీసీలు అభివృద్ధి చెందేలా కార్యాచరణ రూపొందించామన్నారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన ప్రయోగశాలలను వీటిల్లో ఏర్పాటు చేస్తున్నామన్నారు. ప్రతి ఏటీసీలో వీఆర్ (వర్చువల్ రియాలిటీ) టెక్నాలజీని ప్రవేశపెడుతున్నామన్నారు. ఈ ఏడాది జనవరిలో ఏటీసీ ప్రాజెక్టును ఖరారు చేశామని, మార్చి నెలలో టాటా టెక్నాలజీస్‌తో ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ప్రత్యేకంగా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటుకు కూడా చర్యలు తీసుకుంటున్నట్లు శ్రీధర్‌బాబు వివరించారు.



టార్గెట్ రూ. 5,000 కోట్లు

భూవిలువల సవరణ ద్వారా సమకూరే అదనపు ఆదాయం

- సవరణ ప్రక్రియను అధికారికంగా ప్రారంభించిన రిజిస్ట్రేషన్ల శాఖ
- గ్రామీణ–పట్టణ ప్రాంతాలు, వ్యవసాయ–వ్యవసాయేతర భూములు, నివాస–వాణిజ్య ప్రాంతాల ప్రాతిపదికగా పరిశీలన
- గజం భూమి విలువ కనీసం రూ. 1,000 పెంచే అవకాశం
- ప్రధాన రహదారులకు ఇరువైపులా 100 శాతం సవరించే యోచన
- వ్యవసాయ భూముల విలువలపై రెవెన్యూ వర్గాలతో చర్చల తర్వాతే స్పష్టత
- ఈనెల 29 కల్లా సవరణ విలువలను నిర్ధారించనున్న కమిటీలు
- మొత్తంమీద 20–35% వరకు ఆదాయం పెరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భూముల విలువల సవరణ ప్రక్రియ అధికారికంగా ప్రారంభమైంది. ఇందు కోసం రెవెన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్ వర్గాలతో రిజిస్ట్రేషన్ల శాఖ రాష్ట్రవ్యాప్తంగా మంగళవారం ప్రాథమిక స్థాయి సమావేశాలను పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో భూములు, ఆస్తుల విలువలను పెంచడం ద్వారా 20 నుంచి 35 శాతం వరకు ప్రభుత్వానికి అదనపు ఆదాయం సమకూరే అవకాశముందని రిజిస్ట్రేషన్ల శాఖ అంచనా వేస్తోంది. అన్ని ప్రక్రియలు పూర్తి చేసిన అనంతరం ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త విలువల ద్వారా రూ.3,500 కోట్ల నుంచి రూ.5వేల కోట్ల వరకు ఆదాయం పెరగొచ్చని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలంటున్నాయి.

గజం రూ.1,000... ఎకరం రూ. 4లక్షలు పెంపు!

రాష్ట్రంలో ప్రస్తుతం చేస్తున్న సవరణ ప్రక్రియ అనంతరం గజం నివాస స్థలం విలువ కనీసం రూ.1,000 పెరిగే అవకాశముందని తెలుస్తోంది. ఈ మేరకు కనీస విలువతో పట్టణ ప్రాంతాల్లో నివాస స్థలాల విలువల పెంపు ప్రక్రియను మొదలు పెట్టాలని ప్రభుత్వ వర్గాల ద్వారా రిజిస్ట్రేషన్ల శాఖకు మౌఖిక ఆదేశాలు అందినట్టు తెలుస్తోంది. ఇక, ఎకరం వ్యవసాయ భూమి కనీస విలువ ఏ మేరకు సవరించాలన్న దానిపై ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుతం మారుమూల ప్రాంతాల్లోని వ్యవసాయ భూముల బహిరంగ మార్కెట్ విలువ ఎంతుందన్న దానిపై రెవెన్యూ వర్గాలతో చర్చించిన అనంతరం దీనిపై ఓ అంచనాకు

మిగతా 5వ పేజీలో ▶

న్యూస్‌రీల్

కార్పొరేట్ ఆస్పత్రులపై ఉక్కుపాదం



ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులను నిబంధనలకు విరుద్ధంగా నడిపితే వాటిపై ఉక్కుపాదం మోపుతామని వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు.

- వివరాలు 3లో▶

విద్యాహక్కు చట్టం అమలు ఏ దశలో ఉంది



పిల్లల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టాన్ని రాష్ట్రంలో పూర్తిగా ఎందుకు అమలుచేయడం లేదని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. చట్టం అమలు ఏ దశలో ఉందో చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశించింది.

- వివరాలు 3లో▶

25న ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాలు



ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు 25న విడుదల కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఫలితాల అనంతరం దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశానికి మరో దఫా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు.

- వివరాలు 3లో▶

రాష్ట్రంలో 'నీట్' మంటలు



నీట్ పరీక్ష లీకేజీపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు తెలంగాణకూ పాకా యి. నీట్ పరీక్ష రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో విద్యార్థి సంఘాల నేతృత్వంలో స్టూడెంట్ మార్చ్ జరిగింది.

- వివరాలు 3లో▶

ఇదండీ సంగతి



మన ఎంపీల ఇళ్లలో కూడా ఇంత మంచి ఆతిథ్యం దొరకలేదు మేడం!

మోదీ 3.0.. 100 రోజులు... మనవి 2 రోడ్లు



వంద రోజుల ప్రణాళికలో రెండు కీలక రోడ్ల ప్రాజెక్టులకు చోటు

- దేశవ్యాప్తంగా 3 వేల కి.మీ. రోడ్డు ప్రాజెక్టుల ఎంపిక
- ఆర్మూరు–జగిత్యాల–మంచిర్యాల యాక్సెస్ కంట్రోల్డ్ రోడ్డు, జగిత్యాల–కరీంనగర్ నాలుగు వరసల రోడ్డుకు చోటు
- వందరోజుల్లో రూ.6 వేల కోట్లతో ఈ రెండు ప్రాజెక్టుల పనుల ప్రారంభం
- యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా ప్రణాళిక
- ఎన్‌హెచ్ 63, 563లకు ఇక రాజయోగం

- వివరాలు 2లో



8 నూతన వంగడాలు

ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మంగళవారం వివిధ పంటల్లో ఎనిమిది నూతన వంగడాలను విడుదల చేసింది. సెంట్రల్ వెరైటల్ రిలీజ్ కమిటీ, రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీల ఆమోదంతో వీటిని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న పంటలలో మొత్తం ఎనిమిది రకాలను విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ఎం.రఘునందన్ రావు, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు.

- వివరాలు 5లో


• ముసుగు తొలగింది..

బూతులు.. బెదిరింపులు

ఏపీలో అధికారులపై మంత్రులు, టీడీపీ నేతల దుర్భాషలు

- 'పచ్చ'చొక్కా వాళ్లొస్తే కుర్చీ వేసి టీ ఇవ్వాలన్న మంత్రి అచ్చెన్న
- అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవు
- చెప్పింది చేయకపోతే ఏం జరుగుతుందో చెప్పాల్సిన పని లేదని హెచ్చరిక
- నర్సీపట్నం నడిరోడ్డులో మున్సిపల్ అధికారులపై 'అయ్యన్న' దుర్భాషలు
- స్పీకర్ అవుతున్నా.. అసెంబ్లీలో నిలబెడతానంటూ చిందులు
- పోలీసులను గత ప్రభుత్వ తొత్తులుగా అభివర్ణించిన హోం మంత్రి అనిత

12లో



లైన్‌లో పెడతా

నేను మాటిస్తున్నా.. అధికారులకు సమావేశం పెట్టి చెబుతా. రేపటి నుంచి ప్రతి కార్యకర్త ఎస్ఐ దగ్గరకు వెళ్లినా.. ఎమ్మార్వో, ఎండీఓ వద్దకు వెళ్లినా.. ఏ ఆఫీసుకు వెళ్లినా పసుపు బిళ్ల పెట్టుకుని వెళ్లండి. మీకు గౌరవంగా కుర్చీ వేసి టీ ఇచ్చి మీ పనేమిటి? అని అడిగి అందరికీ పనులు చేసే విధంగా అధికారులను లైన్‌లో పెడతా. ఎవరైనా మాట జవదాటితే ఏమవుతారో వాళ్లకు నేను చెప్పాల్సిన అవసరం లేదు.

- మంత్రి అచ్చెన్నాయుడు



బ్యాలెట్టే బెటర్

- అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు
- దేశంలోనూ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి
- ఈవీఎంలను పక్కన పెట్టాలి అప్పుడే ప్రజాస్వామ్యం నిస్సందేహంగా మనగలదు
- 'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ ట్వీట్

- వివరాలు 12లో▶

ఐటీలో కోతల కాలం!



- ఉద్యోగాలకు కత్తెర పెడుతున్న కంపెనీలు
- 2024లోనూ కొనసాగుతున్న లేఆఫ్స్
- ఏఐ, ఎంఎల్‌తో ఉద్యోగాలు కోల్పోతున్న వైనం
- 2022, 2023లో వేల మందికి ఉద్వాసన
- ఈ ఏడాది మే వరకు 75 వేల ఉద్యోగాల తొలగింపు
- నైపుణ్యాలు పెంచుకోవాలని సూచిస్తున్న ఐటీ నిపుణులు

సాక్షి, హైదరాబాద్: సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. ఒకప్పుడు ఉద్యోగార్థుల కలల ప్రపంచం.. సాఫ్ట్‌వేర్ కంపెనీలో జాబ్ వస్తే చాలు రెండు చేతులా సంపాదన, వీకెండ్ పార్టీలు, అప్పుడప్పుడూ టూర్లు. ఇక కరోనా వచ్చాక వర్క్ ఫ్రం హోం సౌలభ్యం. ఆ కలలన్నీ ఇప్పుడు సన్నగిల్లుతున్నాయి.. అంతర్జాతీయంగా ఆర్థిక మాంద్యం, రాజకీయ సంక్షోభం వంటి కారణాలతో ఐటీ కంపెనీలు ఉద్యోగులను ఎడాపెడా తొలగించేస్తున్నాయి. ఖర్చు తగ్గించుకునే నెపంతో పింక్ స్లిప్ ఇచ్చేసి ఇంటికి పంపేస్తున్నాయి. ఇక కొత్తగా ప్లేస్ మెంట్స్ ఇచ్చే విషయంలోనూ మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ఒకవేళ రిక్రూట్ చేసుకున్నా ఆఫర్ లెటర్ ఇవ్వడం లేదు.

అన్ని కంపెనీలదీ అదే బాట..

కరోనా సంక్షోభం తర్వాత ఐటీ రంగంలో చాలా ఒడిదుడుకులు వచ్చాయి. 2022, 2023 సంవత్సరాల్లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 2 వేల కంపెనీలు 4 లక్షల

మిగతా 16వ పేజీలో ▶

క్లుప్తంగా...

21న రాష్ట్ర కేబినెట్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ఈనెల 21న సచివాలయంలో రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రైతు రుణమాఫీ పథకానికి సంబంధించిన విధివిధానాలపై చర్చించి మంత్రివర్గం ఆమోదించే అవకాశాలున్నాయి. రైతుబంధు పథకం స్థానంలో కొత్తగా రైతు భరోసా పథకాన్ని అమల్లోకి తీసుకురావడంతో పాటు శాసనసభ బడ్జెట్ సమావేశాల నిర్వహణపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. 21న మంత్రివర్గ సమావేశం నిర్వహించాలని భావిస్తున్నామని, ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని సీఎంఓ వర్గాలు తెలిపాయి.

ఈవీఎంలతో ముప్పు



సాక్షి, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) వల్ల భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ముప్పు వాటిల్లే పరిస్థితి నెలకొందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ ఆందోళన వ్యక్తంచేశారు. ఈవీఎం వ్యవస్థపై నెలకొన్న అనుమాన పరిస్థితుల్లో వాటి సామర్థ్యాన్ని ప్రజలకు తెలియజేయాల్సిన అవసరముందని అభిప్రాయపడ్డారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ఎలాన్ మస్క్ ఇండియాలో జరిగిన ఎన్నికలపై చేసిన కామెంట్స్ వాస్తవ పరిస్థితులకు దగ్గరగా ఉన్నాయని చెప్పారు. 2018 ఎన్నికల్లో తన ఎన్నిక విషయంలో జరిగిన అవకతవకలన్నీ ఆయన లేవనెత్తిన అభ్యంతరాల్లో ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా, ఎన్నికల సంఘం పనితీరుపై ఒక జాయింట్ పార్లమెంటరీ కమిటీని గానీ లేదంటే సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలో ఒక ఉన్నత స్థాయి విచారణ జరిపితే వాస్తవాలు బయటకు వస్తాయని చెప్పారు.

కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలి: వినోద్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: యాదాద్రి, భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో జరిగిన అవకతవకలను ప్రజలకు తెలియజేయడంతో పాటు అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యల కోసమే సీఎం రేవంత్‌రెడ్డి జస్టిస్ ఎల్.నరసింహారెడ్డితో జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేశారని పీసీసీ ఉపాధ్యక్షుడు ఎంఆర్‌జీ వినోద్‌రెడ్డి తెలిపారు. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్ 10ఏ ప్రకారం విచారణను ఎదుర్కొంటున్న వ్యక్తి కమిషన్‌కు వ్యతిరేకంగా మాట్లాడినా, కామెంట్లు చేసినా అతన్ని ప్రాసిక్యూట్ చేయడంతో పాటు ఆరునెలల జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. తనపై విచారణ సాగిస్తున్న జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్‌కు వ్యతిరేకంగా మాట్లాడటంతో పాటు కమిషన్ ఏర్పాటునే ప్రశ్నించి, కమిషన్ నుంచి వైదొలగాలని జస్టిస్‌కే సూచనలు చేసిన కేసీఆర్‌ను ప్రాసిక్యూట్ చేయాలని వినోద్‌రెడ్డి డిమాండ్ చేశారు.

రేవంత్ నాయకత్వంలో పాలన అటకెక్కింది



సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పాలన పడకేసిందనుకున్నాం కానీ, అటకెక్కిందని బీఆర్ఎస్ నేతలు ధ్వజమెత్తారు. ప్రభుత్వ పనితీరు, హామీల అమలుపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని కలిసేందుకు బీఆర్ఎస్ నేతలు మంగళవారం తెలంగాణ సచివాలయానికి వచ్చారు. అయితే గేటు దగ్గరే వారిని పోలీసులు అడ్డుకోవడంతో సచివాలయ గోడకు వినతి పత్రాన్ని అంటించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి మాట్లాడారు. ఆశ వర్కర్లు, అంగన్‌వాడీలు, గురుకుల టీచర్లు అనేక సమస్యలతో అల్లాడుతున్నా ఈ ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. ఈ ప్రభుత్వానికి చెప్పినా.. గోడకు చెప్పినా ఒక్కటేనని వినతి పత్రాన్ని సెక్రటేరియట్ గోడకు అంటించామన్నారు. జీవో 46 బాధితుల పక్షాన నిలుస్తామని, వారికి న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు.

ఆర్టీసీ టికెట్ల కుంభకోణం సంగతేంటి?: క్రిషాంక్



సాక్షి, హైదరాబాద్: నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓ ప్రైవేటు సంస్థకు కోట్లాది రూపాయలు లబ్ధి చేకూరేలా ఆర్టీసీ టికెట్ల జారీ వ్యవస్థను అప్పగించారని.. గతంలో తాము బయటపెట్టిన విషయాలు నిజమని తేలుతున్నాయని బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం క్రిషాంక్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఎలాంటి టెండర్ నిబంధనలు పాటించకుండా టికెట్ల జారీకి ఉపయోగించే 13,200 'ఐ టిమ్స్'కాంట్రాక్టును 'చలో మొబిలిటీ'అనే సంస్థకు అప్పగించినట్లు కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. ఒక కంపెనీకి లబ్ధి జరిగేలా టెండరు అప్పగించడంలో అవినీతి జరిగినా టీజీఆర్టీసీ యాజమాన్యం మాత్రం తమ తప్పులను కప్పిపుచ్చుకునేలా ప్రకటనలు జారీ చేస్తోందని చెప్పారు. పాత టెండర్‌ను ఫిబ్రవరి 29న రద్దు చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని, అయితే అధికారులు వివిధ రాష్ట్రాల్లో పర్యటించి అధ్యయనం చేసిన తర్వాతే మార్చి 4న 'చలో మొబిలిటీ'ని ఎంపిక చేసినట్లు చెప్తోందన్నారు.

మోదీ 3.0.. 100 రోజులు..
మనవి 2 రోడ్లు

వంద రోజుల ప్రణాళికలో రెండు కీలక రోడ్ల ప్రాజెక్టులకు చోటు

సాక్షి, హైదరాబాద్

మోదీ 3.0 తొలి 'వంద రోజుల ప్రణాళిక'లో తెలంగాణకు చెందిన రెండు కీలక రోడ్ల ప్రాజెక్టులకు చోటు దక్కింది. ఆర్మూరు–జగిత్యాల–మంచిర్యాల యాక్సెస్ కంట్రోల్డ్ హైవే, జగిత్యాల–కరీంనగర్ నాలుగు వరసల జాతీయ రహదారుల ప్రాజెక్టులను ఇందులో ఎంపిక చేశారు. ఈ వంద రోజుల్లో ఈ రెండు ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి. పార్లమెంటు ఎన్నికల ప్రక్రియతో మందగించిన పురోగతిని వేగంగా పట్టాలెక్కించేందుకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మూడో విడత పాలనను వంద రోజుల ప్రత్యేక ప్రణాళికతో ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ ప్రణాళికలో దేశవ్యాప్తంగా 3 వేల కి.మీ. నిడివి గల జాతీయ రహదారులకు సంబంధించిన ప్రాజెక్టులను చేర్చారు. వాటిని యుద్ధప్రాతిపదికన పూర్తి చేసే క్రమంలో పనులను ప్రారంభించేందుకు చకచకా ఏర్పాట్లు చేస్తారు. వాటిలో తెలంగాణకు సంబంధించి ఈ రెండు జాతీయ రహదారులుండటం విశేషం. ఇందులో ఆర్మూరు–జగిత్యాల–మంచిర్యాల రోడ్డుకు సంబంధించి గత ఫిబ్రవరిలోనే టెండర్ల ప్రక్రియ పూర్తయింది. ఇక జగిత్యాల–కరీంనగర్ రోడ్డు విస్తరణకు సంబంధించి ఆరు నెలల క్రితమే టెండర్లు పూర్తికాగా, ఇప్పుడు వాటిని రద్దు చేసి కొత్తగా మళ్లీ టెండర్లు పిలవాలని నిర్ణయించారు. వీటికి సంబంధించి భారత జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ) వేగంగా చర్యలు తీసుకుంటోంది.



- దేశవ్యాప్తంగా 3 వేల కి.మీ. రోడ్డు ప్రాజెక్టుల ఎంపిక
- ఆర్మూరు–జగిత్యాల–మంచిర్యాల యాక్సెస్ కంట్రోల్డ్ రోడ్డు, జగిత్యాల–కరీంనగర్ నాలుగు వరసల రోడ్డుకు చోటు
- వందరోజుల్లో రూ.6 వేల కోట్ల పనుల ప్రారంభం
- యుద్ధప్రాతిపదికన పూర్తిచేసేలా ప్రణాళిక
- ఎన్‌హెచ్ 63, 563లకు రాజయోగం

రెండు రోడ్ల అనుసంధానం

నిజామాబాద్–ఛత్తీస్‌గఢ్‌లోని జగ్దల్‌పూర్ మధ్య విస్తరించి ఉన్న ఎన్‌హెచ్–63ను విస్తరించాలని కేంద్రం గతంలోనే నిర్ణయించింది. ట్రక్కులు అధికంగా తిరిగే ఈ జాతీయ రహదారి రెండు వరసలతో ఇరుకుగా ఉండి ప్రమాదాలకు నిలయంగా మారటంతో నాలుగు వరసలకు విస్తరించనున్నారు. ఇందులో ఆర్మూరు–మంచిర్యాల మధ్య కీలక ప్రాంతాన్ని ఎన్‌హెచ్ఏఐకి అప్పగించారు. రాష్ట్రం పరిధిలోని మిగతా నిడివిని రాష్ట్రప్రభుత్వ అధీనంలోని జాతీయ రహదారుల విభాగం విస్తరిస్తోంది. పట్టణాలు, గ్రామాలున్న చోట బైపాస్‌లు నిర్మించి, మిగతా రోడ్డును విస్తరిస్తారు. ఆర్మూరు, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేట మీదుగా సాగే ఈ రోడ్డు నిడివి 131.8 కిలోమీటర్లు. ఆర్మూరు, మెట్‌పల్లి, కోరుట్ల, జగిత్యాల, లక్సెట్టిపేట, మంచిర్యాల పట్టణాల వద్ద 6–12 కి.మీ. మేర భారీ బైపాస్‌లు ఉంటాయి. ఇవి కాకుండా మరో 8 ప్రాంతాల్లో చిన్న బైపాస్‌లు నిర్మిస్తారు. ఇతర రోడ్ల క్రాసింగ్స్ ఉన్న ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్లను నిర్మిస్తారు. ఇక వంతెనలు, అండర్‌పాస్‌లు, ఆర్ఓబీలు దాదాపు 46 వరకు ఉంటాయి. ఈ మొత్తం ప్రాజెక్టుకు రూ.3,850 కోట్లు ఖర్చు చేయనున్నారు. భూసేకరణ విషయంలో గతంలో స్థానికులు వ్యతిరేకించి ఉద్యమించడంతో రెండుమార్లు దీని డిజైన్ మార్చాల్సి వచ్చింది. దీంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతూ వచ్చింది. ఇప్పుడు ఆలస్యం కాకుండా పనులను వేగంగా పూర్తి చేయనున్నారు.

'ప్రమాదాల రోడ్డు'కు ప్రాధాన్యం

జగిత్యాల నుంచి ఖమ్మం వరకు విస్తరించి ఉన్న ఎన్‌హెచ్–563లో కీలక భాగమైన 58.86 కి.మీ. నిడివి కూడా ఇప్పుడు వంద రోజుల ప్రణాళికలో చోటు దక్కించుకుంది. ఈ రోడ్డు రెండు వరసలుగా ఉండి ఇరుగ్గా మారటంతో ప్రమాదాలకు నిలయమైంది. దీన్ని విస్తరించాలని చాలాకాలంగా యత్నిస్తున్నా పనుల్లో వేగం రాలేదు. కరీంనగర్ నుంచి వరంగల్ మధ్య ఎట్టకేలకు పనులు మొదలు కాగా, జగిత్యాల–కరీంనగర్ మధ్య టెండర్ల ప్రక్రియతో ఆగిపోయింది. గతంలో పిలిచిన టెండర్లను రద్దు చేసి మళ్లీ కొత్తగా పిలవాలని ఇప్పుడు నిర్ణయించారు. ఆ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి వంద రోజుల గడువులో నిర్మాణ పనులు మొదలుపెట్టనున్నారు. ఈ నిడివి పనులకు రూ.2,151 కోట్లు ఖర్చవుతుందని గతంలో అంచనా వేయగా, ఇప్పుడు దాని విలువ రూ.2,300 కోట్లకు చేరుకుంది. ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ జరుగుతోంది. అది కూడా పూర్తికావొచ్చింది. కొన్ని అవాంతరాలున్నా, వేగంగా అధిగమించే ప్రయత్నాలు జరుగుతున్నాయి.

న్యూయార్క్ తరహాలో హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- ప్రపంచంలో పేరొందిన నగరాల సరసన నిలబెడతాం
- సచివాలయంలో కుష్‌మన్ అండ్ వేక్‌ఫీల్డ్ బృందం భేటీ



కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్ సంస్థ ప్రతినిధులతో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరాన్ని అమెరికాలోని న్యూయార్క్‌ను పోలిన రీతిలో తీర్చిదిద్దాల్సి ఉందని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోని పేరొందిన నగరాల సరసన నిలబెట్టాలన్నది తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డితో 'కుష్ మన్ అండ్ వేక్ ఫీల్డ్'సంస్థ ఆసియా పసిఫిక్ సీఈవో మ్యాథ్యూ బౌ ప్రతినిధి బృందం భేటీ అయింది. సచివాలయంలో మంగళవారం జరిగిన ఈ భేటీలో ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబుతో పాటు పలువురు అధికారులు ఈ భేటీలో పాల్గొన్నారు. తాము దేశంలోని ఇతర నగరాలతో పోటీ పడటం లేదని, ప్రపంచ నగరాల స్థాయిలో హైదరాబాద్‌ను తీర్చిదిద్దాలన్నదే తమ లక్ష్యంగా సీఎం రేవంత్ పేర్కొన్నారు. తమ ప్రభుత్వం చేపట్టిన మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టు, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో రైలు మార్గం విస్తరణతో హైదరాబాద్ మరింత అద్భుతంగా తయారవుతుందన్నారు.

దేశంలో వేగంగా హైదరాబాద్ వృద్ధి

గ్లోబల్ సిటీగా హైదరాబాద్ వృద్ధి చెందుతున్న తీరు, వివిధ రంగాల్లో విస్తరిస్తున్న తీరుపై ఈ భేటీలో చర్చించారు. దేశంలోనే హైదరాబాద్ శరవేగంగా వృద్ధి చెందుతున్నట్లు తమ అధ్యయనంలో తేలిందని కుష్‌మన్ అండ్ వేక్ ఫీల్డ్ కంపెనీ ప్రతినిధి బృందం ఈ భేటీ సందర్భంగా వెల్లడించింది. గత ఆరు నెలల్లో రియల్టీ, లీజింగ్, ఆఫీస్ స్పేస్, నిర్మాణ రంగం, రెసిడెన్షియల్ స్పేస్‌లో హైదరాబాద్ నగరం గణనీయమైన వృద్ధి నమోదు చేసినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ప్రధాన నగరాలకు సంబంధించి ప్రతి ఆరు నెలలకోమారు వెల్లడయ్యే తమ నివేదిక తాజా నివేదిక జూలై నెలాఖరులో వెలువడుతుందని ప్రతినిధి బృందం వెల్లడించింది.

లాక్‌హీడ్ మార్టిన్ డైరెక్టర్ భేటీ

ఏరోస్పేస్ సాంకేతికత దిగ్గజ సంస్థ 'లాక్‌హీడ్ మార్టిన్'ఇండియా డైరెక్టర్ (ఏరోనాటిక్స్) మైఖేల్ ఫెర్నాండెజ్ సీఎం రేవంత్‌రెడ్డితో మంగళవారం సచివాలయంలో భేటీ అయ్యారు. డిప్యూటీ సీఎం భట్టి విక్ర మార్క, మంత్రులు శ్రీధర్‌బాబు, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పరిశ్రమల శాఖ అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యానికే భవిష్యత్తు



మల్లేపల్లి ఐటీఐ క్యాంపస్ శంకుస్థాపనలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు

▶ మొదటి పేజీ తరువాయి

లక్షల రూపాయల ఫీజులు కట్టారు. కానీ నిరుద్యోగ యువత పదేళ్ల బంగారు కాలాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నాశనం చేసింది. నియామకాల ప్రక్రియలో జరిగిన అవకతవకలు, లోపాలు, లీకేజీలతో నిరుద్యోగులు నట్టేట మునిగారు. అలాంటి పరిస్థితులను చక్కదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా ప్రపంచంతో పోటీ పడే విధంగా నైపుణ్యాభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గత ప్రభుత్వ పాలనలో ఐటీఐలు కూడా నిర్వీర్యమయ్యాయి. వాటిలో ప్రవేశాలు పొందే పరిస్థితి లేకుండా పోయింది. ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదు. అడ్మిషన్ల కోసం పోటీ పడే విధంగా ఐటీఐలను అభివృద్ధి చేస్తున్నాం. రాష్ట్రంలో ఉన్న 65 ప్రభుత్వ ఐటీఐలను రూ.2,324 కోట్ల ఖర్చుతో ఆధునిక శిక్షణా సంస్థలుగా తీర్చిదిద్దుతున్నాం. ఒక్కో ఏటీసీని గరిష్టంగా రూ.50 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. వీటిల్లో రోబో టెక్నాలజీతో పాటు ఇతర సాంకేతిక ట్రేడ్లను ప్రవేశపెట్టి విద్యార్థులకు శిక్షణ ఇస్తాం. ఇక్కడ శిక్షణ పొందిన వారికి ప్రపంచంలో ఎక్కడైనా ఉద్యోగం పొందే సామర్థ్యం వచ్చేలా లేదా సొంతంగా యూనిట్ ఏర్పాటు చేసుకోగలిగేలా తయారు చేస్తాం..'అని ముఖ్యమంత్రి వివరించారు.

ప్రతి నెలా సమీక్ష: 'అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లను రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుగా పరిగణిస్తున్నాం. ఈ సెంటర్ల ద్వారా జరిగే కార్యక్రమాలను ప్రతి నెలా క్రమం తప్పకుండా సమీక్షిస్తా. ఇందుకోసం ఈ శాఖ నావద్దే ఉంటుంది. ఏటీసీలో శిక్షణ తీసుకునేవారికి భరోసా కల్పించేందుకు ఈ ప్రయత్నం చేస్తున్నాం. అమెరికా సిలికాన్ వ్యాలీలోని భారతీయుల్లో నాలుగో వంతు తెలుగు వాళ్లున్నారు. ఐటీ రంగంలో తెలుగువాళ్లు ప్రపంచంతో పోటీ పడుతున్నారు. అదేవిధంగా ఫార్మా రంగంలోనూ మన పోటీకి సాటిలేదు. అప్పటి ప్రభుత్వాలు ఈ రెండు రంగాలపై దృష్టి పెట్టడంతోనే మన పురోగతి వేగంగా ముందుకెళ్లింది. ఇప్పుడు కూడా సాంకేతిక నైపుణ్యంపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టింది. ప్రతి ఏటీసీలో అత్యాధునిక సాంకేతికతతో కూడిన కోర్సులను ప్రవేశపెట్టబోతున్నాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అధికారులకు ఆదేశాలిచ్చాం. అతి త్వరలో రాష్ట్రంలోని అన్ని సెంటర్లు అందుబాటులోకి వస్తాయి..'అని రేవంత్‌రెడ్డి తెలిపారు.

25 ఏళ్లలో రూ.9 వేల కోట్ల అదనపు భారం!

భద్రాద్రి విద్యుత్ ప్లాంట్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించారు
- యాదాద్రితో ఏటా రూ.1,600 కోట్ల బొగ్గు రవాణా భారం
- ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంతో రూ.3,385 కోట్ల నష్టం
- జస్టిస్ నరసింహారెడ్డి కమిషన్ ఎదుట హాజరైన విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘు



మీడియాతో మాట్లాడుతున్న రఘు, కోదండరాం

సాక్షి, హైదరాబాద్: భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రంతో రానున్న 25 ఏళ్లలో రాష్ట్ర ప్రజలపై సుమారు రూ.9 వేల కోట్ల అదనపు భారం పడనుందని తెలంగాణ జేఏసీ చైర్మన్, విద్యుత్ రంగ నిపుణుడు కె.రఘు తెలిపారు. సూపర్ క్రిటికల్ టెక్నాలజీ కాకుండా కాలం చెల్లిన సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మించిన భద్రాద్రి ప్లాంట్ యాక్సిలరీ కన్‌జంప్షన్ (స్వీయ అవసరాలకు విద్యుత్ కేంద్రం వాడుకునే విద్యుత్)తో పాటు హీట్‌రేట్, నిర్వహణ ఖర్చులు అధికమని, దీనితో ఏటా రూ.350 కోట్ల అదనపు వ్యయం అవుతుందన్నారు. ఇలా విద్యుత్ కేంద్రం జీవిత కాలం 25 ఏళ్లలో సుమారు రూ.9 వేల కోట్ల అదనపు భారం పడుతుందని చెప్పారు. గత బీఆర్ఎస్ సర్కారు హయాంలో జరిగిన ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందం, భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణంపై విచారణ జరుపుతున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్ ఎదుట మంగళవారం రఘు హాజరయ్యారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తన ఫిర్యాదులకు మద్దతుగా వాదనలు విన్పించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వివరాలను వెల్లడించారు.

కాలం చెల్లిన టెక్నాలజీతో సమస్యలు

'కాలం చెల్లిన టెక్నాలజీ కావడంతో భద్రాద్రి విద్యుత్ కేంద్రంలో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. భద్రాద్రి కేంద్రం నిర్మాణానికి ఎంపిక చేసిన స్థలం సరైనది కాదని, పోలవరం పూర్తైతే ముప్పు ఉంటుందని గత ప్రభుత్వమే కేంద్రానికి ఫిర్యాదులు చేసింది. ఓ ప్రభుత్వ రంగ సంస్థ (బీహెచ్ఈఎల్)ను కాపాడుకోవడం కోసం ఇతర ప్రభుత్వ రంగ సంస్థలైన విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లను బలి చేయడం సరికాదు. యాదాద్రి, భద్రాద్రి విద్యుత్ కేంద్రాల నిర్మాణాన్ని నామినేషన్ల ప్రాతిపదికన బీహెచ్ఈఎల్‌కు అప్పగించకుండా బహిరంగ టెండర్లు నిర్వహిస్తే తక్కువ ధరకే వాటిని నిర్మించేందుకు అవకాశం ఉండేది. బీహెచ్ఈఎల్‌తో చేసుకున్న ఒప్పందం ప్రకారం.. మూడేళ్లలో యాదాద్రి నిర్మాణం పూర్తికావాల్సి ఉండగా, తొమ్మిదేళ్లయినా పూర్తికాలేదు. రెండేళ్లలో భద్రాద్రి కేంద్రాన్ని పూర్తి చేసేందుకు ఒప్పందం చేసుకోగా ఏడేళ్లు పట్టింది. 2010లో ఇండియా బుల్స్ అనే కంపెనీ కోసం సబ్ క్రిటికల్ టెక్నాలజీతో బీహెచ్ఈఎల్ తయారు చేసిన జనరేటర్లు, టర్బయిన్లు వంటి పరికరాలు ఆర్డర్ రద్దు కావడంతో నిరుపయోగంగా మారాయి. వాటి కోసమే భద్రాద్రి విద్యుత్ కేంద్రం నిర్మించారు.

'ఛత్తీస్‌గఢ్'కు ఈఆర్సీ ఆమోదం లేదు

ఛత్తీస్‌గఢ్ విద్యుత్ కొనుగోలు ఒప్పందంతో రాష్ట్రానికి రూ.3385 కోట్ల నష్టం జరిగింది. ఛత్తీస్‌గఢ్ నుంచి 1000 మెగావాట్ల విద్యుత్ కొనుగోలుకు ఒప్పందం జరగగా, ఎన్నడూ 1000 మెగావాట్ల విద్యుత్ సరఫరా చేయలేదు. ఈ లోటును పూడ్చుకోవడానికి తెలంగాణ.. బహిరంగ మార్కెట్ (ఓపెన్ యాక్సెస్)లో అధిక ధరతో విద్యుత్ కొనుగోలు చేయడంతో ప్రజలపై రూ.2 వేల కోట్ల అదనపు భారం పడింది. వాస్తవానికి ఛత్తీస్‌గఢ్ ఒప్పందానికి తెలంగాణ ఈఆర్సీ ఆమోదం తెలపలేదు'అని రఘు చెప్పారు.

నిందలు వేసి తప్పించుకోవాలనుకుంటున్నారు

కేసీఆర్‌పై కోదండరాం ఆరోపణలు

సాక్షి, హైదరాబాద్: గత ప్రభుత్వ హయాంలో జరిగిన విద్యుత్ అక్రమాలపై న్యాయ విచారణ నిర్వహిస్తున్న జస్టిస్ ఎల్.నరసింహారెడ్డి కమిషన్‌పై నిందలు వేసి, తప్పించుకునే ప్రయత్నాలను మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్నారని తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆరోపించారు. మంగళవారం ఆయన కమిషన్ ముందు హాజరై తన ఫిర్యాదులకు మద్దతుగా వాదనలు వినిపించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. గత పదేళ్లలో కేసీఆర్ తీసుకున్న నిర్ణయాలతో రాష్ట్ర విద్యుత్ సంస్థలు రూ.81 వేల కోట్ల అప్పులు/ నష్టాల్లోకి కూరుకుపోయాయని కోదండరాం అన్నారు. పోలవరం ప్రాజెక్టు పూర్తైతే భద్రాద్రి విద్యుత్ కేంద్రం ముంపునకు గురవుతుందని చెప్పారు. కొందరికి మేలు చేసేందుకే కేసీఆర్ ఆర్థిక పరమైన నిర్ణయాలు తీసుకున్నారని, దీంతో రాష్ట్ర విద్యుత్ రంగం కుప్పకూలిందని విమర్శించారు. ఆయనపై క్రిమినల్ చర్యలకు సిఫారసు చేయాలని కమిషన్‌ను కోరామన్నారు.

బేవరేజెస్ కార్పొరేషన్ సొంత నిర్ణయాలతో
ప్రభుత్వానికి చెడ్డపేరు

- విశ్వసనీయత దెబ్బతీస్తే సహించేది లేదు
- నివేదిక తర్వాత అధికారులపై కఠినచర్యలు: మంత్రి జూపల్లి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ తప్పుడు నిర్ణయాలతో ప్రభుత్వానికి, ఎక్సైజ్‌శాఖకు చెడ్డపేరు వస్తోందని, కీలక పదవుల్లోని వారు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నడుచుకోవాలే తప్ప.. సొంత నిర్ణయాలు తీసుకోరాదని స్పష్టం చేశారు. మంగళవారం నాంపల్లిలోని ఎక్సైజ్‌శాఖ కార్యాలయంలో ఆయన ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మద్యం కంపెనీల అనుమతుల వ్యవహారం ప్రభుత్వం దృష్టికి తీసుకొని రాకుండా బేవరేజెస్ కార్పొరేషన్ సొంతంగా విధివిధానాలు ఎలా ఖరారు చేస్తుందని మంత్రి అధికారులపై మండిపడ్డారు. తనశాఖలో చోటు చేసుకుంటున్న పరిణామాలపై ఆయన తీవ్ర అసంతృప్తి, ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి నిర్ణయాలతో శాఖ ప్రతిష్ట దెబ్బతినడమేకాక, ప్రజలకు తప్పుడు సంకేతాలు వెళతాయని వ్యాఖ్యానించారు. అనుమతుల అంశంపై సంజాయిషీ ఇవ్వాలని, విచారణ జరిపి సమగ్ర నివేదిక సమర్పించాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్, ఎండీ శ్రీధర్, బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహంను మంత్రి జూపల్లి ఆదేశించారు. నివేదిక ఆధారంగా కఠినచర్యలు ఉంటాయని మంత్రి స్పష్టం చేశారు.

మాదక ద్రవ్యాల అక్రమ రవాణా

మాదక ద్రవ్యాలు, అక్రమ మద్యం, కల్తీ కల్లు, గుడుంబా, గంజాయి సరఫరా, అమ్మకాలపై నిరంతర నిఘాపెట్టాలని, ఉక్కుపాదంతో డ్రగ్స్ మాఫియాను అణచివేయాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటికే పలు సందర్భాల్లో మాదక ద్రవ్యాలు సరఫరా చేసేవారి వెన్నులో వణుకు పుట్టించేలా చర్యలు ఉండాలని ఆదేశించిన విషయాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేశారు. తయారీ, సరఫరా, విక్రేతలు, సప్లయ్ నెట్‌వర్క్ వారి డేటాబేస్ తయారు చేయాలని, తరచూ ఇలాంటి నేరాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపాలన్నారు. యాంటీ నార్కోటిక్ బ్యూరో, పోలీసు శాఖ సమన్వయంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు పని చేయాలని తెలిపారు. మాదక ద్రవ్యాలను అరికట్టడమేకాక.. వాటితో కలిగే నష్టాలపై సమాజంలో అవగాహన కల్పించేందుకు మీడియా, సోషల్ మీడియా, థియేటర్లలో ఆడియో, వీడియో రూపంలో విస్తృత ప్రచారం చేయాలని ఆదేశించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులతో సమావేశాలు నిర్వహించి, వారిలో చైతన్యం తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో ఎక్సైజ్‌శాఖ కమిషనర్, ఎండీ ఇ.శ్రీధర్, అడిషనల్ కమిషనర్ అజయ్‌రావు, బేవరేజెస్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ అబ్రహం, ఉమ్మడి జిల్లాల డిప్యూటీ కమిషనర్లు, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పాల్గొన్నారు.

మళ్లీ ఆంధ్రలో కలపాలనే కుట్ర

- కేసీఆర్‌పై రాజకీయ కక్షతోనే విచారణ కమిషన్లు
- సీఎం, మంత్రులు ముసుగు విమర్శలు చేస్తున్నారు
- నల్లగొండ విద్యుత్ కేంద్రంపై ఎవరైనా ప్రశ్నిస్తే చెప్పుతో కొడతాం: మాజీమంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణను అంధకారంలోకి నెట్టి తిరిగి ఆంధ్రలో కలిపితే బాగుండేదనే ధోరణి కాంగ్రెస్ నేతల మాటల్లో కనిపిస్తోందని మాజీ మంత్రి జి.జగదీశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఛత్తీస్‌గఢ్ విద్యుత్ ఒప్పందంలో రూ.6 వేల కోట్ల నష్టం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం లీకులు ఇచ్చి వార్తలు రాపిస్తోందని ఆరోపించారు. ఛత్తీస్‌గఢ్ నుంచి కొనుగోలు చేసిన విద్యుత్‌కు రూ.7 వేల కోట్లు చెల్లిస్తే రూ.6 వేల కోట్ల అవినీతి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో మంగళవారం పార్టీ నేతలతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంపై నిందలు వేసి, మాజీ సీఎం కేసీఆర్‌పై బురదజల్లేందుకే రాష్ట్ర ప్రభుత్వం విచారణ కమిషన్లు ఏర్పాటు చేసిందన్నారు. తెలంగాణను లేకుండా చేయడం ద్వారా కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వం అనుకుంటోందని ధ్వజమెత్తారు. కేసీఆర్ పేరును మలినం చేయాలనే చిల్లర ప్రయత్నాలు చేస్తున్న సీఎం రేవంత్, మంత్రులు దొంగల్లా చీకట్లో ఎందుకు ముసుగులు వేసుకుంటున్నారని ప్రశ్నించారు. మీడియాకు లీకులు ఇవ్వడానికి బదులుగా ఎందుకు మీడియా సమావేశాలు పెట్టడం లేదని నిలదీశారు. ఛత్తీస్‌గఢ్ ఒప్పందంతో రూ.6వేల కోట్ల నష్టం జరిగిందని ఇచ్చిన లీకులను సమర్థించుకునేందుకు కోదండరాం వంటి వారితో మాట్లాడిస్తున్నారని ఆరోపించారు. రూ.6వేల కోట్ల నష్టం అంటూ ఇచ్చిన లీకుల్లో ప్రతీ అక్షరమూ అబద్ధమేనని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోలులో అవినీతి జరిగితే ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్‌కు, అప్పటి సీఎం రమణ్ సింగ్‌కు ముడుపులు ఇచ్చారా అని ప్రశ్నించారు.

ఎవరైనా ప్రశ్నిస్తే చెప్పుతో కొడతాం....

నల్లగొండలో విద్యుత్ కేంద్రం గురించి ఎవరైనా ప్రశ్నిస్తే చెప్పుతో కొడతామని జగదీశ్‌రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. నల్లగొండ జిల్లాలో తెలంగాణ ఉందని కోదండరాంకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. యాదాద్రి థర్మల్ స్టేషన్ ఏర్పాటుపై నల్లగొండ జిల్లా కాంగ్రెస్ నేతలు దద్దమ్మల్లా నోరెత్తడం లేదన్నారు. కోదండరాం దొంగలతో చేతులు కలిపి ఈర్ష్యతో మాట్లాడుతున్నాడని, ఎమ్మెల్సీ పదవి కోసం ఆశపడుతూ దొంగలకు మద్దతు పలుకుతున్నారన్నారు. బండి సంజయ్ మూర్ఖత్వంతో మాట్లాడుతున్నారని, కేసీఆర్‌ను అరెస్టు చేయాలని బీజేపీ తొందర పడుతున్నట్లు కనిపిస్తోందన్నారు. కాంగ్రెస్, బీజేపీ వేర్వేరు కాదని, సీఎం రేవంత్‌రెడ్డి, బండి సంజయ్ కూడా కలిసే పనిచేస్తున్నారన్నారు. యాదాద్రి విద్యుత్ కేంద్రాన్ని బంద్ చేస్తామని గతంలో ప్రకటించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి రోషం ఉంటే ప్రారంభోత్సవానికి దూరంగా ఉండాలన్నారు. విద్యుత్ అంశాలపై విచారణకు జస్టిస్ నరసింహారెడ్డి అంగీకరించి ఉండాల్సింది కాదన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు చిరుమర్తి లింగయ్య, గ్యాదరి కిషోర్, మాజీ ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విభజన సమస్యలను పరిష్కరించాలి

మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన చట్టంలో పేర్కొన్న హామీలన్నింటినీ నెరవేర్చాలని బీఆర్ఎస్ మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. విభజన చట్టంలోని 9, 10 షెడ్యూల్స్‌లోని పరిష్కారం కాని అంశాలపై ప్రభుత్వం వెంటనే దృష్టి పెట్టాలన్నారు. బీఆర్ఎస్ కార్యాలయం తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్‌గౌడ్ మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. నీళ్లు, నిధులు, నియామకాల్లో ఉమ్మడి రాష్ట్రంలో జరిగిన అన్యాయాలపై పోరాడి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామన్నారు. రాష్ట్రం ఏర్పడి పదేళ్లయినా 9వ షెడ్యూల్‌లో ఉన్న 30 సంస్థలకు సంబంధించిన అంశాలు పరిష్కారం కాలేదని పేర్కొన్నారు. 10వ షెడ్యూల్‌లో 102 సంస్థలకు సంబంధించిన అంశాలపై పరిష్కారం దొరకలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు అనంతరం ఆంధ్ర ప్రాంత ప్రజలను హైదరాబాద్ నుంచి వెళ్లగొడతారని కొందరు పనిగట్టుకుని ప్రచారం చేశారని శ్రీనివాస్‌గౌడ్ మండిపడ్డారు. అయితే కేసీఆర్ సీఎంగా అధికార పగ్గాలు చేపట్టిన తర్వాత ఆంధ్ర ప్రజలను చక్కగా చూసుకున్నామని గుర్తుచేశారు. విభజన హామీలు పరిష్కరించి తెలంగాణ అభివృద్ధికి ఆటంకం లేకుండా చూడాలన్నారు.

క్లుప్తంగా...

‘నీట్’పై నిపుణుల కమిటీ వేయాలి: వినోద్



సాక్షి, హైదరాబాద్: వైద్య విద్య కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) ఏటా నిర్వహిస్తున్న ‘నీట్’పరీక్ష మూలంగా తెలంగాణ విద్యార్థులకు జరిగే లాభనష్టాలపై సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకుని నిపుణుల కమిటీ వేయాలని బీఆర్ఎస్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. నీట్ పరీక్షను రద్దు చేయాలని లక్షలాది మంది విద్యార్థులు రోడ్లపైకి వచ్చి నిరసన తెలుపుతున్నా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, పార్టీ నేతలు మన్నె గోవర్ధన్‌రెడ్డి, రూప్‌సింగ్‌తో కలిసి మంగళవారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. నీట్ పరీక్షను రద్దు చేసి వైద్య విద్య ప్రవేశాలను ఆయా రాష్ట్రాలకే అప్పగించాలని డిమాండ్ చేశారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ అయినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో కోట్లాది రూపాయలు చేతులు మారడంపై ఈడీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

‘దోస్త్’ ద్వారా 41,533 డిగ్రీ సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: డిగ్రీ ఆన్‌లైన్ సేవలు, తెలంగాణ (దోస్త్) రెండో దశ సీట్ల భర్తీ వివరాలను ఉన్నత విద్యామండలి మంగళవారం వెల్లడించింది. మొదటి కౌన్సెలింగ్‌తో కలుపుకొని మొత్తం 41,533 సీట్లు కేటాయించినట్టు మండలి వెల్లడించింది. మొదటి ప్రాధాన్యమిచ్చిన 28,838 మందికి, రెండో ప్రాధాన్యమిచ్చిన 12595 మందికి సీట్లు కేటాయించినట్టు వివరించింది. వెబ్ ఆప్షన్లు తక్కువ ఇచ్చిన 3,270 మందికి సీట్లు కేటాయించలేదు. ఫేజ్–2లో మొత్తం 29707 మంది నమోదు చేసుకున్నారు. 44,803 వెబ్ ఆప్షన్లు వచ్చాయి. సీట్లు పొందిన అభ్యర్థులు 28లోగా సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని మండలి సూచించింది.

యువత జీవితాలతో పదేళ్లు చెలగాటమాడారు

బీఆర్ఎస్‌పై ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ధ్వజం




సాక్షి, హైదరాబాద్: అధికారంలో ఉన్న పదేళ్లు యువత జీవితాలతో బీఆర్ఎస్ పార్టీ చెలగాటం ఆడిందని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టి.జీవన్‌రెడ్డి విమర్శించారు. గాంధీభవన్‌లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఒక్క గ్రూప్–1 పరీక్ష నిర్వహించలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయడం బీఆర్ఎస్ పార్టీకి ఇష్టం ఉందో లేదో హరీశ్‌రావు చెప్పాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో 30 వేల ఉద్యోగాలు భర్తీ చేసినట్లు చెప్పారు. గతంలో కేసీఆర్ నిర్ణయంతో విద్యుత్‌శాఖపై రూ. 40 వేల కోట్ల ఆర్థిక భారం పడిందని, కమీషన్ల కోసం కక్కుర్తి పడి ఎక్కువ పైసలు పెట్టి విద్యుత్ కొనుగోలు చేశారని ఆయన ఆరోపించారు. యాదాద్రి పవర్ ప్లాంట్ భారం అవుతుందని అప్పుడే చెప్పినా, అప్పటి ప్రభుత్వం వినలేదన్నారు. విద్యుత్ శాఖలో జరిగిన అవినీతి కేసీఆర్ మెడకు చుట్టుకుంటోందని, అందుకే హరీశ్‌రావు టాపిక్ డైవర్ట్ చేస్తున్నాడని ఎద్దేవా చేశారు.

20న నిరుద్యోగుల మహాధర్నా: ఆర్.కృష్ణయ్య



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్రంలో విద్యార్థులు, నిరుద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉద్యమం చేయకముందే అన్ని ప్రభుత్వ ఉద్యోగాల్లో పోస్టులు పెంచి భర్తీ చేయాలని రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. నిరుద్యోగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో వేదిక అధ్యక్షుడు అశోక్ అధ్యక్షతన జరిగిన విలేకరుల సమావేశంలో కృష్ణయ్య మాట్లాడారు. గ్రూప్–1, 2, 3, 4 తో పాటు గురుకులాల్లో కూడా అన్ని పోస్టులు పెంచి భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 20న జరిగే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అశోక్ మాట్లాడుతూ అన్ని పోస్టులు పెంచి ఉద్యోగాల భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ మహాధర్నా నిర్వహిస్తున్నామని చెప్పారు. దీనికి అన్ని పార్టీల నాయకులను ఆహ్వానించినట్లు తెలిపారు.

విద్యార్థుల ఆవేదన కేంద్ర మంత్రులకు పట్టదా?



సాక్షి, హైదరాబాద్: నీట్‌లో జరిగిన లోపాలతో 24 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిందని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ తెలుగు విద్యార్థుల ఆవేదన కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లకు పట్టదా? అని ప్రశ్నించారు. గుజరాత్ కేంద్రంగా జరిగిన ఈ వ్యవహారంలో బీజేపీ పెద్దల హస్తం ఉందని విమర్శించారు. నీట్ లీకేజీ పాపం బీజేపీది కాదా? అని నిలదీశారు. పరీక్షల్లో జరిగిన లోపాలపై సీబీఐ విచారణ జరిపితే అన్ని వాస్తవాలు బయటపడతాయని స్పష్టం చేశారు.



రాజ్‌భవన్ ముట్టడి కార్యక్రమంలో బీఆర్ఎస్వీ నాయకులు



స్టూడెంట్ మార్చ్‌లో పాల్గొన్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, విద్యార్థి సంఘాల నాయకులు

రాష్ట్రంలో ‘నీట్’ మంటలు

- పేపర్ లీకేజీపై హైదరాబాద్‌లో ‘స్టూడెంట్ మార్చ్’
- ‘నీట్’ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్/హిమాయత్‌నగర్/పంజగుట్ట: నీట్ పరీక్ష లీకేజీపై దేశవ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు తెలంగాణకూ పాకాయి. నీట్ పరీక్ష రద్దు చేసి, మళ్లీ పరీక్ష నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో వివిధ విద్యార్థి సంఘాల నేతృత్వంలో స్టూడెంట్ మార్చ్ జరిగింది. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఎన్ఎస్‌యూఐ, పీడీఎస్‌యూ, విద్యార్థి జనసమితి, ఆమ్ ఆద్మీ పార్టీ విద్యార్థి విభాగం, ఏఐవైఎఫ్, డీవైఎఫ్ఐ, పీవైఎల్, విద్యార్థి యువజన సంఘాల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ జరిగింది. లక్షలాది మంది విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్టీఏను రద్దు చేయాలని, నీట్ పరీక్ష మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేస్తూ ర్యాలీ నిర్వహించారు. దేశంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన నీట్ పరీక్ష అవకతవకలు, పేపర్ లీకేజీలపై సుప్రీంకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్.మూర్తి అధ్యక్షతన సభ జరిగింది. ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఆజాద్ తదితరులు మాట్లాడారు.అవకతవకలకు పాల్పడిన, పేపర్ అమ్ముకున్న ఎన్టీఏ చైర్మన్, డైరెక్టర్ల పాత్రపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏను రద్దు చేసి తిరిగి ఆయా రాష్ట్రాలు పరీక్ష నిర్వహించుకునే వెసులుబాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న మంత్రులు దీనిపై స్పందించడం లేదని, పరీక్ష పే చర్చ అనే మోదీ పరీక్షలు లీకేజీలపై నోరుమెదపడం లేదని, సాక్షాత్తు విద్యాశాఖ మంత్రి రెండుచోట్ల అవకతవకలు జరిగాయని ఒప్పుకున్న తర్వాత కూడా మౌనం పాటించడం వెనుక ఎవరి ప్రయోజనాల కోసం అని ప్రశ్నించారు.

మళ్లీ పరీక్షపై విద్యార్థుల్లో భయం భయం

అన్నీ సక్రమంగా జరిగి ఉంటే ఇప్పటికే రాష్ట్రస్థాయి ర్యాంకులు వచ్చేవి. విద్యార్థులు తమకు ఎక్కడ సీటు వస్తుందోనన్న అంచనా కూడా వచ్చేది. కానీ నీట్ పేపర్ లీక్ కావడంతో.. విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ నీట్ పరీక్ష నిర్వహిస్తే తాము తీవ్రంగా నష్టపోతామని అంటున్నారు. మళ్లీ చదివి రాస్తే ఇవే ర్యాంకులు వస్తాయన్న గ్యారంటీ ఉండబోవన్నారు. అంతేగాక కాలేజీ యాజమాన్యాలు కూడా మళ్లీ పరీక్ష అంటే విద్యార్థులకు తీవ్రమైన మానసిక వేదనే ఉంటుందన్నారు.

ఉద్రిక్తంగా మారిన చలో రాజ్‌భవన్

నీట్ పరీక్ష రద్దు చేయాలని కోరుతూ బీఆర్ఎస్ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో చేపట్టిన చలో రాజ్‌భవన్‌లో తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. గేట్లు ఎక్కిన నాయకులను పోలీసులు అడ్డుకొని కిందకు దింపి అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్వీ నాయకులకు తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు తుంగ బాలు మాట్లాడుతూ ఎక్కడా లేనివిధంగా ఒక ప్రవేశ పరీక్షలో 67 మంది అభ్యర్థులు 720కి 720 మార్కులు సాధించడం గిన్నిస్ రికార్డు సాధించినట్లే అని ఎద్దేవా చేశారు.

చిన్న తప్పిదాలపై కేసులు వాపస్ తీసుకోండి

- రాజకీయ కక్షపూరిత కేసులతో నాయకులపై చెడు అభిప్రాయం వస్తోంది
- సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాసిన ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్

సాక్షి, హైదరాబాద్: రాజకీయ నాయకులపై చిన్నచిన్న తప్పిదాలకు నమోదు చేసిన కేసులను వాపస్ తీసుకోవాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం పద్మనాభరెడ్డి సీఎం ఎ.రేవంత్‌రెడ్డిని కోరారు. అధికార పార్టీ కనుసన్నలలో పోలీసుశాఖ కొన్ని చిన్నచిన్న తప్పులపై నమోదు చేసిన కేసులను క్షుణ్ణంగా పరిశీలించి వాపస్ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని, అందుకు డీజీపీకి తగిన ఆదేశాలివ్వాలని కోరారు. ఈ మేరకు మంగళవారం ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ అధ్యక్షుడు ఎం పద్మనాభరెడ్డి సీఎంకు లేఖ రాశారు. గతంలోనూ కలెక్టర్లు, డీజీపీ సలహాలు తీసుకొని, చాలా కేసులు వాపసు తీసుకొన్నట్టు గుర్తుచేశారు. రాజకీయ నాయకుల ఆదేశాల మేరకు పోలీసు శాఖ విపక్షనేతలపై చిన్న చిన్న విషయాలలకు సైతం కేసులు నమోదు చేయడంతో రాజకీయ నాయకులపై ప్రజల్లో చెడు అభిప్రాయం కలుగుతోందన్నారు. ఈ అభిప్రాయంతో చాలామంది విద్యావంతులు, ఉద్యోగస్తులు ఓటింగ్‌కు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. దీంతో పోలింగ్ శాతం 50కి మించడం లేదని గుర్తుచేశారు.

ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ తమ ప్రకటనలో పేర్కొన్న కొన్ని కేసులు...

- ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డిపై 89 కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండు, మూడు మినహాయిస్తే మిగిలినవన్నీ చిన్న తప్పిదాలే. ఇన్ని కేసులు పెట్టినా ఇంతవరకు వీటిపై ఎటువంటి విచారణ జరుగలేదు.
- మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై తొమ్మిది కేసులున్నాయి. అన్నీ తెలంగాణ ఉద్యమానికి సంబంధించినవే. నవంబర్ 29, 2009న తెలంగాణ సాధనకు కేసీఆర్ ఆమరణదీక్షకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా నమోదైన కేసులో 15 ఏళ్లుగా ఎలాంటి విచారణ జరగలేదు.
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై 42 కేసులు నమోదయ్యాయి. వీటిలో దేనిపైనా విచారణ జరిగింది లేదు.
- కాంగ్రెస్‌కి చెందిన ఖానాపూర్ (ఎస్టీ రిజర్వ్‌డ్) ఎమ్మెల్యే ఎద్మ బొజ్జుపై 52 కేసులు నమోదయ్యాయి. వీటిలో ఏవీ నేరపూరితమైనవి కావు.

మెదక్ ఘటనపై న్యాయ విచారణ జరిపించాలి

- బీజేపీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్



సాక్షి, హైదరాబాద్: మెదక్‌లో ఇటీవల ఓ వర్గం టార్గెట్‌గా జరిగిన ఘటనలపై న్యాయ విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ డిమాండ్ చేశారు. గో రక్షకులపై దాడులు చేసిన వారిని అరెస్టు చేయాలన్నారు. లేని పక్షంలో జరిగే పరిణామాలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హిందువులపై కక్ష గట్టి మెదక్‌లో గో రక్షకులను అరెస్ట్ చేయించిందని ఆరోపించారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబుతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. గోవధ చేయరాదని హైకోర్టు తీర్పు స్పష్టం చేస్తున్నా దానిని కూడా బేఖాతరు చేస్తున్నారని మండిపడ్డారు. ఎమ్మెల్యే హరీశ్‌బాబు మాట్లాడుతూ పోడు రైతుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్‌చేశారు. అటవీ అధికారుల దాష్టీకాలను ఎదుర్కొనేందుకు పోడు రైతులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు.

పక్షపాత పోలీసులపై చర్యలు తీసుకోండి

- డీజీపీకి వీహెచ్‌పీ ప్రతినిధుల ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: బక్రీద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా కొంతమంది పోలీసులు పక్షపాత ధోరణి ప్రదర్శించారని.. పనిగట్టుకుని హిందువులపై కేసులు పెట్టారని విశ్వహిందూ పరిషత్ ఆరోపించింది. మెదక్ పట్టణంలో పోలీసు శాఖ అలసత్వం కారణంగా అల్లర్లు జరిగితే.. దోషులను వదిలిపెట్టి బాధితులను రిమాండ్ చేసిన పోలీసులను వెంటనే సస్పెండ్ చేయాలని విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు డీజీపీ రవిగుప్తాకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ప్రచార ప్రసార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి నేతృత్వంలో విశ్వ హిందూ పరిషత్ ప్రతినిధి బృందం మంగళవారం డీజీపీ రవిగుప్తాను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందజేసింది. మెదక్ పట్టణంలో ఆవుల విషయమై స్థానిక ఇన్‌స్పెక్టర్ కారణంగా కత్తిపోట్లు.. పెద్ద ఎత్తున అల్లర్లు జరిగాయని వారు డీజీపీ దృష్టికి తెచ్చారు.

కార్పొరేట్ ఆస్పత్రులపై ఉక్కుపాదం

- ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల ప్యాకేజీని 30 శాతం పెంచాం
- కేసీఆర్ కిట్‌లో భారీ కుంభకోణం జరిగింది
- మీడియాతో చిట్‌చాట్‌లో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: ప్రైవేట్ కార్పొరేట్ ఆస్పత్రులను నిబంధనలకు విరుద్ధంగా నడిపితే వాటిపై ఉక్కుపాదం మోపుతామని వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. వివిధ ప్రొసీజర్లకు ఎంత బిల్లు వేస్తారనేది ఆయా ఆస్పత్రులు ఆరుబయట బోర్డులపై ప్రదర్శించాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో చేసే చికిత్సలకు అయ్యే ఖర్చు కూడా తాము బోర్డులపై ప్రదర్శిస్తామన్నారు. మంగళవారం మంత్రి దామోదర రాజనర్సింహ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. వైద్య,ఆరోగ్యశాఖలో సంస్కరణలకు శ్రీకారం చుట్టామని చెప్పారు. ప్రైవేటు హాస్పిటళ్లు, మెడికల్ షాపులు, హోటళ్లు, రెస్టారెంట్లపై నిరంతర పర్యవేక్షణకు మూడు వేర్వేరు టాస్క్‌ఫోర్స్‌లు నియమించబోతున్నామని వెల్లడించారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ కఠినంగా అమలు చేసి, ప్రైవేటు హాస్పిటళ్ల దోపిడీని నియంత్రిస్తామని తెలిపారు. ఇందుకు ఓ టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో నకిలీ మెడిసిన్ తయారీ, ట్రాన్స్‌పోర్టేషన్, మెడిసిన్ ధరల నియంత్రణ, మెడికల్ షాపుల్లో తనిఖీలు తదితర అంశాలను పర్యవేక్షించేందుకు మరో టాస్క్‌ఫోర్స్, ఆహారకల్తీ చేసే వారిపై కఠిన చర్యలకు మూడో టాస్క్‌ఫోర్స్ పనిచేస్తుందన్నారు. ఈ మూడు టాస్క్‌ఫోర్స్‌లు నేరుగా తనకే రిపోర్ట్ చేస్తాయని చెప్పారు.

ఐదేళ్లు నిండిన అందరినీ బదిలీ చేస్తాం

ఐదేళ్లు నిండిన డాక్టర్లు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందిని బదిలీ చేసితీరుతామని దామోదర రాజనర్సింహ తెలిపారు. ఈ విషయంలో సంఘాల నేతలు సహా ఎవరికీ మినహాయింపు ఉండబోదన్నారు. ఆస్పత్రుల్లో పాతుకుపోయిన డాక్టర్లు, కాలేజీల్లో పాతుకుపోయిన టీచింగ్ ఫ్యాకల్టీ అందరినీ బదిలీ చేస్తామని తెలిపారు. జిల్లా మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్లను కూడా మారుస్తామన్నారు. సిటీలో పని చేసే డాక్టర్ల కంటే, జిల్లాల్లో పనిచేసే వారికి ఎక్కువ వేతనాలు ఇస్తామని, ఇందుకు అనుగుణంగా హెచ్ఆర్‌పీలో మార్పులు చేసేందుకు చర్యలు ప్రారంభించామన్నారు. త్వరలోనే జీఓ వస్తుందని చెప్పారు.

65 ఏళ్లకు అడిషనల్ డీఎంఈల రిటైర్‌మెంట్

తెలంగాణ వైద్య విధాన పరిషత్‌ను తెలంగాణ సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్‌గా మార్చుతున్నామని మంత్రి తెలిపారు. టీవీవీపీ ఉద్యోగులందరికీ ట్రెజరీ ద్వారా జీతాలు అందజేస్తామన్నారు. ఇప్పుడు తాము టీవీవీపీ డైరెక్టర్, పబ్లిక్ హెల్త్ డైరెక్టర్, డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్, మెడికల్ కార్పొరేషన్ ఎండీ పోస్టులు సృష్టిస్తున్నామని చెప్పారు. అడిషనల్ డీఎంఈల రిటైర్‌మెంట్ వయసు 65 ఏళ్లకు పెంచుతామని మంత్రి వెల్లడించారు. ఫిర్యాదుల కోసం త్వరలోనే టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేస్తామని, మండలానికో పాలియేటివ్ కేర్ సెంటర్ నెలకొల్పుతామన్నారు.



డీహెచ్ పనితీరుపై అసంతృప్తి

ప్రజారోగ్య సంచాలకుడు డాక్టర్ రవీందర్‌నాయక్ పనితీరుపై మంత్రి దామోదర రాజనర్సింహ అసంతృప్తి వ్యక్తంచేశారు. వివిధ విభాగాల అధిపతుల పనితీరును తాను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నానన్నారు.

కార్పొరేషన్‌తో రూ. 9 వేల కోట్ల అప్పు చేశారు

బీఆర్ఎస్ సర్కారు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ కార్పొరేషన్ అని పెట్టి, దాని ద్వారా బ్యాంకుల నుంచి రూ. 9 వేల కోట్ల అప్పులు చేసిందని దామోదర వెల్లడించారు. కేసీఆర్ కిట్, న్యూట్రిషన్ కిట్లను తాత్కాలికంగా నిలిపివేశామని, కేసీఆర్ కిట్‌లో పెద్ద ఎత్తున స్కామ్ జరిగిందన్నారు. ఆ రెండు పథకాల్లో మార్పులుచేర్పులు చేసి కొత్త రూపంలో తీసుకొస్తామని తెలిపారు. ఆరోగ్యశ్రీ వైద్య చికిత్సల ప్యాకేజీలో 30 శాతం పెంచినట్టు తెలిపారు. ఇక నుంచి పేదల ఉచిత వైద్యం కోసం తెల్ల రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులంటూ కాకుండా, కేవలం ఆరోగ్యశ్రీ కార్డులనే పరిగణనలోకి తీసుకుంటామంటారు. అయితే తెల్లరేషన్ కార్డున్నవారు ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకోవాలన్నారు.

యాక్సిడెంట్ కేసులో లక్ష వరకు ఉచిత వైద్యం...

రాష్ట్రంలోని ప్రధాన రహదారులపై ప్రతి 35 కిలోమీటర్లకు ఒకటి చొప్పున మొత్తం 75 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నామని మంత్రి వెల్లడించారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారి ప్రాణాలు కాపాడేందుకు తమిళనాడు తరహా వ్యవస్థ అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. యాక్సిడెంట్‌లో గాయపడిన వారికి, వారి ఆర్థికస్థితితో సంబంధం లేకుండా అన్ని ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో రూ.లక్ష వరకూ ఉచితంగా ట్రీట్‌మెంట్ అందించేలా ఈ పథకం ఉంటుందన్నారు.

పీజీఈసెట్‌లో 18,829 మంది పాస్

ఉత్తీర్ణతలో బాలికలదే పైచేయి



ఫలితాలు విడుదల చేస్తున్న లింబాద్రి, బుర్రా వెంకటేశం తదితరులు

సాక్షి, హైదరాబాద్: పోస్టు–గ్రాడ్యుయేట్ ఇంజనీరింగ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (పీజీఈసెట్–2024)లో 18,829 మంది అర్హత సాధించారు. ఈ ఫలితాల్లో బాలికలే పైచేయి సాధించారు. 8,246 మంది బాలురు సెట్‌లో ఉత్తీర్ణులైతే, బాలికలు 10,583 మంది ఉత్తీర్ణులయ్యారు. పీజీఈసెట్ ఫలితాలను మంగళవారం విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి, వైస్‌చైర్మన్లు వి.వెంకటరమణ, ఎస్‌కె మహమూద్, మండలి కార్యదర్శి శ్రీరాం వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు. ఇంజనీరింగ్, టెక్నాలజీ, ఆర్కిటెక్చర్, ఫార్మసీ పోస్టు–గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ సెట్‌ను జేఎన్‌టీయూహెచ్ ఈ ఏడాది నిర్వహించింది. ర్యాంకుల ఆధారంగా మొత్తం 19 విభాగాల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

ఏయే విభాగాల్లో ఎంత ఉత్తీర్ణత

విభాగం	అర్హత పొందిన వారు	
	బాలురు	బాలికలు
ఏరోస్పేస్	41	4
ఆర్కిటెక్చర్, ప్లానింగ్	142	104
బయోమెడికల్	21	16
బయోటెక్నాలజీ	31	40
కెమికల్	49	31
సివిల్	1,695	959
కంప్యూటర్‌సైన్స్ ఇన్ఫర్మేషన్	1,725	2,240
ఎలక్ట్రికల్	877	793
ఈసీఈ	798	1,100
ఎన్విరాన్‌మెంటల్	93	73
ఫుడ్ టెక్నాలజీ	10	40
జియో ఇంజనీరింగ్	30	13
ఇన్‌స్ట్రుమెంటల్	10	10
మెకానికల్	717	112
మెటలర్జికల్	24	5
మైనింగ్	69	8
నానోటెక్నాలజీ	28	16
ఫార్మసీ	1,880	5,011
టెక్స్‌టైల్ టెక్నాలజీ	6	8

ముఖ్యమైన విభాగాల్లో టాపర్స్

పేరు	మార్కులు	ప్రాంతం
సివిల్ ఇంజనీరింగ్		
దోకి రాజన్‌బాబు	84	జనగాం
మహ్మద్ అఫ్రీద్	83	భూపాల్‌పల్లి
కనవీణ రవళి	81	పెద్దపల్లి
కంప్యూటర్ సైన్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ		
ఎం.అంజనీకుమార్	89	మేడ్చల్
ఎ.గౌరవ్ అవినాష్	87	మల్కాజిగిరి
జంగా మౌనిక	78	హైదరాబాద్
ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్		
ఆకోజు దివ్య	71	జనగాం
ఎం.శ్రీకాంత్	70	నాగర్‌కర్నూల్
వినయ్ మోడెమ్	65	మంచిర్యాల
ఫార్మసీ		
బసవరాజు వెంకట ప్రశాంత్	92	కడప (ఏపీ)
కందూరి తరుణ్‌కుమార్	91	నంద్యాల
తొగుటం సాయి కిరణ్	89	వరంగల్

25న ఇంటర్ అడ్వాన్స్‌డ్ ఫలితాలు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ ఫలితాలు ఈనెల 25న విడుదల కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది. ఫలితాల విడుదల తర్వాత దోస్త్ ద్వారా డిగ్రీలో ప్రవేశానికి మరో దఫా కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ పరీక్షలకు రెండు సంవత్సరాలకు కలిపి 4.5 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల్లో ఫెయిల్ అయిన వారు, ఫస్టియర్ ఇంప్రూవ్‌మెంట్ కోసం రాసిన వారు ఈ జాబితాలో ఉన్నారు. మొత్తం 11 లక్షల సమాధాన పత్రాలను కొన్ని రోజులుగా మూల్యాంకనం చేశారు. గత పరీక్షల్లో తప్పులు దొర్లిన నేపథ్యంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిర్ణయించారు. సాంకేతిక లోపాలను, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. డీకోడింగ్, ఆన్‌లైన్‌లో మార్కులు పొందుపర్చే కార్యక్రమం పూర్తయింది. అయితే, ఉన్నతాధికారి ఒకరికి మంగళవారం సెంటిమెంట్ ఉండటంతో 25వ తేదీన ఒప్పుకుంటారా అనే సందేహం అధికారుల్లో ఉంది. గత పరీక్ష ఫలితాల విషయంలోనూ ఉన్నతాధికారి మంగళవారం సెంటిమెంట్ ముందుకు తేవడంతో అంతా సిద్ధం చేసినా ఫలితాల వెల్లడిని వాయిదా వేశారు. ఈసారి కూడా అలాంటి అడ్డంకి ఉంటే 26 లేదా 27న విడుదల చేసే వీలుందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

విద్యాహక్కు చట్టం అమలు ఏ దశలో ఉంది

వివరాలు చెప్పాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన పిల్లల ఉచిత, నిర్బంధ విద్యాహక్కు చట్టం –2009ను రాష్ట్రంలో పూర్తిస్థాయిలో ఎందుకు అమలుచేయడం లేదని ప్రభుత్వాన్ని హైకోర్టు ప్రశ్నించింది. అసలు చట్టం అమలు ఇప్పుడు ఏ దశలో ఉందో పూర్తి వివరాలు తెలుసుకొని చెప్పాలని ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ‘రాష్ట్రంలో విద్యాహక్కు చట్టాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడం లేదు. చట్టంలో 121 సీ ప్రకారం ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఒకటో తరగతి నుంచి 10వ తరగతి వరకు 25 శాతం సీట్లు కేటాయించాల్సి ఉంది. అలా ఎక్కడా జరగడం లేదు. దీనిని ప్రభుత్వం కఠినంగా అమలు చేసేలా ఆదేశాలు జారీ చేయాలి’అని కోరుతూ న్యాయవాది యోగేష్ ప్రజాప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధానన్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ జూకంటి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. ప్రభుత్వం దాఖలు చేసిన కౌంటర్‌లో ప్రైవేట్ పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం సీట్లు ఉచితంగా ఇస్తున్నట్టు ఎక్కడా లేదని, రాష్ట్రంలో విద్యాహక్కు చట్టం అమలు ఎంత వరకు వచ్చిందో చెప్పాలని ఏఏజీ ధర్మాసనం ఆదేశించింది. కాగా, విద్యాహక్కు చట్టంపై తమకు సాయం చేసేందుకు అమికస్‌గా నియమితులైన సీనియర్ న్యాయవాది సునీల్ బి.గణు సేవలను ధర్మాసనం ప్రశంసించింది.

- మరో పిటిషన్ విచారణ సందర్భంగా ప్రభుత్వ హాస్టళ్లలో బాత్‌రూమ్‌లు, టాయిలెట్లు, పరుపులు, దిండ్లు లాంటి ఏర్పాట్లపై కూడా వివరాలు అందజేయాలని చెబుతూ, విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

టీచర్ల పదోన్నతులు ఎలా చేపడతారు?

- పాఠశాల విద్యాశాఖను ప్రశ్నించిన హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం
- ఇద్దరు జడ్జీలు విరుద్ధ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం సరికాదు
- పిటిషన్లన్నీ కలిపి మళ్లీ విచారణ చేపట్టాలని సింగిల్ జడ్జికి సూచన

సాక్షి, హైదరాబాద్: ‘టెట్’వివాదంపై కోర్టు ఉత్తర్వులు ఉండగా పదోన్నతులు ఎలా చేపడతారని పాఠశాల విద్యాశాఖను హైకోర్టు ద్విసభ్య ధర్మాసనం ప్రశ్నించింది. టెట్‌తో సంబంధం లేకుండా పదోన్నతులు కల్పించాలని సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను రద్దు చేసింది. వివాదం కోర్టులో ఉందని తెలిసి పదోన్నతుల ప్రక్రియ ఎలా చేపడతారని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దేవసేనను ప్రశ్నించింది. ఇది కోర్టు ఉల్లంఘన కిందకే వస్తుందని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ వివాదంపై దాఖలైన పిటిషన్లను మళ్లీ సింగిల్ జడ్జి ముందుకు పంపుతున్నామని, విచారణ చేపట్టి మెరిట్ ఆధారంగా నిర్ణయం తీసుకుంటారని స్పష్టం చేసింది. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్(ఎన్‌సీటీఈ) 2010 ప్రకారం సెకండరీ గ్రేడ్ టీచర్లు(ఎస్‌జీటీ) స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాలంటే టెట్ తప్పనిసరి అని, ఆ మేరకే పదోన్నతులు చేపట్టేలా విద్యాశాఖను ఆదేశించాలని కోరుతూ గత సంవత్సరం కొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ఎన్‌సీటీఈ నిబంధనలు పాటించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం కొందరు ఎస్‌జీటీలు మరోసారి హైకోర్టులో పిటిషన్ వేశారు. అయితే రోస్టర్ మారిన కారణంగా ఈ పిటిషన్ మరో న్యాయమూర్తి వద్దకు వచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీఓ నంబర్ 36 ప్రకారం.. ఎన్‌సీటీఈ నిబంధనలు జారీ చేయకంటే ముందు (2010 ముందు) నియామకమైన ఉపాధ్యాయుల పదోన్నతులకు టెట్ అవసరం లేదని ఎస్‌జీటీలు వాదించారు. ఆయా సబ్జెక్టుల్లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుకు పదోన్నతి పొందేందుకు తాము అర్హులమని పేర్కొన్నారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి.. ప్రభుత్వ జీఓ ప్రకారం టెట్ లేకున్నా 2010 ముందు ఉన్న ఎస్‌జీటీలు స్కూల్ అసిస్టెంట్ పదోన్నతులకు అర్హులేనని 2024 మే 2న ఉత్తర్వులు జారీ చేశారు.

రెండు మధ్యంతర ఉత్తర్వులా?...

మేలో ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ టెట్ క్వాలిఫై అయిన నిర్మల్ జిల్లాకు చెందిన గంగాదాస్‌తోపాటు మరో 52 మంది పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలి, జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఒకే అంశంపై ఇదే హైకోర్టు రెండు విరుద్ధ ఉత్తర్వులు ఇవ్వడం సరికాదన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. ‘టెట్’అంశంపై సెప్టెంబర్‌లోనే హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిందని, మరోసారి దానికి విరుద్ధంగా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడాన్ని తప్పుబట్టింది. మే 2న ఇచ్చిన రెండవ మధ్యంతర ఉత్తర్వులను కొట్టివేస్తున్నామని చెప్పింది. కాగా కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించి పదోన్నతుల ప్రక్రియలో ఎలా ముందుకు వెళతారని ఈ సందర్భంగా కోర్టుకు హాజరైన విద్యాశాఖ కమిషనర్‌పై ద్విసభ్య ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది.



అన్ని రకాల దుఃఖం నుండి బయటపడి నిర్వాణాన్ని పొందాలంటే తృష్ణ సమూలంగా అంతరించక తప్పదు.
– బుద్ధదాన భిక్కు (బౌద్ధ ధర్మం)

సాక్షి

బుధవారం, 19 జూన్ 2024

కలలు మాని... కళ్ళు తెరవాలి!

ఏడాది గడిచిందో లేదో... సరిగ్గా అదే రకమైన దుర్ఘటన. అవే రకమైన దృశ్యాలు. మళ్ళీ అవే అనునయ విచారాలు, నష్టపరిహారాలు, దర్యాప్తుకు ఆదేశాలు, భద్రతే తమకు ముఖ్యమంటూ సర్కారీ ప్రకటనలు. పశ్చిమ బెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సీల్దా వెళుతూ ఆగివున్న కాంచన్‌జంగా ఎక్స్‌ప్రెస్‌ను వెనుక నుంచి వచ్చిన ఓ గూడ్స్ రైలు గుద్దుకున్న సోమవారం నాటి ప్రమాద దృశ్యాలు, తదనంతర పరిణామాలు చూస్తే సరిగ్గా అలాగే అనిపిస్తుంది. నిరుడు జూన్ 2న ఒడిశాలోని బాలాసోర్ జిల్లాలో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్, మరో రెండు రైళ్ళు ఢీ కొట్టుకోవడంతో 290 మందికి పైగా మరణించగా, వెయ్యి మందికి పైగా గాయపడ్డ దారుణ ఘటన ఇప్పటికీ మదిలో మెదులుతూనే ఉంది. ఇంతలోనే ఇప్పుడు ఈశాన్య సరిహద్దు రైల్వే జోన్‌లో జనం బక్రీద్ హడావిడిలో ఉండగా ఉదయం తొమ్మిది గంటల వేళ జరిగిన తాజా రైలు ప్రమాదం పాలకులు పాఠాలు నేర్చుకోలేదని తేల్చింది. గూడ్స్ పైలట్, కో–పైలట్ సహా పది మంది ప్రాణాలను బలి తీసుకొని, 40కి పైచిలుకు మందిని గాయాలపాలు చేసిన ఈ దుర్ఘటన మన రైల్వే వ్యవస్థలో లోటుపాట్లను మరోసారి బయటపెట్టింది.

ప్రమాదం జరగడానికి మూడు గంటల ముందు ఉదయం 5.50 గంటల నుంచే రెండు స్టేషన్ల మధ్య ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ చెడిపోయిందని వార్తలు వచ్చాయి. సిగ్నల్‌ను పట్టించుకోకుండా గూడ్స్ ట్రెయిన్ ముందుకు పోవడం వల్లే ప్రమాదం సంభవించిందని రైల్వే బోర్డ్ ఛైర్‌పర్సన్ జయా వర్మ సిన్హా ఉవాచ. కానీ, ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనిచేయనప్పుడు రెడ్ సిగ్నళ్ళను పట్టించుకోకుండా ముందుకు సాగాల్సిందిగా సర్వసాధారణంగా ఇచ్చే టీఏ 912 మెమోను స్టేషన్ మాస్టర్ ఇవ్వడం వల్లే రైళ్ళు రెండూ ఒకే లైనులో ముందుకు సాగాయట. విభిన్న కథనాలు, వాదనలు, తప్పొప్పులు ఏమైనా అమాయకుల ప్రాణాలు పోవడం విచారకరం. లెక్క తీస్తే 2018–19 నుంచి 2022–23 మధ్య అయిదేళ్ళలో తీవ్ర పర్యవసానాలున్న రైలు ప్రమాదాలు సగటున ఏటా 44 జరిగాయి. దాదాపు 470కి పైగా జరిగిన 2000–01 నాటితో పోలిస్తే ఈ సంఖ్య తగ్గినట్టే కానీ, పెరిగిన సాంకేతికత, పాలకుల ప్రగల్భాలతో పోలిస్తే ఇప్పటికీ ఎక్కువే. ముఖ్యంగా రైళ్ళు ఢీ కొంటున్న ఘటనలు ప్రతి 3.6 నెలలకు ఒకటి జరుగుతున్నాయట. దేశంలోని మొత్తం 18 రైల్వే జోన్లలో దక్షిణ రైల్వే లాంటి ఆరింటిలో మినహా, మిగతా అన్నిటా నిరుడు ఏదో ఒక ప్రమాదం సంభవించింది.

రైలు ప్రమాదాలను అరికట్టాలనీ, ప్రయాణాల్లో ప్రయాణికుల భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వాలనీ చాలాకాలంగా చర్చ జరుగుతోంది. రైళ్ళు ఢీకొనే ప్రమాదం లేకుండా చూసేందుకు ప్రయోగాలూ సాగాయి. ప్రమాదాలను నివారించేందుకు ఆటోమేటిక్ ట్రెయిన్ ప్రొటెక్షన్ సిస్టమ్ 'కవచ్'ను మూడు భారతీయ సంస్థలు దేశీయంగా రూపొందించాయి. ఈ 'కవచ్' భద్రతా వ్యవస్థ రైళ్ళ వేగాన్ని నియంత్రించడమే కాక, ప్రమాద సూచికలు డ్రైవర్ల దృష్టిని దాటిపోకుండా తోడ్పడుతుంది. మసక మసక చీకటిలోనూ భద్రతను అందిస్తుంది. ఇన్ని ప్రత్యేకతలున్న 'కవచ్'ను ప్రవేశపెట్టామని పాలకులు చాలా కాలంగా గొప్పలు చెబుతున్నారు. కానీ, భారత రైల్వే వ్యవస్థ దాదాపు లక్ష కిలోమీటర్ల పైచిలుకు పొడవైనది కాగా, దశలవారీగా 1500 కి.మీల మేర మాత్రమే 'కవచ్' ఇప్పటికి అందుబాటులోకి వచ్చింది. ఈ నత్తనడక ప్రయాణికుల భద్రతపై ప్రభుత్వ పట్టింపులేనితనానికి నిదర్శనం.

అసలు ఒకప్పటిలా రైల్వేలకూ, రైల్వే శాఖకూ ప్రాధాన్యం ఉందా అంటే అనుమానమే. రైలు సేవల్లో సామాన్యుల హితం కన్నా హంగులు, ఆర్భాటాలు, ఎగువ తరగతి సౌకర్యాలకే పెద్ద పీట వేస్తున్నారు. సౌకర్యాల పేరిట అధిక ఛార్జీలు, వందే భారత్ రైళ్ళు, సుందరీకరణ లాంటివాటి మీదే సర్కారు దృష్టి తప్ప, సాధారణ రైళ్ళ సంగతి పట్టించుకోవట్లేదు. సరిపడా కోచ్‌లు, బెర్తులు కరవన్న మాట అటుంచి, కనీసం కూర్చొనే జాగా కూడా లేక శౌచాలయాల వద్దే ఒకరిపై ఒకరుపడుతున్న జనంతో క్రిక్కిరిసిన రైళ్ళు మన దేశంలో నిత్య దృశ్యాలు. వీటన్నిటి మధ్య భద్రత మాట సరేసరి! గతంలో సాధారణ బడ్జెట్‌కు దీటుగా రైల్వేకు ప్రత్యేక బడ్జెట్ ఉండేది. 1924 నుంచి ఉన్న ఆ రెండు వేర్వేరు బడ్జెట్ల విధానానికి 2017లో బీజేపీ సర్కార్ స్వస్తి పలికింది. ఫలితంగా ఆ తర్వాత రైల్వే శాఖకు వెలుగు తగ్గింది. దక్షిణాదితో పోలిస్తే ఉత్తరాదికి, అందులోనూ బీజేపీ పాలిత రాష్ట్రాలకే రైల్వే సౌకర్యాల విస్తరణలో సింహభాగం వడ్డిస్తున్నారన్న ఆరోపణలూ ఉన్నాయి. ఒకప్పటి రైల్వే మంత్రి, బెంగాల్ ప్రస్తుత సీఎం మమతా బెనర్జీ మాటల్లో చెప్పాలంటే, రైల్వేస్ ఇప్పుడో అనాథ.

ఇక, నిరుటి పాలనలో లాగే... కొత్త మోదీ సర్కారులోనూ అశ్వినీ వైష్ణవ్‌కే రైల్వే శాఖ అప్పగించారు. పేరుకు ఆయన రైల్వే మంత్రే కానీ, కీలకమైన ఎలక్ట్రానిక్స్ అండ్ ఐటీ శాఖ, సమాచార ప్రసార శాఖ సైతం ఆయన వద్దే ఉన్నాయి. దేనికదే అత్యంత ముఖ్యమైన మూడు శాఖలను వైష్ణవ్ ఒక్కరే నిర్వహించడం భారమే. ఇవన్నీ కాక సోమవారం రైలు ప్రమాదం జరిగిన కొద్ది గంటలకే... ఆయనను రానున్న అసెంబ్లీ ఎన్నికలకై మహారాష్ట్రలో పార్టీ ఎన్నికల కో–ఇన్‌ఛార్జ్‌గా కూడా బీజేపీ నియమించడం మరీ విడ్డూరం. పాలనా ప్రాధాన్యాల పట్ల అలసత్వానికి ఇది మచ్చుతునక. దేశంలో మునుపెన్నడూ జరగనంత ప్రమాదమైన బాలాసోర్ విషాదం తర్వాతా మనం మారలేదు. సీబీఐ దర్యాప్తు చేసి, ఛార్జ్‌షీట్ దాఖలు చేసినా ఆ కేసు ఇంకా కోర్టులోనే మూలుగుతోంది. అందుకే, ఇకనైనా సిగ్నలింగ్ వ్యవస్థల ఆధునికీకరణ, రైల్వే ప్రయాణ భద్రతను పెంచడం ప్రాధమ్యం కావాలి. బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టుల గురించి రంగుల కలలు చూపిస్తున్న మన పాలకులు తాజా ఘటనతోనైనా క్షేత్రస్థాయి వాస్తవాలపై కళ్ళుతెరవాలి. ఉట్టికెగరలేకున్నా, స్వర్గానికి నిచ్చెన వేస్తామంటే హాస్యాస్పదం.

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
జ్యేష్ఠ మాసం, తిథి: శు.ద్వాదశి ఉ.5.35 వరకు, తదుపరి
త్రయోదశి, నక్షత్రం: విశాఖ సా.4.23 వరకు, తదుపరి
అనూరాధ, వర్జ్యం: రా.8.36 నుండి 10.17 వరకు
దుర్ముహూర్తం: ఉ.11.36 నుండి 12.28 వరకు
అమృతఘడియలు: ఉ.6.52 నుండి 8.43 వరకు.

సూర్యోదయం : 5.30
సూర్యాస్తమయం: 6.32
రాహుకాలం : ప.12.00 నుండి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుండి 9.00 వరకు

భీమా కోరేగావ్... ఓ అన్యాయ గాథ

విశ్లేషణ



జూలియో రెబీరో

భీమా కోరేగావ్ (మహారాష్ట్ర) కేసు మొదలై ఆరేళ్లవుతోంది. అక్కడ జరిగిన అల్లర్లకు కారణం కావడంతోపాటు, నిషేధిత మావోయిస్టు సంస్థ సభ్యులుగా ఉండి, ప్రధాని నరేంద్ర మోదీని చంపేందుకు కుట్ర పన్నారని ఆరోపిస్తూ 16 మందిని పుణె పోలీసులు 'ఉపా' కింద అరెస్టు చేశారు. అరెస్టయిన వారిలో న్యాయవాదులు, విద్యావేత్తలు, రచయితలు, కవులు, గాయకులు ఉన్నారు. వీరిలో ఎవరూ దోషులుగా తేలకుండానే, కనీసం విచారణనైనా ఎదుర్కోకుండా చాలా సంవత్సరాలు జైల్లో గడిపారు. కొందరు అతి కష్టం మీద బెయిల్ పొందారు, కొందరు ఇంకా జైల్లోనే ఉన్నారు. అయినా ఇప్పటికీ వారి మీద తుది అభియోగాలు మోపలేదు. విచారణ ఎప్పుడు మొదలవుతుందో తెలీదు. ఇలా ఏ ప్రజాస్వామిక దేశంలో అయినా జరుగుతుందా?

గుజరాత్‌కు చెందిన అల్పా షా నైరోబీలో పెరిగింది. నా దివంగత భార్య మెల్బా కూడా అక్కడే జన్మించి, పదేళ్ల వరకు అక్కడ ఉంది. కెన్యాలోని మౌ మౌ ఉద్యమం కారణంగా భారతీయ సంతతికి చెందిన అనేక కుటుంబాలు ఆ దేశాన్ని విడిచి రావలసి వచ్చింది. అలా భారత్‌కు వచ్చినవారిలో గోవాకు చెందిన నా భార్య వాళ్ల మెనెజెస్ కుటుంబాలు కూడా ఉన్నాయి. వీళ్ల గోవాకు వస్తే, అల్పా ఇంగ్లండ్‌కు వలస వెళ్లింది.

అల్పా కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో చదువుకున్నారు. ప్రస్తుతం ఆంత్రోపాలజీ ప్రొఫెసర్‌గా ఉన్నారు. 'నైట్‌మార్చ్', 'ఇన్ ది షాడోస్ ఆఫ్ ద స్టేట్' పుస్తకాలు రాశారు. ఆమె ఇటీవలి పుస్తకం 'ది ఇన్‌కార్సెరాషెన్స్: భీమా కోరేగావ్ అండ్ ద సెర్చ్ ఫర్ డెమోక్రసీ ఇన్ ఇండియా' మానవ హక్కుల కోసం పరితపించే ఈ నిబద్ధ యోధురాలిని నాకు పరిచయం చేసింది. అల్పా రాసిన 'ఇన్‌కార్సెరాషెన్స్...' (నిర్బంధాలు) మార్చిలో ప్రచురితమైంది. నిషేధిత మావోయిస్టు సంస్థ సభ్యులుగా ఉండి, ప్రధాని మోదీని చంపేందుకు కుట్ర పన్నినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న 16 మంది వ్యక్తిగత చరిత్రను అల్పా పరిశీలించారు. మోదీని చంపేందుకు కుట్ర పన్నారనే ఆరోపణను కేసు తీవ్రత కోసం జోడించినట్లు కనిపిస్తోంది. విచారణ సమయంలో ఈ ఆరోపణ పునరావృతం కాలేదు.

భీమా కోరేగావ్ కేసులో అరెస్టయిన వారిలో న్యాయవాదులు, విద్యావేత్తలు, రచయితలు, కవులు, గాయకులు కూడా ఉన్నారు. వీరిలో కబీర్ కళా మంచ్ కవి సుధీర్ ధావలే, గాయకులు రమేశ్ గాయిచోర్, సాగర్ గోరఖే, జ్యోతి జగ్‌తాప్ వంటివారు కేసులోని ఇతరులకు తెలియనే తెలియదు. వీరిలో ఎవరూ దోషులుగా తేలకుండానే, చాలా ఏళ్ళు జైల్లో గడిపారు. క్రూరమైన 'ఉపా' (చట్టవిరుద్ధమైన కార్యకలాపాల నిరోధక చట్టం) కింద వారిని అరెస్టు చేసినందున, ఈ ప్రక్రియే శిక్షగా మారింది. ఉపా కేసుల్లో బెయిల్ పొందడం దాదాపు అసాధ్యం. భీమా కోరేగావ్ నిందితులపై తుది అభియోగాలు ఇంకా రూపొందించలేదు. 2018లో మొదటి అరెస్టులు జరిగాయి. కొందరు బెయిల్‌పై ఉన్నారు, కొందరు ఇంకా జైలులో ఉన్నారు. వారి మీద సమీప భవిష్యత్తులో విచారణ ప్రారంభమయ్యే అవకాశం లేదు.

'జైలు కాదు, బెయిల్' అనేది సుప్రీంకోర్టును అలంకరించిన అత్యంత గౌరవనీయమైన న్యాయనిపుణులలో ఒకరైన జస్టిస్ వీఆర్ కృష్ణయ్యర్ నిర్దేశించిన సూత్రం. ఆయన అన్నయ్య వీఆర్ లక్ష్మీనారాయణన్ నా ఐపీఎస్ సహోద్యోగి. సీబీఐలో పనిచేశారు. దేశ భద్రతకు ముప్పు వాటిల్లుతుందని చెప్పే సందర్భాల కోసం తెచ్చిన ఉపాను వాస్తవ ఆచరణలో, అన్యాయానికి సాధనంగా మార్చేశారు.

ఉపా కింద నిర్బంధానికి గురైన 16 మంది కార్యకర్తలు వివిధ వర్గాలకు చెందినవారు. ఇందులో నలుగురు క్రైస్తవులు: ఫాదర్ స్టాన్ స్వామి (ఇప్పుడు మరణించారు), తమిళనాడులోని ఒక సంపన్న భూస్వామ్య కుటుంబంలో జన్మించిన జెసూట్ మతగురువు వెర్నాన్ గోంసాల్వేస్, ముంబైకి చెందిన అరుణ్ ఫెరీరా, కేరళకు చెందిన రోనా విల్సన్. ముస్లిం అయిన హనీ బాబు కూడా కేరళకు చెందినవారే. ఈ కేసులో ఏడుగురు దళిత హక్కుల కార్యకర్తలు ఉన్నారు: దళిత దిగ్గజం బీఆర్ అంబేడ్కర్ మనమరాలు రమను వివాహం చేసుకున్న ఆనంద్ తేల్‌తుంబ్డేతో పాటు జ్యోతి జగ్‌తాప్, సాగర్ గోరఖే, రమేశ్ గాయిచోర్, సుధీర్ ధావలే, సురేంద్ర గాడ్లింగ్, షోమా సేన్ ఈ కేసులో భాగం. మిగిలిన నలుగురు అగ్రకుల హిందువులు. ఇందులో సుధా భరద్వాజ్‌తో పాటు, మహేశ్ రావుత్ (గడ్చిరోలికి చెందిన అటవీ హక్కుల కార్యకర్త), మానవ హక్కుల కార్యకర్త గౌతమ్ నవ్‌లఖా (వీరి భాగస్వామి సభా హుస్సేన్ మహిళా హక్కుల కార్యకర్త), హైదరాబాద్‌కు చెందిన వామపక్ష కవి వరవరరావు ఉన్నారు. ఈయన తన కవితలు, కార్యకలాపాలకుగాను గతంలోనూ జైలులో ఉన్నారు.



ఆనంద్ తేల్‌తుంబ్డే, సుధా భరద్వాజ్, స్టాన్ స్వామి, షోమా సేన్, అరుణ్ ఫెరీరా, గౌతమ్ నవ్‌లఖా, రోనా విల్సన్, వరవరరావు.

సుధా భరద్వాజ్, ఫాదర్ స్టాన్ స్వామి గిరిజన హక్కుల కోసం పోరాడారు. సుధ అమెరికాలో విద్యావేత్తలైన భారతీయ తల్లిదండ్రులకు జన్మించారు. కాన్పూర్ ఐఐటీలో చదువుకున్నారు. ఆమెకు అమెరికా పాస్‌పోర్ట్ ఉంది. చట్ట పరిధిలో హక్కుల కోసం పోరాడుతున్న గిరిజనులతో తన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకున్న తర్వాత తన పాస్‌పోర్టును అప్పగించారు. బాంబే హైకోర్టు విడుదల చేయడానికి ముందు ఆమె మూడేళ్లు జైలు జీవితం గడిపారు. ఛత్తీస్‌గఢ్‌లో తమ భూమిని కోల్పోయిన గిరిజనుల పక్షాన వాదించడమే ఆమె చేసిన ఏకైక 'నేరం'. ఫాదర్ స్వామి నాయకత్వంలో గిరిజనులు అమలులో ఉన్న చట్టాలకు అనుగుణంగా తమ హక్కులపై అవగాహన పెంచుకున్నారు. ఈ చట్టాలు గిరిజనుల భూముల్లో ఇనుప ఖనిజం, బొగ్గు తవ్వకాలకు వ్యతిరేకంగా పోరాడేందుకు వారిని పురికొల్పాయి. ఫాదర్ స్వామి ప్రేరేపణతో జార్ఖండ్‌లోని హో గిరిజనులు లేవనెత్తిన అభ్యంతరాల వల్ల చాలా కార్పొరేట్ గ్రూపులు దెబ్బతిన్నాయి. ఆయన జ్యుడీషియల్ కస్టడీలోనే మరణించారు (2021).

ఆనంద్ తేల్‌తుంబ్డే ఒక ఇంజినీర్. ప్రభుత్వ రంగంలో చమురు, గ్యాస్ ఉత్పత్తి సంస్థ అయిన పెట్రోనెట్ ఇండియాకు సీఈఓగా, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమితులు కాకముందు భారత్ పెట్రోలియంలో రెండు దశాబ్దాలు పనిచేశారు. పదవీ విరమణ చేసే ముందు ముంబై విశ్వవిద్యాలయం నుండి మేనేజ్‌మెంట్‌లో పీహెచ్‌డి పొందారు. ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని వినోద్ గుప్తా స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ప్రొఫెసర్‌గా చేరారు. తాను ఏ నేరం చేయలేదని చెప్పినప్పటికీ ఆయనను పుణె పోలీసులు గోవాలో పట్టుకున్నారు. పోలీసులు, జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తేల్‌తుంబ్డేకు వ్యతిరేకంగా అందించిన ఏకైక సాక్ష్యం ఆయన కంప్యూటర్ నుండి సేకరించిన ఉత్తర ప్రత్యుత్తరాలు, మావోయిస్టులతో లింకులు ఉన్నట్లు అనుమానించిన మరికొందరి నుండి సేకరించిన ఉత్తరప్రత్యుత్తరాలు. వాటిని అందరూ తిరస్కరించారు. దళితులు, ఆదివాసీలు నయా ఉదారీకరణ, ప్రపంచీకరణ నుండి ప్రయోజనం పొందలేదని చూపించడానికి దేశవ్యాప్తంగా డేటాను విశ్లేషించడంపై తేల్‌తుంబ్డే ఆసక్తి చూపించారు. దళితులను, ఆదివాసీలను హిందూ మతంలోకి చేర్చడానికి సంఘ్ పరివార్ చేస్తున్న ప్రయత్నాలకు ఇది విరుద్ధం. అయితే సుధ, ఫాదర్ స్వామి, తేల్‌తుంబ్డే, షోమా సేన్ వంటి ఉద్యమకారుల ప్రయత్నాలు కులానికి, తెగలకు సంబంధించిన వివక్ష సమకాలీన భారతదేశంలో నియమంగా ఉంటోందని నిరూపించాయి.

అల్పా రాసిన పుస్తకం సమకాలీన భారత రాజకీయాలపై అధ్యయనం చేస్తున్న విద్యార్థులందరూ తప్పక చదవవలసినది. బాధితుల కంప్యూటర్‌లలో సాక్ష్యాలను చొప్పించడానికి మాల్‌వేర్‌ను ఉపయోగించడంలో నిపుణులైనవారిని హ్యాకర్‌గా ఉపయోగించారని కంప్యూటర్‌ల హ్యాకింగ్‌పై అమెరికా కేంద్ర నిపుణుల అన్వేషణలో తేలింది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన అమెరికాకు చెందిన రెండు డిజిటల్ ఫోరెన్సిక్స్, సైబర్ సెక్యూరిటీ కంపెనీలైన ఆర్సెనల్ కన్సల్టింగ్, సెంటినెల్ ల్యాబ్స్ కనుగొన్న వాటిని అంగీకరించడానికి ఎన్ఐఏ, పుణె పోలీసులు నిరాకరించారు. విచారణ సమయంలో ఈ నిపుణుల ఫలితాలను సమర్పించడానికి డిఫెన్స్ లాయర్లు ప్రయత్నించవచ్చు.

విచారణ ఎప్పుడు మొదలవుతుంది? ఇప్పటికైతే అభియోగాలు కూడా మోపే సూచనలు కనిపించడం లేదు. ప్రత్యేకించి తమపై మోపిన నేరాలకు సంబంధించి తాము దోషులం కాదని వారు చెబుతున్నప్పుడు కూడా విచారణపై ఆశ లేకుండా ఏళ్ల తరబడి వారిని జైలులో ఉంచడం ఏ ప్రజాస్వామిక దేశంలో అయినా జరిగిందా?

వ్యాసకర్త మాజీ ఐపీఎస్ అధికారి; 'పద్మభూషణ్' పురస్కార గ్రహీత ('ద ట్రిబ్యూన్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

మరేం చేయగలరు?



రైల్వే మంత్రి రైలు ప్రమాదాలనూ, రైళ్లు క్రిక్కిరిసిపోవడాన్నీ ఆపలేరు. విద్యా మంత్రి ప్రశ్నాపత్రాల లీకులనూ, ఆఖరికి పరీక్షల స్కాములనూ ఆపలేరు. హోమ్ మంత్రి తీవ్రవాద దాడులనూ, మణిపూర్ హింసనూ ఆపలేరు.

– ధ్రువ్ రాఠీ, యూట్యూబర్

అయ్యో అల్కా!



ఒక గాయని ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి రావడం దిగ్భ్రాంతిని కలిగించింది. ఆమె పూర్తిగా కోలుకోవాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను. (వైరస్ దాడి వల్ల కొన్ని వారాల క్రితం ఉన్నట్టుండి వినికిడి శక్తిని కోల్పోయినట్టు గాయని అల్కా యాజ్ఞిక్ పోస్ట్ చేశారు.)

– చిన్మయీ శ్రీపాద, గాయని

ఇండియన్ అయితే?



హారిస్ రవూఫ్‌తో ఫొటో దిగాలని అభిమాని అనుకున్నాడు. దానికి ఆయన నిరాకరించారు. గర్విష్ఠి, దురుసు అని అభిమాని నిందించాడు. ఇది ఆమోదయోగ్యం కాదు. అభిమానిని 'ఇండియన్' అంటూ హారిస్ దాడి చేయబోయారు. అభిమాని తాను పాకిస్తానీ అని చెప్పాడు. అభిమాని ఇండియన్ అయినా రవూఫ్ సహనం చూపాల్సింది! (టీ20 ప్రపంచ కప్ వేళ అమెరికాలో జరిగింది.)

– మెహ్‌విశ్ ఖమాస్ ఖాన్, పాక్ జర్నలిస్ట్

ఎండలా? మంటలా?



తీవ్ర ఎండాకాలాలు ఢిల్లీకి కొత్తేమీ కాదు; కానీ ఈసారి వేరే. ఎంత దారుణంగా ఉందంటే, కనీసం బయట ఒక పది నిమిషాలు నడవడం కూడా అసాధ్యంగా అనిపిస్తోంది. ఏసీలు నామమాత్రంగా పని చేస్తున్నాయి. నల్లా నీళ్లు మసిలిపోతున్నాయి. అయినా వాన జాడ లేదు.

– రాహుల్ సభర్వాల్, జర్నలిస్ట్

పాతికేళ్ల క్రితం...



ఇది మీకు తెలుసా? ఇస్మాయిల్ దర్బార్‌ను సంగీత దర్శకుడిగా తీసుకోవడానికి దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీని మెప్పించిన పాట 'తడప్ తడప్' (కేకే పాడారు). దర్బార్ దాని సంగీతం మీద నాలుగు నెలలు పనిచేశారు. ఒకరోజు భన్సాలీకి ఒక ట్యూన్ ఇచ్చారు. ఆయన దాన్ని 9 సార్లు విన్నారు. అదే ఈ పాట. దీంతో ఇంటెర్వల్ పాయింట్ కూడా తట్టిందని భన్సాలీ అన్నారు. ('హమ్ దిల్ దే చుకే సనమ్' పాతికేళ్ల క్రితం 1999 జూన్ 18న విడుదలైంది.)

– మీమాంస శేఖర్, జర్నలిస్ట్

నేర్చుకోవాల్సిన పాఠాలు



దేశంలోని 95 శాతం మంది డ్రైవర్లకు కనీసం మెయిన్ రోడ్డుకు కుడి వైపు ఎలా మలగాలో తెలియదు. అయినా మాకు డ్రైవింగ్ పాఠాలేమీ అక్కర్లేదని జనాలు వాదిస్తుంటారు. కాకపోతే బలవంతంగా అమలు చేయడం ఇలాంటి వాటిని ఎప్పటికీ పరిష్కరించలేదు. కేవలం శిక్షణతో మాత్రమే సాధ్యం.

– నరేశ్ రాఘవన్, డ్రైవింగ్ మాన్యువల్స్ రచయిత

దారుణ సేవలు



పేరుకు ధనిక దేశం. కానీ హజ్ యాత్రకు సంబంధించి, సౌదీ అరేబియాలో సేవలు దారుణంగా ఉన్నాయి. సరిపోయినన్ని అంబులెన్సులు లేవు. పోలీసులు లేరు. ఎక్కడ చూసినా చెత్తా చెదారంతో దారులు నిండిపోయాయి. వీధుల్లో యాత్రికులు చనిపోతున్నారు. (ఎండలకు 19 మంది హజ్ యాత్రికులు చనిపోయారని వార్త.)

– మాహెర్ లూవె, వ్యాఖ్యాత

ఇన్ బాక్స్

జన్యులోపంపై పోరాటం

మానవ శరీరానికి జీవాన్నిచ్చే రక్తాన్ని తయారు చేసే ఎర్ర రక్త కణాలలో లోపభూయిష్టంగా ఏర్పడే కణాలను 'సికిల్ సెల్స్' అంటారు. వీటి వల్ల రక్త హీనత కలుగుతుంది. ఈ వ్యాధినే 'సికిల్ సెల్ ఎనీమియా' అంటారు. దీన్ని 2047 నాటికి సమూలంగా నిర్మూలించాలన్న కృత నిశ్చయంతో ఉన్న కేంద్ర ప్రభుత్వం 2023 బడ్జెట్లో 'సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనా మిషన్' కార్యక్రమాన్ని ప్రకటించింది. దీనిలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రభావిత గిరిజన ప్రాంతాలలో 0–40 ఏళ్ళ మధ్య వయసున్న దాదాపు 7 కోట్ల మందికి ఈ వ్యాధిపై అవగాహన కలిగించటంతో పాటు సార్వత్రిక వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ వంటి వాటిని నిర్వహించాలని నిర్ణయించింది. ఏపీలో దాదాపు 4 వేల ఆరోగ్య కేంద్రాల్లో సికిల్ సెల్ ఎనీమియాపై పెద్ద ఎత్తున అవగాహనా కార్యక్రమాలు, వైద్య శిబిరాల ద్వారా వ్యాధి నిర్ధారణ పరీక్షలు, కౌన్సెలింగ్ వంటి కార్యక్రమాల్ని 'ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా నివారణా దినం' సందర్భంగా జూన్ 19న చేపడుతున్నారు.

సికిల్ సెల్ ఎనీమియా మానవ శరీరాలకు వారసత్వంగా సంక్రమించే వ్యాధి. మన రక్తంలో హిమోగ్లోబిన్ ఉత్పత్తికి కారణమయ్యే జన్యు కణాలు లోపభూయిష్టంగా ఏర్పడటం ఈ వ్యాధికి కారణం.

రక్తకణాల సంఖ్య తగ్గడం (రక్తహీనత), కళ్ళు పసుపు రంగులోకి మారటం, తీవ్రమైన ఒళ్ళునొప్పులు, కీళ్ళ నొప్పులు, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది, అలసట, తరచుగా వచ్చే అంటు వ్యాధులు, గర్భధారణ సమయంలో సమస్యలు, అవయవ నష్టం (వైఫల్యం) వంటి లక్షణాలు సికిల్ సెల్ బాధితుల్లో కనపడతాయి.

చాలా మంది పిల్లలు, పెద్దలు ఈ రకమైన బాధను కలిగి ఉంటారు. వారిలో వీపు, కాళ్ళు, ఛాతీ, మొదలైన ప్రాంతాల్లో తీవ్రమైన నొప్పి ఉంటుంది. వాతావరణంలో మార్పు, విరేచనాలు, జ్వరం, నిర్జలీకరణం (డీహైడ్రేషన్), ఇన్ఫెక్షన్, ఒత్తిడి, అలసట వంటి లక్షణాలు ఈ నొప్పిని మరింత ఎక్కువ చేస్తాయి. ఈ లక్షణాలు లేకపోయినా సరే ఈ వ్యాధిగ్రస్థులు క్రమం తప్పకుండా స్పెషలిస్టు డాక్టర్‌ను సంప్రదించాలి.

– కిల్లి వేంకట రమణమూర్తి, ఏపీ వైద్య ఆరోగ్యశాఖ పీఆర్వో
(నేడు ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనా దినం)

కొత్త పాఠ్యాంశాల రూపకల్పన జరగాలి!

అభిప్రాయం



బి.ఎస్. రాములు

తెలంగాణ రాష్ట్రం ఏర్పడగానే కొత్త పాఠ్యపుస్తకాలు వచ్చాయి. ఆనాటి అవగాహన, చరిత్ర పరిణామం, తెలంగాణ భాష, సంస్కృతి తీరుతెన్నులు మరింత స్పష్టమయ్యాయి. ఆనాటి పాఠ్యపుస్తకాల్లో ఒకేసారి తెలంగాణ భాష ప్రవేశపెడితే ఇబ్బందిగా ఉంటుందని కొన్ని పాఠాలు పాత పద్ధతిలో, కొన్ని పాఠాలు తెలంగాణ భాషలో తెచ్చారు. ఆనాడు ఒకటో తరగతిలో ఉన్నవారు ఇప్పుడు పదో తరగతిలో చేరారు. ఇప్పుడు అందరికీ తెలంగాణ భాష వచ్చేస్తున్నది. తెలంగాణలో ఉన్న ఆంధ్ర, తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల ప్రజలు, విద్యార్థులకు ఇప్పుడు తెలంగాణ భాష సుపరిచితం. అందువల్ల తెలంగాణ భాషనూ, సంస్కృతీ చరిత్రలను మరింత సుసంపన్నం చేసుకోవడానికి పాఠ్యపుస్తకాలను కొంగొత్తగా తీర్చిదిద్దుకోవడం అవసరం.



తెలుగు భాష నేర్చుకోవడానికి, నేర్పడానికి సంస్కారవంతమైన పదాలు, నుడికారాలు పొందుపరుస్తారు. వాడుకలో ఉన్న పదాలను తీర్చిదిద్ది అవసరమైన మేరకు చేర్చుతారు. కొన్ని పదాలు, భావాలు పరిహరిస్తారు. తెలుగు వాచకాల ద్వారా అనేక కోణాల్లో ఆలోచించి వ్యాకరణం; నిత్య జీవితంలోని అవసరాలకు, అవగాహనకు అనుకూలంగా పాఠ్యాంశాలు చేర్చుతారు. పోస్టాఫీసు, రైల్వే, బస్సు, రవాణా సౌకర్యాలు లేఖలు రాసే విధానం, ప్రశ్నలకు జవాబులు ఇచ్చే విధానం పాఠం సారాంశాన్ని అర్థం చేసుకుని సంక్షిప్తంగా రాసే విధానాన్ని నేర్పుతారు. ఏ భాషలోనైనా ఈ కృషి ఇలా సాగుతుంది. ఫలితంగా ఆ యా భాషలపై పిల్లలకు పట్టు చిక్కుతుంది.

నాలుగవ తరగతి నుండి భారత రాజ్యాంగంలోని ప్రాథమిక హక్కులను, వాటి విశిష్టతను పాఠ్యాంశాలుగా వీలున్నంత ఎక్కువగా చేర్చాలి. అలా విద్యార్థులను ఒక నూతన సమాజ నిర్మాణంలో, నూతన సంస్కృతి విలువలతో మనుషులంతా ఒక్కటే అనే ఆత్మవిశ్వాసంతో, ఆత్మ గౌరవంతో ఎదగడానికి, తీర్చిదిద్దడానికి కృషి జరగాలి. ఓటు హక్కు విలువ, ఆధార్ కార్డు, పాస్‌పోర్ట్, ఎన్నికలు జరిగే తీరు, ప్రజాప్రతినిధులను ఎన్నుకునే తీరు, గ్రామ పంచాయితీ, మున్సిపాలిటీ కర్తవ్యాలు, శాసనసభ, ఎమ్మెల్యేల, ఎంపీల కర్తవ్యాలు ఏమిటో పదో తరగతికి వచ్చేటప్పటికి అన్నీ అర్థం కావాలి. ఐదో తరగతి నుండి ఇంటర్ వరకు ప్రతి ఒక్క విద్యార్థికీ స్థానిక మాతృభాషలో తేలికైన పదాలతో భారత రాజ్యాంగాన్ని ప్రచురించి ఉచితంగా అందించాలి. తద్వారా వారు ఏ రంగంలో ఉన్నా, తమ హక్కులను తెలుసుకుంటారు. తమ కర్తవ్యాలను గుర్తిస్తారు.

ఆ యా సబ్జెక్టులను నేర్పడానికి రాసిన పాఠ్యపుస్తకాలను అవే భావాలతో తెలుగు పాఠ్యపుస్తకాల రచయితలు సంస్కృత పదాలతో నింపకుండా, వాడుక భాషలోని పదాలతో తిరిగి రాసి సుసంపన్నం చేయాలి. అచ్చ తెలుగు పదాల వాడకం తెలంగాణలో చాలా ఎక్కువ. వాటిని ప్రజల నుండీ, విద్యార్థుల నుండీ సేకరించి పాఠాల రచనలో ఉపయోగించాలి. వాడుకలో ఉన్న ఇంగ్లీషు, ఉర్దూ, మరాఠీ, తమిళ, కన్నడ పదాలను తొలగించకుండా పాఠాల్లో మాతృభాషగానే భావించి ఉపయోగించినప్పుడే జీవితానికి దగ్గరగా పాఠ్యాంశాలు ఉంటాయి.

ప్రతి ఐదారేళ్ళకోసారి పాఠ్యపుస్తకాలు మారుతుండాలి. కొత్త విషయాలు చేర్చుతుండాలి. ఉపాధ్యాయులకు మారిన విషయాలపట్ల శిక్షణ ఇస్తూ ఉండాలి. ఇంగ్లీషు మీడియంలోనైతే కేవలం స్కూల్లో నేర్చుకుంటేనే సరిపోదు. సాయంత్రం, రాత్రి, ఉదయం పరస్పరం ఇంగ్లీషులో మాట్లాడుకునే అవకాశం ఉన్నప్పుడే ఇంగ్లీషు భాషలో మాట్లాడడం, విషయం చెప్పడం అలవాటవుతుంది. అందుకు పాఠశాలల్లో సాయంత్రాలు ప్రత్యేకంగా శిక్షణ ఇవ్వడం అవసరం. గురుకుల పాఠశాలల్లో విద్యార్థులు ఇలాంటి శిక్షణ పొంది ఇంగ్లీషులో చక్కగా మాట్లాడుతున్నారు. ఏడో తరగతికే హ్యారీపోటర్ నవలలను చదువుతున్నారు. ఇలా తెలుగు, హిందీ మీడియాల్లో చదివేవాళ్ళు కూడా ఐదో తరగతి నుండి ఆధునిక సాహిత్యం చదవడంతో పాటు కవితలు, పాటలు, కథలు, వ్యాసాలు రాసే నైపుణ్యాలు అలవర్చడం ఎంతో అవసరం.

వ్యాసకర్త తెలంగాణ బీసీ కమిషన్ తొలి ఛైర్మన్ । 83319 66987

పవిత్రతకు ఉద్దీపన

మనం మన ఇంటిలోని గోడలపై రక రకాల రంగురంగుల చిత్రపటాలను తగిలించుకుంటాం. ప్రకృతి రమణీయమైన చిత్రాలు అందులో ఉంటాయి. జలపాతాలు, దేవదారు వృక్షాలు, కొండలు, కోనలు, మేఘాలు, నెమళ్ళు, బారులు తీరిన కొంగలు – ఇలా ఎన్నెన్నో మనకు, మన ఇంటికి వచ్చే అతిథులకు కనువిందు చేస్తాయి. మానసిక ఆనందం కల్గుతుంది. అయితే ఆధ్యాత్మిక ప్రగతికి తోడ్పడేవి ముఖ్యంగా దేవీ దేవతల, సాధు సత్పురుషుల చిత్రపటాలు.

ఒకసారి శ్రీరామ కృష్ణ పరమహంస... అశ్వినీ కుమార్ దత్తాకు తమ గదిలోని చిత్తరువులను చూపించి ఆ తర్వాత, 'బుద్ధుని చిత్తరువు దొరుకుతుందా? దొరికితే నా కొరకు ఒకటి పట్టుకు రండి దయచేసి' అన్నారు. దేవీ దేవతల, సాధు సత్తముల చిత్తరువులను చూస్తూ ఉంటే దివ్యభావన ఉద్దీపనమవుతుంది కాబట్టి రామకృష్ణ పరమహంస అలాంటి చిత్తరువులను ఇంటి గోడలపై తగిలించుకొమ్మని తన భక్తులకు చెప్పి ప్రోత్సహించేవారు. తానూ స్వయంగా అలా చేసేవారు. 'ఇలాంటి చిత్తరువులు నాలో ఆధ్యాత్మిక ఉద్దీపన కలిగిస్తాయి, బొమ్మ పండును చూస్తే నిజమైన పండు జ్ఞాపకం వచ్చినట్టు' (పుట 185– శ్రీరామకృష్ణ లీలామృతం) అని అంటారాయన. దీన్ని చదివినప్పుడు మనకు శిరిడీసాయి, గజానన్ మహారాజ్ గుర్తొస్తారు. వారిద్దరూ దత్తాత్రేయుని అవతారాలేనని అంటారు. బహుశ రామకృష్ణుడు వారిని గూర్చి విని ఉండరు. దివ్యదృష్టితో దర్శించి ఉంటారు. హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు భగవంతుని దర్శించగలరు అని పెద్దలు అంటారు. మనం మనలోని దుర్గుణాలను గమనించి వాటిని వదిలించుకొంటూ మరొకవైపు ధ్యాన, ప్రార్థనల్లో గడుపుతుంటే సత్పురుషుల, ఋషుల దర్శనం లభిస్తుంది. క్రమక్రమంగా చివరకు సత్యసాక్షాత్కారమే కల్గుతుంది.

'కామం, క్రోధం, లోభం, మోహం త్యక్త్వాత్మానం పశ్యతి సోహం' – అని చెబుతుంది భజగోవింద శ్లోకం. కామ, క్రోధాదులను వదిలించుకొంటే సోహం భావం కలిగి 'శివోహం శివోహం' అని అనగలం. కాబట్టి మనల్ని మనం నిత్యం పరిశీలించుకొంటూ అహంకారాది దుర్గుణాలను వదిలించుకొంటే మన హృదయమే దైవం కొలువై ఉండే పవిత్ర ఆలయం అవుతుంది.

– రాచమడుగు శ్రీనివాసులు

కొత్త వంగడాలతో తెగుళ్లకు చెక్


వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్నలో కొత్త రకాలు | **విడుదల చేసిన వ్యవసాయ వర్సిటీ** | **ఎనిమిదేళ్లలో వివిధ పంటలలో 61 వంగడాలు**



సాక్షి, హైదరాబాద్, ఏజీవర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం మంగళవారం వివిధ పంటల్లో ఎనిమిది నూతన వంగడాలను విడుదల చేసింది. సెంట్రల్ వెరైటల్ రిలీజ్ కమిటీ, రాష్ట్ర స్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీల ఆమోదంతో వీటిని రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చింది. వరి, మొక్కజొన్న, రాగి, సజ్జ, జొన్న పంటలలో మొత్తం ఎనిమిది రకాలను విడుదల చేసినట్లు వైస్ చాన్స్‌లర్ ఎం.రఘునందన్‌రావు, పరిశోధన సంచాలకులు డాక్టర్ పి.రఘురామిరెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. వరిలో రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో రెండు రకాలు, సెంట్రల్ వెరైటల్ రిలీజింగ్ కమిటీ ఆమోదంతో మరో రెండు రకాలను విడుదల చేశారు. అలాగే రాష్ట్రస్థాయి వెరైటల్ రిలీజ్ కమిటీ ఆమోదంతో జొన్న, రాగి సజ్జ పంటలో ఒక్కొక్కటి చొప్పున... అలాగే సెంట్రల్ వెరైటల్ కమిటీ ఆమోదంతో మొక్కజొన్నలో ఒక రకాన్ని విడుదల చేసినట్లు వివరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఏర్పడిన తర్వాత గత 8 ఏళ్లలో వివిధ పంటలలో 61 నూతన వంగడాలను రైతులకు అందుబాటులోకి తేవడం జరిగింది. అందులో భాగంగా వరిలో 25, మొక్కజొన్న 2, జొన్నలో 5, అపరాలలో 11, నూనె గింజల్లో 7, పత్తిలో 1, పశుగ్రాస పంటలలో పది రకాలను విడుదల చేయడం జరిగింది. అందులో రాష్ట్ర స్థాయిలో 23, జాతీయ స్థాయిలో 38 రకాలను విడుదల చేసినట్లు వారు వివరించారు.

తాజాగా వరిలో విడుదలైన రకాలేంటంటే..?

రాష్ట్రంలో గత కొన్నేళ్లుగా వరి విస్తీర్ణం గణనీయంగా పెరుగుతూ ఉండడంతో నీటిపారుదల సౌకర్యం ఉన్న ప్రాంతాల్లో ఒకే ఏడాది రెండు పంటలు వేసుకోవడానికి అవకాశం ఉంది. ఇందుకోసం తక్కువ కాల వ్యవధితో పాటు అగ్గి తెగులు, సుడిదోమ, ఉల్లికోడులను తట్టుకొనే రకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకొని వరిలో కొత్తగా నాలుగు రకాలను రైతులకు వర్సిటీ అందుబాటులోకి తెచ్చింది. రాజేంద్రనగర్ వరి పేరిట ఆర్ఎస్ఆర్-28361 అను దొడ్డు గింజల రకాన్ని రాష్ట్రస్థాయి వెరైటల్ కమిటీ ఆమోదంతో విడుదల చేసినట్లు ఎం.రఘునందన్ రావు, డాక్టర్ రఘురామిరెడ్డి తెలిపారు. అలాగే తెలంగాణ వరి- (కేఎన్ఎం- 7037) పేరిట తక్కువ పంట కాలం కలిగిన, సన్నని, పొడవైన గింజ, తక్కువ నూక శాతం (దిగుబడి 62.3 కిలోలు), నాణ్యత కలిగిన అన్నం లక్షణాలు కలిగిన ఈ రకాన్ని జాతీయ స్థాయిలో విడుదల చేసినట్లు వివరించారు. సుడిదోమ, అగ్గి తెగులు, ఎండు కోళ్ళు తెగులును తట్టుకొనే తెలంగాణ వరి-1289 (డబ్ల్యూజీఎల్- 1289) ను కూడా జాతీయస్థాయిలో విశ్వవిద్యాలయం విడుదల చేసింది. ఇది తెలంగాణతోపాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలలోనూ సాగు చేయడానికి అనుకూలమైన రకమని వారు తెలిపారు. అలాగే ఉల్లికోడు బయోటైప్‌లను తట్టుకొనే వరంగల్ వరి-119ను కూడా రాష్ట్ర స్థాయిలో విడుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు.



మొక్కజొన్న: కాండం కుళ్ళు తెగులు తట్టుకొని అధిక దిగుబడినిచ్చే డీహెచ్ఎం-206 అనే నూతన మొక్కజొన్న హైబ్రిడ్ ను జాతీయస్థాయిలో విడుదల చేయడం జరిగింది. ఇది ఉత్తర భారత దేశంలోని వివిధ రాష్ట్రాలలో సాగుకు అనుకూలమైన మొక్కజొన్న హైబ్రిడ్.

జొన్న: యాసంగిలో సాగుకు రైతులు ఎక్కువగా మొగ్గు చూపే మాల్దండి జొన్న రకానికి ధీటుగా, తాండూర్ పరిశోధన స్థానం నుంచి ఎస్‌వీటీ-55 అనే కొత్త జొన్న రకాన్ని విడుదల చేశారు. జొన్న రొట్టె నాణ్యతతో ఉండడం దీని ప్రత్యేకత.

సజ్జ - రాగి: పాలెం ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ద్వారా అధిక ఇనుము, అధిక జింక్ కలిగిన పీబీహెచ్-1625, సజ్జ హైబ్రిడ్‌ను అలాగే రాగిలో అధిక కాల్షియం కలిగిన పీఆర్ఎస్-38 రకాన్ని రాష్ట్రస్థాయిలో విడుదల చేయడం జరిగింది.

యాదాద్రిలో సామూహిక గిరి ప్రదక్షిణ



సామూహిక గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం సామూహిక గిరి ప్రదక్షిణ వేడుకగా జరిగింది. శ్రీస్వామి వారి జన్మ నక్షత్రమైన స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని కొండ దిగువన వైకుంఠద్వారం వద్ద ఉదయం 5.30 గంటలకు ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, ఈఓ భాస్కర్‌రావు, అనువంశిక ధర్మకర్త బి.నర్సింహమూర్తి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 4 వేల మందికిపైగా భక్తులతో గిరి ప్రదక్షిణ చేశారు. సుమారు 4.5 కిలోమీటర్ల దూరం గిరి ప్రదక్షిణ చేస్తూ శ్రీలక్ష్మీనరసింహస్వామి నామస్మరణ చేశారు. గిరి ప్రదక్షిణలో కోలాటాలు, హరేరామ హరేకృష్ణ బృందాలు, కళాకారులు దేవుడి పాటలతో భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం అయిలయ్య, భాస్కర్‌రావు, నర్సింహమూర్తిలతో పాటు భక్తులంతా మెట్ల మార్గంలో యాదాద్రి కొండపైకి చేరుకున్నారు. భక్తులందరికీ గర్భాలయంలో స్వయంభూ దర్శనాన్ని కల్పించారు.

నిరుద్యోగుల జోలికొస్తే ఊరుకోం

బీఆర్ఎస్ నేతలు దేవీప్రసాద్, వాసుదేవరెడ్డి

సాక్షి, హైదరాబాద్: నిరుద్యోగులు, పోటీ పరీక్షల అభ్యర్థులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించకుంటే ఊరుకునే ప్రసక్తే లేదని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. శాసనమండలికి ఎన్నికైన బల్మూరు వెంకట్ వంటి నేతలు చిన్న బుద్ధితో వ్యవహరించవద్దని హితవు పలికారు. పార్టీ నేతలు జి.దేవీప్రసాద్, కేతిరెడ్డి వాసుదేవరెడ్డి మంగళవారం తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. నిరుద్యోగులు ఎదుర్కొంటున్న ఐదు ప్రధాన సమస్యలను తమ పార్టీకి చెందిన మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రభుత్వం దృష్టికి తెచ్చారన్నారు. ప్రతిపక్ష నేతగా తన వద్దకు వచ్చే వినతులను ప్రస్తావించిన హరీశ్‌రావుపై మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి విమర్శలు చేయడం సరికాదన్నారు. చంద్రబాబు కార్యాలయానికి తెలంగాణ మంత్రి వెళ్లడంపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు పెండింగులో ఉన్న డీఏలు అమలయ్యే చూడాలని దేవీ ప్రసాద్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. నిరుద్యోగులకు కాంగ్రెస్ ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని కోరిన హరీశ్‌రావుపై ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ చేసిన వ్యాఖ్యలపై వికలాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

క్లుప్తంగా...

రైతులకు పంటల రాయితీ డబ్బు త్వరలో..

వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: ఆయిల్‌పామ్, అంతర పంటల రాయితీ డబ్బులను రెండు, మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు ఉద్యానశాఖ చర్యలు తీసుకుంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మంగళవారం సచివాలయంలో ఆయిల్‌పామ్, అంతర పంటలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ ప్రభుత్వం ఆయిల్‌పామ్ సాగు, వివిధ ఉద్యాన పంటల లో సూక్ష్మ సేద్యం కోసం రాయితీలు ఇస్తూ పెద్దఎత్తున ప్రోత్సహిస్తోందన్నారు. 2023-24 ఆయిల్‌పామ్ సాగు పథకం కింద కేంద్ర ప్ర భుత్వం రూ.80.10 కోట్లను విడుదల చేసింద ని, దీనికి రూ.53.4 కోట్ల రాష్ట్ర వాటా కలుపు కొని మొత్తం రూ.133.5 కోట్లు విడుదల చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా అను మతులు ఇచ్చిందని వివరించారు. బకాయిలు విడుదలైన నేపథ్యంలో 2024-25 సంవత్సరానికి నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవాలని, ఆయిల్‌పామ్ సాగు చేపట్టేందుకు రైతులను ప్రోత్సహించాలని ఉద్యానవనశాఖ అధికారులను మంత్రి తుమ్మల ఆదేశించారు.

భద్రాద్రి రామయ్య ప్రవర, గోత్రాలపై విచారణ

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో శ్రీరామనవమి రోజు చదివే స్వామివారి ప్రవర, గోత్రాలపై జరుగుతున్న వివాదంపై విచారించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ మంగళవారం భద్రాచలం చేరుకుంది. కొంతకాలంగా జరుగుతున్న ఈ వివాదంపై విచారణకు ప్రభుత్వం కమిటీ వేసింది. గతంలోనే ఆలయ అర్చకులు, పండితుల నుంచి సీల్డ్ కవర్లలో అభిప్రాయా లు సేకరించారు. కాగా, దీనిపై ఆరోపణలు చేస్తున్న ఇరు వర్గాల వారిని విచారించేందుకు ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీ భద్రాచలం చేరుకుంది. దేవస్థానం కాటేజీల్లో ప్రత్యే కంగా వీడియోలు ఏర్పాటుచేసి అర్చకులు, వేద పండితులు, అధికారుల నుంచి వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. మరో మూడురోజుల పాటు ఇరు వర్గాల వారిని విచారించనున్నట్లు తెలిసింది. అయితే ఈ వివాదం హై కోర్టు పరిధిలో ఉండడంతో.. వివరాలు వెల్లడించేందుకు అధికారులు ఇష్టపడటం లేదు.

హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్లడం ఖాయం

- హరీశ్, రఘునందన్ మధ్య లోపాయికారీ ఒప్పందం
- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, అడ్లూరి లక్ష్మణ్

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి హరీశ్‌రావు బీజేపీలోకి వెళ్లడం ఖాయమని ఆయనకు మెదక్ ఎంపీ రఘునందన్‌రావుకు మధ్య లోపాయికారి ఒప్పందం ఉందని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. ప్రభుత్వ విప్‌లు బీర్ల ఐలయ్య, అడ్లూరి లక్ష్మణ్ మంగళవారం అసెంబ్లీ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా హరీశ్ రావుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బీర్ల ఐలయ్య మాట్లాడుతూ హరీశ్ రావుకు బీఆర్ఎస్ పార్టీ పగ్గాలు ఇవ్వరని తేలిందని, అందుకే ఆయన త్వరలోనే బీజేపీలోకి వెళ్తారని జోస్యం చెప్పారు. హరీశ్ రావు తన స్థాయిని మరిచి పిచ్చెక్కినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. మీడియా ముందు మాట్లాడకపోతే మామకి అనుమానం వస్తుందని హరీశ్ భయపడుతున్నాడని, పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుండి కేసీఆర్, కేటీఆర్ గాయబ్ అయ్యారని, ప్రజలు పరువు తీసినా బీఆర్ఎస్ నేతలకు సిగ్గు రావడం లేదని ఘాటుగా ధ్వజమెత్తారు. ఎప్పటికైనా బీఆర్ఎస్ పార్టీని బీజేపీలో విలీనం చేస్తారని అన్నారు. కాగా, జూలై 17 నుంచి రైతులకు రుణమాఫీ చేస్తామని వారు వెల్లడించారు.

సడన్ బ్రేక్ ప్రాణం తీసింది..

లారీ కేబిన్‌లోకి దూసుకొచ్చిన రైలు పట్టాలు.. శరీరం ఛిద్రమై డ్రైవర్ మృతి



రైల్వే ట్రాక్‌లైన్ పట్టాలను పక్కకు లాగుతున్న జేసీబీలు

దమ్మపేట: రోడ్డుపై నిర్మించిన స్పీడ్ బ్రేకర్లు ఓ లారీ డ్రైవర్ ప్రాణాలను బలి తీసుకున్నాయి. స్పీడ్ బ్రేకర్లను ముందుగా గమనించని డ్రైవర్.. సడన్ బ్రేక్ వేయడంతో లారీలో ఉన్న రైల్వే ట్రాక్ పట్టాలు కేబిన్‌లోకి దూసుకొచ్చి తగలడంతో అతడి శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం గుర్వాయిగూడెంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ నుంచి రైల్వే ట్రాక్ పట్టాల లోడ్‌తో ట్రాలీ లారీ తమిళనాడులోని తిరుచనాపల్లికి వెళుతోంది. లారీని మధ్యప్రదేశ్‌కు చెందిన కాకు(36) నడుపుతుండగా, ఆకాష్ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. దమ్మపేట మండలం గుర్వాయిగూడెం సమీపంలోని మూలమలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లను గమనించని కాకు.. అక్కడికి రాగానే సడన్ బ్రేక్ వేశాడు. దీంతో ట్రాలీలో ఉన్న రైల్వే ట్రాక్ పట్టాలు కేబిన్‌లోకి దూసుకురాగా లారీ ఒక పక్కకు పడిపోయింది. పట్టాలు డ్రైవర్‌పై పడడంతో శరీరం ఛిద్రమై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహం కేబిన్‌లో ఇరుక్కుపోయింది. క్లీనర్ మాత్రం కిందకు దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. సమాచారం అందగానే అక్కడికి చేరుకున్న సీఐ జితేందర్‌రెడ్డి, ఎస్సై సాయికిశోర్‌రెడ్డి నాలుగు జేసీబీలతో రెండు గంటల పాటు శ్రమించి పట్టాలను, డ్రైవర్ మృతదేహాన్ని వెలికితీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అశ్వారావుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

నిషేధిత డ్రగ్ తయారీ ముఠా గుట్టురట్టు

పోలీసుల అదుపులో ఇద్దరు నిందితులు.. వివరాలు వెల్లడించిన ఎస్పీ రూపేశ్



డ్రగ్ తయారీ కోసం ఏర్పాటు చేసిన రియాక్టర్ తదితర పరికరాలను పరిశీలిస్తున్న ఎస్పీ రూపేశ్

జిన్నారం (పటాన్‌చెరు): టీఎస్ న్యాబ్, జిల్లా పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి నిషేధిత డ్రగ్ తయారు చేస్తున్న ముఠా గుట్టును రట్టు చేశారు. సంగారెడ్డి జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేశ్ మంగళవారం వివరాలు వెల్లడించారు. గుమ్మడిదలకు చెందిన గోసుకొండ అంజిరెడ్డి, కొత్తపల్లికి చెందిన ప్రభాకర్‌గౌడ్, అనంతారానికి చెందిన సాయికుమార్‌గౌడ్, వికారాబాద్ జిల్లా పంచలింగాలకు చెందిన క్యాసారం రాకేశ్‌లు నిషేధిత అల్ప్రాజోలం తయారు చేయాలని నిర్ణయించుకున్నారు. నలుగురూ కలిసి కొత్తపల్లి గ్రామ శివారులో ఓ కోళ్ల ఫారాన్ని లీజుకు తీసుకున్నారు. అక్కడ ఓ ప్రత్యేక గదిలో డ్రగ్‌ను తయారు చేసేందుకు రియాక్టర్‌తో సహా అన్ని రకాల వసతులను ఏర్పాటు చేసుకున్నారు. అంజిరెడ్డి బాలానగర్‌లో అల్ప్రాజోలం తయారీకి కావాల్సిన ముడి పదార్థాలు తీసుకురాగా రాకేశ్ డ్రగ్‌ను ప్రాసెస్‌ను చేసేవాడు. ఆరు నెలలుగా వీరి డ్రగ్ వ్యాపారం బాగానే నడిచింది. అయితే గ్రామ శివారులో వ్యర్థాల ఘాటు వాసనలు వెలువడటంతో ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలిపారు. దీంతో టీఎస్ న్యాబ్, పోలీసులు సంయుక్తంగా డ్రగ్ కేంద్రంపై దాడులు జరిపి, రూ.40 లక్షల విలువైన 2.6 కిలోల అల్ప్రాజోలం, మరో రూ.60 లక్షల విలువైన ముడి పదార్థాలు, యంత్రాలను అధికారులు సీజ్ చేశారు. రాకేశ్, అంజిరెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకోగా, సాయికుమార్‌గౌడ్ ప్రస్తుతం చర్లపల్లి జైల్లో ఉన్నాడు. ప్రభాకర్‌గౌడ్ పరారీలో ఉన్నాడని ఎస్పీ రూపేశ్ తెలిపారు. సమావేశంలో న్యాబ్ డీఎస్పీ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ సంతోష్, పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి, జిన్నారం సీఐ సుధీర్ కుమార్, ఎస్ఐలు మహేశ్వర్‌రెడ్డి, విజయారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల భద్రతే ప్రధానం

- విధి నిర్వహణలో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి
- దక్షిణ మధ్య రైల్వేజనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్
- ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ భద్రత అవార్డుల ప్రదానం



మాట్లాడుతున్న అరుణ్‌కుమార్ జైన్

సాక్షి, హైదరాబాద్ : రైళ్ల నిర్వహణలో ప్రతి ఒక్కరూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని దక్షిణమధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ సూచించారు. ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని చెప్పారు. అన్ని విభాగాలూ సమన్వయంతో పని చేయాలన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం సికింద్రాబాద్ రైల్ నిలయంలో వివిధ విభాగాలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అదనపు జనరల్ మేనేజర్ ఆర్. ధనంజయులు, వివిధ శాఖలకు చెందిన ఉన్నతాధికారులు, సికింద్రాబాద్, హైదరాబాద్, విజయ వాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్‌లకు చెందిన రైల్వే మేనేజర్‌లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. జోన్‌లో సేఫ్టీ డ్రైవ్‌లను కొనసాగించాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నియంత్రించేందుకు ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆయన అధికారులను ఆదేశించారు. లోకో పైలట్లు, షంటర్‌లు, ట్రాక్ మెయింటెయినర్లు, గార్డులు తదితర క్షేత్రస్థాయి సిబ్బందికి ఎప్పటికప్పుడు భద్రతపై కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు.అనంతరం సరుకు రవాణా కార్యకలాపాలపై సమీక్ష నిర్వహించారు. ట్రాక్ పునరుద్ధరణకు సంబంధించిన పనుల పురోగతిని కూడా సమీక్షించారు.

12మందికి అవార్డులు: విధినిర్వహణలో అప్రమత్తంగా ఉండి, అంకితభావంతో పని చేసిన 12 మంది ఉద్యోగులకు ఆయన 'మ్యాన్ ఆఫ్ ది మంత్'భద్రతా అవార్డులను అందజేశారు. సికింద్రాబాద్ డివిజన్‌లో ముగ్గురు, హైదరాబాద్‌లో ఒక్కరు, విజయవాడలో ఇద్దరు, గుంతకల్‌లో ముగ్గురు, నాందేడ్‌లో ఒక్కరు, గుంటూరులో ఇద్దరు చొప్పున ఉద్యోగులకు ''మ్యాన్ ఆఫ్ ద మంత్'భద్రతా అవార్డులు అందజేశారు.వారి సేవలను అభినందించారు. ఈ అవార్డు గ్రహీతల్లో లోకో పైలట్లు, స్టేషన్ మాస్టర్లు, టెక్నీషియన్లు, పాయింట్స్ మ్యాన్, గేట్ మ్యాన్, ట్రాక్ మెయింటెయినర్లు ఉన్నారు.

ఆ కేసులను కొట్టివేయలేం: హైకోర్టు

- మానవ అక్రమ రవాణా కేసులో నిందితుల పిటిషన్ల కొట్టివేత

సాక్షి, హైదరాబాద్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్టకు అక్రమంగా బాలికలను తరలించి, వారిని వ్యభిచార కూపంలోకి దించారన్న కేసులో తమపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలంటూ పలువురు నిందితులు దాఖలు చేసిన పిటిషన్లను హైకోర్టు కొట్టివేసింది. 2018లో మానవ అక్రమ రవాణా వ్యభిచార గృహాల నిర్వాహకులపై కేసులు నమోదయ్యాయి. వీటిని కొట్టివేయాలంటూ నిందితులు కామసాని వంశీ, కామసాని అనిత, కామసాని జమున, కామసాని జ్యోతి, కామసాని రాజేశ్వరి హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ కె.సుజన మంగళవారం విచారణ చేపట్టారు. 'చట్టప్రకారం ఈ కేసును ప్రత్యేక అధికారి దర్యాప్తు చేయాలి. పోలీసులు చేయడం చెల్లదు. బాలికలను అక్రమంగా తరలించారన్న ఆరోపణలు అవాస్తవం. పోలీసులు తనిఖీలు చేసి సీజ్ చేసిన అంశాల ఆధారంగా కేసు నమోదు చేయలేదు. మేజిస్ట్రేట్ ముందు బాలికలు ఇచ్చిన వాంగ్మూలంలో వారిపై లైంగిక దాడి జరిగినట్లు చెప్పలేదు. ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని కేసును కొట్టివేయాలి'అని పిటిషనర్ల తరఫు న్యాయవాది వాదించారు. ఏపీపీ గణేశ్ వాదనలు వినిపిస్తూ.. బాలికలను అక్రమంగా తరలించి వారి శరీర ఎదుగుదల కోసం హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చారన్నారు. ఆ తర్వాత ఆ బాలికలను బలవంతంగా వ్యభిచారంలోకి నెట్టారని చెప్పారు. ఇలాంటి వ్యభిచార గృహాలు నిర్వహిస్తూ విపరీతంగా ధనార్జన చేసి నిందితులు విలాసవంతమైన జీవితాలను గడుపుతున్నారని తెలిపారు. వాదనలు విన్న న్యాయమూర్తి నిందితుల పిటిషన్లను అనుమతించలేమని కొట్టివేశారు.

ఆసరా పెన్షనర్ల కష్టాలపై సమీక్ష

సాక్షి ఎఫెక్ట్

సాక్షి, కామారెడ్డి: ఆసరా పింఛన్ కోసం పండుటాకులు పడుతున్న ఇబ్బందులపై 'సాక్షి'దినపత్రికలో మంగళవారం 'పింఛన్ కోసం యాభై కిలోమీటర్లు'శీర్షికన ప్రచు రితమైన కథనంపై పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు స్పందించారు. ఎలా జరిగిందన్న అంశంపై నివేదికను ఇవ్వాలని ఆదేశించారు. దీంతో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులతో సమీక్షించారు. కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి, ఎల్లారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని దేవునిపల్లి గ్రామాలకు చెందిన ఆసరా లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులపై చర్చించారు. ఇక్కడి నుంచి అక్కడికి వెళ్తున్న, అక్కడి నుంచి ఇక్కడికి వస్తున్న వారి జాబితాను రూపొందించారు. నివేదికను సెర్ప్ ఉన్నతాధికారులకు పంపించారు. సమస్యను ఎలా పరిష్కరించాలన్న అంశంపై అధికారులు చర్చిస్తున్నారు.

తుపాకీతో బెదిరించి మహిళా కానిస్టేబుల్‌పై ఎస్ఐ అత్యాచారం!

వరంగల్ క్రైం: ఎస్ఐ తన సర్వీస్ రివాల్వర్‌తో బెదిరించి మహిళా కానిస్టేబుల్‌పై రెండుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడు. విశ్వసనీయ సమాచారం మేరకు... జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం సబ్ డివిజన్ పరిధిలో పనిచేసే ఎస్ఐ ఇరవై రోజుల క్రితం తన ఇంటికి దగ్గరలో ఉండే ఓ మహిళా కానిస్టేబుల్‌కు ఫోన్ చేశాడు. 'నేను ప్రమాదవశాత్తు ఇంట్లో కాలు జారి పడిపోయాను. కాలు విరిగింది. లేవలేకపోతున్నా.. వచ్చి సాయం చేయి'అని ప్రాధేయపడ్డాడు. దీంతో ఆమె పైఅధికారి ఆపదలో ఉన్నాడని ఆ ఎస్ఐ ఇంటికి వెళ్లింది. అప్పటికే తన వంకరబుద్ధితో ప్రణాళిక సిద్ధం చేసుకున్న ఆ ఎస్ఐ ఆ మహిళా కానిస్టేబుల్ ఇంటికి రాగానే తలుపులు పెట్టి... తన కామవాంఛ తీర్చకుంటే చంపేస్తా అంటూ తన సర్వీస్ రివాల్వర్‌తో బెదిరించాడు. బలవంతంగా తన కోరిక తీర్చుకొని ఎవరికైనా చెబితే నీకు అదే చివరి రోజు అంటూ బెదిరించాడు. రెండు రోజులక్రితం మళ్లీ ఆ ఎస్ఐ విధులు ముగించుకొని ఇంట్లో నిద్రిస్తున్న సదరు మహిళా కానిస్టేబుల్ ఇంటికి వచ్చాడు. ఇంట్లోకి చొరబడి మరోసారి అత్యాచారం చేసినట్టు తెలిసింది. సదరు ఎస్ఐ ఆగడాలు మితిమీరిపోతున్నాయని, తను మంత్రి మనిషిని, నన్నెవరూ ఏమీ చేయలేరని తోటి సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్టు తెలిసింది. అత్యాచార ఘటనపై ఏఎస్పీ, డీఎస్పీ మంగళవారం రాత్రి సదరు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి విచారణ చేపట్టినట్టు సమాచారం. ఈ సందర్భంగా ఆ ఎస్ఐ నుంచి సర్వీస్ రివాల్వర్ స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఆయనపై అట్రాసిటీ, లైంగిక వేధింపుల కేసు నమోదు చేసి బుధవారం అరెస్ట్ చూపించనున్నట్టు తెలిసింది.

పింఛన్ల పెంపు ఎప్పుడు?

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి ఆర్నెళ్లు గడిచినా సామాజిక పింఛన్ల పరిమితి రూ.4 వేలకు పెరగలేదని ఏఐడీఆర్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కొల్లి నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగుల పింఛను రూ.4 వేల నుంచి రూ.6 వేలకు పెంచుతామని, ఇతర కేటగిరీల్లోని సామాజిక పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. కానీ ఆర్నెళ్లు గడిచినా పెంచకపోవడం దారుణమని విమర్శించారు. తక్షణమే ఈ హామీని నిలబెట్టుకోవాలని, లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

టార్గెట్ రూ. 5 వేల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

రానున్నారు. అయితే, రిజిస్ట్రేషన్ల శాఖ అంచనా ప్రకారం ఆగస్టు 1 నుంచి అమల్లోకి వచ్చే కొత్త విలువల ప్రకారం రాష్ట్రంలో ఎకరం వ్యవసాయ భూమి విలువ రూ.4 లక్షల వరకు పెరగనుందని తెలుస్తోంది. ఇక, విలువల సవరణ కోసం గ్రామీణ, పట్టణ ప్రాంతాలు, వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, నివాస, వాణిజ్య సముదాయాలను కేటగిరీలుగా తీసుకోనున్నారు. ప్రధాన రహదారులకు ఇరువైపులా ఉన్న నివాస, వాణిజ్య సముదాయాల ప్రభుత్వ విలువలను 100 శాతం పెంచనున్నట్టు తెలుస్తోంది.

ఈనెల 29 కల్లా కమిటీల సంతకాలు

విలువల సవరణ ప్రక్రియలో భాగంగా రిజిస్ట్రేషన్ల శాఖ రూపొందించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 29 నాటికి అన్ని రకాల భూములు, ఆస్తుల విలువల పెంపుపై సవరణ కమిటీలు సంతకాలు చేయనున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో జేసీ, ఆర్డీవో, ఎమ్మార్వో, సబ్‌రిజిస్ట్రార్లతో; పట్టణ ప్రాంతాల్లో మున్సిపల్ కమిషనర్, ఆర్డీవో, ఎమ్మార్వో, సబ్‌రిజిస్ట్రార్లతో; హెచ్ఎండీఏ పరిధిలో కమిషనర్, ఆర్డీవో, ఎమ్మార్వో, సబ్‌రిజిస్ట్రార్లతో విలువల సవరణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు సంతకాలు చేసిన అనంతరం ప్రతిపాదిత విలువలను ఆన్‌లైన్‌లో ఉంచి 15 రోజులపాటు ప్రజల నుంచి అభిప్రాయాలు, అభ్యంతరాలు తీసుకుని జూలై 24 కల్లా విలువల సవరణకు తుదిరూపు ఇవ్వనున్నారు. ఆ తర్వాత వాటిని కంప్యూటరీకరించి ఆగస్టు 1 నుంచి కొత్త విలువలను అమలు చేయనున్నారు.

0.001 శాతం నిర్లక్ష్యమున్నా పరిష్కరించాల్సిందే

'నీట్' పరీక్ష విధానంపై సుప్రీంకోర్టు వ్యాఖ్య



సాక్షి, న్యూఢిల్లీ: వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం చేపట్టిన నీట్–యూజీ 2024 పరీక్ష విధానం, నిర్వహణలో 0.001 శాతం లోపం తలెత్తినా సరే సకాలంలో పరిష్కరించాలని సర్వోన్నత న్యాయస్థానం మంగళవారం వ్యాఖ్యానించింది. మే ఐదో తేదీన నిర్వహించిన నీట్‌యూజీలో కొందరు విద్యార్థులకు సమయాభావం, ఇతరత్రా కారణాలతో గ్రేస్ మార్కులు ఇవ్వడాన్ని సవాల్‌చేస్తూ దాఖలైన వేర్వేరు పిటిషన్లను విచారించిన జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ ఎస్‌వీఎన్ భట్టిల సెలవుకాల ధర్మాసనం పై వ్యాఖ్యలు చేసింది. ఈ పరీక్షను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) చేపట్టిన విషయం విదితమే. '' అత్యంత కఠినమైన ఇలాంటి ప్రవేశ పరీక్ష కోసం విద్యార్థులు ఎంతగా శ్రమిస్తారో మనందరికీ తెలుసు. వైద్యుడే సమాజంలో అవినీతికి పాల్పడితే సమాజానికి ఎంతటి నష్టం చేకూరుతుందో ఊహించండి. ప్రవేశపరీక్షలు నిర్వహించే ఒక బాధ్యతాయుత సంస్థగా ఒకే మాట మీద నిలబడాలి. మీ వైపు ఏదైనా తప్పు జరిగితే నిజాయతీగా ఒప్పుకోవాలి. సరిదిద్దేందుకు చేపట్టిన చర్యలనూ వివరించాలి. కనీసం ఆ దిశగా చర్యలకు సమాయత్తం అయ్యామని అయినా నిరూపించుకోవాలి. అప్పుడే మీ పనితీరుపై విశ్వాసం పెరుగుతుంది'' అని ఎన్‌టీఏ తరఫున వాదించిన లాయర్లకు కోర్టు చీవాట్లు పెట్టింది.

రెండు వారాల్లో స్పందన తెలపండి

కేసుల తదుపరి విచారణ జరిగే జూలై 8వ తేదీలోపు ఏమేం చర్యలు చేపట్టారో నివేదించాలని కోర్టు సూచించింది. మళ్లీ పరీక్షను నిర్వహించాలంటూ దాఖలైన పిటిషన్లపై రెండు వారాల్లోపు మీ స్పందన తెలపాలంటూ ఎన్‌టీఏ, కేంద్ర ప్రభుత్వాలను కోర్టు ఆదేశించింది. పరీక్షలో అడిగిన ఒక ప్రశ్నను పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ప్రస్తావించగా ''దానికి ఎన్‌టీఏ, కేంద్రం సమాధానం చెప్తాయి. మీరెందుకు పిటిషన్లు వేశారో మమ్మల్ని అర్థం చేసుకోనివ్వండి. మీ వాదనలను సావధానంగా వినేందుకు సాయంత్రందాకా కూర్చుంటాం' అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. పేపర్ లీకేజీపై సీబీఐ విచారణకు ఆదేశించాలంటూ దాఖలైన పిటిషన్‌నూ కోర్టు విచారించింది. గ్రేస్ మార్కులు పొందిన 1,563 మంది అభ్యర్థులకు ఆ మార్కులను తీసేశామని కేంద్రం, ఎన్‌టీఏ జూన్ 13వ తేదీన కోర్టుకు నివేదించిన విషయం విదితమే. ఆ మార్కులు పోను మిగిలిన మార్కులతో ఆ విద్యార్థులు కౌన్సెలింగ్‌కు వెళ్లొచ్చు లేదంటే మరో సారి పరీక్ష రాసుకోవచ్చు అని ఎన్‌టీఏ తెలిపింది.

4,750 కేంద్రాల్లో 24 లక్షల మంది అభ్యర్థులు

మే ఐదున 4,750 కేంద్రాల్లో దాదాపు 24 లక్షల మంది అభ్యర్థులు నీట్‌యూజీ–2024 రాశారు. హరియాణాలోని ఫరీదాబాద్ కేంద్రంలో రాసిన వారిలో ఆరుగురికి సహా దేశవ్యాప్తంగా 67 మందికి 720కిగాను 720 మార్కులు పొంది టాప్‌ర్యాంక్ సాధించడంతో అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఎక్కువ మంది విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలపడమే ఈ అనూహ్య టాప్‌ర్యాంకుల పర్వానికి అసలు కారణమని వెల్లడైంది. వ్యవహారం కోర్టుకు చేరడంతో వారందరికీ గ్రేస్ మార్కులు తొలగిస్తున్నామని ఎన్‌టీఏ ప్రకటించినప్పటికీ అసలు ఈ విధానాన్ని ఎందుకు అనుసరిస్తున్నారని, గోప్యత ఎందుకు పాటించారని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. సమయం వృథా అయితే ఆ మేరకు అదనపు సమయం పరీక్ష రాయించాలిగానీ విద్యార్థికి ఏ ప్రామాణిక ప్రాతిపదికన గ్రేస్ మార్కులు ఇస్తారని విద్యావేత్తలు సైతం విస్మయం వ్యక్తం చేస్తున్నారు. నీట్‌యూజీ కౌన్సెలింగ్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కాలేజీల్లోని ఎంబీబీఎస్, బీడీఎస్, ఆయుష్ తదితర కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.

బెంగాల్‌లో రైలు ప్రమాదం..

10కి చేరిన మృతులు

న్యూఢిల్లీ/కోల్‌కతా/ సిలిగురి: పశ్చిమబెంగాల్‌లోని డార్జిలింగ్ జిల్లాలో సోమవారం సంభవించిన రైలు ప్రమాదంలో మృతుల సంఖ్య 10కి చేరింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆరేళ్ల బాలిక ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం చనిపోయినట్లు అధికారులు తెలిపారు. దీంతో, మృతుల సంఖ్య 9 నుంచి 10కి చేరుకుందన్నారు. సీల్దాకు వెళ్తున్న గూడ్స్ రైలు సోమవారం ఉదయం రంగపాణి రైల్వే స్టేషన్‌లో నిలిచి ఉన్న కాంచనజంగ రైలును వెనుక నుంచి ఢీకొట్టిన విషయం తెల్సిందే. ఘటనలో మృతి చెందిన, గాయాలపాలైన వారిని వదిలేసి ప్రమాదానికి గురవని బోగీలతో 850 మంది ప్రయాణికులతో సోమవారం మధ్యాహ్నం బయలుదేరిన కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ మంగళవారం వేకువజామున సీల్దాకు చేరుకున్నట్లు ఈస్టర్న్ రైల్వే అధికారి ఒకరు తెలిపారు. సీల్దా నుంచి ప్రయాణికులను వారిని గమ్య స్థానాలకు చేర్చేందుకు 16 బస్సులు, 60 కార్లను ఏర్పాటు చేశామన్నారు.

కుమార్తె బర్త్‌డే కోసం వస్తూ...

సోమవారం జరిగిన రైలు ప్రమాదం కోల్‌కతాకు చెందిన సృష్టి అనే 11 ఏళ్ల చిన్నారికి తీరని వేదన మిగిల్చింది. ఈమె తండ్రి శుభాజిత్ మాలి(31) ఆఫీసు పని మీద శుక్రవారం సిలిగురి వెళ్లారు. మరికొద్ది రోజులపాటు ఆయన అక్కడే ఉండిపోవాల్సి ఉంది. కానీ, సృష్టి బర్త్‌డే వేడుకలో పాల్గొనేందుకు ముందుగానే సోమవారం బయలుదేరారు. కాంచనజంగ ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కే ముందు సృష్టికి వీడియో కాల్ చేసి మాట్లాడారు. ఎలాగోలా సమయానికి వచ్చేస్తా. బర్త్‌డే ఘనంగా చేసుకుందామని, కేకు తీసుకొస్తానని కూతురికి మాట ఇచ్చారు. కానీ, విధి మరోలా ఉంది. రైలు ప్రమాదంలో మరణించిన వారిలో శుభాజిత్ కూడా ఉన్నారు. అదే రైలులో ప్రయాణించిన ఆయన స్నేహితుడు ఈ విషాద వార్తను కుటుంబసభ్యులకు తెలిపారు. దీంతో, శుభాజిత్ కుటుంబం తీవ్ర దుఃఖంలో మునిగింది. ఎప్పుడూ బస్సులోనే ప్రయాణించే శుభాజిత్.. ఈసారి మాత్రం కుమార్తె పుట్టిన రోజు వేడుక జరపాలనే తొందరలో రైలు ప్రయాణాన్ని ఎంచుకున్నారని, ఇదే ఆయన ప్రాణాలు తీసిందని బంధువులు ఆవేదన వ్యక్తం చేశారు.

అశ్వినీ వైష్ణవ్ రాజీనామా చేయాలి: ఖర్గే

దేశంలో రైల్వే వ్యవస్థను బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు ఆ పదవిలో కొనసాగే అర్హత లేదని మండిపడ్డారు. మోటారు సైకిల్‌పై కూర్చుని ప్రమాద స్థలికి మంత్రి చేరుకోవడంపై స్పందిస్తూ. అశ్వినీ వైష్ణవ్ రైల్వే మంత్రినా లేక రీల్ మంత్రినా అంటూ ఎద్దేవా చేశారు.

మోదీ మౌనమేల?

- నీట్ పరీక్షపై ప్రధాని స్పందించరా?
- పేపర్‌లీకేజీ రహిత విధానాల కోసం పోరాడతాం: రాహుల్



న్యూఢిల్లీ: లోపభూయిష్ట విధానాలతో నీట్ పరీక్షలు నిర్వహిస్తున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ధ్వజమెత్తారు. నీట్ పరీక్షపై దేశవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయని ప్రధాని మోదీ ఎందుకు మౌనం వహిస్తున్నారని నిలదీశారు. పేపర్‌లీకేజీలు జరక్కుండా పటిష్ట విధానాల రూపకల్పన కోసం వీధుల నుంచి పార్లమెంట్ దాకా యువత గళాన్ని వినిపించేదుకు కాంగ్రెస్ కృషిచేస్తుందని రాహుల్ ప్రకటించారు. మంగళవారం ఆయన 'ఎక్స్'లో హిందీలో పలు ట్వీట్లు చేశారు. '' 24 లక్షలకు పైగా విద్యార్థుల భవిష్యత్తు నిర్ణయించే నీట్ పరీక్షలో లోపలున్నాయని స్పష్టమైనా మోదీ ఎప్పటిలాగే మౌనం దాల్చారు. బిహార్, గుజరాత్, హరియాణాలో అరెస్టుల పర్వాన్ని పరికిస్తే ఇదంతా వ్యవస్థీకృత నేరమని స్పష్టంగా తెలుస్తోంది. బీజేపీ పాలిత రాష్ట్రాలే పేపర్ లీకేజీలకు కేంద్ర స్థానాలుగా భాసిల్లుతున్నాయి. బాధ్యత గల ప్రతిపక్షంగా కాంగ్రెస్ దేశ యువత గళాన్ని వీధులు మొదలుకుని పార్లమెంట్‌దాకా వినిపించేలా చేస్తుంది'' అని రాహుల్ వ్యాఖ్యానించారు. నీట్‌యూజీ–2024 పరీక్ష విధానం, నిర్వహణలో ఎక్కడైనా 0.001 శాతం నిర్లక్ష్యం ఉన్నా సరే దానినీ సకాలంలో పరిష్కరించాలని మంగళవారం నీట్ అంశంపై కేసు విచారణసందర్భంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానించిన నేపథ్యంలో రాహుల్ స్పందించారు.

వయనాడ్‌కు రాజీనామా

కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ కేరళలోని వయనాడ్ లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. రాయ్‌బరేలీ నుంచి ఎంపీగా కొనసాగనున్నారు. రాహుల్ రాజీనామాను స్పీకర్ 18వ తేదీన ఆమోదించినట్లు లోక్‌సభ సచివాలయం మంగళవారం ఒక బులెటిన్‌లో తెలిపింది. 18వ లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్ వయనాడ్, రాయ్‌బరేలీల నుంచి పోటీచేసి రెండుచోట్ల విజయం సాధించిన విషయం తెలిసిందే.

---


24 నుంచి కాంగ్రెస్ వరుస భేటీలు

పార్టీ బలోపేతం, రానున్న అసెంబ్లీ ఎన్నికలకు వ్యూహం ఖరారు

న్యూఢిల్లీ: ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో మెరుగైన ఫలితాలను సాధించిన కాంగ్రెస్ పార్టీ అదే ఉత్సాహంతో మరికొద్ది నెలల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలకు ముందుగానే శ్రేణులను సిద్ధం చేయాలని యోచిస్తోంది. ఇందులో భాగంగానే సంస్థాగతంగా పార్టీ బలోపేతం చేయడంతోపాటు మహారాష్ట్ర, జార్ఖండ్, హరియాణా రాష్ట్రాలతోపాటు జమ్మూకశ్మీర్ అసెంబ్లీలకు త్వరలో జరగనున్న ఎన్నికలకుగాను వ్యూహాలు సిద్ధం చేసేందుకు వచ్చే వారంలో వరుసగా సమావేశాలు జరిపేందుకు షెడ్యూల్ ఖరారు చేసింది. ఈ నెల 24వ తేదీన కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీలు మొదటగా జార్ఖండ్ నేతలతో సమావేశమై వ్యూహం ఖరారు చేయనున్నారు. అదేవిధంగా, 25న మహారాష్ట్ర, 26న హరియాణా, 27న జమ్మూకశ్మీర్ నేతలతో భేటీ కానున్నారని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత) కేసీ వేణుగోపాల్ మంగళవారం 'ఎక్స్'లో వెల్లడించారు. మహారాష్ట్ర, హరియాణా, జార్ఖండ్ అసెంబ్లీలకు ఈ ఏడాది చివర్లో ఎన్నికలు జరగాల్సి ఉంది. అదేవిధంగా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీకి సెప్టెంబర్ 30వ తేదీలోగా ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఇప్పటికే ఆదేశించడం తెల్సిందే.

గంగమ్మ దత్తత తీసుకుంది

- వారణాసి పర్యటనలో ప్రధాని మోదీ
- కిసాన్ సమ్మాన్ నిధి కింద రూ. 20 వేల కోట్లు విడుదల



వారణాసిలోని దశాశ్వమేధ ఘాట్‌లో మంగళవారం సాయంత్రం గంగా హారతి సమయంలో పూజలు చేస్తున్న మోదీ

వారణాసి: గంగా మాత తనను దత్తత తీసుకున్నట్లే కనపడుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి వరుసగా మూడోసారి ఎంపీగా ఎన్నికయ్యాక మోదీ తొలిసారిగా మంగళవారం వారణాసిలో పర్యటించారు. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద 17వ విడత రూ.20,000 కోట్లను 9.26 కోట్ల మంది రైతుల ఖాతాల్లో జమచేశారు. మెహందీగంజ్‌లో పీఎం కిసాన్ సమ్మాన్ సమ్మేళన్‌లో మాట్లాడుతూ 'వారణాసి ప్రజలు మూడోసారి నన్ను ఎంపీగానే కాదు ప్రధానిగానూ ఎన్నుకున్నారు. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు ఇదివరకెప్పుడూ చూడని తీర్పునిచ్చారు. చరిత్ర సృష్టించారు' అని మోదీ పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వ తొలి నిర్ణయం రైతులకు, పేదలకు సంబంధించినదని అన్నారు. వికసిత్ భారత్‌కు.. రైతులు, మహిళలు, యువత, పేదలు గట్టి మూలస్తంభాలుగా తాను పరిగణిస్తానన్నారు. 'విశ్వనాథుడు, గంగా మాత ఆశీస్సులు, కాశీ ప్రజల అపార ప్రేమతో మూడోసారి దేశానికి ప్రధాన సేవకుడిని అయ్యే భాగ్యం నాకు దక్కింది. వరుసగా మూడోసారి నన్ను తమ ప్రతినిధిగా ఎన్నుకొని కాశీ ప్రజలు నన్ను ఆశీర్వదించారు. ఇప్పుడు గంగా మాత కూడా నన్ను దత్తత తీసుకున్నట్లే కనపడుతోంది. నేనిక్కడి వాడిని అయిపోయాను' అని మోదీ అన్నారు. ప్రజాస్వామ్య దేశాల్లో ప్రభుత్వాలు వరుసగా మూడోసారి ఎన్నికకావడం అరుదని, భారత్ ప్రజలు దీన్ని చేసి చూపించారని ప్రధాని అన్నారు. భారత్‌లో 60 ఏళ్ల తర్వాత తమ ప్రభుత్వం హ్యాట్రిక్ సాధించిందన్నారు. 'యువత ఆకాంక్షలు, ప్రజల కలలు ఎక్కువగా ఉన్న భారత్ లాంటి దేశంలో 10 ఏళ్ల పాలన తర్వాత కూడా మరో అవకాశం రావడం ఘన విజయం. ప్రజల విశ్వాసానికి ప్రతీక' అని మోదీ అన్నారు.

ప్రతి డైనింగ్ టేబుల్‌పై మన ఆహార ఉత్పత్తులు ఉండాలి

ప్రపంచవ్యాప్తంగా ప్రతి డైనింగ్ టేబుల్‌పై మన ఆహార ఉత్పత్తులు ఉండాలని తాను కోరుకుంటున్నట్లు ప్రధాని మోదీ రైతులనుద్దేశించి అన్నారు. 'ప్రపంచ మార్కెట్ గురించి ఆలోచించాలి. పప్పులు, నూనె గింజల ఉత్పత్తిలో స్వయంసమృద్ధిని సాధించాలి. వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతిలో అగ్రగామిగా ఎదగాలి. బనారస్ లంగ్డా మామిడి, జౌన్‌పూర్ రాడిష్ రకం, గాజీపూర్ లేడీ ఫింగర్ రకం.. తదితరాలు నేడు విదేశీ మార్కెట్‌లకు చేరుతున్నాయి. ఒక జిల్లా.. ఒక ఉత్పత్తి చొరవతో, జిల్లా స్థాయిలో వ్యవసాయ ఉత్పత్తుల హబ్‌ల ఏర్పాటుతో ఎగుమతులు పెరుగుతున్నాయి. ప్రపంచ ప్యాకేజ్డ్ ఫుడ్ మార్కెట్‌లో భారత్‌ను మనమిప్పుడు కొత్త శిఖరాలకు తీసుకెళ్లాలి' అని మోదీ పేర్కొన్నారు.

ఆంక్షలపై సమష్టి సమరం

- ఉత్తరకొరియా, రష్యా బంధం బలోపేతం
- ఉ.కొరియా పర్యటనకు ముందు పుతిన్ వ్యాఖ్య




సియోల్: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉత్తరకొరియాలో రెండు రోజుల పర్యటనకుగాను బుధవారం ఉదయం ఆ దేశ రాజధాని ప్యాంగ్యాంగ్ చేరుకున్నారు. విమానాశ్రయం వద్ద అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. అమెరికా సారథ్యంలో రష్యా, ఉ.కొరియాలపై కొనసాగుతున్న ఆంక్షలను ఇరుదేశాలు సమష్టిగా ఎదుర్కొంటాయని పుతిన్ ప్రకటించారు. ఉ.కొరియా పర్యట నకు కొద్ది గంటల ముందు ఆయన ఆ దేశ అధికారిక వార్తా సంస్థకు రాసిన వ్యాసంలో పలు అంశాలను ప్రస్తావించారు. '' ఉక్రెయిన్ విషయంలో మా సైనిక చర్యలను సమర్థిస్తూ, సాయం చేస్తున్న ఉ.కొరియాకు కృతజ్ఞతలు. బహుళ ధ్రువ ప్రపంచం సాకారం కాకుండా అవరోధాలు సృష్టిస్తున్న పశ్చిమదేశాలను అడ్డుకుంటాం. పశ్చిమదేశాల చెప్పుచేతల్లో ఉండకుండా సొంత వాణిజ్యం, చెల్లింపుల వ్యవస్థలను రష్యా, ఉ.కొరియాలు అభివృద్ధి చేయనున్నాయి. పర్యాటకం, సాంస్కృతికం, విద్యారంగాలకూ ఈ అభివృద్ధిని విస్తరిస్తాం'' అని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధ జ్వాలలను మరింత రగిల్చేందుకు కావాల్సిన ఆయుధ సంపత్తిని ఉ.కొరియా సమకూర్చుతుండగా, ఆ దేశానికి అణ్వస్త్ర సామర్థ్యం, క్షిపణుల తయారీ, సాంకేతికతలను రష్యా అందిస్తోందని అమెరికాసహా పశ్చిమ దేశాలు ఆరోపిస్తుండటం తెల్సిందే. ఈ ఆరోపణలను రష్యా, ఉ.కొరియా కొట్టిపారేశాయి. పుతిన్ పర్యటన వేళ ఈ ఆయుధ సాయం, టెక్నాలజీ సాయం మరింత పెచ్చరిల్లే ప్రమాదముందని అమెరికా ఆందోళన వ్యక్తంచేసింది.

ఉక్రెయిన్‌తో ఆగదు: అమెరికా

'ఉ.కొరియా బాలిస్టిక్ క్షిపణులే ఉక్రెయిన్‌ను ధ్వంసం చేస్తున్నాయి. రష్యా, ఉ.కొరియా బంధం దుష్ప్రభావం ఉక్రెయిన్‌కు మాత్రమే పరిమితం కాబోదు కొరియా ద్వీపకల్పంపై పడు తుంది' అని అమెరికా ప్రతినిధి జాన్ కిర్బీ ఆందోళన వ్యక్తంచేశారు. 'మండలి తీర్మానాలు, శాంతి, సుస్థిరతలకు విఘాతం కల్గించే రీతిలో రష్యా, ఉ.కొరియా సహకారం పెరగొద్దు' అని దక్షిణకొరియా హెచ్చరించింది. చెత్త నింపిన బెలూన్లను ద.కొరియా పైకి ఉ.కొరియా వదలడం విదితమే.

వలసదారులకు భారీ ఆఫర్

- అమెరికా పౌరుల జీవిత భాగస్వాములు, పిల్లలకు పౌరసత్వం ఇవ్వనున్న బైడెన్ సర్కార్
- కనీసం పదేళ్లుగా అమెరికాలో నివసిస్తున్న వాళ్లకు అవకాశం
- 5 లక్షల మందికి లబ్ధి చేకూరే చాన్స్



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ అమెరికా పౌరులను ఆకట్టుకునేందుకు బైడెన్ సర్కార్ అక్కడి చట్టబద్ధతలేని వలసదారులకు భారీ ఉపశమనం కలిగించనుంది. అమెరికా పౌరులను పెళ్లాడిన వారికి దేశ పౌరసత్వం ఇవ్వాలని నిర్ణయించినట్లు బైడెన్ మంగళవారం ప్రకటించారు. అయితే ఈ వలసదారు ఇప్పటికే అమెరికాలోనే కనీసం పదేళ్లుగా నివసిస్తూ ఉండాలనే షరతు విధించారు. చట్టవిరుద్ధంగా అమెరికాలో నివసిస్తున్న దాదాపు ఐదు లక్షల మంది వలసదారులకు ఈ నిర్ణయంతో లబ్ధిచేకూరనుంది. అమెరికా పౌరుల భాగస్వాములు చట్టబద్ధత కోసం త్వరలో దరఖాస్తుచేసుకోవచ్చని తర్వాతి దశలో వాళ్లకు పౌరసత్వం ఇస్తామని బైడెన్ పేర్కొన్నారు. ఈ ఏడాది జూన్ 17నాటికి అమెరికాలో స్థిరనివాసం ఏర్పాటుచేసుకుని పదేళ్లు పూర్తయితే లీగల్ స్టేటస్(చట్టబద్ధత) కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. వారి దరఖాస్తు ఆమోదం పొందితే మూడేళ్ల తర్వాత గ్రీన్‌కార్డ్ కోసం విడిగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. వారికి తాత్కాలిక వర్క్ పర్మిట్ ఇస్తారు. ఈ వర్క్ పర్మిట్ సాధిస్తే వారు దేశ బహిష్కరణ వేటు నుంచి తప్పించుకుని అమెరికాలోనే ఉద్యోగాలు/పనులు చేసుకోవచ్చు. '' పౌరసత్వంలేని భాగస్వామి, చిన్నారులతో కలసి అమెరికా పౌరులు కుటుంబసమేతంగా సంతోషంగా గడిపేందుకు అవకాశం కల్పిస్తున్నాం. కుటుంబాల ఐక్యత దేశ ఆర్థికాభివృద్ధికి దోహదం చేస్తుంది' అని ఈ సందర్భంగా బైడెన్ వ్యాఖ్యానించారు.

పిల్లలూ దరఖాస్తు చేసుకోవచ్చు

అమెరికా పౌరులను పెళ్లాడిన అక్రమ వలసదారుల పిల్లలూ చట్టబద్ధత కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. ఇలాంటి పిల్లలు దేశవ్యాప్తంగా 50,000 మంది ఉంటారని అమెరికా ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. జీవితభాగస్వామి చట్టబద్ధత కోసం దరఖాస్తు చేసుకోవాలనుకుంటే అమెరికా పౌరులను పెళ్లాడి పదేళ్లు పూర్తికావాల్సిన పనిలేదు. అంటే పెళ్లికి ముందే అమెరికాలో పదేళ్లుగా ఉంటూ జూన్ 17వ తేదీలోపు పెళ్లాడినా సరే వాళ్లు దరఖాస్తుచేసుకునేందుకు అర్హులే. 17వ తేదీ(సోమవారం) తర్వాత పదేళ్లు పూర్తయితే వారిని అనర్హులుగా పరిగణిస్తారు. అమెరికాలో సమ్మర్ సీజన్ దాకా ఈ దరఖాస్తులను స్వీకరిస్తారు. దరఖాస్తు ఫీజు వివరాలను ఇంకా నిర్ణయించలేదు. అమెరికా పౌరులను పెళ్లాడిన దాదాపు 11 లక్షల మంది వలసదారుల్లో చాలా మంది ఈ తాజా నిర్ణయంతో లబ్ధిపొందనున్నారు.

డ్రీమర్లకూ తాయిలాలు!

అమెరికాలో నివసిస్తున్న చట్టబద్ధ వలసదారుల పిల్లల(డ్రీమర్లు)కు బైడెన్ సర్కార్ అదనపు సౌకర్యాలు కల్పించనుంది. '' అమెరికా ఉన్నత విద్యా సంస్థలో డిగ్రీ పూర్తిచేసి ఉద్యోగ ఆఫర్ పొందిన డ్రీమర్లు నిరభ్యంతరంగా ఉద్యోగాలు చేసుకోవచ్చు' అని బైడెన్ అన్నారు. అమెరికాలో హెచ్–1బీ, ఇతర దీర్ఘకాలిక నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాదారుల పిల్లలను 'డ్రీమర్'లుగా పిలుస్తారు. ఈ చట్టబద్ధ వలసదారుల పిల్లల వయసు 21 ఏళ్లు నిండితే వారు అమెరికాలో ఉండటానికి అనర్హులు. అప్పుడు వారివారి స్వదేశాలకు అమెరికా సాగనంపుతుంది. ఈ ప్రమాదం నుంచి వీరందరినీ బయటపడేసేందుకు గతంలో ఒబామా సర్కార్ 'డిఫర్డ్ యాక్షన్ ఫర్ చైల్డ్‌హుడ్ అరైవల్స్ ప్రోగ్రామ్' పేరిట రక్షణ కల్పించిన విషయం తెల్సిందే.

ఈవీఎంల వల్లే కర్నాటకలో బీజేపీ కూటమికి ఎక్కువ సీట్లు

తిరిగి బ్యాలెట్ పేపర్లు రావాలి: డిప్యూటీ సీఎం డీకే శివకుమార్



బెంగళూరు: రాష్ట్రంలో బీజేపీ– జేడీఎస్ కూటమి అధిక లోక్‌సభ స్థానాలు సాధించడానికి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలే (ఈవీఎంలు) కారణమని కర్నాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆరోపించారు. ఈవీఎంల పనితీరుపై దర్యాప్తు జరగాలన్నారు. ఎన్నికల్లో ఈవీఎంలను పక్కనబెట్టి బ్యాలెట్ పేపర్లను వాడాలని ఆయన డిమాండ్ చేశారు. 'కర్నాటకలో బీజేపీ– జేడీఎస్ కూటమి అనుకున్న దానికంటే ఎక్కువ సీట్లు గెలవడంలో ఈవీఎంల పాత్ర ఉంది. ఈవీఎంలు పోవాల్సిందే. మళ్లీ బ్యాలెట్ పేపర్లను తీసుకురావాలి. ఎన్నికల ఫలితాలపై దర్యాప్తు చేపట్టాలి' అని శివకుమార్ మంగళవారం విలేకరులతో అన్నారు. బ్యాలెట్ పేపర్లు వాడినపుడు మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్‌కు మూడింట రెండొంతుల మెజారిటీ వచ్చేదని, ప్రస్తుతం పరిస్థితి మారిపోయిందని (ఈవీఎంల మూలంగా) పేర్కొన్నారు. మధ్యప్రదేశ్‌లో 29 స్థానాలకు 29ని బీజేపీయే క్లీన్ స్వీప్ చేసింది. కర్నాటకలో 28 స్థానాలుండగా... బీజేపీ 17, జేడీఎస్ 2, కాంగ్రెస్ 11 చోట్ల గెలిచాయి.

---

41 ఎయిర్ పోర్టులకు బాంబు బెదిరింపు

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 41 విమానాశ్రయాలకు మంగళవారం బాంబు బెదిరింపు మెయిళ్లు అందాయి. 'హలో, ఎయిర్‌పోర్టులో పేలుడు పదార్థాలు అమర్చాం. అవి త్వరలోనే పేలుతాయి. మీరంతా చనిపోవడం ఖాయం' అని అందులో ఉంది. వెంటనే రంగంలోకి దిగిన భద్రతా విభాగాలు పూర్తి స్థాయిలో తనిఖీలు చేపట్టాయి. ఎటువంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు కనిపించకపోవడంతో అవన్నీ వట్టి బెదిరింపులేనని తేల్చాయి. మధ్యాహ్నం 12.40 గంటల సమయంలో విమానాశ్రయాలన్నిటికీ exhumedyou888 @gmail. com ఐడీ నుంచే బెదిరింపులు అందినట్లు అధికారులు తెలిపారు. కేఎన్ఆర్ అనే అనుమానాస్పద ఆన్‌లైన్ గ్రూప్ నుంచే ఈ మెయిళ్లు వచ్చినట్లు చెబుతున్నారు. ఇదే గ్రూపు గతంలో ఢిల్లీలోని స్కూళ్లలో మే ఒకటో తేదీన బాంబులు పెట్టినట్లు బెదిరింపు మెయిళ్లు పంపించిందని అంటున్నారు.

థాయ్ మాజీ ప్రధాని థక్సిన్‌కు ఎదురుదెబ్బ

రాజకుటుంబం పరువునష్టం కేసులో దోషిగా ప్రకటించిన కోర్టు



బ్యాంకాక్: థాయ్‌ల్యాండ్ రాజరికాన్ని దూషించిన కేసులో దేశ మాజీ ప్రధానమంత్రి థక్సిన్ షినవత్ర(74)ను కోర్టు దోషిగా ప్రకటించింది. థాయ్ రాజకీయాల్లో కీలకంగా ఉన్న థక్సిన్ 18 ఏళ్ల క్రితం, 2006లో ప్రధాని పదవి నుంచి ఉద్వాసనకు గురయ్యారు. అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గతేడాదే ఆయన స్వదేశానికి చేరుకున్నారు. సంప్రదాయవాదులకు, రాజరికానికి అనుకూలంగా ఉండే రాజ్యాంగ న్యాయస్థానం థక్సిన్‌పై విచారణ చేపట్టింది. థక్సిన్ అనారోగ్యం కారణంగా ఆస్పత్రిలో ఉండటంతో కోర్టు మంగళవారం ఉదయం వర్చువల్‌గా విచారణ జరిపి, దోషిగా తేల్చింది. ఆ వెంటనే, దేశం విడిచి వెళ్లరాదనే షరతుతో ఆయనకు రూ.11 లక్షల పూచీకత్తుపై బెయిల్ మంజూరు చేసింది. అయితే, థక్సిన్‌పై పలు అవినీతి ఆరోపణల కేసులు కూడా ఉన్నాయి. థక్సిన్ షినవత్ర సారథ్యంలోని ఫ్యూ థాయ్ పార్టీ ప్రస్తుతం అధికారంలో ఉంది. ఆ పార్టీకి చెందిన శ్రేత్థ థవిసిన్ ప్రధానిగా ఉన్నారు. ఆయనపై ఉన్న అవినీతి ఆరోపణలపై రాజ్యాంగ కోర్టు విచారణ చేపట్టింది. రుజువైతే ఆయన కూడా పదవి కోల్పోయే ప్రమాదముంది. కాగా, థాయ్‌ల్యాండ్‌లో రాజకుటుంబాన్ని విమర్శించడం అత్యంత తీవ్రమైన నేరం . ఇందుకు గాను, 3 నుంచి 15 ఏళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశముంది.

భట్టీ భాయ్.. ఈద్ ముబారక్..!

పాక్ గ్యాంగ్‌స్టర్‌కు జైలు నుంచే లారెన్స్ బిష్ణోయ్ ఫోన్

అహ్మదాబాద్/చండీగఢ్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ సెంట్రల్ జైలులో ఉన్న గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ పాకిస్తాన్‌లోని గ్యాంగ్‌స్టర్ షహజాద్ భట్టికి వీడియో కాల్ చేసి, పండుగ శుభాకాంక్షలు తెలపడం సంచలనంగా మారింది. 19 సెకన్ల నిడివి కలిగిన ఆ వీడియోలో బిష్ణోయ్ ఈ నెల 17న పాక్‌లో ఉన్న భట్టికి ఫోన్ చేసి ఈద్–ఉల్–అజా శుభాకాంక్షలు చెబుతున్నట్లుగా ఉంది. అయితే, తమ దేశంలో మరుసటి రోజు పండుగ జరుపుకుంటామని భట్టి తెలపగా, మళ్లీ ఫోన్ చేస్తానని బిష్ణోయ్ అంటున్నట్లుగా ఉంది. ఈ వీడియో ప్రామాణికత నిర్ధారణ కానప్పటికీ, సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీనిపై గుజరాత్ ప్రభుత్వం విచారణకు ఆదేశించింది.

బీజేపీ కీలక నేతల భేటీ

పార్లమెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ: రానున్న పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు మంగళవారం రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నివాసంలో సీనియర్ మంత్రులు సమావేశమయ్యారు. భేటీలో మనోహర్ లాల్ ఖట్టర్, భూపేందర్ యాదవ్, వీరేంద్ర కుమార్, పీయూష్ గోయల్, అన్నపూర్ణా దేవి, ఎస్. జై శంకర్‌తోపాటు, జేడీయూ నేత లలన్ సింగ్, లోక్ జనశక్తి పార్టీ(రాం విలాస్) నేత చిరాగ్ పాశ్వాన్ హాజరయ్యారు. ఈ నెల 24వ తేదీ నుంచి లోక్‌సభ సమావేశాలు ప్రారంభం కానున్న విషయం తెలిసిందే. ఉభయ సభల సమావేశాన్ని ఉద్దేశించి రాష్ట్రపతి ముర్ము చేసే ప్రసంగంలో ప్రస్తావించాల్సిన అంశాలపై నేతల అభిప్రాయాలు, సూచనలు, సలహాలను రాజ్‌నాథ్ అడిగి తెలుసుకున్నారు. లోక్‌సభ స్పీకర్, డిప్యూటీ స్పీకర్ పదవులకు అభ్యర్థుల ఎంపికపైనా సమావేశం చర్చించినట్లు సమాచారం. స్పీకర్ పదవికి బీజేపీ బలపరిచే అభ్యర్థికే తాము మద్దతిస్తామని ఇప్పటికే ఎన్డీఏలోని జేడీయూ స్పష్టం చేయగా ఏకాభిప్రాయం ఆధారంగానే అభ్యర్థిని నిర్ణయించాలని టీడీపీ కోరుతోంది. అదే సమయంలో, డిప్యూటీ స్పీకర్ పదవిని ప్రతిపక్షానికి ఇవ్వాలని ఇండియా కూటమి కోరుతుండగా, బీజేపీ మాత్రం తమ భాగస్వామ్య పక్షాలకే ఈ పోస్టు ఇవ్వాలని యోచిస్తున్నట్లు సమాచారం. స్పీకర్ పదవికి బీజేపీ నేతలు రాధా మోహన్ సింగ్, డి.పురంధేశ్వరి, భర్తృహరి మహతాబ్ పేర్లు వినిపిస్తున్నాయి. ప్రొటెం స్పీకర్ పదవికి కాంగ్రెస్ సీనియర్, ఎనిమిది పర్యాయాలు లోక్‌సభకు ఎన్నికైన అత్యంత సీనియర్ సభ్యుడు కె.సురేశ్ పేరు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం.

క్రిటికల్ టెక్నాలజీ అభివృద్ధిలో భారత్, అమెరికా ముందుండాలి

జాతీయ భద్రత సలహాదారు ధోవల్

న్యూఢిల్లీ: వ్యూహాత్మక ప్రయోజనాల రీత్యా క్రిటికల్ టెక్నాలజీ అభివృద్ధిలో భారత్, అమెరికాలు ముందంజలోనే కొనసాగాలని జాతీయ భద్రతా సలహాదారు అజిత్ ధోవల్ పేర్కొన్నారు. అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జేక్ సలివాన్‌తో కలిసి మంగళవారం ఐసెట్ (ఇండియా–యూఎస్ ఇనిషియేటివ్ ఆన్ క్రిటికల్ అండ్ ఎమర్జింగ్ టెక్నాలజీ) ఇండస్ట్రీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టెక్నాలజీ విషయంలో పరిశ్రమల పాత్ర అత్యంత కీలకమని చెప్పారు. ఐసెట్‌తో రక్షణరంగ ఆవిష్కరణలు, సెమీ కండక్టర్ పరిశ్రమల రంగాల్లో ఊహించిన దానికి మించి పురోగతి సాధించామన్నారు. సాంకేతిక భాగస్వామ్యంలో ఆవిష్కరణలు, అమలు, ఉత్పత్తి ప్రధానమైనవని సలివాన్ చెప్పారు. ప్రైవేట్ రంగంలో ఆవిష్కరణలకు ప్రభుత్వపరంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. కృత్రిమ మేధ, సెమీ కండక్టర్లు, క్రిటికల్ మినరల్స్, అధునాతన టెలికమ్యూనికేషన్, రక్షణ, అంతరిక్ష రంగాల్లో భారత్–అమెరికా సహకారాన్ని మరింత పెంచేందుకు తీసుకోవాల్సిన చర్యలను సోమవారం రెండు దేశాలు ప్రకటించాయి. వాణిజ్యం, టెక్నాలజీ, పారిశ్రామిక సహకారానికి సంబంధించి రెండు దేశాల మధ్య సహకారంలో అడ్డంకులను పరిష్కరించుకోవాలని కూడా నిర్ణయించాయి. భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రెండు దేశాల కీలక పరిశ్రమల రంగ ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రైల్వే భద్రతా విభాగంలో లక్షన్నర పోస్టులు ఖాళీ

ఆర్టీఐ దరఖాస్తుకు రైల్వే శాఖ సమాధానం

న్యూఢిల్లీ: రైల్వే భద్రతా విభాగంలో మంజూరైన 10 లక్షల పోస్టులకుగాను 1.5 లక్షలకు పైగా పోస్టులు ప్రస్తుతం ఖాళీగా ఉన్నట్లు ఆ శాఖ తెలిపింది. సమాచార హక్కు చట్టం కింద అందిన దరఖాస్తుకు రైల్వే శాఖ ఈ మేరకు బదులిచ్చింది. అదేవిధంగా, అన్ని రకాలైన లోకో పైలట్ల పోస్టులు కలిపి 70,093 మంజూరు కాగా ప్రస్తుతం 14,429 పోస్టులు ఖాళీగా ఉన్నాయని, మొత్తం 57,551 అసిస్టెంట్ డ్రైవర్ల పోస్టులకు గాను 4,337 పోస్టులను భర్తీ చేయాల్సి ఉందని కూడా రైల్వే శాఖ వివరించింది. అయితే, రైల్వే భద్రతా ప్రాజెక్టుల కోసం 2004–14 సంవత్సరాల్లో రూ.70 వేల కోట్లు ఖర్చు చేయగా, 2014–24 సంవత్సరాల్లో 2.5 రెట్లు అధికంగా రూ.1.78 లక్షల కోట్లు వెచ్చించినట్లు ఓ అధికారి చెప్పారు.

---

30 నుంచి మోదీ 'మన్ కీ బాత్'

సాక్షి, న్యూఢిల్లీ: దేశ ప్రజలను ఉద్దేశించి ప్రధాని మోదీ చేసే రేడియో ప్రసంగం 'మన్ కీ బాత్' మళ్లీ ప్రారంభం కానుంది. 110వ ఎపిసోడ్ ఈ ఏడాది ఫిబ్రవరి 25వ తేదీన మోదీ నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అడ్డు రావడంతో కార్యక్రమానికి తాత్కాలికంగా విరామమిచ్చారు. ఇటీవల మూడోసారి దేశ ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన మోదీ 111వ ఎపిసోడ్‌ను ఈనెల 30న ప్రారంభిస్తున్నట్లు మంగళవారం 'ఎక్స్'లో ప్రకటించారు.

సాక్షి హైదరాబాద్

బుధవారం ၊ 19 ၊ జూన్ ၊ 2024



బంగారంతో బురిడీ!
మార్కెట్ ధర కంటే తక్కువకు బంగారం బిస్కెట్లు విక్రయిస్తామని వ్యాపారులను మోసం చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. -8లో



..కబ్జాపై కదిలిన యంత్రాంగం
రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలం కబ్జాపై అధికారులు స్పందించారు. ఎట్టకేలకు రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. -8లో

గరిష్ఠం/కనిష్ఠం 34.0/25.0

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తేలికపాటి వర్షం పడవచ్చు. గరిష్ట ఉష్ణోగ్రత 34, కనిష్ట ఉష్ణోగ్రత 25 డిగ్రీల సెల్సియస్ ఉండనున్నాయి. ఉపరితల గాలులు గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో పశ్చిమ నైరుతి దిశ వైపు వీచవచ్చు.

హై కాస్ట్ సిటీ

- జీవన వ్యయంలో ఖరీదైన నగరం
- కాస్ట్ ఆఫ్ లివింగ్‌లో సిటీకి 5వ స్థానం
- అత్యంత ఖరీదైన నగరంగా ముంబై
- మెర్సర్ అధ్యయనంలో వెల్లడి





సాక్షి, సిటీబ్యూరో: నగర జీవనం అంతకంతకూ ఖరీదెక్కుతోంది. ఈ క్రమంలో విశ్వనగరంగా మారుతున్న హైదరాబాద్‌లో జీవన వ్యయం మిగిలిన నగరాలతో పోలిస్తే కాసింత తక్కువగానే ఉన్నప్పటికీ.. గత కొన్నేళ్లతో పోల్చుకుంటే పెరుగుదల రేటు ఎక్కువగానే ఉండడం ఆందోళన కలిగిస్తోంది. ఈ అంశంపై ఆసక్తికరమైన విశేషాలను వెల్లడించింది ఓ అంతర్జాతీయ అధ్యయనం. 'ప్రవాసుల అభిప్రాయాల ప్రకారం.. కాస్ట్ ఆఫ్ లివింగ్' అనే అంశంపై ప్రపంచవ్యాప్తంగా ఆ సంస్థ నిర్వహించిన అధ్యయనంలో నగర జీవన వ్యయం గురించి కొన్ని ఆసక్తికర అంశాలు వెల్లడయ్యాయి. హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ మెర్సర్ నిర్వహించిన 2024 కాస్ట్ ఆఫ్ లివింగ్ సర్వేలో నివసించడానికి భారతదేశంలోనే ముంబై అత్యంత ఖరీదైన జీవన వ్యయం కలిగిన నగరంగా అభివర్ణించింది. 2013లో సర్వే ప్రారంభమైనప్పటి నుంచి ఈ నగరం ఈ విషయంలో అగ్రస్థానంలోనే కొనసాగుతోంది. ఈ జాబితాలో హైదరాబాద్ 5వ స్థానంలో నిలవడం ఊరటనిస్తోంది.

ప్రపంచ మేటి నగరాల సరసన..

ప్రపంచవ్యాప్తంగా 226 నగరాల వ్యాప్తంగా ఈ అధ్యయనం జరిగింది. ఈ అధ్యయన ఫలితాల ప్రకారం... ప్రపంచంలోని టాప్ 10 అత్యంత ఖరీదైన నగరాల్లో మొదటిదిగా హాంకాంగ్ ఆ తర్వాత స్థానాల్లో సింగపూర్, జ్యూరిచ్, జెనీవా, బెర్న్, న్యూయార్క్ సిటీ, లండన్, నసావు, లాస్ ఏంజెల్స్‌లు నిలిచాయి. మన దేశానికి వచ్చేసరికి.. ముంబై గత సంవత్సరం నుంచి ఏకంగా 11 స్థానాలు ఎగబాకి 136వ స్థానంలో నిలిచింది. ఇతర భారతీయ నగరాల్లో న్యూఢిల్లీ 164వ స్థానంలో చెన్నై 189వస్థానంలో, బెంగళూరు 195వ స్థానంలో, పుణె 205వ స్థానంలో, కోల్‌కతా 207వ స్థానంలో నిలవగా హైదరాబాద్ 202వ స్థానాన్ని దక్కించుకుంది.

ఏడాదిగా పెరగని జీవన వ్యయం..

ఏడాది వ్యవధిలో దేశంలోని ప్రధాన నగరాలలో కాస్ట్ ఆఫ్ లివింగ్ విషయంలో చెప్పుకోదగ్గ స్థాయిలో పెరిగినప్పటికీ.. మన నగరం మాత్రం స్థిరంగా అదే స్థానంలో కొనసాగడం గమనార్హం. అంటే ఏడాది వ్యవధిలో మన నగరంలో జీవన వ్యయం పెరగలేదని అర్థం. గత ఏడాది ముంబై 147వ స్థానంలో ఉండగా ఇప్పుడు 136వ స్థానానికి, 169వ స్థానంలో ఉన్న ఢిల్లీ 165వ స్థానానికి, 184వ స్థానంలో ఉన్న చెన్నై 189వ స్థానానికి 189వ స్థానంలో ఉన్న ముంబై 195వ స్థానానికి ఎదిగాయి. 213వ స్థానంలో ఉన్న పుణె 205వ స్థానానికి, 211వ స్థానంలో ఉన్న కోల్‌కతా 207వ స్థానంతో జీవన వ్యయం విషయంలో తగ్గుదల నమోదు చేశాయి. మన నగరం మాత్రం 202వ స్థానంలోనే మార్పుచేర్పులు లేకుండా కొనసాగడం విశేషం. 2022వ సంవత్సరంలో ఈ జాబితాలో మనం 192వ స్థానంలో నిలిచాం.. అంటే రెండేళ్లలో భాగ్యనగరం కూడా 10 స్థానాలు పైకి ఎగబాకిందని, ఇది మన నగరంలో పెరుగుతున్న కాస్ట్ ఆఫ్ లివింగ్‌ను సూచిస్తోంది.

అద్దెలు తక్కువ.. మద్యానికి ఎక్కువ..

పర్సనల్ కేర్ ఉత్పత్తులకు సంబంధించి అత్యంత ఖరీదైన నగరంగా ముంబై, ఆ తర్వాత స్థానంలో చెన్నై బాగా తక్కువ వ్యయం ఉన్న నగరంగా కోల్‌కతా నిలిచాయి. ఇక అత్యధికంగా ఇంటి అద్దెలు పెరుగుతున్న నగరంగా 12 నుంచి 15 శాతంతో ఢిల్లీ తొలిస్థానంలో నిలవగా, 6-8 శాతంతో ముంబై , 3-6శాతం పెరుగుదలతో బెంగళూర్, పుణె ఆ తర్వాత స్థానాల్లో నిలిచాయి. ఇంటి అద్దెల్లో చెన్నైతో పాటు మన నగరం కూడా దేశంలోనే అత్యల్పంగా 2-4శాతం పెరుగుదల నమోదు చేశాయి. దేశంలోనే మద్యం కోసం అత్యధిక వ్యయభరిత నగరాలుగా రెండో స్థానంలో బెంగళూర్‌తో మన నగరం పోటీపడుతుండగా చెన్నై మనల్ని తోసిరాజని తొలిస్థానంలో నిలవడం గమనార్హం.

జనావాసాల్లోకి కొండచిలువ


కొండ చిలువను పట్టుకుంటున్న స్నేక్ సొసైటీ సభ్యుడు

మణికొండ: పన్నెండు అడుగుల పొడవున్న కొండ చిలువ జనావాసాల్లోకి వచ్చి స్థానికులను భయభ్రాంతులకు గురిచేసింది. మంగళవారం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని తిరుమలహిల్స్ రోడ్డు నంబర్-4లోని ఖాళీ స్థలంలో కొండచిలువ కనిపించింది. వెంటనే స్థానికులు స్నేక్ సొసైటీ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి పట్టుకున్నారు. పాములు కనిపిస్తే తమకు సమాచారం ఇవ్వాలని, వాటిని జూపార్కులో అప్పగిస్తామని స్నేక్ సొసైటీ సభ్యులు సూచించారు.

కవి విల్సన్ సుధాకర్‌కు ప్రతిష్టాత్మక రోమ్ పురస్కారం



సాక్షి, సిటీబ్యూరో: నాశ్చిరా అసోసియేషన్, బార్డ్ ఇంటర్నేషనల్ గ్రూప్ ఆధ్వర్యంలోని ప్రతిష్టాత్మక 'డొన్నె డ్లీఅమోర్' (ఉమెన్ ఆఫ్ లవ్) అంతర్జాతీయ అవార్డుకు తెలుగు కవి తుల్లిమల్లి విల్సన్ సుధాకర్ ఎంపికయ్యారు. ఈ నెల 27న రోమ్ (ఇటలీ) వేదికగా అవార్డును స్వీకరించడానికి బార్డ్ ఇంటర్నేషనల్ గ్రూప్ నుంచి ఆహ్వానం అందిందని విల్సన్ సుధాకర్ తెలిపారు. మహిళా ప్రపంచానికి ప్రేరణగా రాసే సాహిత్యానికి గౌరవంగా ఈ అవార్డును అందిస్తారు. స్త్రీలపై సుధాకర్ రాసిన తెలుగు కవిత్వాన్ని ఆంగ్లంలోకి అనువదించగా.. ఆ కవిత్వం ఔన్నత్యాన్ని తెలుసుకొని దానిని ఇటాలియన్‌లోకి అనువదించి ఈ అవార్డుకు ఎంపిక చేశారని సుధాకర్ వివరించారు. నగరానికి చెందిన సుధాకర్ మినిస్ట్రీ ఆఫ్ టూరిజం (గవర్నమెంట్ ఆఫ్ ఇండియా) అసిస్టెంట్ డైరెక్టర్ జనరల్‌గా జపాన్, దక్షిణాఫ్రికా, దుబాయ్‌లలో విధులు నిర్వహించారు. పేదల పక్షపాతిగా, స్త్రీలు, బాల కార్మికులు, దళితులకు సంబంధించిన పలు అంశాలపై విల్సన్ సుధాకర్ రాసిన రచనలు ఆదరణ పొందాయి. ఆయన రాసిన పలు కవితలు ఆంగ్లం, ఇటాలియన్ భాషల్లోకి అనువాదమయ్యాయి.

పీజీ ప్రవేశ పరీక్షలకు 70 వేల దరఖాస్తులు

ఉస్మానియా యూనివర్సిటీ: పీజీ ప్రవేశ పరీక్షలకు 70 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు మంగళవారం సీపీజీఈటీ- 2024 కన్వీనర్ ప్రొ.పాండు రంగారెడ్డి తెలిపారు. రాష్ట్రంలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు వచ్చే నెల 6 నుంచి ప్రవేశ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు తెలిపారు. నేడు (19న) పరీక్షల టైం టేబుల్‌ను వెల్లడించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకోని అభ్యర్థులు రూ.500 అపరాధ రుసుముతో ఈ నెల 25 వరకు, రూ.2000 అపరాధ రుసుముతో 30 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. వివిధ డిగ్రీ కోర్సుల్లో ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు సైతం పీజీ ప్రవేశ పరీక్షలకు హాజరు కావచ్చని పాండు రంగారెడ్డి తెలిపారు.


ఎస్కీలో 4 కొత్త కోర్సులు

డైరెక్టర్ రామేశ్వరరావు వెల్లడి

రాయదుర్గం: ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఎస్కీ)లో నాలుగు కొత్త కోర్సులకు శ్రీకారం చుట్టనున్నారు. మంగళవారం ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి.రామేశ్వరరావు కోర్సుల వివరాలను వెల్లడించారు. ఆర్బిట్రేషన్‌లో ఏడాది వ్యవధితో గత పీజీ సర్టిఫికేషన్ కోర్సును ఆగస్టు మొదటి వారంలో క్లాసులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సైబర్ సెక్యూరిటీలో ఏడాది వ్యవధి గత పీజీ సర్టిఫికేషన్ కోర్సును కూడా ఆగస్టు నుంచే ప్రారంభిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఒక్కో కోర్సు ఫీజు రూ.1.20 లక్షలు ఉంటుందన్నారు. రెండు కోర్సులకు ఫీజు జులై 30 వరకు కాలేజీలో చెల్లించవచ్చన్నారు. రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తామన్నారు. ఆర్బిట్రేషన్ కోర్సులో చేరేవారు ఏదైనా డిగ్రీ పూర్తి చేసి ఉండాలని, ఫైనల్ చదివే వారు కూడా అర్హులని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీలో ఏదైని గ్రాడ్యుయేషన్ కోర్సులో కనీసం 50 శాతం మార్కులు కలిగి ఉండాలని, డిగ్రీ ఫైనల్ ఇయర్ చదివే వారు కూడా అర్హులని పేర్కొన్నారు. కాగా.. ఒక ఏడాది కాల పరిమితితో కూడిన పీజీ డిప్లొమో ఇన్ జనరల్ మేనేజ్‌మెంట్, పీజీ డిప్లొమో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజ్‌మెంట్, ఇండస్ట్రియల్ సేఫ్టీ, ఎన్విరాన్‌మెంట్ కోర్సులను ఎస్కీలోని స్కూల్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేషన్ స్టడీస్‌లో ప్రవేశ పెడుతున్నట్లు ఆయన వివరించారు. వీటి కోసం అడ్మిషన్ల ప్రక్రియను కొనసాగిస్తున్నట్లు ఆయన వివరించారు.

టెర్రర్ గ్యాంగ్స్

సిటీపై ఉత్తరాది ముఠాల కన్ను



- బవారియాల వరుస స్నాచింగ్‌లు
- చోరీలతో రెచ్చిపోతున్న ధార్ ముఠా
- ఇవి యూపీ, ఎంపీ రాష్ట్రాలకు చెందినవి
- అప్రమత్తమైన మూడు కమిషనరేట్లు
- రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు



సాక్షి, సిటీబ్యూరో: ఉత్తరాదికి చెందిన క్రిమినల్ గ్యాంగ్స్ నగరంపై విరుచుకుపడుతున్నాయి. పగలు బవారియాలు స్నాచింగ్‌లతో హడలెత్తిస్తుండగా.. రాత్రి వేళల్లో ధార్ ముఠా చోరీలతో రెచ్చిపోతోంది. వీటిలో ఒకటి ఉత్తరప్రదేశ్‌కు చెందిన ముఠా కాగా మరొకటి మధ్యప్రదేశ్‌ది. గడిచిన కొన్ని రోజులుగా ×గ్రేటర్‌×ను హడలెత్తిస్తున్న ఈ నేరగాళ్ల కోసం హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు.

తరచూ బవారియాల పంజా..

ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాకు చెందిన బవారియాల్లో అనేక చైన్ స్నాచింగ్ గ్యాంగ్స్ ఉన్నాయి. వీళ్లు ముఠాలుగా ఏర్పడి ఢిల్లీ, హరియాణా, మహారాష్ట్ర, కర్ణాటకలతో పాటు తెలంగాణలోనూ నేరాలు చేస్తున్నారు. వీరిపై దేశ వ్యాప్తంగా వందల సంఖ్యలో కేసులు ఉన్నాయి. ఏదైనా ప్రాంతాన్ని లక్ష్యంగా చేసుకుంటే వరుసపెట్టి నేరాలు చేస్తుంది ముఠా. 2018 డిసెంబర్ ఆఖరి వారంలో నగరంలో పంజా విసిరిన బవారియాలు రెండు రోజుల వ్యవధిలో మొత్తం తొమ్మిది స్నాచింగ్స్ చేశారు. మీర్‌పేట, వనస్థలిపురం, హయత్‌నగర్, ఎల్బీ నగర్, నాగోల్, చైతన్యపురిల్లో ఇవి జరిగాయి. ఆపై గతేడాది జనవరిలో మరోసారి సిటీపై పడ్డారు. ఒకే రోజు ఉప్పల్, నాచారం, ఉస్మానియా యూనివర్సిటీ, చిలకలగూడ, రామ్‌గోపాల్‌పేట్ పోలీసుస్టేషన్ల పరిధిలోకి వచ్చే ఏడు ప్రాంతాల్లో వరుస నేరాలకు పాల్పడ్డారు. తాజాగా శనివారం జవహర్‌నగర్, శామీర్‌పేట, మెహిదీపట్నంల్లో నాలుగు నేరాలకు ఒడిగట్టారు.

రంగంలోకి ప్రత్యేక బృందాలు..

సిటీతో పాటు శివార్లలో ఉత్తరాది ముఠాలు రెచ్చిపోతుండటాన్ని పోలీసు విభాగం సీరియస్‌గా తీసుకుంది. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లకు చెందిన స్థానిక పోలీసులతో పాటు టాస్క్‌ఫోర్స్, స్పెషల్ ఆపరేషన్ టీమ్స్ (ఎస్‌ఓటీ) రంగంలోకి దిగాయి. మరోవైపు కాలనీలతో పాటు ఇతర ప్రాంతాల్లోనూ గస్తీ ముమ్మరం చేశాయి. ప్రతి ఒక్కరూ ఈ గ్యాంగ్స్ విషయంలో అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిస్తున్నాయి. అపరిచితులకు ఇళ్ల అద్దెకు ఇవ్వకపోవడం, వాళ్లను లోపలకు రానీయకపోవడం ఉత్తమం అని సూచిస్తున్నాయి. రోడ్లపై నడిచి వెళ్లే మహిళలు మెడలోని ఆభరణాలు బయటకు కనిపించకుండా కొంగు, చున్నీ కప్పుకోవాలని చెబుతున్నాయి. రాత్రి వేళల్లో ఎవరైనా వచ్చి తలుపు తట్టినా, ఆవరణలో అలికిడి అయినా అప్రమత్తం కావాలని స్పష్టం చేస్తున్నాయి. సీసీ కెమెరాల్లో చూసి, లేదా నిర్ధారించుకున్నాక మాత్రమే తలుపులు తీయాలని, అవసరమైతే '100'కు కాల్ చేయడం ద్వారా పోలీసుల సహాయం పొందాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నాయి.

ధార్ గ్యాంగ్ టార్గెట్ శివార్లే..

మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ ముఠా దోపిడీలు, దొంగతనాలు చేస్తుంది. 2018-22 మధ్య ఈ గ్యాంగ్‌పై సైబరాబాద్‌లో 138, రాచకొండలో 32 చోరీ కేసులు నమోదయ్యాయి. కాలనీల్లో దూరంగా విసిరేసినట్లు ఉండే ఇళ్లనే ఈ ముఠా ఎంచుకుంటుంది. పగటిపూట భిక్షాటన, చిన్న చిన్న వస్తువుల అమ్మకం, దివ్యాంగుల ముసుగులో తిరుగుతూ రెక్కీ చేసి అనువైన ఇళ్లను గుర్తిస్తుంది. రాత్రి వేళల్లో పంజా విసిరుతుంది. సాధారణంగా చోరీలు చేసే ధార్ ముఠా అవసరమైతే ఎదుటి వారిపై దాడులు చేసి దోపిడీలకూ తెగబడుతుంది. 2022లో పోలీసులు ధార్ గ్యాంగ్‌కు చెందిన అనేక మందిని అరెస్టు చేశారు. కొందరిపై పీడీ యాక్ట్ ప్రయోగించి జైలుకు తరలించారు. దీంతో కొన్నాళ్లు వీరి కదలికలు తగ్గాయి. తాజాగా పంథా మార్చిన ధార్ గ్యాంగ్ గత వారం అబ్దుల్లాపూర్‌మెట్‌లో 5, హయత్‌నగర్‌లో 6 చోరీలకు పాల్పడింది.

ఆశా వర్కర్ల డిమాండ్లను నెరవేర్చాలి

- మహిళామోర్చా నేతల ధర్నా
- కోఠి డీఎంహెచ్‌ఎస్ వద్ద ఉద్రిక్తత


డీఎంహెచ్‌ఎస్ వద్ద ప్లకార్డులతో మహిళా మోర్చా నేతలు

సుల్తాన్‌బజార్: ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని భారతీయ జనతాపార్టీ మహిళామోర్చా ఆధ్వర్యంలో చేపట్టిన డీఎంహెచ్‌ఎస్ ముట్టడి తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. మంగళవారం బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి ఆధ్వర్యంలో కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ ముట్టడి యత్నాన్ని సుల్తాన్‌బజార్ పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులకు, బీజేపీ మహిళా నేతలకు మధ్య తీవ్ర వాగ్వావాదం చోటుచేసుకుంది. పోలీసులు గేట్లు మూసివేయడంతో మహిళా నాయకురాళ్లు ముందుకు తోసుకువెళ్లారు. దీంతో పోలీసులు వారిని అడ్డుకున్నారు. వైద్యశాఖ మెటర్నల్ హెల్త్ న్యూట్రిషియన్ జాయింట్ డైరెక్టర్ పద్మజతో ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసా చారి చర్చలు జరపడంతో వివాదం సద్దుమణిగింది. ఈ సందర్భంగా శిల్పారెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 26 వేల మంది ఆశావర్కర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశా వర్కర్ల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు, ఎన్నికల అనంతరం ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరారు. రాష్ట్రంలో ఆశా వర్కర్లు మూడు దశాబ్దాలకు పైగా పని చేస్తున్నారని, వారు అన్ని రకాలుగా శ్రమ దోపిడికి గురవుతున్నారన్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ కూడా ఆశా వర్కర్లను గ్లోబల్ లీడర్లుగా గుర్తించిందన్నారు. ఇంత అనుభవం ఉన్న ఆశావర్కర్లను పరీక్షలు రాయాలని అడగడం సమంజసం కాదన్నారు. ఆశా వర్కర్లకు ఇచ్చే పారితోషికాన్ని ప్రస్తుత ప్రభుత్వం రూ.18 వేలు పెంచి అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మహిళా మోర్చా నాయకురాళ్లు లలిత, గీతారెడ్డి, డాక్టర్ సమత, అనిత, భాగ్యలక్ష్మి, జ్యోతి, వాణి, మంజులారెడ్డి, పాల్గొన్నారు.


మహిళా మోర్చా నేతలు, పోలీసులకు మధ్య తోపులాట

బడి బస్సు భద్రమేనా?

- గ్రేటర్ పరిధిలో 14,624 స్కూల్ బస్సులు
- రంగారెడ్డి జిల్లా పరిధిలోనే 11,922..
- వీటిలో 3,500 బస్సులు కండిషన్ లేనివే
- నిబంధనలు పట్టించుకోని పాఠశాలలు
- విద్యా సంవత్సరం ఆరంభంలోనే హడావుడి
- ఆ తర్వాత గాలికొదిలేస్తున్న రవాణా శాఖ

ఏటా ప్రహసనంగా ఆర్టీఏ తనిఖీలు

బడి బస్సుల తనిఖీలు ప్రహసనంగా మారాయి. ఏటా విద్యాసంవత్సరం ఆరంభంలో సామర్థ్యం లేని బస్సులను తనిఖీలు చేసి కేసులు నమోదు చేసినా.. ఆ తర్వాత అవి మళ్లీ రోడ్లపైకి వచ్చేస్తున్నాయి. మరోవైపు ఆర్టీఏ అధికారులు సైతం బస్సుల సామర్థ్యాన్ని నిర్ధారించడంలో కచ్చితమైన ప్రమాణాలను పాటించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. కొన్ని విద్యాసంస్థలు కాలం చెల్లిన డొక్కు బస్సులను నడిపినా పట్టించుకోకుండా కొందరు ఎంవీఐలు ఉత్తుత్తి తనిఖీలు చేసి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేస్తున్నారు. – సాక్షి, సిటీబ్యూరో



గ్రేటర్ పరిధిలో సుమారు 14,624 స్కూల్ బస్సులు ఉన్నాయి. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా పరిధిలోనే సుమారు 11,922 బస్సులు పిల్లలకు రవాణా సదుపాయాన్ని అందజేస్తున్నాయి. వీటిలో సుమారు 3,500కు పైగా బస్సులు సామర్థ్యం లేనివి ఉన్నట్లు అంచనా. మరోవైపు సామర్థ్యం ఉన్నట్లు ధ్రువీకరించిన వాటిలోనూ ఏ మేరకు ఫిట్‌నెస్ ఉందనేది సందేహమే. ఏటా వారం రోజుల పాటు ఆర్టీఏ అధికారులు హడావుడి చేయడం.. ఆ తర్వాత పట్టించుకోకపోవడం షరామామూలుగా మారింది. దీంతో స్కూల్ బస్సుల నిర్వహణపై నిర్లక్ష్యం రాజ్యమేలుతోంది. కొన్ని విద్యాసంస్థలు తక్కువ జీతాలతో లభించే డ్రైవింగ్‌లో పెద్దగా అనుభవం లేనివారిని నియమిస్తున్నాయి. బస్సుల సామర్థ్యాన్నీ గాలికొదిలేస్తున్నాయి.

ఎందుకీ నిర్లక్ష్యం?

స్కూల్ బస్సుల కారణంగా జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం స్పష్టమైన విధి విధానాలను రూపొందించింది. నిబంధనలు, మార్గదర్శకాలను పేర్కొంది. ఆచరణలో మాత్రం అమలుకు నోచుకోవడం లేదు. నిరంతర నిఘా విధానం లేకపోవడం, డ్రైవర్లపై ఎలాంటి నియంత్రణ, తనిఖీ లేకపోవడంతో బడి బస్సుల్లో పిల్లల భద్రత గాలిలో దీపంలా మారుతోంది.

స్కూల్ బస్సు ఇలా ఉండాలి..

- బస్సు పసుపు రంగులో ఉండాలి. రంగు పాలిపోయినట్లుగా కాకుండా స్పష్టంగా కనిపించాలి. విద్యార్థులు బస్సులోకి ఎక్కడం, దిగడం డ్రైవర్‌కు స్పష్టంగా కనిపించేలా కన్వెక్స్ క్రాస్ వ్యూ అద్దాలు అమర్చాలి. బస్సు లోపలి భాగంలో పెద్ద పారదర్శకమైన అద్దం ఏర్పాటు చేయాలి. దీనివల్ల లోపల ఉన్న పిల్లలు కూడా డ్రైవర్‌కు కనిపిస్తారు.
- బస్సు ఇంజిన్ కంపార్ట్‌మెంట్‌లో ఒక అగ్నిమాపక యంత్రం (ఫైర్ ఎక్స్‌టింగ్విషర్), పాడి అందుబాటులో ఉండాలి. అత్యవసర ద్వారం ఉండాలి. ఫస్ట్ ఎయిడ్ బాక్స్ ఏర్పాటు చేయాలి.
- సదరు పాఠశాల/కళాశాల పేరు, టెలిఫోన్ నంబర్, మొబైల్ నంబర్, పూర్తి చిరునామా బస్సుకు ఎడమవైపున ముందుభాగంలో స్పష్టంగా రాయాలి.
- సీట్ల కిందిభాగంలో బ్యాగులు పెట్టుకొనేలా అరలు ఏర్పాటు చేయాలి. పిల్లలు పట్టుకొనేందుకు వీలుగా అక్కడక్కడా లోహపు స్తంభాలను బస్సులో అమర్చాలి.
- వాహనానికి నలువైపులా పైభాగం మూలాల్లో (రూఫ్‌పై కాదు) బయటివైపు యాంబర్ (గాఢ పసుపు పచ్చని) రంగున్న ఫ్లాషింగ్ లైట్లను ఏర్పాటు చేయాలి. పిల్లలు దిగేటప్పుడు, ఎక్కేటప్పుడు ఈ లైట్లు వెలుగుతూ ఉండాలి.
- సదరు వాహనం స్కూల్ బస్సు అని తెలిసేలా ముందుభాగంలో పెద్ద బోర్డుపై 250 ఎంఎంకు తగ్గని విధంగా ఇద్దరు విద్యార్థుల (అమ్మాయి, అబ్బాయి) బొమ్మ నల్లరంగులో చిత్రించి ఉండాలి. ఆ చిత్రం కింద 'స్కూల్ బస్సు' లేదా 'కళాశాల బస్సు' అని నల్ల రంగులో 100 ఎంఎం సైజు అక్షరాల్లో రాయాలి. అక్షరాల గాఢత సైజు 11 ఎంఎం ఉండాలి.
- బస్సు తలుపులు సురక్షితమైన లాకింగ్ సిస్టమ్‌తో ఉండాలి. సైడ్ విండోలకు అడ్డంగా 3 లోహపు కడ్డీలను ఏర్పాటు చేయాలి. సీటింగ్ కంటే ఎక్కువ మందిని తీసుకెళ్లకూడదు.
- ఫుట్‌బోర్డుపై మొదటి మెట్టు 325 ఎంఎం ఎత్తుకు మించకుండా ఉండాలి. అన్ని మెట్లు జారకుండా ఉండే లోహంతో అమర్చాలి.
- లోపలికి ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు పట్టుకొనేందుకు వీలుగా ముందరి తలుపు మెట్లకు సమాంతరంగా రెయిలింగ్ ఉండాలి.
- బస్సులో ప్రయాణించే విద్యార్థుల పేర్లు, తరగతులు, చిరునామాలు, ఎక్కాల్సిన, దిగాల్సిన వివరాలు బస్సులో ఉండాలి.

డ్రైవర్ల అర్హతలిలా..

- డ్రైవర్ వయసు 60 ఏళ్లకు మించొద్దు. పాఠశాల యాజమాన్యం ప్రతి డ్రైవర్ ఆరోగ్య పట్టికను విధిగా నిర్వహించాలి.
- యాజమాన్యం తమ సొంత ఖర్చుతో డ్రైవర్లకు ప్రతి 3 నెలలకోసారి రక్తపోటు, షుగరు, కంటి చూపు వంటి ఆరోగ్య పరీక్షలు చేయించాలి.
- డ్రైవర్‌ను నియమించేందుకు ముందు అతని అర్హతలు, డ్రైవింగ్ లైసెన్స్,తదితర అంశాలపై సంబంధిత ఆర్టీఏ అధికారులను సంప్రదించాలి. ప్రతి బస్సులో ఒక అటెండర్ తప్పనిసరిగా ఉండాలి.
- డ్రైవర్‌కు బస్సు డ్రైవింగ్‌లో కనీసం 5 సంవత్సరాల అనుభవం ఉండాలి. డ్రైవర్, అటెండర్ తప్పనిసరిగా యూనిఫాం ధరించాలి.

అమలుకు నోచుకోని నిబంధనలు..

- నిబంధనల్లో చాలా వరకు అమలుకు నోచుకోవడం లేదు.
- స్కూల్ బస్సుల భద్రతను మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని గతంలో నిర్ణయించారు. ఇప్పటి వరకు అమల్లోకి రాలేదు.
- బస్సు లోపలివైపు సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా డ్రైవర్ నైపుణ్యాన్ని అంచనా వేయడంతో పిల్లలను జాగ్రత్తగా బస్సు ఎక్కించేందుకు, తిరిగి ఇళ్ల వద్ద దించేందుకు సిబ్బంది చూపే శ్రద్ధ వంటి వివరాలను తెలుసుకోవచ్చు.

ప్రభుత్వ స్థలం కబ్జాపై కదిలిన యంత్రాంగం

- ముగ్గురిపై కేసు నమోదు
- 'సాక్షి' కథనాలకు స్పందన

సాక్షి ఎఫెక్ట్


సర్వే నంబర్ 13లోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి

సుభాష్‌నగర్: రూ.కోట్లు విలువచేసే ప్రభుత్వ స్థలం కబ్జాపై 'సాక్షి' వరుస కథనాలతో అధికారులు స్పందించారు. ఎట్టకేలకు రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పోలీసులు రంగ ప్రవేశం చేశారు. ఈ తతంగానికి పాల్పడుతున్న ముగ్గురిపై కేసు నమోదు చేశారు. గాజులరామారంలోని సర్వే నంబర్ 13లోని ప్రభుత్వ స్థలాన్ని సూరారం ఇన్‌స్పెక్టర్ వెంకటేశంతో కలిసి అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి పరిశీలించారు. ఈ మేరకు ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసిన శ్రీనాథ్, శోభారాణి, సంధ్యారెడ్డిలపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సర్వే నంబర్ 13లోని స్థలంలో కబ్జాలపై 2019లోనే సాక్షిలో కథనం ప్రచురితమైంది. అప్పటి తహసీల్దార్ గౌతంకుమార్ స్పందించి సదరు స్థలంలో మొక్కలు నాటించారు. తాజాగా మార్చి నుండి కొందరు కబ్జా యత్నాలు ప్రారంభించగా సాక్షిలో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ప్రస్తుత తహసీల్దార్ రెహమాన్‌ఖాన్ సదరు స్థలం ప్రభుత్వస్థలంగా పేర్కొంటూ బోర్డు ఏర్పాటు చేశారు. అయితే..గంట వ్యవధిలోనే కబ్జాదారులు బోర్డును మాయం చేశారు. మరుసటి రోజు బోర్డు మాయం పేరిట 'సాక్షి' మరో కథనం ప్రచురించింది. దీంతో సీరియస్‌గా తీసుకున్న రెవెన్యూ అధికారులు కబ్జాదారులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అంతలోనే లోక్‌సభ ఎన్నికలు రావడంతో, అధికారులు బిజీగా ఉండటాన్ని గమనించి కబ్జాదారులు గోశాల పేరిట కబ్జాకు తెర లేపారు. ఈ కబ్జాను వ్యతిరేకించిన ఓ వ్యక్తిపై దాడి చేయడంతో మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని సాక్షి కుండలు బద్దలు చేసింది. ఎట్టకేలకు అడిషనల్ డీసీపీ నరసింహారెడ్డి స్వయంగా కబ్జా అవుతున్న స్థలాన్ని పరిశీలించారు.

స్కూల్ వ్యాన్ బీభత్సం

టీ షాప్, వెల్డింగ్ షాపుల్లోకి దూసుకెళ్లిన వైనం..


వెల్డింగ్ షాప్‌లోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్

నల్లకుంట: స్కూల్ పిల్లలను చేరవేసే ఓ మినీ వ్యాన్ అదుపు తప్పి రహదారి పక్కనే ఉన్న షాపుల్లోకి దూసుకెళ్లిన సంఘటన కాచిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం..మంగళవారం ఉదయం 8.30 గంటల సమయంలో జానయ్య అనే వ్యక్తి తన మినీ మారుతీ స్కూల్ వ్యాన్ తీసుకుని నల్లకుంట తిలక్‌నగర్ చౌరస్తా నుంచి ఫీవర్ ఆసుపత్రి వైపు వేగంగా వెళ్తున్నాడు. తిలక్‌నగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోకి చేరుకున్న వ్యాన్ ఒక్క సారిగా అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి దూసుకెళ్లి అక్కడ ఉన్న చాయ్ బండిని ఢీకొంది. అదే వేగంతో పక్కనే ఉన్న ఓ వెల్డింగ్ షాప్‌లోకి దూసుకు వెళ్లింది. దీంతో టీ స్టాల్, వెల్డింగ్ షాప్ షెటర్ పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనకు కొద్ది క్షణాల ముందు టీ స్టాల్‌లో పనిచేసే వ్యక్తులు పక్కకు వెళ్లడంతో ప్రాణాపాయం తప్పింది. ఈ ప్రమాదంలో కొంతమేర ఆస్తి నష్టం జరిగినప్పటికీ..ఆ సమయంలో అక్కడ జనసంచారం లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. ఈ ఘటనతో ఆ రోడ్డులో ట్రాఫిక్ స్తంభించింది. విషయం తెలుసుకున్న ట్రాఫిక్ పోలీసులు అక్కడకు చేరుకుని మినీ వ్యాన్‌ను క్రేన్ సహాయంతో అక్కడి నుంచి తొలగించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. కాగా ఈ విషయంపై కాచిగూడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సమాచారం.

చార్టర్డ్ అకౌంటెంట్ అదృశ్యం



బంజారాహిల్స్: ఓ చార్టర్డ్ అకౌంటెంట్ అదృశ్యమైన సంఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే..బెంగళూరుకు చెందిన ఎల్.సునీల్‌కుమార్ (45) గత జనవరిలో భార్యతో విడిపోయి హైదరాబాద్‌కు వచ్చాడు. బంజారాహిల్స్‌లోని మైత్రీవనం పేయింగ్ హాస్టల్‌లో ఉంటున్నానంటూ తన సోదరుడు అభిషేక్‌కు వాట్సాప్ ద్వారా తెలిపాడు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే సునీల్‌కుమార్ ఇటీవల కొద్దికాలంగా ఎలాంటి పోస్టులు పెట్టకపోవడం, తాము ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఆయన బస చేస్తున్నానని చెప్పిన హాస్టల్ వద్దకు వెళ్లి ఆరా తీశారు. అయితే సునీల్ కుమార్‌కు సంబంధించి అక్కడ ఎలాంటి సమాచారం లభించకపోగా ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ చేసి ఉంది. గత జనవరి 22వ తేదీ నుంచి సునీల్‌కుమార్ తమకు అందుబాటులో లేకుండాపోయాడని, తాము పలుమార్లు హాస్టల్‌కు వస్తామని చెబితే వద్దంటూ దాటవేసేవాడని, ఇదంతా పలు అనుమానాలకు దారి తీస్తుందంటూ అభిషేక్ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆచూకీ తెలిసిన వారు 8712660458 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

బంగారంతో బురిడీ!

- తక్కువ ధరకు విక్రయిస్తామంటూ మోసం
- నకిలీ బంగారం చేతిలో పెట్టి పరార్
- అంతరాష్ట్ర ముఠా ఆటకట్టించిన పోలీసులు
- నకిలీ బంగారం, కరెన్సీ స్వాధీనం
- రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: మార్కెట్ ధర కంటే తక్కువకు బంగారం బిస్కెట్లు విక్రయిస్తామని బంగారం వ్యాపారులను మోసం చేస్తున్న అంతరాష్ట్ర ముఠా ఆటకట్టించారు రాచకొండ పోలీసులు. నలుగురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వీరి నుంచి మూడు కార్లు, కానిస్టేబుల్ దుస్తులు, రూ.6.86 కోట్ల నకిలీ నగదు, 5 కిలోల నకిలీ బంగారం బిస్కెట్లు, రూ.51 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఆయా వివరాలను రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి మంగళవారం మీడియాకు వివరాలను వెల్లడించారు.

- నెల్లూరు జిల్లాకు చెందిన కర్రెద్దుల విజయ్ కుమార్ అలియాస్ కృష్ణ మోహన్ చౌదరి, బోగిరి సునీల్ గవాస్కర్ అలియాస్ హరీష్, నంబూరి డేవిడ్ అలియాస్ సెంథిల్, అడిగోపుల ఓంసాయి కిరిటీలు కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి కొనుగోలు చేసిన బంగారం తమ దగ్గదర ఉందని, తక్కువ ధరకే విక్రయిస్తామని వ్యాపారస్తులను సంప్రదించేవారు. ఈక్రమంలో బోడుప్పల్‌కు చెందిన సింగిరెడ్డి సురేష్ రెడ్డి ద్వారా స్థానిక వ్యాపారి శ్రీదిలీప్ బర్మాకు ఈ విషయం తెలిసింది. దీంతో ఇరువురు కలిసి గత నెల 19న బెంగళూరుకు వెళ్లి, విజయ్‌కుమార్, హరీష్‌లను కలిశారు. దిలీప్ దగ్గరి నుంచి రూ.6 లక్షలు తీసుకొని 81 గ్రాముల బంగారం ఇచ్చారు. నాలుగు రోజుల తర్వాత హరీష్ బోడుప్పల్‌కు వచ్చి దిలీప్‌కు అదనంగా 20 గ్రాముల బంగారాన్ని ఇచ్చాడు. దీంతో పూర్తిగా విశ్వసించిన దిలీప్ 2 కిలోల బంగారం కావాలని ఆర్డర్ చేశాడు. రూ.20 లక్షల నగదు చెల్లించాడు. మిగిలిన రూ.90 లక్షల నగదును గత నెల 29న స్నేహితుడు సురేష్‌తో కలిసి బెంగళూరులోని టీసీ పాళ్యంకు వెళ్లి విజయ్‌కుమార్‌కు ఇచ్చారు. వీరి సమక్షంలోనే విజయ్ 5 కిలోల బంగారాన్ని ఇతరులకు విక్రయించాడు. ప్రస్తుతం స్టాక్ లేదని చెప్పి వారిని తిరిగి పంపించేశాడు.

చెన్నై తీసుకెళ్లి..

గత నెల 30న మేనేజర్ నంబూరి డేవిడ్‌ను కలిసేందుకు దిలీప్‌ను విజయ్ కుమార్ చెన్నైలోని లీ రాయల్ మెరిడియన్ హోటల్‌కు తీసుకెళ్లాడు. అక్కడ హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని రోడ్ నం-35లో బంగారాన్ని తీసుకోవాలని డేవిడ్ వారికి సూచించాడు. దీంతో హైదరాబాద్‌కు దిలీప్ తిరుగు ప్రయాణమయ్యాడు. ఇక అంతే అప్పట్నుంచి దిలీప్‌తో కమ్యూనికేషన్ కట్ చేసేశారు. మోసపోయానని గ్రహించిన దిలీప్ ఈనెల 8న మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సాంకేతిక ఆధారాలను సేకరించిన పోలీసులు కీసర వద్ద నలుగురు నిందితులను పట్టుకున్నారు.

నకిలీ పోలీసుగా హడావుడి..

బాధితులను నమ్మించేందుకు వారి మనుషులనే కస్టమర్ల రూపంలో పెట్టేవారు. బాధితుల సమక్షంలోనే నకిలీ కరెన్సీతో, నకిలీ బంగారం బిస్కెట్లను విక్రయించేవారు. దీన్ని కళ్లారా చూసిన బాధితులు నిజమని నమ్మేవారు. దీంతో వారికీ తక్కువ ధరకు బంగారం కావాలని నిందితులను సంప్రదించేవారు. ప్రస్తుతం బంగారం లేదని, అడ్వాన్స్ చెల్లిస్తే కొద్ది రోజుల్లో అందజేస్తామని నమ్మించేవారు. ఆ తర్వాత నిందితులు నకిలీ బంగారం బిస్కెట్లు తీసుకొచ్చి, బాధితులకు అందజేసే క్రమంలో నకిలీ పోలీసు అధికారి జోక్యం చేసుకుంటాడు. దీంతో నిందితులు, బాధితులు ఇరువురూ అక్కడ్నుంచి పరారవుతారు. ఇప్పటికే నిందితులు విజయ్ కుమార్‌పై కావలి టు టౌన్ ఠాణాలో 13 కేసులు, నంబూరి డేవిడ్‌పై రెండు కేసులున్నాయి.

నగరంలో నేడు

- అన్నమయ్య కళాక్షేత్రం, హిందూస్ ఫర్ ప్లూరలిటీ అండ్ ఈక్వాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో అన్నమయ్య జయంతి సందర్భంగా బుధవారం ఉదయం 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. బిర్లా సైన్స్ సెంటర్‌లోని భాస్కర ఆడిటోరియంలో ఇది జరుగుతుంది.
- శ్రీ కిరణ్ సాంస్కృతిక సమాఖ్య, శ్రీ త్యాగరాయ గానసభ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం 6.00 గంటలకు ఏకాపద్మ స్మారక పురస్కార ప్రదానోత్సవ సభ చిక్కడపల్లిలోని శ్రీ కళాసుబ్బారావు కళావేదికలో జరుగుతుంది.
- ఉమెన్ అండ్ ట్రాన్స్‌జెండర్ ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ×న్యూ క్రిమినల్ లా×' పై సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరుగుతుంది.
- ప్రోగ్రెసివ్ ఆర్గనైజేషన్స్ ఆఫ్ ఉమెన్ (పీఓడబ్ల్యూ) అర్థ శతాబ్ది వార్షికోత్సవ సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం 12 గంటలకు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ జరుగుతుంది.
- వివేక వర్ధిని ఎడ్యుకేషన్ సొసైటీకి చెందిన గౌలిగూడలోని వివేక్ వర్ధిని పాఠశాలలో ప్రైమరీ సెక్షన్‌ను బుధవారం ఉదయం 10 గంటలకు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవసేన ప్రారంభిస్తారు.
- జూబ్లీహిల్స్‌లోని అపోలో కేన్సర్ సెంటర్‌లో ఉదయం 11.30 గంటలకు అవుట్ పేషెంట్లకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

మత్తు పదార్థాలకు బానిసై దోపిడీలు..

ముగ్గురు మైనర్లను అరెస్ట్ చేసిన పోలీసులు

హిమాయత్‌నగర్: గంజాయి, వైట్నర్‌లకు బానిసలైన ముగ్గురు మైనర్లు దారిదోపిడీలకు పాల్పడుతుండగా నారాయణగూడ పోలీసులు అరెస్ట్ చేశారు. సుల్తాన్ బజార్ ఏసీపీ శంకర్, నారాయణగూడ సీఐ చంద్రశేఖర్ విలేకరులకు తెల్పిన వివరాల మేరకు..హిమాయత్‌నగర్ బర్గర్ కింగ్‌లో పార్ట్‌టైం ఉద్యోగం చేసే దినేష్ రెడ్డి అనే వ్యక్తి ఈ నెల 13 వ తేదీన తెల్లవారు జామున 4:30 గంటల సమయంలో హాస్టల్‌కు తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో హిమాయత్‌నగర్‌లోని సిటీ కేఫ్ సమీపంలోని స్ట్రీట్ నెం:11 వద్ద అకస్మాత్తుగా బైకుపై ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అడ్డగించి..డబ్బు డిమాండ్ చేశారు. బాధితుడు తన వద్ద లేదని చెప్పడంతో వారు మొబైల్ ఇవ్వమని అడిగారు. అతను నిరాకరించడంతో దాడి చేసి కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ లాక్కుని పారిపోయారు. బాధితుడు దినేష్ రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసిన పోలీసులు, వాహన తనిఖీలలో ముగ్గురు మైనర్లను అదుపులోకి తీసుకొని విచారించారు. ముగ్గురు దోపిడీకి పాల్పడ్డారని నిర్ధారించి వారిని జువైనల్ హోంకు తరలించారు. వీరిలో ఓ మైనర్ ఓ గ్యాంగ్ రేప్ కేసులో గతంలో శిక్ష అనుభవించాడని ఏసీపీ తెలిపారు. ఇటీవల బొల్లారం పీఎస్ పరిధిలో ఓ టాటూ సెంటర్ లో టాటూ వేయించుకున్న ముగ్గురు మైనర్లు, ఆ టాటూ మిషన్‌ను కూడా దొంగిలించి, సొంతంగా టాటూలు వేసుకున్నారని తెలిపారు. వారి నుండి యాక్టివా వాహనం, టాటూ మిషన్‌లను సీజ్ చేశారు.

అదుపుతప్పిన ప్రైవేటు బస్సు



రాజేంద్రనగర్: ప్రైవేటు బస్సు అదుపు తప్పి ఫుట్‌పాత్‌పైకి వేగంగా దూసుకొచ్చి సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో స్తంభం కాస్తా పెద్ద శబ్దంతో ఒరిగిపోయింది. ఈ ఘటన సమయంలో రోడ్డుపై ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళ్తే..బెంగళూర్ నుంచి నగరానికి వస్తున్న ఓ ప్రైవేటు బస్సు మంగళవారం ఉదయం ఆరాంఘర్ చౌరస్తా వద్దకు రాగానే అదుపు తప్పింది. ఫుట్‌పాత్‌పైకి దూసుకొచ్చి సీసీ కెమెరాల కోసం ఏర్పాటు చేసిన స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ఎప్పుడు రద్దీగా ఉన్న ఆరాంఘర్ చౌరస్తాలో ఈ సంఘటన చోటు చేసుకోవడంతో వాహనదారులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. డ్రైవర్ నిద్ర మత్తులో ఉండటంతోనే ఈ సంఘటన జరిగిందని స్థానికులు, ప్రయాణికులు ఆరోపించారు. బస్సులోని ఐదుగురు ప్రయాణికులతో పాటు డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. బస్సు ముందు భాగం ధ్వంసమైంది. ఈ సంఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు వెల్లడించడం గమనార్హం.

బోర్డు తిప్పేసిన కన్సల్టెన్సీ

వర్కింగ్ వీసాల పేరుతో రూ.70 లక్షలు దండుకున్న వైనం

మలక్‌పేట: వర్కింగ్ వీసాలు ఇప్పించి విదేశాలకు పంపిస్తామని చెప్పి ఓ కన్సల్టెన్సీ నిర్వాహకుడు నిరుద్యోగుల నుంచి లక్షల రూపాయాలు దండుకుని బోర్డు తిప్పేసిన సంఘటన మంగళవారం మలక్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ జయంత్ తెలిపిన వివరాల ప్రకారం..మహబూబ్‌నగర్ టౌన్‌కు చెందిన గాండ్ల కిరణ్‌కుమార్ 'డేగాస్ డెస్టినేషన్' ప్రైవేట్ లిమిటెడ్ పేరుతో 9 నెలలుగా కన్సల్టెన్సీ నిర్వహిస్తున్నాడు. అక్టోబర్ 2023లో సలీంనగర్‌లో కన్సల్టెన్సీ ప్రారంభించి, మూడు నెలల క్రితం దిల్‌సుఖ్‌నగర్‌కు ఆఫీస్‌ను మార్చాడు. అమెరికా, న్యూజిలాండ్ దేశాలకు వర్కింగ్ వీసా మీద పంపిస్తామని ఏజెంట్ల ద్వారా నిరుద్యోగులకు గాలం వేశాడు. ఆరు నెలల్లోగా విదేశాలకు పంపిస్తానని ఒక్కొక్కరి వద్ద రూ.లక్ష నుంచి 9 లక్షల వరకు వసూలు చేశాడు. ఆ తర్వాత వారిని విదేశాలకు పంపించకుండా మభ్యపెడుతున్నాడు. ఈలోగా కొత్త కంప్యూటర్లు తెస్తానని చెప్పి, ఆఫీసులో ఉన్న కంప్యూటర్లు అమ్మేశాడు. రేపు, మాపు అంటూ వారిని నమ్మిస్తూ కాలయాపన చేశాడు. వీసాల విషయమై న్యూజిలాండ్‌కు వెళ్తున్నానని, వచ్చిన తర్వాత అందర్నీ విదేశాలకు పంపిస్తానని చెప్పి అక్కడి నుంచి ఉడాయించాడు. బాధితులు మూడు రోజులుగా అతని సెల్ నంబర్‌కు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గ్రహించిన బాధితులు కన్సల్టెన్సీ వద్ద ఆందోళనకు దిగారు. అనంతరం బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. 16 మంది బాధితులు ఫోన్‌పే, నగదు రూపంలో డబ్బులు కట్టిన రసీదులు, సంబంధిత పత్రా లు పోలీసులకు అందజేశారు. బాధితులు అందజేసిన వివరాల ప్రకారం దాదాపు రూ.60 నుంచి 70 లక్షల వరకు టోకరా వేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా కిరణ్‌కుమార్ నగరంలోని ఎస్ఆర్‌నగర్‌లో ఉన్నట్లుగా తెలిసింది.

ఇద్దరు పాత నేరస్తుల అరెస్టు

సుల్తాన్‌బజార్: జల్సాలకు అలవాటు పడి దొంగతనాలను వృత్తిగా చేసుకున్న ఇద్దరు పాత నేరస్తులను సుల్తాన్‌బజార్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు మంగళవారం సుల్తాన్‌బజార్ ఏసీపీ శంకర్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసాచారి, డీఎస్‌ఐ నరేష్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. యాకుత్‌పురా ప్రాంతానికి చెందిన ఇబ్రహీం షేక్ రసూల్‌ఖాన్, అబ్దుల్ అర్బాజ్‌లు చిన్ననాటి స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బులు సంపాదించాలనే క్రమంలో మొబైల్‌ఫోన్లు, ఇతర దొంగతనాలు చేస్తూ జల్సాలు చేసేవారు. కాగా ఈ నెల 15వ తేదీన చాదర్‌ఘాట్‌లోని రోస్ బేకరీ వద్ద ఓ క్యాబ్‌డ్రైవర్ వద్ద ఉన్న మొబైల్ ఫోన్‌ను, పర్సును స్నాచింగ్ చేసి అక్కడి నుండి పరారయ్యాడు. అదే రోజు కోఠి బ్యాంక్‌స్ట్రీట్‌లోని లక్ష్మీవిలాస్ బ్యాంక్ ఫుట్‌పాత్‌పై ఓలా క్యాబ్ డ్రైవర్ ఫోన్ మాట్లాడుతుండగా అతని చేతిలో నుంచి ఫోన్ లాక్కుని పరారయ్యాడు. ఈ మేరకు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సీసీ ఫుటేజీలు, వివిధ కోణాల్లో పరిశీలించిన అనంతరం విశ్వసనీయ సమాచారం మేరకు మొబైల్ స్నాచింగ్‌లకు పాల్పడుతున్న ఇబ్రహీం షేక్ రసూల్‌ఖాన్, అబ్దుల్ అర్బాజ్‌లను మంగళవారం గుజరాతి గల్లీలో మొబైల్ ఫోన్లను విక్రయిస్తుండగా పట్టుకున్నారు. విచారణలో మొబైల్ చోరీలకు పాల్పడుతున్నట్లు ఒప్పుకున్నారు. వారి వద్ద నుండి రెండు సెల్‌ఫోన్లు, ఒక వ్యాలెట్, ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై అబిడ్స్, ఫలక్‌నూమా, రైన్‌బజార్ పోలీస్‌స్టేషన్లలో ఇప్పటికే పలు కేసులు నమోదై ఉన్నాయని తెలిపారు.


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ శంకర్

యువతిపై అనుమానంతో ప్రేమికుడి దాడి


చాంద్రాయణగుట్ట: ప్రియురాలిపై ప్రియుడు దాడి చేసి గాయపరిచిన సంఘటన ఛత్రినాక పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బ్యూటీషియన్‌గా పనిచేస్తున్న ఓ యువతి (24) ఎస్సార్టీ కాలనీలో తన తల్లితో కలిసి నివాసం ఉంటోంది. యువతికి 2019లో వివాహం కాగా భర్తతో విభేదాలొచ్చి విడిగా ఉంటున్నారు. కాగా యువతికి హరిబౌలి ప్రాంతానికి చెందిన మణికంఠతో స్నేహం కుదిరింది. ఈ క్రమంలో వివాహం చేసుకోవాలని కోరగా అతన్ని దూరం పెట్టింది. దీంతో వేరే వ్యక్తితో సంబంధం ఉందని అనుమానించిన మణికంఠ మంగళవారం యువతి ఒంటరిగా ఉన్న సమయంలో ఇంట్లోకి జొరబడి ఆమెపై దాడి చేశాడు. గొంతును బలంగా నులమడంతో కండ్ల నుంచి తీవ్ర రక్తస్రావం జరిగింది. యువతి అరుపులు విని స్థానికులు ఛత్రినాక పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు రక్తపు మడుగులో ఉన్న యువతిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మణికంఠను అదుపులోకి తీసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మూడున్నర కిలోల గంజాయి పట్టివేత



మేడ్చల్: మేడ్చల్ ఎక్సైజ్ సర్కిల్‌లోని దేవరయాంజాల్ గ్రామంలో ఎక్సైజ్ పోలీసులు దాడులు చేసి మూడున్నర కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం దేవర యాంజాల్ గంజాయి అక్రమ సరఫరా, విక్రయం జరుగుతుందనే సమాచారంతో అందడటంతో దాడి చేశారు. గ్రామంలో ఉన్న శంకర్‌భాగ్, సిబాకిలా అనే ఇద్దరు యువకులు గంజాయి సరఫరా చేస్తూ విక్రయాలు చేస్తున్నారు. వీరిద్దరిని అదుపులోకి తీసుకుని..మూడున్నర కిలోల ఎండు గంజాయి, రెండు సెల్ ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్, దేవరయాంజాల్ పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు, మేడ్చల్‌లో ఇంజినీరింగ్ కళాశాలల విద్యార్థులకు నిందితులు గంజాయి విక్రయిస్తున్నారని పోలీసులు తెలిపారు.

ఆలయంలో విగ్రహాలు ధ్వంసం.. పోలీసులకు ఫిర్యాదు


ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

మేడ్చల్ రూరల్: మండలంలోని డబిల్‌పూర్ గ్రామంలో హనుమాన్‌గుట్టపై ఉన్న పురాతన ఆలయంలోని విగ్రహాలను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. మంగళవారం ఉదయం గ్రామస్తులు ఆలయంలో పూజలు నిర్వహించేందుకు వెళ్లగా..విగ్రహాలు ధ్వంసమై ఉండడాన్ని గమనించారు. విషయం తెలిసి పెద్దఎత్తున గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ఆలయం వద్దకు చేరుకుని ఆందోళన నిర్వహించారు. విగ్రహాల ధ్వంసానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కాగా ఇటీవల కొందరు యువకులు ఆలయం వద్దకు వచ్చి రీల్స్ చేశారని సమీప రైతులు తెలుపుతున్నారు. విషయం తెలుసుకున్న మేడ్చల్ పోలీసులు హుటాహుటిన ఆలయం వద్దకు చేరుకున్నారు. మేడ్చల్ జోన్ అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి, మేడ్చల్ ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డి, సీఐ సత్యనారాయణ సంఘటన తీరును పరిశీలించారు. క్లూస్ టీంతో ఆధారాలు సేకరించారు. గుర్తుతెలియని వ్యక్తులు విగ్రహాలను ధ్వంసం చేశారని, పోలీస్ సిబ్బందిని బృందాలుగా ఏర్పరచి దర్యాప్తు చేస్తున్నామని అడిషనల్ డీసీపీ నర్సింహారెడ్డి తెలిపారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్ టీం, సీసీఎస్, ఎస్‌ఓటీ పోలీసులతో దర్యాప్తు చేపట్టామని దుండగులను త్వరలో పట్టుకుంటామన్నారు.

విద్యార్థులే డ్రగ్ పెడ్లర్లు

- రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురి అరెస్టు
- రాచకొండ కమిషనర్ తరుణ్ జోషి వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: రెండు వేర్వేరు కేసుల్లో ఆరుగురు అంతరాష్ట్ర డ్రగ్ పెడ్లర్లను రాచకొండ పోలీసులు పట్టుకున్నారు. ఆయా వివరాలను కమిషనర్ తరుణ్ జోషి మంగళవారం మీడియాకు వెల్లడించారు.

- హయత్‌నగర్‌కు చెందిన అత్తాపురం భరత్ రెడ్డి, వనస్థలిపురానికి చెందిన చిక్యాల విఖ్యాత్‌లు ఇద్దరు స్నేహితులు. మాదక ద్రవ్యాలకు బానిసలుగా మారారు. డ్రగ్స్‌కు డిమాండ్ బాగా ఉందని గుర్తించిన ఈ ఇరువురు విద్యార్థులు డ్రగ్స్‌ను విక్రయించి, సొమ్ము చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో బెంగళూరుకు వెళ్లి అక్కడి పెడ్లర్ల నుంచి రూ.1,200లకు గ్రాము ఎండీఎంఏను కొనుగోలు చేసి, నగరానికి తీసుకొచ్చి రూ.5-6 వేలకు విక్రయించేవారు. ఎప్పటిలాగే ఈ నెల 16న బెంగళూరు నుంచి 26 గ్రాముల ఎండీఎంఏను తీసుకొచ్చి..విఖ్యాంత్ ఇంట్లో దాచిపెట్టారు. ఈ నెల 17న హయత్‌నగర్‌కు చెందిన డ్రగ్ వినియోగదారుడు తన్నీరు హేమంత్ కుమార్‌కు విక్రయించేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) ఎల్బీనగర్, వనస్థలిపురం పోలీసులు దాడి చేసి ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.4 లక్షల విలువ చేసే 26 గ్రాముల ఎండీఎంఏ, నాలుగు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఇప్పటికే భరత్ రెడ్డిపై హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ఠాణాలలో పలు కేసులున్నాయి.
- బోరబండకు చెందిన పెరుసాముల దినేష్, అమర్లలూరి హానెస్ట్, తెల్లపల్లి భరణి ముగ్గురు స్నేహితులు. వీరు మాదక ద్రవ్యాలు, విలాసవంతమైన జీవితానికి అలవాటు పడి..సులువుగా డబ్బు సంపాదించాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో తక్కువ ధరకు హాష్ ఆయిల్‌ను తీసుకొచ్చి, అవసరం ఉన్న కస్టమర్లకు విక్రయించి సొమ్ము చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో విశాఖపట్నంలోని నర్సీపట్నంకు వెళ్లి రూ.50 వేలకు లీటరు చొప్పున రెండు లీటర్ల హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేశారు. హైదరాబాద్‌కు కారులో వస్తుండగా..ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న స్పెషల్ ఆపరేషన్ టీం (ఎస్ఓటీ) ఎల్బీనగర్, భువనగిరి రూరల్ పోలీసులు అనాజీపురం క్రాస్ రోడ్ వద్ద ముగ్గురు నిందితులను పట్టుకున్నారు. వీరి నుంచి రూ.20 లక్షలు విలువ చేసే రెండు లీటర్ల హాష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లు, కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు దినేష్‌పై బాలానగర్ ఎక్సైజ్ పోలీసు స్టేషన్‌లో గతంలోనూ కేసులున్నాయి. రెండు కేసుల్లో నిందితుల నుంచి మాదక ద్రవ్యాలను కొనుగోలు చేసిన వినియోగదారులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో ప్రజాధనం వృథా

ఇంజినీరింగ్ అధికారుల పనితీరుపై కార్పొరేటర్, డీసీ ఆగ్రహం



ఫిలింనగర్ బస్తీలో పర్యటిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, డీసీ ప్రశాంతి

ఫిలింనగర్: అభివృద్ధి పనులను కొందరు అధికారులు నిర్లక్ష్యంగా నిర్వహిస్తున్నారని దీని వల్ల ప్రజాధనం వృథా అవుతుందని కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ ప్రశాంతి అన్నారు. రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జూబ్లీహిల్స్ డివిజన్ పరిధిలోని ఫిలింనగర్ బస్తీలు వరదతో అతలాకుతలమయ్యాయి. బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీలో వరదకు రోడ్డంతా కొట్టుకుపోవడంతో స్థానికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, జీహెచ్ఎంసీ సర్కిల్–18 ఉప కమిషనర్ ప్రశాంతి, ఏఈ వెంకటేష్, జయచంద్రా, జలమండలి మేనేజర్ పవన్ తదితరులు మంగళవారం బస్తీల్లో పర్యటించారు. బాల్‌రెడ్డినగర్, బసవతారకనగర్ బస్తీల్లో పర్యటించి అక్కడి రోడ్ల దుస్థితిని చూసి తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. ఇంజినీర్ల పనితీరుపై కూడా వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బస్తీవాసులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ త్వరలోనే రోడ్డు పనులను ప్రారంభిస్తామని హామీ నిచ్చారు. అంతేకాకుండా నాలాలో పేరుకుపోయిన పూడికను బుధవారం నుంచే తొలగించే పనులు మొదలుపెడతామన్నారు.

నీట్ పరీక్షలో అక్రమాలపై సీబీఐతో విచారణ చేపట్టాలి

బంజారాహిల్స్: నీట్–2024 ప్రవేశ పరీక్షలో జరిగిన అక్రమాలపై సీబీఐతో విచారణ జరిపించాలని ఖైరతాబబాద్ నియోజకవర్గం ఎన్ఎస్‌యూఐ వర్కింగ్ ప్రెసిడెంట్ జీవన్‌రాజ్ రాథోడ్ డిమాండ్ చేశారు. నీట్ ప్రవేశ పరీక్షలు మళ్లీ నిర్వహించి విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. నీట్ పరీక్షలో విద్యార్థులకు చిత్ర విచిత్రమైన మార్కులు వచ్చాయని, కొంతమంది విద్యార్థులకు 718, 719 మార్కులు ఎలా వచ్చాయని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అడుగుతుంటే యూజీసీ మాత్రం గ్రేస్ మార్కులు కలిపామంటూ దాటవేత ధోరణి కనబరుస్తుందని ఆరోపించారు. గ్రేస్ మార్కులు కలపాలని నిబంధనల్లో లేకున్నా ఎలా కలిపారో చెప్పాలని ప్రశ్నించారు. పరీక్షా ఫలితాలలో ఒకే పరీక్షా కేంద్రంలో రాసిన విద్యార్థులకు వరుసగా ఒకే విధంగా మార్కులు రావడం ప్రవేశ పరీక్ష లోపాలను ఎత్తిచూపుతుందన్నారు. ఒకపక్క ప్రవేశ పరీక్ష పేపర్ లీక్ అయ్యిందని వస్తున్న వార్తలపై కేంద్ర ప్రభుత్వం విచారణ చేపట్టకుండా విద్యార్థులకు అన్యాయం చేస్తుందని, అలాగే కొన్ని చోట్ల జరిగిన మాల్ ప్రాక్టీస్ వల్ల చదువుకునే విద్యార్థులకు అన్యాయం జరుగుతుందని వాపోయారు. 2024 నీట్ పరీక్షల్లో జరిగిన స్కామ్ బయటపడాలంటే సీబీఐ విచారణ చేపట్టాలని, నీట్ పరీక్షను మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష నిర్వహణను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించాలని, బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

ఝాన్సీలక్ష్మీబాయికి నివాళి

లిబర్టీ: పోరాట పటిమలో ఝాన్సీలక్ష్మీబాయికి ఎవరూ పోటీ రారని, బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడిన యోధురాలు ఝాన్సీలక్ష్మీబాయి అని లోక్‌దళ్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, జాతీయ కార్యదర్శి పి.వి.రాజేశ్వరరావు అన్నారు. దేశం కోసం ఆత్మ బలిదానం చేసిన త్యాగం చేసిన యోధులను స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన కోరారు. వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి సభను పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశ ప్రజల్ని దోచుకుంటూ అరాచక పాలన సాగిస్తున్న ఆంగ్లేయులపై తిరుగుబాటు చేసిన శివంగిలా యుద్ధభూమిలో విరుచుకుపడిన వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫ్లడ్ లైట్ల ఏర్పాట్ల పరిశీలన



ఫ్లడ్ లైట్ల ఏర్పాటును పరిశీలిస్తున్న విజయారెడ్డి

ఖైరతాబాద్: ఖైరతాబాద్ డివిజన్ పరిధిలోని ఓల్డ్‌సీఐబి క్వార్టర్స్ జీహెచ్ఎంసి గ్రౌండ్‌లో ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు. ఇటీవల ఫ్లడ్ లైట్ల గురించి సంబంధిత అధికారులకు కార్పొరేటర్ విజయారెడ్డి వినతి చేశారు. ఈ మేరకు రూ.4.38 లక్షల వ్యయంతో 16 ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేశారు. మంగళవారం ఫ్లడ్ లైట్ల ఏర్పాటు పనులను విజయారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బీర్ల ఐలయ్యకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్ కురుమ

పంజగుట్ట: రాష్ట్రంలో 12 శాతం జనాభా ఉన్న కురుమలకు మంత్రివర్గంలో స్థానం కల్పించాలని కురుమ సామాజిక వర్గానికి చెందిన ఏకైక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు ప్రస్తుతం జరగబోయే మంత్రివర్గ విస్తరణలో స్థానం కల్పించాలని బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షుడు కనకాల శ్యామ్ కురుమ డిమాండ్ చేశారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కురుమ యువ చైతన్య సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మె మహేందర్‌తో కలిసి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధనలో కురుమల పాత్ర మరవలేదని దొడ్డి కొమురయ్య మొదలు కొనపురి సాంబశివుడు, రాములు ఎంతోమంది అమరులు అయ్యారని గుర్తుచేశారు. బీర్ల ఐలయ్య ఎన్నో సేవా కార్యక్రమాలు చేశారని ఆయనకు మంత్రివర్గంలో స్థానం కల్పిస్తే ప్రజలకు మేలు జరగడంతో పాటు కురుమ సామాజిక వర్గానికి కూడా మేలు చేసినవారౌతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం రాష్ట్ర నాయకులు దొడ్డి శ్రీనాథ్, బండారు శ్రీశైలం, బీర్ల శ్రీనివాస్, కుండే కృష్ణ, మహేష్, రమేష్, రవి, రాజు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెండు ల్యాప్‌టాప్‌లు మాయం

వెంగళరావునగర్: ఒకే హాస్టల్‌లో ఉంటున్న ఇరువురి ల్యాప్‌టాప్‌లు మాయమైన సంఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... బి.హరిలాల్‌నాయక్, పి.వంశీకృష్ణలు వెంగళరావునగర్‌లోని హ్యాపీ బాయ్స్ హాస్టల్‌లో ఉంటున్నారు. ఈ నెల 16 రాత్రి తమ ల్యాప్‌టాప్‌లు గదిలో పెట్టి నిద్రపోయారు. మరుసటిరోజు చూసేసరికి ఇరువురి ల్యాప్‌టాప్‌లు మాయం అయ్యాయి. చుట్టుపక్కల వారిని విచారించినప్పటికీ ప్రయోజనం లేకపోవడంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

బోనాల జాతర ఏర్పాట్ల పరిశీలన

హిమాయత్‌నగర్: బోనాల జాతర సమీపిస్తున్న తరుణంలో పలు బస్తీలు, కాలనీలలో ఆలయాలు సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే హిమాయత్‌నగర్‌లోని చంద్రనగర్ బస్తీ, ఓల్డ్ కమేళాలో మంగళవారం కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్ పర్యటించి బోనాల పండుగ ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు జి.రామన్ గౌడ్, మహేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు.. చెత్తకుప్పల దర్శనం

- విజ్ఞప్తి చేసినా పట్టించుకోని అధికారులు
- విషజ్వరాలు ప్రబలుతాయని స్థానికుల ఆందోళన

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ బస్తీల్లో పారిశుద్ధ్య సమస్య నానాటికి తీసికట్టులా మారుతోంది. స్థానికంగా ఓపెన్ గార్బేజీల చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని ఎన్నిమార్లు చెప్పినా సంబంధిత సిబ్బంది అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేరుకపోయిన చెత్త కుప్పలు, మురుగునీటి ప్రవాహం వలన విషజ్వరాలు ప్రబలుతాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా ఫిలింనగర్‌లోని దీన్‌దయాల్‌నగర్ బస్తీ మీ దుగా వెళ్లాలంటే స్థానికులకు ఇబ్బందికరంగా మారుతోంది. ఒక వైపు రోడ్డుంతా పొంగుతున్న మురుగు, మరోవైపు భారీ ఎత్తున పేరుకుపోయిన చెత్తకుప్ప లు దర్శనమిస్తుంటాయి. సంబంధిత అధికారులు స్పందించి ఇక్కడ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఫిలింనగర్ దీన్‌దయాల్‌నగర్ చౌరస్తాలో ఒక వైపు చెత్తకుప్పలు. మరో వైపు మురుగు నీరు నిలిచిన దృశ్యం

సాఫీగా ముందుకు సాగేలా..!

ఫ్లై ఓవర్లు.. అండర్‌పాస్‌లు

- కేబీఆర్ పార్కు రోడ్డులో సర్వే చేస్తున్న అధికారులు
- జంక్షన్ల మీదుగా నిర్మించేలా ప్రతిపాదనలు చేస్తున్న అధికారులు
- అధ్యయనం పూర్తయిన వెంటనే ప్రభుత్వానికి నివేదిక



జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు

బంజారాహిల్స్: నిత్యం వేలాది మంది ఐటీ కారిడార్‌కు మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం చేరుకోవాలంటే కేబీఆర్ పార్కు, జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దాటాల్సిందే. పెరిగిన ట్రాఫిక్‌కు అనుగుణంగా గతంలో ఇక్కడ ట్రాఫిక్ కష్టాలు తీర్చేందుకు గత ప్రభుత్వం మల్టీలెవల్ ఫ్లైఓవర్లు నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందించడంతో పాటు నలుగురు మంత్రులు సైతం శంకుస్థాపన కూడా చేశారు. కానీ కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో పెద్ద ఎత్తున చెట్లు తొలగించాల్సిన అవసరం రావడంతో పర్యావేరణ వేత్తలు, ప్రకృతి ప్రేమికులు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో ఆ ప్రాజెక్ట్ కాస్త అటకెక్కింది. ఆ తర్వాత సొరంగ మార్గం నిరిమ్స్తామని కూడా ఎన్నో వార్తలు వచ్చాయి. ఆ ప్రతిపాదనలు ఏవీ కూడా కార్యరూపం దాల్చలేదు. తాజాగా మరోసారి ప్రభుత్వం ఇక్కడ ట్రాఫిక్ కష్టాలకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు మరో ప్రతిపాదన ముందుకు తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. కొన్ని కన్సల్టెన్సీలతో పాటు జీహెచ్ఎంసీ ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు ఈ ప్రాజెక్ట్‌పై పని చేస్తున్నారు. అయితే ఈసారి మల్టీలెవల్ ఫ్లైఓవర్లు కాకుండా ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

సాఫీగా ముందుకు సాగేలా...

ట్రాఫిక్ సిగ్నళ్ళ వద్ద ఎక్కువ సేపు నిలుస్తున్న తరుణంలో అసలు వాహనాలు ఈ సిగ్నళ్ళ వద్ద ఆగకుండా ఉండేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ప్రతీ జంక్షన్ మీదుగా వాహనాలు వెళ్ళే విధంగా ఫ్లై ఓవర్లు నిర్మించనున్నారు. మల్టీలెవల్ ఫ్లై ఓవర్లకు పెద్ద మొత్తంలో స్థల సేకరణ అవసరం అవుతుండగా ఈ ఫ్లైఓవర్లకు మాత్రం తక్కువ స్థలంలోనే మంచి ఫలితాలను పొందే అవకాశం ఉంటుందని అధికారులు అంటున్నారు. దీనికి తోడు గతంలో కేబీఆర్ పార్కు వాక్‌వే సగానికి పైగా రోడ్డు వెడల్పులో పోయే అవకాశం ఉండగా ఈ కొత్త ప్రతిపాదనలో అటువంటి ప్రమాదమేమి ఉండదని తెలుస్తోంది. దీని లోభాగంగా ఇప్పటికే స్థానికంగా ఉన్న పార్కుల విభాగం అధికారులతో ఎక్కడెక్కడ చెట్లు రోడ్డు వెడల్పులో పోతాయో గుర్తించి మార్కింగ్ చేయాల్సిందిగా సూచించారు. ఈ ప్రాజెక్ట్‌లో కేబీఆర్ పార్కుకు ఎటువంటి ముప్పు లేకుండా ఉండేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. కేబీఆర్ పార్కు ఎదురుగా ఉన్న రోడ్డులో ఉండే చెట్లతో పాటు సెంట్రల్ మీడియన్‌లోని చెట్లు పూర్తిగా పోయే అవకాశం ఉంది. ఇప్పటికే అధికారులు ఇందుకు సంబంధించి మార్కింగ్‌లను వేశారు. ప్రతిపాదనలు పూర్తయిన తర్వాత ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతోనే పనులు మొదలయ్యే అవకాశం ఉంది. ఒక వైపు ఫ్లై ఓవర్ మరో వైపు అండర్‌పాస్ నిర్మించేలా అధికారులు ప్రతిపాదనలు రూపొందిస్తున్నారు. ఇందుకు సంబంధించిన డిజైన్లు కూడా ఇప్పటికే పూర్తయినట్లు సమాచారం.



కేబీఆర్ పార్కు వద్ద సర్వే చేస్తున్న ప్రాజెక్ట్ విభాగం అధికారులు (ఫైల్)

ఫ్లై ఓవర్లు ఇలా...

- బంజారాహిల్స్ రోడ్ నెం. 14 జనతా బార్ నుంచి జపనీస్ గార్డెన్ వరకు
- జపనీస్ గార్డెన్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెం. 1లోని హెరిటేజ్ బిల్డింగ్ వరకు
- సీవీఆర్ జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ రోడ్ నెం. 45 వరకు
- కేబీఆర్ పార్కు మెయిన్ గేటు నుంచి రెయిన్ ఆస్పత్రి వరకు
- వీటితో పాటు గుర్తించిన కొన్ని చోట్ల అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు.

నియామకం



నియామక పత్రాలను అందిస్తున్న పార్టీ అధ్యక్షులు బి.మహేష్‌బాబు

లిబర్టీ: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గడ్డం శంకర్‌కు గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడిగా జె.ఎల్.సుధీష్‌కుమార్‌ను పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బి.మహేష్‌బాబు నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో మంగళవారం ఇరువురికి నియామక పత్రం అందజేశారు. అంబేడ్కర్ ఆలోచన విధానంతో గౌతమబుద్ధుని తాత్విక వెలుగులో పని చేయాల్సిన అవసరముందన్నారు. దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, పార్టీ బలోపేతం కోసం పని చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ జాతీయ కార్యదర్శి చొప్పరి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి



నిలిచిన నీటిని చూపుతున్న నేతలు నగేష్, నాగరాజు

శ్రీనగర్‌కాలనీ: వర్షాలకు డ్రైనేజీలు పొంగి రోడ్లపై రోజుల తరబడి నిలుస్తున్నాయని జీహెచ్ఎంసీ అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా సమస్యలను పరిష్కరించకపోవడం రివాజుగా మారిందని ఎల్లారెడ్డిగూడ నేతలు నగేష్, నాగరాజు ఆరోపించారు. మంగళవారం ఎల్లారెడ్డిగూడ, శ్రీనగర్‌కాలనీ, నాగార్జుననగర్‌కాలనీలతో పాటు పలు బస్తీల్లో నిలిచిన నీటిని గుర్తించారు. డ్రైనేజీ, రోడ్ల వ్యవస్థ సరిగా లేదని, అడ్డగోలుగా భవన నిర్మాణాలు జరగడంతో డ్రైనేజీ నీరు రోడ్లపై నిలిచిపోతుందన్నారు. సమస్యలను అధికారులకు చెప్తే అప్పటికప్పుడు చేసి చేతులు దులుపుకుంటున్నారని అన్నారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని శాశ్వత పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే అమలు చేయాలని కోరారు.

20న ఏఐసీఎఫ్ వార్షికోత్సవం

కాచిగూడ: ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ (ఏఐసీఎఫ్) 28వ వార్షికోత్సవ వేడుకలను ఈ నెల 20న గోల్కొండ ఎక్స్‌రోడ్ లోని మెనోనైట్ బ్రదరన్ బేతేలు చర్చిలో నిర్వహిస్తున్నట్లు సంస్థ తెలంగాణ రాష్ట్ర కో ఆర్డినేటర్ ఏకే గిడియోను బాబు తెలిపారు. వేడుకలకు రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, మాజీ ఎంపీ మందా జగన్నాథం, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, యస్సీ కార్పొరేషన్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, తదితరులు ప్రత్యేక ఆహ్వానితులుగా హాజరుకానున్నట్లు తెలిపారు.

సమస్యలపై శంఖారావంలో వినతుల వెల్లువ



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాగంటి...

వెంగళరావునగర్: ప్రజలు ఇచ్చిన సమస్యలను సాధ్యమైనంత త్వరలోనే పరిష్కరించడానికి కృషి చేస్తామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ తెలియజేశారు. యూసుఫ్‌గూడ డివిజన్ పరిధిలోని కమలాపురి కాలనీ గ్రౌండ్‌లో కార్పొరేటర్ రాజ్‌కుమార్ పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం సమస్యలపై శంఖారావం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ గత పదేళ్ళ కాలంలో బీఆర్ఎస్ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన ఆరు నెలల్లోనే ప్రజల నుంచి ఇంకా సమస్యలు వెల్లువెత్తుతున్నాయని వాటిని కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ముఖ్యంగా శ్రీకృష్ణానగర్ వరదనీటి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరారని, అయితే శ్రీనగర్‌కాలనీ ప్రధాన రహదారిలో వరదనీటికి అడ్డంకులు ఉన్నాయని వాటిని తొలగించి శాశ్వత పరిష్కారం చేపట్టడానికి అధికారులకు సూచించామని చెప్పారు. కమలాపురికాలనీ ఫేజ్–2లో షాపుల వద్ద అక్రమ పార్కింగ్‌లు ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నాయని చెప్పారు. వాటిని కూడా పరిగణలోనికి తీసుకుని పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసి సర్కిల్–19 ఉప కమిషనర్ సేవా ఇస్లావత్, వాటర్‌వర్క్స్, జీహెచ్ఎంసి, టౌన్‌ప్లానింగ్, సివిల్ సప్లైస్, విద్యుత్, రెవెన్యూ శాఖల అధికారులు, సిబ్బంది, కాలనీల నేతలు పాల్గొన్నారు.

భయానకం..బాల్‌రెడ్డినగర్ ప్రయాణం

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని బండారు బాల్‌రెడ్డినగర్ బస్తీకి వెళ్లాలంటే జనాలు జంకుతున్నారు. ఇక్కడ మురుగు నీటి కాల్వను నిర్మించి నెలలు గడుస్తున్నా జీహెచ్ఎంసీ అధికారులు సీసీ రోడ్డు వేయకపోవడంతో ప్రస్తుత ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎగువ ఉన్న బస్తీల నుంచి వచ్చే వరదతోపాటు మట్టి, రాళ్లు ఇళ్ళలోకి వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో కనీసం నడవడానికి కూడా వీల్లేని పరిస్థితులు నెలకొన్నా యని స్థానికంగా ఈ సమస్యను ఎన్నిమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకున్న దాఖలాలు లేవని స్థానికులు ఆరోపిస్తున్నారు.



వర్షం తాకిడికి కొట్టుకుపోయిన రోడ్డు

పరీక్షల అవకతవకలతో విద్యార్థుల జీవితాలు ఆగం

లిబర్టీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే పరీక్షలు కొందరి నిర్లక్ష్యం కారణంగా ఎంతోకష్టపడిన చదివిన విద్యార్థుల జీవితాలు ఆగం అవుతున్నాయని విద్యార్థి సంఘ నాయకులు అన్నారు. నేషనల్ ఎలిజిబుల్ టెస్ట్(నీట్) పరీక్షల అవకతవకలపై సమగ్ర విచారణ జరిపించాలని నీట్ పరీక్షను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి యువజన సంఘాలు ఆందోళనకు దిగాయి. నీట్ పరీక్షను రద్దు చేయాలని ప్రధాన డిమాండ్‌తో ఎస్ఎఫ్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పిడిఎస్‌యూ, డివైఎఫ్ఐ, పివైఎల్ విద్యార్థి యువజన సంఘాలతో కూడిన ఐక్య కార్యాచరణ సమితి ఆధ్వర్యంలో హిమాయత్‌నగర్ వై జంక్షన్ నుంచి ప్రారంభమైన విద్యార్థి యువజన మార్చ్ హిమాయత్‌నగర్ లిబర్టీ చౌరస్తా మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. ఈ సందర్భంగా అనంతరం ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు మణికంఠరెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టా లక్ష్మణ్, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లూరు ధర్మేంద్రలు మాట్లాడుతూ నీట్ పరీక్షను పూర్తిస్థాయిలో రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్ష పేపర్ లీకేజీకి ప్రధాన మంత్రి బాధ్యత వహించాలని దేశ ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నీట్ పరీక్షల నిర్వహణ బాధ్యతలను రాష్ట్ర ప్రభుత్వానికి అప్పగించాలన్నారు. నీట్ పరీక్ష బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలన్నారు. ఒకే క్లాసులో పరీక్షలు రాసిన పలువురు విద్యార్థులకు ఒకే విధంగా 720 మార్కులు రావడం ఎంత ప్రవేశ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ అయిందని అందు వల్లనే అన్ని మార్కులు విద్యార్థులు వచ్చాయని వారు ఆరోపించారు. గతంలో మెడికల్ కోర్సుల ప్రవేశ పరీక్షను రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించమని మోదీ అధికారంలోకి వచ్చాక ఆ విధానానికి స్వస్తి చెప్పి దేశవ్యాప్తంగా ప్రవేశ పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఫలితంగా అవకతవకలు పరీక్షా ప్రశ్నాపత్రాల లీకేజీలు కావడం నిత్యకృత్యమయ్యాయని వారు ఆరోపించారు. నీట్ పరీక్షను రద్దు చేసి మళ్లీ నిర్వహించకపోతే పెద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు మూర్తి, నాగరాజు, నాయకులు మహేష్, ఆజాద్, రామకృష్ణ, పరశురాం, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ పాల్గొన్నారు.

వైభవంగా కల్యాణం



శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి కల్యాణోత్సవంలో భక్తులు

ఫిలింనగర్: ఫిలింనగర్ దైవ సన్నిధానం వింశతి (20వ) వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ఈ కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని నేత్రపర్వంగా వీక్షించారు. అంతకముందు ఉదయం శ్రీస్మార్తాగము, శ్రీవైఖానస ఆగమముల ప్రకారం విశేష అలంకారం, నిత్య హోమం, బలిహరణ, తీర్థ ప్రసాద వితరణ జరిగాయి. సాయంత్రం స్వామి కల్యాణ అనంతరం శేష వాహన సేవ కనులపండువగా జరిగింది. అలాగే రాత్రి అమృత గోపాల్‌చే కర్నాటక సంగీత కచేరి వీనులవిందు చేసింది. ఈ వేడుకల్లో భక్తులు తన్మయత్వంలో మునిగితేలారు.

నిమ్స్ కాంట్రాక్ట్ కార్మికులకు బకాయిలు చెల్లించండి

డైరెక్టర్ బీరప్పకు వినతి పత్రాన్ని సమర్పించిన నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్



లక్డీకాపూల్: నిమ్స్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని నిమ్స్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ యూనియన్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం కోరుతూ మంగళవారం యూనియన్ ప్రతినిధి బృందం డైరెక్టర్ డాక్టర్ బీరప్పను కలిసి వినతి పత్రాన్ని సమర్పించింది. డైరెక్టర్‌ను కలిసిన వారిలో యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈ నర్సింహులు, అధ్యక్షుడు ఎం. వెంకటేష్, మాజీ ప్రధాన కార్యదర్శి బాలయ్య, నాయకులు లక్ష్మీ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు బాలయ్య మాట్లాడుతూ సెమి స్కిల్డ్ పోస్టులు భర్తీలో అన్ స్కిల్డ్‌గా పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పరిగణించాలన్నారు. డస్క్ జాబ్‌లో అర్హత కలిగిన అన్ స్కిల్డ్ కార్మికులకు అవకాశం ఇవ్వాలని యాజమాన్యాన్ని కోరామన్నారు. అంతే కాకుండా కాంట్రాక్ట్ కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించాలని కోరామన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పెరిగిన వీడిఏ పాయింట్లను కూడా అమలు చేయాలని డైరెక్టర్‌కు విజ్ఞప్తి చేశామన్నారు. దాంతో పాటు ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల రోజున విధులు నిర్వహించిన కార్మికులందరికీ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా కార్మిక శాఖ కమిషనర్ సమక్షంలో నిర్వహించిన సమావేశంలో జరిగిన ఒప్పందం ప్రకారం పదవి విరమణ చెందిన కార్మికులకు వైద్య సౌకర్యాన్ని వెంటనే అమలు చేయాలని కోరామన్నారు. కార్మికుల సమస్యల పట్ల డైరెక్టర్ సానుకూలంగా స్పందించినట్టు బాలయ్య పేర్కొన్నారు.

అభినందనలు...



స్వరూపరాణిని అభినందిస్తున్న కిలారి మనోహర్

వెంగళరావునగర్: ఎర్రగడ్డ ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి లే సెక్రటరీగా విధులు నిర్వహించిన బి.స్వరూపరాణికి తెలంగాణా ప్రభుత్వ ఆయుష్ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పదోన్నతి లభించింది. ఈ మేరకు మంగళవారం భారతీయ జనతా పార్టీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షులు కిలారి మనోహర్ తదితర నేతలు ఆమెను కలిశారు. పదోన్నతి పొందిన ఆమెకు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు. ఇప్పటి వరకు ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రిలో లే సెక్రటరీగా ఆమె అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్‌లో భారతీయ పురాతన వైద్యమైన ఆయుర్వేద వైద్యానికి మరింత సేవలు అందించాలని మనోహర్ కోరారు. ఆమెను కలిసి అభినందించిన వారిలో కిలారి మనోహర్‌తో పాటుగా పలువురు బీజేపీ నేతలు ఉన్నారు.

'నీట్' అవకతవకలపై నేడు విద్యార్థుల ర్యాలీ

కాచిగూడ: నీట్ పరీక్ష అవకతవకలపై ఈనెల 19న బర్కత్‌పుర చమన్ నుంచి విద్యార్థులతో పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నీట్ పరీక్ష రాసిన 24 లక్షల మంది విద్యార్థులకు న్యాయం జరిగేలా చూడాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జరిగే ఈ ర్యాలీలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పాల్గొంటారని తెలిపారు.

వాక్ వే.. వావ్ గార్డెన్స్!



థీమ్ గార్డెన్



ఎక్సోరా గార్డెన్ బటర్ ఫ్లై గార్డెన్ హెర్బల్ గార్డెన్



3,453 మొక్కలు.. 11 థీమ్ గార్డెన్స్

కేబీఆర్ పార్క్‌లో పరచుకున్న పచ్చదనం..

పరవశించిపోతున్న వాకర్లు

బంజారాహిల్స్: హలో.. మీరు ఎప్పుడైనా కేబీఆర్ పార్క్‌లోకి వెళ్లారా.. వెళ్లకపోతే.. ఓసారి వెళ్లి చూడండి.. 'వాక్ వే'ను చూడగానే 'వావ్.. వే'అని తప్పకుండా అంటారు మీరు. దారికి ఇరువైపులా.. భూమికి పచ్చని రంగేసినట్టుగా ఉంటుంది. పచ్చని మొక్కలు, తీరొక్క పువ్వు మనసుకు, కంటికి ఆహ్లాదకర అనుభూతిని ఇస్తాయి. ఒకటీ, రెండూ కాదు.. 11 రకాల థీమ్ గార్డెన్లు అక్కడ దర్శనమిస్తాయి. విభిన్న రకాల థీమ్ గార్డెన్స్‌ను చూస్తూ నడిచే వాకర్లు అలసట మరిచి పరవశించిపోతున్నారు. విద్యార్థులకు విజ్ఞానం అందించే బొటానికల్ గార్డెన్‌లాగా కూడా 'వాక్ వే'ను తీర్చిదిద్దారు. పార్కు చుట్టూ సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఉండే ఈ 'వాక్ వే'లో 3,453 రకాల పూలు, ఔషధ మొక్కలు ఉన్నాయి. వాక్ వే చుట్టూ సీతాకోక చిలుకలను ఆకర్షించేందుకు ప్రత్యేకంగా బటర్ ఫ్లై గార్డెన్ ఏర్పాటు చేశారు. రాక్ గార్డెన్, బాంబూ గార్డెన్, ఫైకస్ గార్డెన్, తీగల మొక్కలు పెంచేందుకు క్రీపర్ గార్డెన్, ఆర్నమెంటల్, హెర్బల్ గార్డెన్, బోగన్ విల్లా గార్డెన్, ఎక్సోరా గార్డెన్, ప్లమేరియా గార్డెన్, పామెటమ్ గార్డెన్‌లను అధికారులు ప్రత్యేకంగా తీర్చిదిద్దారు.

మినీ బొటానికల్ గార్డెన్‌లా...

కేబీఆర్ పార్కు వాక్ వే చుట్టూ ఉన్న చెట్లు, మొక్కల విశిష్టతలను తెలిపేలా భారీ బోర్డును ఏర్పాటు చేసి వాటి పేర్లు రాశారు. ప్రతీ మొక్క పేరుతోపాటు దాని శాస్త్రీయనామం కూడా ఏర్పాటు చేశారు. వాకర్ల భద్రత నిమిత్తం సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లోనూ వెలుగులు విరజిమ్మేలా వీధిదీపాలు, హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేశారు.

NXT WAVE స్కిల్స్ 'నెక్ట్స్'

సాక్షి, సిటీబ్యూరో: నాలుగు గోడల మధ్య పాఠ్య పుస్తకాల చదువులకు కాలం చెల్లింది. పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టు క్షేత్రస్థాయిలో ప్రయోగాత్మక నైపుణ్యం కలిగిన విద్యే అనివార్యమైంది. నిత్య జీవితంలో ఎదురయ్యే సవాళ్లను పరిష్కరించే నూతన ఆవిష్కరణలకే సంస్థలు మొగ్గు చూపుతున్నాయి. ఈ క్రమంలో ఏదో ఒక కోర్సు నేర్చుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగంలో చేరగానే సరిపోదు.. కొత్తవి నేర్చుకుంటూనే నిలదొక్కుకోగలం, రాణించగలం! ఆ దిశగా అభ్యర్థులను సంసిద్ధులను చేస్తోంది నెక్ట్స్‌వేవ్. అయితే సంస్థ లక్ష్యం.. ఆచరణ వంటి మరిన్ని వివరాలను కంపెనీ ఫౌండర్, సీఈవో రాహుల్ అట్లూరి 'సాక్షి'తో పంచుకున్నారు.

కరోనా సమయంలో విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యాలను మెరుగుపరిచేందుకు ఐఐటీ పూర్వ విద్యార్థులైన శశాంక్ రెడ్డి, అనుపమ్, రాహుల్ అట్లూరి నెక్స్ట్ వేవ్ అనే సంస్థను స్థాపించారు. కంటిన్యూయస్ కెరీర్ బిల్డింగ్ ప్రోగ్రాం(సీసీబీపీ) పేరిట కళాశాల నుంచి గ్రాడ్యుయేట్లుగా బయటికొచ్చే విద్యార్థులకు కంపెనీల్లో అవసరమయ్యే సైబర్ భద్రత, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ), మెషిన్ లెర్నింగ్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ), డేటా సైన్స్ వంటి సాంకేతికత రంగాల్లో నైపుణ్యతను పెంచే శిక్షణ ఇవ్వడమే దీని లక్ష్యం. చదువు పూర్తయ్యి ఏళ్లు గడుస్తున్నా.. అనేకమంది ఉద్యోగం దొరక్క ఇబ్బందులు పడుతుంటారు. ఇందుకు ప్రధాన కారణం సరైన సాంకేతిక నైపుణ్యం లేకపోవడమే. ఈ అంశాన్నే అవకాశంగా మార్చుకున్నారు ఈ ముగ్గురు ఐఐటీ పూర్వ విద్యార్థులు. దీనిద్వారా విద్యార్థులకు టెక్నికల్ కోర్సులను అందిస్తూనే ఉద్యోగ అవకాశాలను చూపిస్తూ, భవిష్యత్తు టెక్ లీడర్లను తయారు చేస్తున్నారు.

- నైపుణ్యాభివృద్ధికి సరికొత్త ప్రయత్నం
- పరిశ్రమ అవసరాలకు తగ్గట్టుగా శిక్షణ
- సైబర్ భద్రత, ఏఐ, మెషిన్ లెర్నింగ్, డేటా సైన్స్‌లో
- గూగుల్, ఒరాకిల్, అమెజాన్ వంటి 1,700 సంస్థలతో ఒప్పందం
- హైదరాబాద్ స్టార్టప్ నెక్ట్స్ వేవ్‌కు ఫోర్బ్స్ జాబితాలో చోటు



కంపెనీ ఫౌండర్లు అనుపమ్, రాహుల్, శశాంక్

ఫోర్బ్స్ జాబితాలో...

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్(డబ్ల్యూఈఎఫ్) విడుదల చేసిన టెక్నాలజీ పయనీర్స్-2024 జాబితాలో దేశంలోని పది కంపెనీలకు చోటు దక్కగా.. ఇందులో హైదరాబాద్‌కు చెందిన నెక్ట్స్‌వేవ్ స్థానం దక్కించుకుంది. రెండేళ్లలో నెక్ట్స్‌వేవ్ ద్వారా శిక్షణ పొందినవారు గూగుల్, అమెజాన్, అసెంచర్, డెలాయిట్, టెక్ మహీంద్రా, ఒరాకిల్, కాగ్నిజెంట్ వంటి 1,700లకుపైగా కంపెనీల్లో ఉద్యోగాలు పొందారు. వృత్తి జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ఎదుర్కోవడంతో పాటు అవకాశాలను అందిపుచ్చుకునేందుకు ఈ నెక్స్‌ట్ వేవ్ వేదికగా నిలిచింది. విద్యార్థులు తమ కెరీర్‌లో నూతన ఆవిష్కరణలతో నైపుణ్యాలను మెరుగు పరుచుకునేందుకు వీలు కల్పిస్తుంది.

ఎవరికీ శిక్షణ..

ఫ్రెషర్స్‌తో పాటు వివిధ కారణాలతో కెరీర్‌లో గ్యాప్ వచ్చిన వారు, వేరే రంగంలో పనిచేస్తూ.. ఐటీకి మారాలనుకునే వారికి ఈ శిక్షణ ఇస్తారు. అమెజాన్, గూగుల్ వంటి ప్రముఖ కంపెనీల్లోని సాంకేతిక నిపుణులు పరిశ్రమ అవసరాలను వివరిస్తారు. ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా 4 వేలకు పైగా కళాశాలకు చెందిన లక్షకుపైగా విద్యార్థులు ఈ స్టార్టప్ కమ్యూనిటీలో భాగస్వామ్యమయ్యారు. రానున్న రెండేళ్లలో 10 వేల కంపెనీలతో భాగస్వామ్య ఒప్పందం చేసుకోవాలనేదే మా లక్ష్యం. దేశంలో డిగ్రీ అయ్యాక ఖాళీగా ఉంటున్న దాదాపు 60 శాతం మందిని నిపుణులుగా తీర్చిదిద్దాలన్నదే తమ ఉద్దేశమని రాహుల్ తెలిపారు.

బదిలీల్లో టీజీడీఏ వైద్యులను మినహాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ బొంగు రమేష్ తదితరులు

సుల్తాన్‌బజార్: వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టనున్న ఉద్యోగులు, వైద్యుల సాధారణ బదిలీలు 20 శాతానికి మించకుండా చూడాలని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం(టీజీడీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు కోఠి డీఎంహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, డాక్టర్ నరహరి, డాక్టర్ ఎ.కృష్ణారెడ్డి, రంగా అజ్మీర, డాక్టర్ మాధవి మాట్లాడుతూ బదిలీల్లో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. అనుభవజ్ఞులైన వైద్య నిపుణులు ఇతర ప్రాంతాలకు బదిలీ చేయాల్సి వస్తే ప్రతిష్టాత్మకమైన ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, సరోజినిదేవి కంటి ఆసుపత్రిలో వైద్యసేవలు కుంటుపడే ప్రమాదం ఉందన్నారు. జిల్లాలతోపాటు మెడికల్ కాలేజీలను కూడా కుదించాలని కోరారు.

'ప్రజావాణి'కి అందిన 607 అర్జీలు

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 607 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి పర్యవేక్షణలో వివిధ శాఖలకు సంబంధించిన సమస్యలపై అధికారులు ప్రజలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా భూమి, ఉద్యోగ, రేషన్‌కార్డులకు సంబంధించిన దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్య ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ సమస్యలపై 176, ఇళ్ల కోసం 58, కొత్త రేషన్‌కార్డు, పింఛన్ మంజూరు కోరుతూ 54 దరఖాస్తులు వచ్చాయి. పోలీసు సమస్యలపై కూడా 62 మంది వినతిపత్రాలను సమర్పించడం గమనార్హం. ఎస్‌జీటీ పోస్టులకు బీఈడీ చేసినవారిని అనుమతి ఇచ్చిన విధంగానే టెట్ పేపర్-2 రాసి ఉత్తీర్ణులైన వారికి కూడా అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు.

ఈ భూమికి హద్దులు చెప్పండి ప్లీజ్..

తమ వ్యవసాయ భూమికి హద్దులు చెప్పాలని సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం కట్కూర్‌కి చెందిన కాశబోయిన సమ్మయ్య యాదవ్, స్వరూప ప్రజావాణిలో మొర పెట్టుకున్నారు.



ప్రజావాణికి వచ్చిన వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ప్రత్యేక అధికారి దివ్య

కార్పొరేటర్ల ఫ్యామిలీ ప్యాక్



మెడికల్ గ్రూప్ ఇన్సూరెన్స్‌కు రూ.90 లక్షల

ప్రజల సొమ్ముతో ప్రీమియం..

కుటుంబసభ్యులకూ వైద్యం

ఖజానా ఖాళీగా ఉన్నా ఖర్చులకు వెరవని జీహెచ్ఎంసీ

సాక్షి, సిటీబ్యూరో: ఓ వైపు నెలనెలా సిబ్బంది జీతాలకు కటకట.. మరోవైపు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు ఇబ్బందులు.. అయినా సరే.. కార్పొరేటర్లు, ఉన్నతాధికారులు ఎవరూ కూడా జీహెచ్ఎంసీ ఖర్చులభారాన్ని తగ్గించడంలేదు. కార్పొరేటర్లు, వారి కుటుంబాలకే కాక ఇంకా ఎన్నికే జరగని కోఆప్షన్ సభ్యులు, వారి కుటుంబాలకు కూడా (వారి ఎన్నిక ఎప్పుడు జరిగితే అప్పటి నుంచి వర్తించేలా) మెడికల్ గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించనున్నారు. అందుకుగాను ఏజెన్సీ ఎంపికకు జీహెచ్ఎంసీ సిద్ధమైంది. కార్పొరేటర్ల కుటుంబాల కోసం ప్రజలు చెల్లించిన పన్నుల సొమ్ము నుంచి ఫ్యామిలీ ప్యాక్‌గా మెడికల్ ఇన్సూరెన్స్‌కు ప్రీమియం కడుతుండటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వాస్తవానికి కార్పొరేటర్లలో మెడికల్ ఇన్సూరెన్స్ ప్రీమియం కట్టలేని పరిస్థితిలో ఎవరూ లేరు. కార్పొరేటర్లు కొందరు ఎన్నికల్లో గెలిచేందుకు లక్షలకు లక్షల రూపాయలు ఖర్చు చేశారు కూడా. అయినా గ్రూప్ మెడిక్లెయిమ్ ఇన్సూరెన్స్ పాలసీ ప్రీమియం మాత్రం జీహెచ్ఎంసీ ఖజానా నుంచే చెల్లించాలని నిర్ణయించడం గమనార్హం. ఈ మేరకు సంబంధిత ఏజెన్సీలను ఆహ్వానిస్తూ టెండర్లు పిలిచారు. ఇన్సూరెన్స్ ప్రీమియంగా దాదాపు రూ.90 లక్షలు చెల్లించనున్నారు. తద్వారా ఏడాది వరకు రిస్క్ కవరేజీసహా రూ.5 లక్షల విలువైన వైద్య సదుపాయాలు పొందవచ్చు.

ఆరుగురికి ప్రయోజనం

కేవలం కార్పొరేటర్లకే కాక ఒక్కొక్కరి కుటుంబంలో ఆరుగురికి ఈ సదుపాయం వర్తిస్తుంది. కార్పొరేటర్‌తోపాటు వారి భర్త /భార్య, ఇద్దరు పిల్లలు, తల్లిదండ్రులు లేదా అత్తామామల్లో ఎవరైనా ఇద్దరికి ఈ సదుపాయం ఉంటుంది. మొత్తం 150 మంది కార్పొరేటర్లుండగా, 147 మందికి వర్తింపచేసేందుకు టెండర్‌లో పేర్కొన్నారు. ఇద్దరు కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికవడంతో వారి స్థానాలు ఖాళీ అయ్యాయి. ఇద్దరు కార్పొరేటర్లు మరణించారు. వారిలో ఒకరు ఇటీవలే మరణించడంతో ఆ ఖాళీని పరిగణించలేదు.

అధికారుల జీతాల భారం..

జీహెచ్ఎంసీలో అధికారుల ఎక్కువగా ఉండటంతో వారి జీతభత్యాల నుంచి వాహన సదుపాయం దాకా ఖర్చులు పెరిగిపోయాయి. గతంలో ఒక్క అడిషనల్ కమిషనర్ నిర్వహించిన విధుల కోసం ముగ్గురు, నలుగురు అధికారులను నియమించారు. ఎన్నికల కోసం తీసుకున్న డిప్యూటీ కలెక్టర్లను కూడా ఇక్కడే కొనసాగిస్తున్నారు. ఈ ఖర్చులతోపాటు చాంబర్ల హంగులు, ఫోన్ సదుపాయాలు వంటివి సరేసరి. మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఖర్చులు వీటికి అదనం.

ఆదిలోనే హంసపాదు

అర్ధంతరంగా ఆగిన మూసారంబాగ్ బ్రిడ్జ్ పనులు

- రూ.55 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభం
- మూసీనదిలో రెండు పిల్లర్లు నిర్మించి వదిలేసిన వైనం
- అడ్డుగా ఉన్న విద్యుత్ కేబుళ్లను తొలగించని వైనం
- వాహనదారుల అవస్థలు



మూసారంబాగ్ ప్రాంతంలో మూసీనదిపై నిలిచిన వంతెన నిర్మాణ పనులు

అంబర్‌పేట: మూసారంబాగ్ మూసీనదిపై చేపట్టిన వంతెన పనులు అర్ధంతరంగా అటకెక్కాయి. సుమారు రూ.55 కోట్ల అంచనా వ్యయంతో మూసారంబాగ్ బ్రిడ్జి పనులు చేపట్టారు. మూసీనదిలో కేవలం రెండు పిల్లర్లు వేసి ఎవరికీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయ స్థాయిలో డిజైన్ రూపొందించి మొదలు పెట్టిన పనులు నిలిచిపోవడంతో రాకపోకలకు తీవ్ర అసౌకర్యం కలుగుతోంది. నిలిచిపోయిన బ్రిడ్జ్ నిర్మాణ పనులు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. భారీ వర్షాలు కురిస్తే మూసారంబాగ్ బ్రిడ్జిపై నుంచి మూసీ పొంగిపొర్లుతుంది. దీంతో రాకపోకలు ఎక్కడికక్కడే నిలిచిపోవడం పరిపాటిగా మారింది. తాజాగా ఒకవైపు పాత బ్రిడ్జిపై రాకపోకలు కొనసాగిస్తూ, మరోవైపు బ్రిడ్జ్ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ వర్షకాలంలో భారీ వర్షాలు కురిస్తే ఆ రెండు పిల్లర్లు దెబ్బతినే అవకాశం ఉంది. దీంతో ప్రజాధనం వృథా అయ్యే ప్రమాదం ఉంది.

మలక్‌పేట నుంచి వచ్చే వాహనాలకే అనుమతి...

మలక్‌పేట నుంచి అంబర్‌పేట వైపు వాహనాలను అనుమతించి... అంబర్‌పేట నుంచి మలక్‌పేట వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించారు. దీంతో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే అంబర్‌పేట ప్రధాన రహదారిలో నిర్మిస్తున్న ఫ్లైఓవర్ ఆరేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయి. అక్కడ సైతం ట్రాఫిక్ మళ్లింపుతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఒకే ప్రాంతంలో రెండు ప్రధాన రోడ్లపై రెండు బ్రిడ్జ్‌ల నిర్మాణం చేపట్టి ట్రాఫిక్ మళ్లించడంతో అంబర్‌పేట ప్రాంతానికి వాహనదారులు రావడానికి జంకుతున్నారు.

ట్రాఫిక్‌తో నిత్యం నరకం

అంబర్‌పేట, విద్యానగర్, నల్లకుంట, నారాయణగూడ ప్రాంతాల వారు అటు వైపు వెళ్లాలన్నా... దిల్‌సుఖ్‌నగర్, మలక్‌పేట్, సరూర్‌నగర్, ఎల్‌బీనగర్ ప్రాంతాల వారు ఇటు వైపు రావాలన్నా మూసారంబాగ్ వంతెనే ప్రధాన వారధి. ఒకవైపు బ్రిడ్జ్ నిర్మాణ పనులు సాగుతుండటంతో మరోవైపు నుంచి మాత్రమే వాహనాలను అనుమతిస్తున్నారు. దీంతో వాహనదారుల, స్థానికుల రాకపోకలకు ఇబ్బందులు అన్నీఇన్నీ కావు.



అలీకేఫ్ చౌరస్తాలో రాకపోకలపై ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

విద్యుత్ కేబుళ్లు తొలగించిన తర్వాతే..

ముసారంబాగ్ బ్రిడ్జ్ నిర్మాణ ప్రాంతంలో విద్యుత్ కేబుళ్లను తొలగించి ఇతర ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ విషయాన్ని విద్యుత్ శాఖ దృష్టికి తీసుకెళ్లాం. వారు కేబుల్ పనులకు నిధులు కేటాయిస్తే పనులు చేస్తామని సమాధానం ఇచ్చారు. ప్రభుత్వం నుంచి విద్యుత్ శాఖకు నిధులు మంజూరైతే వారు కేబుళ్లను తొలగిస్తారు. ఈ తర్వాతనే బ్రిడ్జ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. వర్షకాలంలో ఈ పనులు చేపట్టడం ఇబ్బందికరమే.

- సురేష్, ఈఈ ప్రాజెక్ట్స్

'విద్యతోనే సమాజంలో మార్పు'



ప్రభాశంకర్‌ను సన్మానిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు తదితరులు

గన్‌ఫౌండ్రీ: విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి డి.శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం నాంపల్లి ఎగ్జిబిషన్ మైదానంలో సరోజినీనాయుడు బాలికల ఫార్మసీ కళాశాల సిల్వర్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో విద్యాప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఆ దిశగా విద్యార్థులు కూడా రాణించాలని సూచించారు. నాణ్యమైన విద్యతోపాటు మహిళా సాధికారత కోసం కృషి చేయాలన్నారు. విద్యార్థులకు, సంస్థకు ప్రభుత్వం నుంచి సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం గ్రాడ్యుయేషన్ పూర్తి చేసిన విద్యార్థినులకు డిగ్రీ పట్టాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి, కళాశాల చైర్మన్ బి.ప్రభాశంకర్, ఉస్మానియా గ్రాడ్యుయేట్ అసోసియేషన్ అధ్యక్షుడు టి.వి.గోపాలచారి, ఎకనామిక్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ డి.గంగాధర్‌రావు, కార్యదర్శి జి.వి.రంగారెడ్డి, ఎగ్జిబిషన్ సొసైటీ కార్యదర్శి బి.హన్మంతరావు, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ టి.మమత తదితరులు పాల్గొన్నారు.

'గాంధీ'లో కొత్త హాస్టళ్లకు స్థలపరిశీలన



గాంధీ ప్రాంగణంలో స్థలాన్ని పరిశీలిస్తున్న ఉన్నతాధికారులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ మెడికల్ కాలేజీ ప్రాంగణంలో అదనపు హాస్టల్ భవనాల నిర్మాణ స్థలాన్ని ఉన్నతాధికారులు పరిశీలించారు. హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) డాక్టర్ వాణి, టీజీఎంఎస్ఐడీసీ ఇంజనీర్ల బృందం మంగళవారం గాంధీ మెడికల్ కాలేజీని సందర్శించారు. గాంధీ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ రాజారావులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. 500 గదులతో సుమారు 900 మందికి వసతి సౌకర్యం నిమిత్తం నూతన హాస్టళ్లకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, వైస్ ప్రిన్సిపాల్స్ కృష్ణమోహన్, రవీంద్రకుమార్, తెలంగాణ వైద్యవిద్య మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) చీఫ్ ఇంజనీర్ దేవేంద్ర కుమార్, ఎస్ఈ సురేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్టెమ్ సబ్జెక్ట్‌లలో ప్రోత్సహించాలి

బయోఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ శ్రీదేవి

రాయదుర్గం: స్టెమ్ సబ్జెక్ట్‌లలో మహిళలను ప్రోత్సహించాలని సింజీన్ ఇంటర్నేషనల్ లిమిటెడ్‌లోని బయో ఫార్మాస్యూటికల్ డెవలప్‌మెంట్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ శ్రీదేవి కంభంపాటి సూచించారు. హైదరాబాద్ నాలెడ్జి సిటీలోని టీహబ్‌లో రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(రిచ్) సహకారంతో మహిళల కోసం మంగళవారం స్కాలర్‌షిప్, మెంటరింగ్, ఇండస్ట్రీ ఓరియంటేషన్ రెండవ కోహర్ట్ కార్యక్రమాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ వర్చువల్‌గా పాల్గొని నిర్వాహకులను అభినందించారు. హైదరాబాద్‌లో ఉన్న అగ్రశ్రేణి పరిశోధన, అభివృద్ధి సంస్థలు, పరిశ్రమలలో విద్యార్థినులకు అభ్యాస అవకాశాలను అందించడమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో భాగంగా రెండవ బృందం కోసం టైర్-2, టైర్-3 సంస్థల నుంచి 30 మంది మహిళలను సింజీన్ స్కాలర్‌షిప్, మెంటర్‌షిప్ ప్రోగ్రామ్ కోసం ఎంపిక చేశారు.

పరిశ్రమల రుణమేళా..



పరిశ్రమల రుణమేళా కార్యక్రమానికి హాజరైన ప్రతినిధులు

మల్లాపూర్: 'నాచారం టీని'ఇండస్ట్రీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ సౌజన్యంతో మంగళవారం పరిశ్రమలకు రుణమేళా నిర్వహించారు. ఈ మేళాకు ముఖ్యఅతిథిగా ఎంఎస్ఎంఈ అడిషనల్ డెవలప్‌మెంట్ కమిషనర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. పారిశ్రామికవేత్తలు పరిశ్రమల అభివృద్ధి కోసం రుణాలు తీసుకొని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో టీని అసోసియేషన్ అధ్యక్షుడు జయరాజ్, ఉపాధ్యక్షుడు రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేష్, కార్యదర్శి రాంమోహన్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌గౌడ్, 300 మంది పారిశ్రామికవేత్తలు, ఐసీఐసీఐ, కెనరా బ్యాంక్, యూనియన్ బ్యాంక్, ఇండస్ బ్యాంక్‌ల మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

కులగణన తర్వాతే స్థానిక ఎన్నికలు

వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా డిమాండ్

నాగోలు: కుల జనగణన తర్వాతే స్థానిక సంస్థల్లో 43% బీసీ రిజర్వేషన్ అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలని వర్కర్స్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు రాయబండి పాండురంగాచారి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం కొత్తపేటలో వర్కర్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వెంకటస్వామి గౌడ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. పాండురంగాచారి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగబద్ధ రిజర్వేషన్లు ఉండటం వల్లే వారు ఉన్నత స్థానాల్లో రాణించగలుగుతున్నారని అన్నారు. దేశ జనాభాలో దాదాపు 60% ఉన్న బీసీ కులాలకు అసెంబ్లీ, పార్లమెంట్ లాంటి చట్టసభల్లో రాజ్యాంగబద్ధ రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడం వల్లే వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రాజకీయంగా అభివృద్ధి చెందిన జాతి మాత్రమే ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో అభివృద్ధి సాధించిగలదని చరిత్ర చెబుతోందన్నారు. ఆధిపత్య కులాల యాజమాన్యంలోని కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల్లో పనిచేసే ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలు తమ జాతి ప్రయోజనాల కంటే స్వార్థమే పరమావధిగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

దివ్యాంగులను ఉత్పాదకులుగా తీర్చిదిద్దాలి


రాయదుర్గం: దివ్యాంగులను ఉత్పాదక పౌరులుగా తీర్చిదిద్దాలని ఆదిత్య మెహతా ఫౌండేషన్ ట్రస్టీ, బాహుబలి చిత్ర నిర్మాత శోభు యార్లగడ్డ అన్నారు. గోపన్‌పల్లి జవహర్ నవోదయ విద్యాలయ క్యాంపస్‌లో జవహర్ నవోదయ విద్యాలయ సమితి, ఆదిత్యా మెహతా ఫౌండేషన్ ఆధ్వర్యంలో అతిపెద్ద పారాస్పోర్ట్స్ ప్రత్యేక అవసరాల పిల్లల శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మంగళవారం జరిగిది. ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచిచారు. షిల్లాంగ్, భోపాల్, హైదరాబాద్, పాట్నా, పూణే, చండీగఢ్, లక్నో, జైపూర్ రీజియన్ల నుంచి వచ్చిన పిల్లలు 28 పారాస్పోర్ట్స్‌లో పాల్గొనగా, 181 మందిని ఎంపిక చేశారు.

సాక్షి సిటీ ప్లస్
11
హైదరాబాద్, బుధవారం, 19, జూన్, 2024

ఒకే ఒక్క ఛాన్స్... ఈ డైలాగ్ ఎక్కడో విన్నట్లుందే..అనుకుంటున్నారా...! అవును రవితేజ హీరోగా నటించిన ఖడ్గం సినిమాలోనిది.. అయితే ఇది ఈ ఒక్క సినిమాకో.. హీరోకో పరిమితం కాదు...దాదాపు ఇండస్ట్రీలో అవకాశం కోసం ఎదురు చూసే ప్రతి ఒక్కరి నోటి వెంట వచ్చేది ఈ డైలాగే..అంటే అతిశయోక్తి కాదేమో..నాటి ఎన్టీఆర్ దగ్గర నుంచి నేటి విశ్వక్ సేన్ వరకూ అలా వచ్చిన వారే.. ఇప్పుడు ఇదంతా మాకెందుకు చెప్తున్నారు..? ఇవన్నీ తెలిసిన విషయాలే అనుకుంటున్నారా..? అవును..! అందులో నిజం లేకపోలేదు..కాకపోతే గతంతో పోలిస్తే నటనవైపు వెళ్లాలని అనుకునే వారి సంఖ్య భారీగా పెరిగిందనే విషయాన్ని చెప్పడానికి వచ్చినదే ఈ తిప్పలంతా..నగరవాసుల్లో నటనవైపు పెరిగిన ఆసక్తి... గతంతో పోలిస్తే పెరిగిన అవకాశాలు.. వివిధ వేదికలు గుర్తించి తెలుసుకునే ప్రయత్నమే ఇది...

ప్రొఫెషన్‌తో పనిలేదు.. యాక్టింగ్‌యే ప్యాషన్	సిటిజనుల్లో పెరిగిన నటనాభిరుచి	ఓటీటీలు, యూట్యూబ్‌ల రాకతో ఓవర్‌టైమ్ యాక్టింగ్‌కు సై..





ఒక్క ఛాన్స్

విశ్వ..నట...నగరంగా హైదరాబాద్

సాక్షి సిటీబ్యూరో

ఆయనో ప్రముఖ వైద్యుడు.. నగరంలోని ఓ ప్రభుత్వాస్పత్రిలో కీలక పదవిలో కొనసాగుతున్నారు. డయాబెటిక్ కన్సల్టేషన్ కోసం ఆయన్ని కలిసేందుకు సికింద్రాబాద్‌కు చెందిన గిరి ఆ ఆస్పత్రికి వెళ్లారు. డాక్టర్‌ను చూడగానే ఎక్కడో చూసినట్లు.. బాగా తెలిసినట్లు చాలా యూనీక్‌గా అనిపించింది. కాసేపు తన బుర్ర బద్దలకొట్టుకుని ''ఫలానా వెబ్‌సిరీస్‌లో మీరు నటించారు కదా డాక్టర్?'' అని ఠక్కున అనేశాడు.. డాక్టర్ కూడా చాలా ఫ్రెండ్లీగా మొహమాటాన్ని పక్కనబెట్టి అడిగిన ప్రశ్నకు అవునంటూ చిరునవ్వుతో సమాధానమిచ్చారు. గిరికి ఎదురైన అనుభవమే మనలో చాలామందికీ కలిగే ఉండొచ్చు.. ఆస్పత్రులు, బొటిక్‌లు, పార్లర్లు, కాలేజీలు.. ఎక్కడ పడితే అక్కడ అనేక మంది నగరవాసులు డాక్టర్ తరహాలోనే తమ ప్రతిభను వివిధ మాధ్యమాల్లో చాటుతున్నారు..

వెల్లువెత్తుతున్న అవకాశాలు..

టీవీలు, షార్ట్ ఫిలింస్...వరకూ దశలవారీగా యాక్టింగ్ హాబీ విస్తృతమవుతూ ఉంది. గత ఐదేళ్ల కాలంలో ఆన్‌లైన్ వినియోగంతో పాటుగా ఈ హాబీ కూడా ఒక్కసారిగా ఊపందుకుంది. ముఖ్యంగా ఓటీటీ వేదికలు విస్తృతమవడంతో నటీనటులకు అవకాశాలు కూడా వెల్లువెత్తుతున్నాయి. తక్కువ బడ్జెట్‌లో సినిమాలు, సిరీస్ రూపొందించే నిర్మాతలు, టెక్నీషియన్లుతో పాటు నటీనటులను కూడా తమ బడ్జెట్‌కు అందుబాటులో ఉండేలా జాగ్రత్త పడుతున్నారు.. పాత్రోచితంగా కనిపించే వ్యక్తులకు కాస్తంత శిక్షణ అందిస్తే చాలు పని జరిగిపోతున్న పరిస్థితుల్లో వయసుతో సంబంధం లేకుండా.. అనేకమందికి అవకాశాలు గుమ్మం ముందుకు వచ్చి మరీ తలుపు తడుతున్నాయి.

సొంత వేదికలు..

ఇన్‌స్టా, స్నాప్‌చాట్, ఫేస్‌బుక్, యూట్యూబ్ రీల్స్, టిక్‌టాక్ వంటి మాధ్యమాల రాకతో సరదాగా మొదలుపెట్టి రీల్స్, షార్ట్ వీడియోలు వగైరా వంటి సోషల్ మీడియా వేదికల్లో తమ ప్రతిభను కనబరుస్తున్నారు. అంతే కాదు సినీ తారలను మించిన ఫాలోయింగ్‌ను, గుర్తింపును, ఫాలోవర్స్‌ను పోగేసుకుంటున్నారు. ఒక్క మాటలో చెప్పాలంటే.. ఆయా ప్రాంతాల్లో సెలబ్రిటీలుగా.. చిన్నపాటి స్టార్‌లుగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. అంతేకాదు ఆ వేదికల ద్వారానే సినీ అవకాశాలనూ అందిపుచ్చుకుంటున్నారు. యూట్యూబ్ ద్వారా పాపులరైన గంగవ్వే దీనికో ఉదాహరణ... ఏ రంగంలో, ఏ వేదిక, ఏ మాధ్యమం ద్వారా సక్సెస్ సాధించినా, తెరపై రాణించడం, తద్వారా వచ్చే పాపులారిటీకి సాటిరావు అనేది వాస్తవం.


స్టోరీ టెల్లింగ్, ఫ్యాషన్ కాదేదీ నటనకు అనర్హం..

నగరానికి చెందిన ఫ్యాషన్ డిజైనర్ రామ్... గత కొంత కాలంగా సెలబ్రిటీలకు డిజైన్లు అందించడంలో పేరొందారు. లుక్స్‌లో టాలీవుడ్ హీరోలకు తీసిపోని రామ్... లాక్ డౌన్ టైమ్‌లో దొరికిన ఖాళీ సమయాన్ని నటనాభిరుచితో భర్తీ చేసుకున్నారు. ఆయన పచ్చీస్ పేరుతో రూపొందించిన ఓ సినిమాలో హీరోగా నటించారు. ఆ సినిమా ఆ మధ్య ఓటీటీలో విడుదలైంది.. అదే విధంగా నగరంలో స్టోరీ టెల్లింగ్‌కు కేరాఫ్‌గా పేరొందిన దీపా కిరణ్ కూడా ఇటీవల యాంగర్ టేల్స్ అనే ఓటీటీ చిత్రంలో నటించారు. అందులోని నాలుగు పొట్టి కథల్లో ఒకటైన యాస్ ఆఫ్టర్ నూన్ న్యాప్‌లో ఆమె కనిపిస్తారు. ఈ ఎక్స్‌పీరియన్స్ తనకు కొత్త అనుభూతిని పంచిందని ఆమె అంటున్నారు.

నటనే హాబీగా...

కేరెక్టర్‌కు ఓకె...కెరీర్‌గా నాట్ ఓకె...అంటున్నారు ఈ హాబీ యాక్టర్లు. నటనావకాశాలు వస్తున్నా వరుస పెట్టి సినిమాలు చేసేయాలనే ఆత్రం చూపడం లేదు. తమ కెరీర్‌కు ప్రాధాన్యత ఇస్తూనే అడపాదడపా వచ్చిన ఛాన్సుల్ని సద్వినియోగం చేసుకుంటున్నారు. సినిమా అనేది తమకు అభిరుచి మాత్రమే నని అనేక మంది స్పష్టం చేస్తున్నారు. ''నాట్యం అనేది నా అభిరుచికి, నా ఆలోచనలకు దగ్గరగా ఉన్న సినిమా కాబట్టి నటించాను. అంతే తప్ప సినిమాల్ని కెరీర్‌గా తీసుకునే ఆలోచన లేదు'' అంటున్నారు సంధ్యారాజు. ప్రముఖ పారిశ్రామిక వేత్త సత్యం రామలింగరాజు కుటుంబ సభ్యురాలైన సంప్రదాయ నృత్య కారిణి... ఆ మధ్య నాట్యం అనే సినిమాలో కథానాయికగా నటించారు. ఆ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు జాతీయ పురస్కారానికి కూడా నోచుకుంది. అయినప్పటికీ ఆమె మరో చిత్రంలో నటించలేదు. అదే విధంగా నగరానికి చెందిన ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు ఆకెళ్ల రాఘవేంద్ర కూడా ఒకటి రెండు చిత్రాల్లో కనిపించారు.

- కేవలం టాలీవుడ్ మాత్రమే కాదు.. కోలీవుడ్, మాలీవుడ్ చిత్రాల నిర్మాణానికీ కేరాఫ్ అడ్రస్‌గా మారిన భాగ్యనగరంలో ఓటీటీలు, యూ ట్యూబ్ చిత్రాల వెల్లువతో నటించే సరదా ఉన్న వారికి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. అయితే నటనను జస్ట్ ఫర్ ఛేంజ్ అన్నట్టు హాబీగా ఎంచుకోవడం వల్ల పెద్ద నష్టం లేకపోయినా, సరైన శిక్షణా నేపథ్యం లేకుండానే పూర్తి స్థాయి కెరీర్‌గా మార్చుకోవాలనే తొందరపాటు మాత్రం సరైంది కాదని అనుభవజ్ఞులు సూచిస్తున్నారు.



ప్రేక్షకాభిరుచిలో మార్పు...

నటనలో పేరున్నవారు, బాగా తెలిసిన ముఖాలను మాత్రమే కాకుండా కొత్త వారిని కూడా ఆదరించే దిశగా ప్రేక్షకుల అభిరుచుల్లో స్పష్టమైన మార్పు వచ్చింది. దీంతో నిర్మాతలు కొత్త నటీనటులతో ప్రయోగాలు చేయడానికి గతంలోలా భయపడడం లేదు. అంతేకాకుండా ఏ రంగంలో ఉన్నవారు ఆ రంగానికి సంబంధించిన పాత్రల్లో కాస్త సులభంగా మమేకమయ్యే వీలుంటుంది. కాబట్టి సినిమాలో వైద్యుడి పాత్ర ఉంటే వైద్యుడిని, లాయర్ పాత్రకు లాయర్‌ని ఎంచుకుంటూన్నారు. దీంతో రంగాలేమైనా తెరంగేట్రం సాధారణ విషయంగా మారిపోయింది.



సంగీత ప్రియులను అలరించనున్న 'జావేద్ అలీ'



సాక్షి, సిటీబ్యూరో:

ప్రముఖ బాలీవుడ్ సింగర్ జావేద్ అలీ తన స్వరాలతో నగరవాసులను మంత్రముగ్ధులను చేయనున్నారు. వరల్డ్ మ్యూజిక్ డే ఫెస్టివల్‌లో భాగంగా ఈనెల 21న నగరంలోని ప్రిజంలో జావేద్ అలీ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్‌ను నిర్వహించనున్నారు. హంగామా డిజిటల్ మీడియా ఎంటర్‌టైన్మెంట్, స్కిల్‌బాక్స్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ మ్యూజిక్ షో రాత్రి 8 గంటలకు ప్రారంభం కానుందని హంగామా డిజిటల్ మీడియా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సామిని పాల్ తెలిపారు. జోధా అక్బర్ ఫేమ్ 'జాష్న్-ఈ-బహారా', పుష్ప...'శ్రీవల్లి', బజరంగీ భాయిజాన్‌లోని 'తు జో మిలా' వంటి హిట్ సాంగ్స్‌తో సంగీత ప్రియులను సమ్మోహనం పరచనున్నారని, కాన్సర్ట్ టికెట్లు స్కిల్‌బాక్స్‌లో అందుబాటులో ఉన్నాయని సామిని అన్నారు. ఈ కాన్సర్ట్‌కు సంబంధించి.. 'ప్రత్యక్ష ప్రదర్శన ఎప్పుడూ థ్రిల్లింగ్‌గా ఉంటుందని, హైదరాబాదీ అభిమానులను అలరించడానికి ఇదొక మంచి అవకాశమని' సింగర్ జావేద్ అలీ ఓ ప్రకటనలో తెలిపారు. అద్భుతమైన మ్యూజిక్ నైట్ కోసం తానూ ఎదురు చూస్తున్నానని అందులో వెల్లడించారు.

'వేవ్‌మెడ్ పిక్సీ' ఆవిష్కరణ



సాక్షి, సిటీబ్యూరో:

ఫెమినా మిస్ ఇండియా తెలంగాణ - 2023 'ఊర్మిళ చౌహాన్' బంజారాహిల్స్‌లోని 'ది స్కిన్ సెన్స్'లో సందడి చేశారు. దక్షిణాదిలో స్కిన్‌కేర్ రంగంలోకి మొదటిసారిగా తీసుకొచ్చిన వినూత్న ప్లాస్మా టెక్నాలజీ 'వేవ్‌మెడ్ పిక్సీ'ని ఊర్మిళ చౌహాన్ ఆవిష్కరించారు. మంగళవారం జరిగిన ఈ ఆవిష్కరణలో ఊర్మిళ మాట్లాడుతూ.. ఆరోగ్యకరమైన జీవనానికి స్కిన్ కేర్ అవసరమని, ముఖ్యంగా సౌందర్య సంరక్షణలో పిక్సీ వంటి అధునాతన చికిత్సలు ప్రాముఖ్యతను సంతరించుకున్నాయని తెలిపారు. ప్రముఖ డెర్మటాలజిస్టు 'డాక్టర్ అలెక్యా సింగపూర్' వేవ్‌మెడ్ పిక్సీ అధునాతన సేవల గురించి వివరిస్తూ.. పిక్సీ ఇటలీకి చెందిన అధునాతన ప్లాస్మా టెక్నాలజీ. ఇది నాన్-ఇన్వాసివ్ సర్జరీ. భవిష్యత్ సేవలకు ఇది నాంది పలుకుతుందని అన్నారు. నాన్-సర్జికల్ బ్లీఫరోప్లాస్టీ వంటి అధునాతన పద్ధతులను ప్రదర్శిస్తుందని, అతి సులభంగా వినియోగించేలా ప్రత్యేక సాంకేతికతతో రూపొందించారని పేర్కొన్నారు.



క్రేజీ కట్స్

సిటీలో స్టైలిష్ హెయిర్ కట్‌కు క్రేజ్

- విస్తరిస్తున్న అంతర్జాతీయ ఫ్యాషన్ సెలూన్స్
- నెలలో ఒక్క అంతర్జాతీయ హెయిర్ స్టైలిస్ట్‌కైనా ఆహ్వానం..
- సినీతారలకు ధీటుగా ఔత్సాహికులు

స్టైల్‌కి, ఫ్యాషన్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నగరం వృద్ధిచెందుతోంది. ఓ పక్క స్టైల్‌తోపాటు దానికి తగిన విధంగా కేర్ తీసుకుంటున్నారు. ఇటీవల ఓ సినిమాలో జడేసుకోపోయావా... తల్లీ.. ముడేసుకున్నా.. ముద్దుగానే ఉన్నావులే అని రావు రమేష్ అంటాడు. ఆ తరహాలోనే ప్రతిదీ స్టైలే.. ఇక హెయిర్ స్టైల్స్‌లోనూ అనేక రకాలు ఉన్నాయంటే అతిశయోక్తిలేదు.. బజ్‌కట్.. క్రూకట్, ఫాక్స్ హాక్, బాబ్, బౌల్, కోంబ్ ఓవర్, ఫ్లాట్ టాప్, ముల్లె, పాంపడోర్ ఇలా పురుషులు ఫాలో అయ్యే హెయిర్ స్టైల్స్‌లో 30కి పైగా రకాలు ఉన్నాయి.. కాగా పిక్సీ కట్, స్పైకీ పిక్సీ, ఒన్ లెగ్త్ మిడీ, మోహాక్ షార్ట్ కట్, యాంగిల్డ్ బాబ్, షార్ట్ వేవీ.. వంటి 60 రకాల హెయిర్ స్టైల్స్ ఉన్నాయి. అయితే హెయిర్ స్టైల్స్ ఎప్పటి నుండో ఉన్నప్పటికీ... ప్రొఫెషనల్స్‌తో చేయించుకోవడం తక్కువ.. కానీ ప్రస్తుతం సెలబ్రిటీల నుంచి సామాన్యుల వరకూ హెయిర్ స్టైలిస్ట్‌ని ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో నగరంలో అంతర్జాతీయ బ్రాండెడ్ సెలూన్స్ విస్తరిస్తున్నాయి. అంతేకాదు.. రెగ్యులర్‌గా నెల్లో కనీసం ఒక్కరైనా హెయిర్ స్టైలిస్ట్లు సందర్శిస్తున్నారు..

– సాక్షి, సిటీబ్యూరో

హైదరాబాద్ అందమైన నగరంగానే కాకుండా అందానికీ అత్యంత ప్రాధాన్యతనిచ్చే నగరంగా ప్రసిద్ధి చెందింది. నగరం వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ స్టూడియోలు, ప్రతీ ఏటా పదుల సంఖ్యలో నిర్వహించే గ్లోబల్ ఫ్యాషన్ ఈవెంట్స్ దీనికి నిదర్శనం ..అయితే గత కొంత కాలంగా అందానికి అదనపు హంగులద్దే హెయిర్ కట్స్ ట్రెండ్‌గా మారింది. ముఖ్యంగా ఫ్యాషన్ ఔత్సాహికులు సినీతాలకు దీటుగా వినూత్న హెయిర్ స్టైల్స్‌కు మొగ్గుచూపుతున్నారు. దీనిని వేదికగా మార్చుకుని ప్రముఖ గ్లోబల్ బ్రాండ్లు, ఫేమస్ సెలూన్స్ నగరంలో సేవలు ప్రారంభిస్తున్నాయి. అంతేకాకుండా అంతర్జాతీయ సెమినార్లకూ హైదరాబాద్ కేంద్రంగా మారుతోంది. హెయిర్ స్టైలిస్ట్ వ్యాపారం, అవకాశాలు ఎక్కువగా ఉన్న నగరాల్లో హైదరాబాద్ టాప్‌లో ఉండటం విశేషం. ఫ్యాషన్ షోలు, ఫ్యాషన్ వీక్‌లతో హెయిర్ స్టైలిస్ట్‌ల అవసరం పెరిగింది. రానున్న కాలంలో ఐటీ, హిస్టారికల్‌తో పాటు ఫ్యాషన్ ఐకాన్‌గానూ నగరం వెలుగొందనుందని పలువురు విశ్లేషకులు అంటున్న మాట..


అవకాశాలు పుష్కలం..



నగరంలో నష్టపోని రంగం ఏదైనా ఉందంటే... అది హెయిర్ స్టైలింగ్ అని నిస్సందేహంగా చెప్పవచ్చు. ఈ రంగంలో అడుగుపెట్టిన ప్రతి ఒక్కరూ వృత్తిపరంగా మంచి అవకాశాలు పొందుతున్నారు. మన వ్యక్తిత్వాన్ని మరింత అద్భుతంగా చూపించడంలో ఫ్యాషన్ ఔట్‌లుక్ కీలకపాత్ర పోషిస్తుంది. ఈ హంగులను అందుకోవడంలో నగరవాసులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారు. ప్రముఖ హెయిర్ బ్రాండ్స్, హెయిర్ కట్స్ ఇక్కడి విలాసవంతమైన జీవన విధానంలో భాగమయ్యాయి. సిటీలో బోటోస్మూత్ ట్రీట్‌మెంట్ వంటి సెమినార్స్ నిర్వహిస్తే వందల మంది స్టైలిస్టులు పాల్గొని శిక్షణ పొందారు. దీనిని బట్టి అర్థం చేసుకోవచ్చు..ఇక్కడ కురులను అందంగా చూపించుకోవడానికి ఎంత ఇష్టపడుతున్నారో.

–నజీబ్ ఉర్ రెహ్మాన్,
ప్రముఖ అంతర్జాతీయ హెయిర్ స్టైలిస్ట్.


దక్షిణాది అందాలకు అంతర్జాతీయ క్రేజ్...



సాంకేతికత, అందం, ఆరోగ్యం మేళవింపుగా కనిపించింది. మొదటిసారి 2008లో భారతీయ మహిళల సంస్కృతిలో భాగమైన ఒక హెయిర్ స్టైల్ నన్నెంతగానో ఆకట్టుకుంది. నేను పలు దేశాల్లో శిక్షణ అందిస్తున్న సమయంలో భారతీయ అందం గురించి, ముఖ్యంగా ఇక్కడి పొడవైన జుట్టు గురించి చాలా సార్లు విన్నాను. ఇక్కడ మహిళల సౌందర్యానికి, వినూత్నమైన వ్యక్తిత్వానికి కేశాలంకరణ ప్రతిబింబంలా కనిపిస్తుంది. ప్రస్తుతం ఇక్కడి అమ్మాయిలు ట్రెండీగా కనిపిస్తున్నారు. సాధారణంగా ప్రతి రెండు నెలలకోసారి హెయిర్ ట్రీట్మెంట్ తీసుకుంటుంటారు. అందంతో పాటు ఆరోగ్యం కూడా కాపాడుకోవాలి కాబట్టి తక్కువ రసాయనాలు వాడటం శ్రేయస్కరం. బోటోస్మూత్ ట్రీట్‌మెంట్ అందంతో పాటు ఆరోగ్యకరమైన జుట్టును అందిస్తాయి. ఇతర దేశాలతో పోలిస్తే భారత్‌లో శిరోజాల అందం, ఆరోగ్యం పట్ల ఎంతో శ్రద్ధ చూపిస్తారు. ముఖ్యంగా గ్లోబల్ ఫ్యాషన్ హంగులకు హైదరాబాద్ వేదికగా మారింది. ఇటాలియన్, జపనీస్ వంటి విభిన్న హెయిర్ స్టైల్స్ ఇక్కడ చూసి ఆశ్చర్యపోయాను. మొదటి సారి నగరంలో నిర్వహించిన లుక్ అండ్ లెర్న్ సెమినార్‌లో ఇక్కడి ప్రొఫెషనల్ హెయిర్ స్టైలిస్ట్‌లకు వినూత్న స్టైల్స్‌పై అవగాహన కల్పించాను. గోద్రెజ్ ప్రొఫెషనల్ బోటోస్మూత్ ట్రీట్‌మెంట్‌పై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెషన్స్‌లో ఔత్సాహికుల స్కిల్స్ చూసి ఆశ్చర్యపోయాను. హెయిర్ కలరింగ్‌కు, స్ట్రెటెనింగ్, స్టైల్ కట్స్‌కు మంచి డిమాండ్ ఉంది. మా దేశం బ్రెజిల్‌లో శిరోజ సౌందర్యం పైన మాత్రమే ఆసక్తి చూపిస్తారు. కానీ ఇక్కడ అధునాతన

–వివియన్ బెనెడెట్టో,
అంతర్జాతీయ హెయిర్ మాస్ట్రో, బ్రెజిల్.
(ఫార్మాల్డిహైడ్-రహిత హెయిర్‌స్టైలిస్ట్)

మిస్ ఇండియా 'యోగాసన్'



సాక్షి, సిటీబ్యూరో:

మాజీ మిస్ ఇండియా, ప్రముఖ అంతర్జాతీయ యోగా ట్రైనర్ సిమ్రాన్ అహుజా సిటీలో సందడి చేశారు. రానున్న ప్రపంచ యోగా దినోత్సవ నేపథ్యంలో కొన్ని ప్రధాన యోగాసనాలు వేసి ఔత్సాహికులను అలరించారు. నగరంలోని కంట్రీ క్లబ్ వేదికగా 10వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాలను సిమ్రాన్ అహుజా, క్లబ్ హాస్పిటాలిటీ అండ్ హాలిడేస్ చైర్మన్ వై.రాజీవ్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. మంగళవారం నిర్వహించిన ప్రారంభోత్సవంలో 'మహిళా సాధికారత కోసం యోగా' అనే థీమ్‌తో పాటు కంట్రీ క్లబ్ వీవీపీ ప్లాటినం గ్లోబల్ కార్డ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిమ్రాన్ అహుజా మాట్లాడుతూ.. భారత ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయడంలో యోగా కీలక పాత్ర పోషించిందని, ఇతర దేశాల వారు సైతం యోగాను నిత్య జీవితంలో భాగం చేసుకోవడం గర్వకారణమని అన్నారు. దేశ ప్రాధాన్యతగా యోగాను ప్రపంచ దేశాలకు పరిచయం చేయడంలో ప్రధాని మోదీ కృషి ఎనలేనిదని అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా యోగా సాధన చేస్తూ మంచి ఆరోగ్య ఫలితాలను పొందానని వై.రాజీవ్ రెడ్డి తెలిపారు. పటిష్ఠ ఆర్థిక వ్యవస్థతో పాటు యోగా వంటి విలువైన సాంస్కృతిక వారసత్వ సంపదను కలిగిన అగ్రదేశంగా భారత్ నిలుస్తుందని అన్నారు. కంట్రీ క్లబ్ ఆధ్వర్యంలో ఇలాంటి వినూత్న ఫిట్నెస్ కార్యక్రమాలను నిర్వహించడం గొప్ప అనుభూతినిస్తుందన్నారు.

• ముసుగు తొలగింది..

బూతులు.. బెదిరింపులు

అధికారులపై మంత్రులు, టీడీపీ నేతల దుర్భాషలు..

శ్రీకాకుళం, సాక్షి, అనకాపల్లి, సింహాచలం: కొత్త అసెంబ్లీ ఇంకా కొలువుదీరలేదు. నూతన సభ్యుల ప్రమాణ స్వీకారాలు పూర్తి కాలేదు. కొందరు టీడీపీ ప్రజా ప్రతినిధులు నిజ స్వరూపాలు అప్పుడే బయటపడుతున్నాయి. బూతు భాష, బెదిరింపుల్లో పోటాపోటీగా దూసుకెళుతున్నారు. ఉన్నత పదవుల్లో ఉన్నప్పుడు హుందాగా నడుచుకోవాలనే విషయాన్ని విస్మరించి తమ అధినేత ప్రశంసల కోసం తహతహలాడుతున్నారు. వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు.. టీడీపీ కార్యకర్తలంతా పసుపు బిళ్లలతో ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాలంటూ ఉపదేశించారు. వారికి కుర్చీలేసి కూర్చోబెట్టి టీ ఇచ్చి పనులు చేయాని అధికార యంత్రాంగాన్ని బెదిరించారు. పోలీసుల్లో గత ప్రభుత్వ తొత్తులుగా వ్యవహరించిన వారు స్వయంగా తప్పుకోవాలని హోంమంత్రి వంగలపూడి అనిత హెచ్చరికలు జారీ చేశారు. నర్సీపట్నంలో నాసిరకంగా రోడ్లు నిర్మించారంటూ టీడీపీ సీనియర్ నేత, ఎమ్మెల్యే అయ్యన్న పాత్రుడు మునిసిపల్ అధికారులపై నడిరోడ్డులో పచ్చి బూతులతో రెచ్చిపోయారు. త్వరలో తాను స్పీకర్ అవుతున్నానని, ఇలాంటి రోడ్లు వేసినందుకు మిమ్మల్ని అసెంబ్లీలో గంటల కొద్దీ నిలబెడతానని హెచ్చరించారు. అయ్యన్న తిట్ల దండకానికి నిశ్చేష్టులైన అధికారులు చుట్టూ ప్రజలంతా చూస్తుండటంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యారు.

లైన్‌లో పెడతా: మంత్రి అచ్చెన్న

'నేను మాటిస్తున్నా. అధికారులకు సమావేశం పెట్టి చెబుతా. రేపటి నుంచి ప్రతి కార్యకర్త ఎస్‌ఐ దగ్గరకు వెళ్లినా.. ఎమ్మార్వో, ఎండీఓ వద్దకు వెళ్లినా.. ఏ ఆఫీసుకు వెళ్లినా పసుపు బిళ్ల పెట్టుకుని వెళ్లండి. మీకు గౌరవంగా కుర్చీ వేసి టీ ఇచ్చి మీ పనేమిటి? అని అడిగి అందరికీ పనులు చేసే విధంగా అధికారులను లైన్‌లో పెడతా. ఎవరైనా నా మాట జవదాటితే ఏమవుతారో వాళ్లకు నేను చెప్పాల్సిన అవసరం లేదు' అని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సోమవారం రాత్రి ఓ సభలో వ్యాఖ్యానించారు. మంగళవారం కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడితో కలసి శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో నిర్వహించిన కార్యక్రమంలోనూ అదే విషయాన్ని పునరుద్ఘాటించారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు పనులపై ప్రభుత్వ కార్యాలయాలకు వస్తే కుర్చీ వేసి కూర్చోబెట్టి, టీ ఇచ్చి గౌరవించాలని ఆదేశించారు. గత ఐదేళ్ల పాలనలో టీడీపీ క్యాడర్ ఎన్నో అవమానాలకు గురైందన్నారు. ఏ పనిమీద వెళ్లినా అధికారులు, ఉద్యోగులు పట్టించుకోలేదని చెప్పారు. ఎంపీగా రామ్మోహన్‌నాయుడు, ఎమ్మెల్యేలుగా తనతో పాటు బెందాళం అశోక్ బాబు ఉన్నా తమను పట్టించుకోకుండా అవమానించారన్నారు. ఇకపై అలా జరగకుండా ఇలాంటి ఆదేశాలు ఇస్తున్నామని స్పష్టం చేశారు. అప్పట్లో అవమానించి పనులు చేయని వారి వద్దే గౌరవం పొందాలని, పనులు చేయించాలనే ఉద్దేశంతో ఇలాంటి నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ఈ విషయంలో అధికారులు, ఉద్యోగులు నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ఐదేళ్లలో ఏ అధికారి, ఉద్యోగి ఎలా పని చేశారో తమ వద్ద అన్ని వివరాలు ఉన్నాయని చెప్పారు. కాగా, వలంటీర్లతో బలవంతంగా రాజీనామాలు చేయించిన వారిపై పోలీసుస్టేషన్లలో ఫిర్యాదు చేసి, తమను కలవాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. తమకు ఉద్యోగాలు తిరిగి ఇవ్వాలంటూ మంగళవారం తనను కలసిన కొందరు వలంటీర్లనుద్దేశించి మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడారు.



మున్సిపల్ అధికారులను తిడుతున్న మాజీ మంత్రి, నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు

గత ప్రభుత్వ తొత్తులు తప్పుకోండి..

కొందరు పోలీసులు వైఎస్సార్‌సీపీ తొత్తులుగా పని చేశారని హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. మంత్రి పదవి చేపట్టాక తొలిసారిగా సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న అనంతరం సోమవారం ఆమె మీడియాతో మాట్లా డారు. ఖాకీ చొక్కా వదిలిపెట్టి వైఎస్సార్‌సీపీ కండువా వేసుకునేందుకు కూడా కొంత మంది పోలీసులు సిద్ధమయ్యా రన్నారు. అలాంటి పోలీసులకు తాను హెచ్చరికలు జారీ చేస్తున్నానని చెప్పారు. వైఎస్సార్‌సీపీ రక్తం ఇంకా మీలో ప్రవహిస్తోందన్న ఫీలింగ్ ఉంటే మీ అంతట మీరే తప్పు కోవాలని పోలీసులకు హెచ్చరికలు జారీ చేస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ప్రతి సంఘటనపై విచారణకు ఆదేశిస్తామని స్పష్టం చేశారు.

తమాషాలు చేస్తున్నారా..

'తమాషాలు ...(బూతు)? ఇష్టం లేకపోతే ...(బూతు)' అంటూ మున్సిపల్ అధికారులపై నర్సీపట్నం టీడీపీ ఎమ్మెల్యే అయ్యన్నపాత్రుడు నడిరోడ్డు మీద బూతులతో రెచ్చిపోయారు. 'నేను అసెంబ్లీ స్పీకర్‌ను అవుతున్నా.. మిమ్మల్ని గంటల కొద్దీ నిలబెడతా..' అంటూ పరుష పదజాలంతో దుర్భాషలాడారు. 'కళ్లు మూసుకుపోయి ఏడుస్తు న్నారా నా కొడకల్లారా!' అంటూ నోరు పారేసుకున్నారు. 'నర్సీపట్నంలో దిక్కుమాలిన మున్సిపల్ కమిషనర్ ఒకడున్నాడు. వాడి సంగతి తేలుస్తా' అంటూ చిందులు తొక్కారు. మంగళవారం నర్సీప ట్నం నియోజకవర్గంలో ఆర్ అండ్ బీ, మున్సిపల్ అధికారులను వెంటబెట్టుకొని అబిద్ సెంటర్‌లో ఇటీవల నిర్మించిన వంద అడుగుల మెయిన్ రోడ్డు, ఆరిలోవ అటవీ ప్రాంతం వద్ద నర్సీపట్నం-కేడీ పేట రోడ్డును పరిశీలించిన క్రమంలో అయ్యన్న బూతు పురాణానికి అధికారులు నిశ్చేష్టులయ్యారు.

నా కొడకల్లారా.. కళ్లు మూసుకున్నారా?

నాణ్యత లేకుండా రోడ్డు ఎలా వేస్తారంటూ అయ్యన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. 'తమాషాలు చేస్తున్నారా..? కళ్లు మూసుకుపోయి ఏడుస్తున్నారా.. నా కొడకల్లారా..' అంటూ బూతులతో విరుచుకుపడ్డారు. పని చేయడానికి ఇష్టం లేకపోతే.. పోండి అంటూ గద్దించారు. ఆర్అండ్‌బీ రోడ్డుకు మున్సిపాలిటీ నిధులను వినియోగించటంపై అధికారులను ప్రశ్నించారు. రోడ్డు పనుల్లో నాణ్యత లేదని.. వారం రోజుల్లో నివేదిక ఇవ్వాలన్నారు. తప్పు చేసిన అధికారులను సస్పెండ్ చేయడం తథ్యమన్నారు. అప్పటి ఎమ్మెల్యే ఒత్తిడితో ఎన్నికల కోసం ఈ రోడ్డు వేశారని మండిపడ్డారు.



సిరిమాను నుంచి పడిపోతున్న పీఠం, పూజారి

సిరిమాను రథం కూలి ఇద్దరి మృతి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం కుప్పిలి గ్రామంలో మంగళవారం అసిరితల్లి ఉత్సవాల్లో ప్రమాదం జరిగింది. గ్రామంలో 14 ఏళ్ల తర్వాత అసిరితల్లి ఉత్సవాలు నిర్వహించారు. ఉత్సవాల్లో చివరిరోజు మంగళవారం సిరిమానోత్సవం చేశారు. సిరిమానుపై పూజారి నాయని చిన్నారెడ్డి ఆశీనులు కాగా బుడగుట్లపాలేం గ్రామానికి చెందిన వందమంది రథం లాగారు. ఉత్సవం మధ్యలో చిన్నారెడ్డి కూర్చున్న సిరిమాను పీఠం శీల విరిగిపోయింది. దీంతో రథం పీఠం ఒక్కసారిగా కూలి కిందనున్న కారిపల్లేటి (60), సూరాడ అప్పన్న (42)లపై పడిపోయింది. దీంతో వీరిద్దరూ ప్రాణాలు కోల్పోయారు. పూజారి చిన్నారెడ్డి అంత ఎత్తునుంచి కింద పడిపోగా.. పళ్ల మధ్య నాలుక కరుచుకోవడంతో నాలుక తెగిపడింది. పోలీసులకు సమాచారం అందడంతో వారు వచ్చి మృతదేహాలను రిమ్స్‌కు తరలించారు. చిన్న శీల విరిగి ఇంత పెద్ద ప్రమాదం జరగడాన్ని గ్రామస్తులు తట్టుకోలేకపోతున్నారు. అనంతరం పోలీసుల భద్రత నడుమ సిరిమానోత్సవం పూర్తిచేశారు.

సీఎం చంద్రబాబుతో పవన్ కల్యాణ్ భేటీ

సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి హోదాలో పవన్ కళ్యాణ్ మంగళవారం మధ్యాహ్నం తొలిసారిగా వెలగపూడిలోని సచివాలయానికి వచ్చారు. మంత్రులు నాదెండ్ల మనోహర్, కందుల దుర్గేష్‌తో కలిసి నేరుగా మొదటి బ్లాక్‌లోని సీఎం చాంబర్‌కు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబుతో పవన్ సమావేశమయ్యారు. సుమారు గంటన్నర పాటు ఈ భేటీ కొనసాగింది. కాగా, పవన్ బుధవారం విజయవాడలోని తన అధికారిక క్యాంపు కార్యాలయంలో ఉప ముఖ్యమంత్రి హోదాలో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ, శాస్త్ర సాంకేతిక శాఖల బాధ్యతలను స్వీకరించనున్నట్టు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం తెలిపింది. మంగళవారం ఉదయమే పవన్ విజయవాడలో తనకు కేటాయించిన క్యాంపు కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కన్నబాబు ఆయనకు స్వాగతం పలికారు.

'పోలవరం' పనుల్లో సంక్షోభం..

బాబు తప్పిదం వల్లే..

మాజీమంత్రి అంబటి రాంబాబు స్పష్టీకరణ

- స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేయకుండానే డయాఫ్రమ్ వాల్‌ను నాటి టీడీపీ సర్కార్ పూర్తిచేసింది
- కాఫర్ డ్యామ్‌ల మధ్య ఖాళీలు వదిలేయడంతో వరద ఉధృతికి 2019లో దెబ్బతిన్న డయాఫ్రమ్ వాల్
- స్పిల్ వే, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు మేమే పూర్తిచేశాం
- స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్, క్రిటికల్ నిర్మాణాలు కూడా పూర్తిచేసి గేట్లన్నీ పెట్టాం
- తప్పులు ఒప్పుకుని ప్రాజెక్టు పూర్తిపై చంద్రబాబు దృష్టిపెట్టాలి



చంద్రబాబు తప్పిదాలను మీడియాకు వివరిస్తున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–19 మధ్య అధి కారంలో ఉన్నప్పుడు చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదంవల్లే పోలవరం ప్రాజెక్టులో విధ్వంసం చోటుచేసుకుందని.. పనుల జాప్యానికి ఆయనే కారణమని మాజీమంత్రి అంబటి రాంబాబు స్పష్టం చేశారు. పోలవరం ప్రాజెక్టు పనులపై సోమవారం సీఎం చంద్రబాబు చెప్పిన మాటలన్నీ పూర్తి అవాస్తవాలు, పచ్చి అబద్ధాలన్నారు. పోలవరం పర్యటన సందర్భంగా ఆయన చేసిన తప్పులను గుర్తుచేసుకోకుండా.. వైఎస్ జగన్‌పై బురదజల్లేందుకు చంద్రబాబు ప్రయత్నించారని మండిపడ్డారు. ప్రాజెక్టు పనులను శరవేగంగా పూర్తిచేయడానికి 2019–24 మధ్య వైఎస్ జగన్ చిత్తశుద్ధితో కృషిచేశా రని.. స్పిల్ వే, అప్రోచ్ ఛానల్, స్పిల్ ఛానల్, పైలట్ ఛానల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లు పూర్తి చేసి గోదావరి వరద ప్రవాహాన్ని 6.1 కిమీల పొడవున మళ్లించారని గుర్తుచేశారు. 2014–19 మధ్య అధికారంలో ఉన్నప్పుడు చేసిన తప్పులను ఒప్పుకుని చిత్తశుద్ధితో ప్రాజెక్టును పూర్తిచేయడంపై దృష్టిపెట్టాలని అంబటి చంద్రబాబుకు హితవు పలికారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మంగళవారం అంబటి రాంబాబు మీడియాతో మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

వాస్తవాలు అవాస్తవాలు అవుతాయా..?

ప్రమాణ స్వీకారం చేసిన ఐదు రోజులకే సోమవారం చంద్రబాబు పోలవరాన్ని సందర్శించారు. అధికారంలోకి వచ్చిన ఉత్సాహంలో ఆయనచేసిన తప్పులన్నీ వైఎస్ జగన్‌పై నెట్టేందుకు యత్నించారు. కానీ, పోలవరం పూర్తిచేయాలంటే ఇంకా నాలుగేళ్లు పడుతుందని అధికారులు చెబుతున్నారంటూ బాబు వెల్లడించారు. పోలవరంలో విధ్వంసానికి వైఎస్ జగనే కారణమని ఆయన పదే పదే చెప్పే ప్రయత్నం చేశారు. నిజానికి.. 2019కి ముందు చంద్రబాబు చేసిన చారిత్రక తప్పిదాలే పోలవరం విషయంలో సంక్షోభం వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణంలో బాబు వ్యూహాత్మక, చారిత్రక తప్పిదాలే ఈ పరిస్థితికి దారితీశాయి. ముందుగా గోదావరి ప్రవాహాన్ని మళ్లించేలా స్పిల్‌వే, తర్వాత ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యాం పూర్తిచేయకుండా డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చంద్రబాబు చేపట్టడమే దీనికి ప్రధాన కారణం. డయాఫ్రం వాల్‌తో పాటు ఎగువ కాఫర్ డ్యామ్, దిగువ కాఫర్ డ్యామ్ పనులు సమాంతరంగా చేపట్టారు. జర్మనీకి చెందిన బావర్ సంస్థ డయాఫ్రమ్ వాల్‌ను పూర్తిచేసి రూ.460 కోట్లు బిల్లులు తీసుకుంది. చివరకు కాఫర్ డ్యాంల మధ్య ఖాళీలు ఉంచేయడంతో వరదలకు డయాఫ్రం వాల్ పూర్తిగా దెబ్బతింది. ఇదీ వాస్తవం. దీన్ని దాచిపెట్టి, కాంట్రాక్టర్‌ను మార్చడంవల్లే డయాఫ్రం వాల్ దెబ్బతిందన్నట్లుగా చంద్రబాబు అవాస్తవాలు చెబుతున్నారు. అంతేకాక.. ఇటు స్పిల్ వే, కాఫర్ డ్యాం పూర్తిచేయకపోడం, గోదావరి నదిని డైవర్షన్ చేయకపోవడంవల్ల 54 గ్రామాలు ముంపు సమస్యను ఎదుర్కొన్నాయనే వాస్తవాన్ని దాచిపెడుతున్నారు. వీటికి సమాధానం చెప్పకుండా మీరు చేసిన తప్పులను వైఎస్ జగన్ పైకి నెట్టేసి పబ్బం గడుపుకుందామనుకుంటున్నారా చంద్రబాబూ? పోలవరంలో జరిగిన అంశాలు ఏమిటనే విషయాన్ని ప్రజలు, మేధావులు, ఇరిగేషన్ మీద అవగాహన ఉన్న వాళ్లు అర్థంచేసుకోవాలి.

ఐదేళ్లలో పూర్తిచేస్తామని చెప్పలేకపోతున్నారు..

నిజానికి.. చంద్రబాబువల్లే ఈ రాష్ట్రానికి తీవ్రమైన నష్టం జరిగింది. జీవనాడి పోలవరం ప్రాజెక్టు పనుల్లో ఆలస్యానికి చంద్రబాబే కారణం. చివరకు.. ఇప్పుడు ప్రజలు అధికారం ఇచ్చినా సరే ఐదేళ్లలో పూర్తిచేస్తామనే మాట చంద్రబాబు చెప్పలేకపోతున్నారు. 2019కి ముందు చంద్రబాబు అశాస్త్రీయంగా ఆలోచించడంవల్లే ఈ పరిస్థితి దాపురించింది.. అప్పట్లో సొంత తెలివితేటలు ఉపయోగించడంవల్ల ఆయన అనేక తప్పులు చేశారు. ఇవాళ వైఎస్ జగన్ మీద విరుచుకుపడడం అన్యాయం.

శరవేగంగా పనులు చేసింది వైఎస్ జగనే..

ఇక దెబ్బతిన్న డయాఫ్రం వాల్‌ను ఏం చేయాలన్న దానిపై పోలవరం ప్రాజెక్టు అథారిటీ ఇప్పటికీ నిర్దిష్టమైన నిర్ణయానికి రాలేదు. ప్రాజెక్టులో 72 శాతం పూర్తిచేశామని చంద్రబాబు చెబుతుండటం విడ్డూరం. ఎందుకంటే..

- మేం కట్టిన పోలవరం స్పిల్‌వే మీద చంద్రబాబు ప్రయాణించారని తెలుసుకోవాలి. మేమే రెండు కాఫర్ డ్యాంలు పూర్తిచేశాం.
- అలాగే, గోదావరి నదిని పూర్తిగా స్పిల్‌వే మీదుగా డైవర్షన్ చేశాం. స్పిల్ ఛానల్, అప్రోచ్ ఛానల్ కూడా పూర్తిచేశాం.
- ఇవికాక క్రిటికల్ నిర్మాణాలు పూర్తిచేసి, గేట్లన్నీ పెట్టి ప్రస్తుతం ఎంత వరద వచ్చినా ఆపరేట్ చేసే పరిస్థితికి ప్రాజెక్టును తీసుకెళ్లాం.

జగన్ ఏ తప్పూ చేయలేదు..

మరోవైపు.. చంద్రబాబు ప్రతి సోమవారం పోలవరం వెళ్తానంటున్నారు. వైఎస్ జగన్‌ను దూషించడమే పనిగా పెట్టుకోబోతున్నారు. కాబట్టి దీన్ని కూలంకషంగా ప్రజలు అర్థంచేసుకోవాలి. నేను మళ్లీ మళ్లీ చెబుతున్నా.. పోలవరం పనుల్లో జగన్ ఎలాంటి తప్పుచేయలేదు. శరవేగంగా ప్రాజెక్టును పూర్తిచేయడానికి చిత్తశుద్ధితో కృషిచేశారు. చంద్రబాబు ప్రభుత్వం చేసిన తప్పిదాలవల్లే పోలవరానికి ఈ దుస్థితి పట్టింది. నాలుగేళ్లకు పూర్తవుతుందా? ఐదేళ్లకు పూర్తవుతుందా? అనే అంశాన్ని అపర మేధావినని, చక్రం తిప్పానని చెప్పుకుంటున్న చంద్రబాబు కూడా చెప్పలేని దుస్థితికి రావడానికి కారణం.. ఆయన ప్రభుత్వం చేసిన తప్పిదం తప్ప మరొకటి కాదు. బాబు హయాంలో జరిగిన విధ్వంసంవల్ల ప్రతి తెలుగువాడూ మూల్యం చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎలాంటి తప్పూ చేయలేదు. చంద్రబాబు తన తప్పులను ఒప్పుకోవాలి.

'హోదా' తీసుకురాకపోతే ద్రోహిగా మిగిలిపోతారు..

చంద్రబాబుకు ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. భగవంతుడు, ప్రజలు మీకు అవకాశం ఇచ్చారు. కూటమిని గెలిపించారు. టీడీపీకి 16 ఎంపీ సీట్లు ఇచ్చారు. కేంద్రంలో ప్రధాని మోదీ చంద్రబాబు మీద ఆధారపడే పరిస్థితి ఇప్పుడు నెలకొంది. చంద్రబాబు చాలా లక్కీ. ఆంధ్రప్రదేశ్‌కు కూడా లక్కీయే. ఇలాంటి పరిస్థితి రావాలని వైఎస్ జగన్ ~చాలాసార్లు కోరుకున్నారు. ఆయనకు రాని అవకాశం టీడీపీకి వచ్చింది. ఇప్పుడు ధర్మపోరాట దీక్షలు అవసరంలేదు. మీ చేతిలో పరిస్థితి ఉంది. ప్రత్యేక హోదాను తీసుకురావాలి. ఆంధ్ర రాష్ట్రానికి ప్రాణం పోయండని చంద్రబాబును రాష్ట్ర ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. దీన్ని ఉపయోగించుకోలేకపోతే రాష్ట్రానికి చంద్రబాబులాంటి ద్రోహి ఎవరూ ఉండరని మనవి చేస్తున్నా. ప్రత్యేక హోదా, రాజధాని నిర్మాణం, పోలవరం నిర్మాణం వంటివన్నీ వదిలేసి వైఎస్ జగన్‌ను రోజూ తిట్టుకుంటూ ఉంటే మిమ్మల్ని ఎవరు నమ్ముతారు బాబూ?

బ్యాలెట్టే బెటర్

అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు

దేశంలోనూ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి



ఈవీఎంలను పక్కన పెట్టాలి

అప్పుడే ప్రజాస్వామ్యం నిస్సందేహంగా మనగలదు

'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి,అమరావతి: ఏపీ ఎన్నికల్లో ఆశ్చర్యకరమైన ఫలితాలపై ఒకవైపు.. ఈవీఎంల ట్యాంపరింగ్, హ్యాకింగ్, అన్‌లాకింగ్ తదితర అంశాలపై మరోవైపు తీవ్రస్థాయిలో చర్చోపచర్చలు నడుస్తున్నాయి. ఫలితాలపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు మాత్రమే కాదు.. ప్రజలు సైతం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సామాజిక మాధ్యమం(ఎక్స్) ఖాతాలో ఓ కీలక సందేశాన్ని పోస్ట్ చేశారు. 'న్యాయం జరగడం ఒక్కటే ముఖ్యం కాదు. జరిగినట్లు కనిపించాలి కూడా. ప్రజాస్వామ్యం గెలవడంతోపాటు నిస్సందేహంగా గెలిచినట్లు కనిపించాలి కూడా. ప్రపంచం మొత్తం మీద అభివృద్ధి చెందిన ప్రజాస్వామ్య దేశాల్లో బ్యాలెట్ ద్వారానే ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఈవీఎంలు కాదు. దేశంలోనూ బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి. ఈవీఎంలను పక్కన పెట్టాలి. ప్రజాస్వామ్యం అసలైన స్ఫూర్తిని కొనసాగించేందుకు మనం కూడా ఇదే దిశగా ముందుకు కదలాలి. అప్పుడే ప్రజాస్వామ్యం నిస్సందేహంగా మనగలదు' అని వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

20న వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

వైఎస్ జగన్ పులివెందుల పర్యటన వాయిదా

సాక్షి,అమరావతి: ఈ నెల 21న అసెంబ్లీ సమావేశాల దృష్ట్యా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ కార్యక్రమాల్లో పలు మార్పులు జరిగాయి. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో విస్తృత స్థాయి సమావేశాన్ని పార్టీ ముందుకు జరిపింది. ఈ నెల 22కు బదులుగా ఈ నెల 20నే విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనుంది. ఇటీవల ఎన్నికల్లో గెలుపొందిన ఎమ్మెల్యేలు, పోటీ చేసిన అభ్యర్థులు ఈ సమావేశానికి హాజరవుతారు. అలాగే పార్లమెంట్ నియోజకవర్గాల్లో పోటీచేసిన అభ్యర్థులు (ఎంపీలు మినహా) ఈ సమావేశానికి హాజరవుతారు. పార్టీ అధ్యక్షుడు వీరికి దిశానిర్దేశం చేయనున్నారు. అలాగే జూన్ 19నాటి పులివెందుల పర్యటనను వైఎస్ జగన్ వాయిదా వేసుకున్నారు.

ఏపీలోని రెండు ఎమ్మెల్సీ స్థానాలకు 12న ఉప ఎన్నిక

- దేశంలో మొత్తం ఐదు స్థానాలకు ఎన్నికలు
- ఈ నెల 25న నోటిఫికేషన్
- షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

సాక్షి, న్యూఢిల్లీ: ఎమ్మెల్యే కోటాలో ఆంధ్రప్రదేశ్‌లోని రెండు ఎమ్మెల్సీ స్థానాల ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. ఏపీతో పాటు కర్ణాటక, బిహార్, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రాల్లోని ఒక్కో స్థానానికి మొత్తం ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జూలై 12న ఉప ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ మేరకు మంగళవారం ఈసీ షెడ్యూల్ ప్రకటించింది. వీటిలో మూడు స్థానాలకు ఎమ్మెల్సీల రాజీనామా కారణంగా, రెండు స్థానాలకు అనర్హత వేటు కారణంగా ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఏపీలో సి.రామచంద్రయ్యపై అనర్హత వేటు పడగా, షేక్ మహ్మద్ ఇక్బాల్ రాజీనామా చేశారు. దీంతో ఈ రెండు స్థానాలకు ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఇద్దరి పదవీకాలం 2027 మార్చి 29 వరకు ఉంది. ఈ ఐదు ఎమ్మెల్సీ స్థానాలకు జూన్ 25న నోటిఫికేషన్ విడుదల కానుంది. జూలై 12న ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు సాయంత్రం 5 గంటలకు ఓట్ల లెక్కింపు జరుగుతుందని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది.

అడ్వొకేట్ జనరల్‌గా దమ్మాలపాటి శ్రీనివాస్

సీఎం చంద్రబాబు నిర్ణయం



సాక్షి, అమరావతి: అందరూ ఊహించిన విధంగానే రాష్ట్ర అడ్వొకేట్ జనరల్ (ఏజీ)గా దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులు కానున్నారు. ఆయన నియామకానికి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఏజీగా దమ్మాలపాటిని నియమించాలన్నది చంద్రబాబు అభిలాష అని, అందుకు అనుగుణంగా చర్యలు తీసుకోవాలని సీఎం ముఖ్య కార్యదర్శి ముద్దాడ రవిచంద్ర మంగళవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) నీరబ్ కుమార్ ప్రసాద్‌ను కోరారు. దీంతో సీఎస్ ఏజీ నియామక ఫైల్‌ను గవర్నర్ ఆమోదం కోసం పంపారు. గవర్నర్ ఆమోద ముద్ర వేయగానే, దమ్మాలపాటి నియామకానికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు వెలువడుతాయి. ఏజీగా దమ్మాలపాటి శ్రీనివాస్ నియమితులు కావడం ఇది రెండోసారి. కాగా, తొలుత ఏజీ పోస్టుకి పలువురి పేర్లు వినిపించాయి. సీనియర్ న్యాయవాది ఆదినారాయణ రావు సహా పలువురి పేర్లు చర్చకు వచ్చాయి. అయితే చంద్రబాబు చివరకు దమ్మాలపాటి వైపే మొగ్గు చూపారు. గతంలో ఏజీగా పనిచేసి ఉండటం, పలు విపత్కర పరిస్థితుల నుంచి చంద్రబాబుతో సహా పార్టీ ఇతర నేతలను బయటపడేయడం, పార్టీలో అందరికీ అందుబాటులో ఉండటం వంటివి దమ్మలపాటికి కలసి వచ్చాయి. న్యాయవ్యవస్థలో దమ్మాలపాటికి మంచిపట్టు ఉండటం కూడా ఆయనకు సానుకూల అంశంగా మారింది. చంద్రబాబు ప్రభుత్వం ఉన్నంత కాలం ఆయన ఏజీ పదవిలో కొనసాగుతారు.

సంక్షేమ పథకాలకు పేర్లు మార్చిన రాష్ట్ర ప్రభుత్వం

సాక్షి, అమరావతి: సాంఘిక సంక్షేమశాఖ పరిధిలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేసిన ఆరు పథకాలకు టీడీపీ ప్రభుత్వం పేర్లు మార్చింది. ఈ మేరకు సాంఘిక సంకేమ శాఖ కార్యదర్శి కె.హర్షవర్ధన్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్‌గా 'నాడు–నేడు' డాష్ బోర్డు పేరు మార్పు

ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం 'మనబడి నాడు–నేడు' పేరుతో ప్రత్యేక విభాగాన్ని అందుబాటులోకి తెచ్చింది. ఈ పనుల పురోగతితో పాటు అన్ని అంశాలను పరిశీలించి తగు నిర్ణయం తీసుకునేందుకు ఓ ప్రత్యేక కమిషనర్‌ను కూడా నియమించింది. అయితే, ఇప్పటి వరకు పాఠశాల విద్యాశాఖలో 'నాడు–నేడు' పేరుతో ఉన్న వెబ్‌సైట్‌ను 'స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్'గా పేరు మార్చారు. ఈ విభాగంలో రాష్ట్రంలోని సుమారు 45 వేల ప్రభుత్వ పాఠశాలల పునర్ నిర్మాణంతో పాటు 11 రకాల సదుపాయాలను కల్పించే బృహత్తర కార్యక్రమాన్ని ఈ విభాగం చేపట్టింది.

2019-2024 మధ్య పథకం పేరు	ప్రస్తుతం మార్చిన పేరు
వైఎస్సార్ కళ్యాణమస్తు	చంద్రన్న పెళ్లి కానుక
వైఎస్సార్ విద్యోన్నతి	ఎన్టీఆర్ విద్యోన్నతి
జగనన్న విద్యా దీవెన	పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్(ఆర్టీఎఫ్)
జగనన్న వసతి దీవెన	పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్స్(ఎంటీఎఫ్)
జగనన్న విదేశీ విద్యా దీవెన(ఎస్సీలకు)	అంబేడ్కర్ ఓవర్‌సీస్ విద్యానిధి(ఏఓవీఎన్)
జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం(జేసీఎస్‌పీ)	ఇన్‌సెంటీవ్స్ ఫర్ సివిల్ సర్వీసెస్ ఎగ్జామ్స్

కొనసాగుతున్న

టీడీపీ విధ్వంసం

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

- వైఎస్సార్‌సీపీ జెండా దిమ్మ ధ్వంసం
- ముక్కలుముక్కలుగా శిలాఫలకాలు



పల్నాడు జిల్లా నాదెండ్ల ఎస్సీ కాలనీలో టీడీపీ కార్యకర్తలు ధ్వంసం చేసిన శిలాఫలకం



అల్కా యాగ్నిక్

చెవి జాగ్రత్త

వేల కొలది పాటలు పాడిన
గాయనికి హటాత్తుగా పాట వినపడకపోతే?
వాయిద్య ధ్వని వినపడకపోతే?
సంగీతమే చెవులకు సోకకపోతే?
అసలు ఏమీ వినిపించకపోతే?
అంతకు మించిన వేదన ఉంటుందా?
గాయని అల్కా యాగ్నిక్ తనకు
అరుదైన 'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్'
వచ్చిందని ప్రకటించింది.
'మిత్రులారా... పెద్ద పెద్ద శబ్దాలకు,
హెడ్‌ఫోన్ల అతి వాడకానికి దూరంగా ఉండండి' అని హెచ్చరించింది.
ఆమె అవస్థ నుంచి మనం నేర్చుకోవాల్సిందేమిటి?

ఆమెకు పాట వినపడదు



'ఏక్ దో తీన్ చార్ పాంచ్ ఛే సాత్' (తేజాబ్), 'చోలీ కే పీఛే క్యా హై' (ఖల్ నాయక్), 'తాళ్ సే తాళ్ మిలా' (తాళ్) వంటి వందలాది హిట్ పాటలు పాడిన అల్కా యాగ్నిక్ (56) ఏ సంగీతాన్ని విని, పాడాలో ఆ సంగీతాన్ని వినలేని హఠాత్ స్థితికి వచ్చి పడింది. ఆమె 'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్'తో బాధ పడుతున్నట్టు డాక్టర్లు నిర్ధారించారు. ఈ విషయాన్ని ఆమె తన ఇన్‌స్టా అకౌంట్ 'ది రియల్ అల్కా యాగ్నిక్' ద్వారా లోకానికి వెల్లడి చేసింది.

ఆమె చెప్పింది ఏమిటి?

'కొన్ని వారాల క్రితం నేను విమానం దిగగానే అసలు ఏమీ వినపడని స్థితికి చేరుకున్నాను. ఆ దెబ్బ నుంచి నేను ధైర్యం చిక్కబట్టుకోవడానికి కొన్నివారాల సమయం పట్టింది. ఇన్నాళ్లుగా నేను ఎందుకు కనపడటం లేదని అడుగుతున్న అభిమానులకు, మిత్రులకు నేను ఒక విషయం చెప్పదలుచుకున్నాను. నేను 'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్' అనే అరుదైన జబ్బుతో బాధ పడుతున్నట్టు డాక్టర్లు తేల్చారు. ఇది వైరల్ అటాక్ అని చెప్పారు. ఈ స్థితి నుంచి కోలుకొని నేను తిరిగి వస్తానని భావిస్తున్నాను. దయచేసి అందరూ పెద్ద శబ్దాలకు, హెడ్‌ఫోన్ల విపరీత వాడకానికి దూరంగా ఉండండి' అని తన ఇన్‌స్టా అకౌంట్‌లో రాసిందామె.

'సెన్సోరిన్యూరల్ హియరింగ్ లాస్' అంటే?

ఇది హఠాత్తుగా వచ్చే చెవుడు. చెవిలోని హియరింగ్ నర్వ్ మీద వైరస్ దాడి చేయడంతో ఆ నర్వ్ ఉబ్బుతుంది. అయితే ఆ నర్వ్ ఒక ఇరుకైన అస్థిక ద్వారా ప్రయాణిస్తుంది కనుక ఎప్పుడైతే ఉబ్బుతుందో అప్పుడు ఒత్తిడికి లోనవుతుంది. దాంతో పనిచేసే గుణం కోల్పోతుంది. దీనివల్ల శబ్దాలు మెదడుకు చేరే వ్యవస్థ దెబ్బ తింటుంది. హఠాత్తుగా చెవుడు వస్తుంది.

- ఈ స్థితికి ముందు ఎటువంటి లక్షణాలూ కనిపించవు.
- ఒక చెవితో మొదలై రెండోచెవికి వ్యాధి రావచ్చు. ఒకోసారి రెండు చెవులకు ఒకేసారి రావచ్చు.
- వార్ధక్యం వల్ల, అనువంశికంగా ఈ వ్యాధి రావచ్చు.
- వైరల్ ఇన్ఫెక్షన్ వల్ల రావచ్చు.
- ఆటో ఇమ్యూన్ డిసీజ్ వల్ల రావచ్చు.
- కొన్ని రకాల మందుల వాడకం వల్ల రావచ్చు.
- పెద్ద పెద్ద శబ్దాలు వినడం, పెద్ద శబ్దంతో హెడ్ ఫోన్ ఎక్కువ సేపు వాడటం వల్ల రావచ్చు.

చికిత్స

- ఈ స్థితి కనిపించిన వెంటనే చికిత్సకు వెళితే కొన్ని రకాల హైడోస్ స్టెరాయిడ్స్ వల్ల పరిస్థితిని మెరుగు పరిచే వీలు ఉంటుంది.
- కొంతమంది ఏ చికిత్సా చేయించుకోకపోయినా కొన్నాళ్లకు యాభై శాతం వినికిడి రావచ్చు.
- కొందరి విషయంలో కాక్లియర్ ఇంప్లాంట్స్ పని చేయవచ్చు.
- ఎక్కువమంది విషయంలో చికిత్స ఉండదనే చెప్పాలి.
- వినికిడి సాధనాలతో వీరు జీవితం గడపాల్సి వస్తుంది.

అల్కా కోలుకోవాలి

అల్కా తన పరిస్థితిని ప్రకటించిన వెంటనే ఆమె సహ గాయకులు సోను నిగమ్, ఇలా అరుణ్, శంకర్ మహదేవన్, కుమార్ సాను స్పందించారు. 'మళ్లీ నిన్ను యథావిధిగా చూస్తాం. మా ప్రేమ నీతో ఉంది' అని వారు కామెంట్లు చేశారు. ధైర్యం చెప్పారు. గాయనిగా ఉంటూనే అల్కా వివిధ రియాల్టీ షోలలో హోస్ట్‌గా పాల్గొంటూ ఉంటుంది. ఆమె మన బాలూతో పాడిన 'దేఖా హై పెహెలీ బార్' (సాజన్) వంటి పాటలు ఇప్పటికీ వినిపిస్తూనే ఉంటుంది. అలాగే ప్రపంచవ్యాప్తంగా స్టేజ్ షోలు ఇస్తూ ఉంటుంది. ఇప్పుడు కొన్నాళ్ల పాటు వాటన్నింటికి ఆమె దూరంగా ఉండాల్సిందే. అన్నింటికంటే పెద్ద ఇబ్బంది ఏమిటంటే హఠాత్తుగా వచ్చిన చెవుడు వల్ల తిరిగి సహజంగా / కృత్రిమంగా వినికిడి వ్యవస్థ పునరుద్ధరింపబడే వరకూ అసలేమీ వినిపించకపోవడంతో అయోమయం ఏర్పడుతుంది. డిప్రెషన్ రావచ్చు. జీవితేచ్ఛ నశించవచ్చు. బంధుమిత్రుల గట్టి సపోర్ట్ ఉంటే, ఆత్మవిశ్వాసం నిలుపుకుంటే తప్ప ఈ పరిస్థితి దాటటం కష్టం. 'మీ ప్రార్థనల్లో నన్ను ప్రస్తావించండి' అని కోరిన అల్కాకు అభిమానుల ప్రార్థనలు సమృద్ధిగా ఉన్నాయి. ఆమె తప్పక కోలుకుంటుందని ఆశిద్దాం.

యూత్ పల్స్

'నా కాళ్లకు ప్రయాణ దాహం పట్టుకుంది' అంటున్నారు యువ ఆర్టిస్ట్‌లు.
ఆ ప్రయాణ అనుభవాలు వారి కళకు బలాన్ని ఇస్తున్నాయి. సమాజంతో కలిసి పనిచేయడానికి అవసరమైన స్ఫూర్తిని ఇస్తున్నాయి. పబ్లిక్ ఆర్ట్‌గా ప్రాచుర్యం పొందిన 'మ్యూరల్ ఆర్ట్' ద్వారా మానసిక ఆరోగ్యం నుంచి మహిళాశక్తి వరకు ఎన్నో విషయాలను ప్రచారం చేస్తున్నారు. కార్టూన్‌లతో నవ్వించడమే కాదు ఆరోగ్య సమస్యల గురించి ఆలోచించేలా చేస్తున్నారు. కళకు సామాజిక ప్రయోజనాన్ని జోడించిన వారి క్రియేటివ్ జర్నీ గురించి....

సామాజిక కళకు సై అంటున్నారు...



ముంబైకి చెందిన మేఘకు మ్యూరల్ ఆర్ట్ అంటే ఎంత ఇష్టమో ప్రయాణాలు అంటే కూడా అంతే ఇష్టం. ఆ ప్రయాణాలలో ప్రకృతి అందాలను ఆస్వాదించడం అంటే ఇష్టం.

ఆమె దృష్టిలో ప్రకృతి అనేది విశాలమైన కాన్వాస్. అస్సాంలోని పచ్చటి కొండల నుంచి జమ్మూ కశ్మీర్‌లోని తెల్లటి మంచుల కొండల వరకు నదుల జలకళ నుంచి ఎడారుల ఇసుక మెరుపుల వరకు ఎన్నో ప్రాంతాల అందాలను ఆస్వాదించింది.

తన కళకు ఇన్‌స్పిరేషన్ తాను వెళ్లిన ప్రాంతాలే.

'ప్రయాణం అంటే ప్రతి రోజు ఒక కొత్త ఎనర్జీతో నిద్ర లేచే ఉత్సాహం. ఆ ఉత్సాహ శక్తి మన కళలో ప్రతి ఫలిస్తుంది' అంటుంది మేఘ.

మానసిక ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కలిగించడానికి తన మ్యూరల్ ఆర్ట్‌ను సాధనంగా వాడుకుంటుంది స్నేహ చక్రవర్తి. 'మైండ్ అండ్ మ్యాటర్' చారిటబుల్ ట్రస్టుతో కలిసి 'ది ట్రావెల్ అండ్ పెయింట్: ఇండియా టూర్' చేసింది. ఆల్ ఇండియా ఆర్ట్ టూర్‌లో ఎన్నో కొత్త విషయాలు తెలుసుకుంది. అట్టడుగు వర్గాల పిల్లలతో సంభాషించి వారితో స్నేహం చేసే అవకాశం వచ్చింది.

'కళ' అనేది మానసిక ఆరోగ్యానికి ఎలా ఉపయోగపడుతుందో విస్తృతంగా ప్రచారం చేస్తోంది స్నేహ చక్రవర్తి.

తిరువనంతపురానికి చెందిన అమితకు చిన్నప్పటి నుంచి చిత్రకళ అంటే ఇష్టం. ప్రయాణాలు అంటే మరీ ఇష్టం.

'మొదట్లో ప్రముఖ చిత్రకారుల ఆర్ట్ వర్క్స్‌ను అనుసరిస్తూ ఆనందించేదాన్ని. అయితే అసలైన ఆనందం నాకు వివిధ ప్రాంతాలకు వెళ్లినప్పుడు అక్కడి ప్రజలతో మాట్లాడినప్పుడు దొరికింది. ఒక ప్రాంతానికి తనదైన అందాలు ఉన్నట్లే సమస్యలు కూడా ఉంటాయి. ఆ సమస్యలను నా కళ ద్వారా ప్రతిబింబించాలనుకుంటు న్నాను' అంటుంది అమిత.

చిత్రకళకు సంబంధించి నిర్దిష్టమైన శైలికి పరిమితం కావడం అంటే అమితకు ఇష్టం లేదు. ఐడియాల విషయంలో ఔట్ ఆఫ్ బాక్స్ ఆలోచించడం ఆమెకు ఇష్టం. 'యూనిక్ ఎక్స్‌ప్రెషన్'ను అమితంగా ఇష్టపడుతుంది.

మేఘ, స్నేహ, అమితలు మాత్రమే కాదు దేశవ్యాప్తంగా ఎంతోమంది యువ కళాకారులు తమవైన కళారూపాలతో సమాజంతో కలిసి నడుస్తున్నారు. సామాజిక కళకు సై అంటున్నారు.



ఐశ్వర్య మణివణ్ణన్

జస్ట్ లోకల్...

చెన్నైకి చెందిన పదహారుమంది యువ ఆర్టిస్ట్‌లు ఐశ్వర్య మణివణ్ణన్ మార్గదర్శకత్వంలో 'లోకల్' థీమ్‌తో వందకుపైగా కళారూపాలు ఆవిష్కరించారు.

టెక్నాలజీపై అతిగా ఆధారపడడం వల్ల కోల్పోతున్నది ఏమిటో తెలియజేస్తాయి ఈ చిత్రాలు. సామాజిక మాధ్యమాల ద్వారా ఎక్కడో జరిగే సంఘటనల గురించి తెలుసుకునే మనం, సమీపంలోని వాటి గురించి మాత్రం తెలుసుకోలేము. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడెక్కడో విషయాల గురించి అనర్గళంగా చెప్పగలిగే వాళ్లలో చాలామందికి లోకల్ విషయాలలో అంతంత మాత్రమే అవగాహన ఉంటుంది.

'తమ స్థానికతతో కళాకారులు మమేకం కావడానికి లోకల్ అనే థీమ్ ఉపయోగపడుతుంది' అంటుంది ఐశ్వర్య. చెన్నైలోని వైబ్రెంట్ స్ట్రీట్ లైఫ్... అందులోని సాంస్కృతిక వైవిధ్యం అంటే ఐశ్వర్యకు ఇష్టం. తన స్టూడెంట్స్‌తో కలిసి నార్త్ చెన్నైలోని కాశిమేడుకు వెళ్లింది. గంభీరమైన సముద్రాన్ని చూసిన తరువాత స్టూడెంట్స్‌కు కొత్తప్రపంచంలోకి వచ్చినట్లు అనిపించింది. ఎంతోమంది జాలరులతో మాట్లాడారు. ఒక రకంగా చెప్పాలంటే ఇది వారి ట్రాన్స్‌ఫర్‌మేటివ్ జర్నీ. అక్కడి దృశ్యాలు స్టూడెంట్స్ ముందున్న కాన్వాస్‌లోకి నడిచొచ్చాయి. సహజత్వాన్ని ప్రతిబింబించాయి.

ఈజ్ దట్ యూ?



ప్రణీత కొవ్రేకర్

'టాలెంటెడ్ ఇలస్ట్రేటర్'గా చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది ముంబైకి చెందిన ప్రణీత కొవ్రేకర్. దైనందిన జీవిత దృశ్యాల నుంచి మానసిక ఒత్తిడి, ఆందోళన వరకు ఎన్నో అంశాలు ఆమె చిత్రాలకు థీమ్‌గా ఉంటాయి. ఊహల్లో నుంచి కాకుండా సొంత అనుభవాల్లో నుంచి చిత్రాలు వేయడం అంటే ప్రణీతకు ఇష్టం.

'కళకు సామాజిక ప్రయోజం ఉంది. అది శక్తిమంతమైన మాధ్యమం' అంటున్న ప్రణీత తన కళ ద్వారా మానసిక ఆరోగ్యంపై అవగాహన తీసుకువచ్చే ప్రయత్నం చేస్తోంది. వివిధ సామాజిక మాధ్యమాలను తన కళకు వేదికగా ఉపయోగించుకుంటోంది.

యాంగ్జయిటీ డిజార్డర్‌లపై 'ఇజ్ దట్ యూ?' టైటిల్‌తో వేసిన డ్రాయింగ్ సిరీస్‌కు మంచి స్పందన వచ్చింది. తన బొమ్మల ద్వారా నవ్వించడంతోపాటు ఆలోచించేలా చేయడం ప్రణీత ప్రత్యేకత.

'డా.ఇంటర్‌నెట్' పేరుతో యాంగ్జయిటీని తగ్గించుకోవడానికి ఏంచేస్తే బాగుంటుందో చిత్రం చివర సలహా కూడా ఇస్తుంది ప్రణీత.

బ్యూటిప్స్

యాక్నే పోవాలంటే...

మాయిశ్చరైజర్‌లో రెండు చుక్కల టీట్రీ ఆయిల్ కలిపి ముఖానికి రాయాలి. ఇలా రోజూ చేస్తుంటే వారం- పది రోజుల్లోనే మచ్చలు తొలగి చర్మం కాంతిమంతమవుతుంది.

ముడతలు తొలగడానికి...

టొమాటో రసం పావు కప్పు తీసుకుని అందులో దూది ముంచి ముఖానికి అద్దాలి. ఆరిన తర్వాత వలయాకారంగా మర్దన చేస్తూ చన్నీటితో శుభ్రం చేయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమగా కాంతిమంతంగా మారుతుంది. వార్ధక్య లక్షణాలుగా కనిపించే ముడతలు కూడా తొలగిపోతాయి.




మృతకణాలు తొలగాలంటే...

బొప్పాయిగుజ్జు పావు కప్పు తీసుకుని అందులో టీ స్పూన్ పన్నీరు (రోజ్‌వాటర్) కలిపి ముఖానికి రాయాలి. పది లేదా పదిహేను నిమిషాలకు తేమను చర్మం పీల్చుకుంటుంది. అప్పుడు వేళ్లతో వలయాకారంగా ముఖమంతా మర్దన చేసి చన్నీటితో శుభ్రం చేయాలి. బొప్పాయిలోని ఎంజైమ్‌లు చర్మంలోని మృతకణాలను తొలగించి చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుతాయి.


చర్మం పొడిబారుతుంటే...

కలబంద గుజ్జును ముఖం, మెడ, చేతులకు, పాదాలకూ రాయాలి. ఇలా చేయడం వల్ల చర్మం తేమను గ్రహించి కాంతిమంతమవుతుంది. ఇన్‌ఫెక్షన్‌లు, దద్దుర్లు కూడా తగ్గిపోతాయి.

కిచెన్ టిప్స్



- ఉల్లిపాయ ముక్కలను నూనెలో వేయించేటప్పుడు కొద్దిగా ఉప్పు వేస్తే త్వరగా మెత్తబడతాయి.
- నిమ్మకాయలు ఎక్కువ రోజులు నిలువ ఉండాలంటే నీటిలో వేసి ఫ్రిజ్‌లో పెట్టాలి.
- వెల్లుల్లి రేకలను ముప్పై సెకన్లపాటు పెన మీద వేడిచేస్తే పొట్టు త్వరగా వస్తుంది.
- ఆమ్లెట్ కోసం కోడిగుడ్డును గిన్నెలో వేసి గిలక్కొట్టే ముందు గిన్నెలో నీళ్ల పోసి వంపేస్తే గుడ్డు సొన గిన్నెకు అంటుకోకుండా ఉంటుంది.
- వంటలో ఉప్పు ఎక్కువైందనిపిస్తే వెంటనే పచ్చి బంగాళాదుంపను చక్రాలుగా కోసివేయాలి. బంగాళాదుంప ముక్కలు ఉప్పును పీల్చుకుంటాయి.
- క్యాలీఫ్లవర్ వండిన తర్వాత కూడా తెల్లగా ఆకర్షణీయంగా కనిపించాలంటే వండేటప్పుడు ఒక టీ స్పూన్ పాలు కలపాలి.
- అల్లంపై తొక్క తీయడానికి చాకుకు బదులుగా స్పూను వాడితే సులభంగా పోతుంది. అల్లాన్ని ఫ్రీజర్‌లో నిల్వ ఉంచితే ఎక్కువ రోజులు ఉంటుంది. తొక్క సులభంగా వస్తుంది.



గిరిజన నేతకు 'రిచా' బ్రాండ్



రిచా మహేశ్వరి

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అయిన రిచా మహేశ్వరి కెరీర్‌లో సంతృప్తిని కలిగించే మూలాలను వెతికింది అయితే వాటి ఆచూకి ఆ ఉద్యోగంలో లభించలేదు. ఫలితంగా లాంగ్ లీవ్ పెట్టి దేశవ్యాప్తంగా ఉన్న ప్రాచీన గిరిజన తెగల వద్దకు వెళ్లింది. ఒడిశాలో గిరిజన తెగల కళాత్మక నేత పనితో మమేకమై ఆ అరుదైన కళను ప్రపంచానికి పరిచయం చేస్తుంది. ఉద్యోగి నుంచి వ్యాపారవేత్తగా మారిన తన ప్రయాణం గురించి వివరించే విశేషాలు మనదైన ప్రపంచాన్ని వెతుక్కునేందుకు తప్పక ఉపయోగపడతాయి.

''నేను పుట్టి పెరిగింది ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్‌లో. మా నాన్నగారిది ఒడిశా. నాన్న బ్యాంకు ఉద్యోగి కావడం, తరచూ బదిలీలు ఉండటం వల్ల కుటుంబంతో పాటు దేశవ్యాప్తంగా తిరిగాను. ఇంజినీరింగ్ డిగ్రీ తర్వాత శాప్ కెరీర్‌ను ఎంచుకున్నాను. కొన్నాళ్ల తర్వాత ఆ ఉద్యోగం నాకు డబ్బు మాత్రమే ఇస్తుంది కానీ, ఉద్యోగం చేసిన సంతృప్తి నివ్వదనిపించింది. దాంతో 2021లో ఏడాదిపాటు ఉద్యోగానికి లీవ్ పెట్టేసి దేశంలోని చాలా గ్రామాలు తిరిగాను. ఒడిశాలోని గ్రామాల్లోకి వెళ్లినప్పుడు నాదైన ప్రపంచంలోకి వచ్చిన భావన నాలో కలిగింది. అక్కడి గిరిజన సంఘాలను కలిశాను. వారి కళాత్మక వస్త్ర శ్రేణులను చూశాను. నాకు అవి అత్యద్భుతంగా కనిపించాయి.

నేత పని...

కొండపత్తితో అక్కడి తెగల కళాత్మక నేత పనితనాన్ని ఆధునిక ప్రపంచానికి పరిచయం చేయాలనుకున్నాను. 'బోయిటో' పేరుతో నాదైన డిజైనర్ స్టూడియో ఏర్పాటు చేశాను. అశోకుని కాలంలో ఈ కళింగ రాజ్యానికి గొప్ప చరిత్ర ఉంది. ఓడరేవు ద్వారా విదేశీ వాణిజ్యాన్ని ఎంతో అభివృద్ధి చేశారు. ఇక్కడి పత్తిని ఇండోనేషియా, చైనా వంటి దేశాలకు తీసుకెళ్లి అక్కడి పట్టును తెచ్చేవారు. బోట్‌ను బోయిటో అని కూడా పిలుస్తారు. ఆ పేరునే మా బ్రాండ్‌కు పెట్టాను. టెక్స్‌టైల్స్ ద్వారా ఒడిశాను అన్వేషిస్తూ పూరీ సమీపంలోని పిప్లిలో నా మొదటి సంస్థను ప్రారంభించాను. పిప్లి అప్లిక్ వర్క్‌కు ప్రసిద్ధి. నుపట్నాలోని ఖండువా, సంబల్‌పూర్, పశ్చిమ బెల్ట్‌లోని సోనేపూర్, బర్గర్, బార్పల్లి వంటి ఇతర నేత యూనిట్‌లు కలుసుకున్నాను. కోరాపూట్‌లో కోట్‌పాడ్ శాలువాలకు ప్రసిద్ధి. దీంతో కోట్‌పాట్ నేత సంఘాన్ని కలుసుకున్నాను. ఆ తర్వాత చుట్టుపక్కల పర్వతాలను డిజైన్ చేసినట్టుగా ఉండే కప్పగండ శాలువాలను తయారు చేసే డోంగ్రియా సంఘం వారితో చర్చించాను. మల్కన్‌గిరిలో నివసించే ప్రాచీన తెగలలో ఒకటైన బోండాల గురించి తెలుసుకున్నాను. వారి అద్భుతమైన, అందమైన నెక్‌పీస్, తలపాగా డిజైన్లను చూశాను. వారంతా వారి సొంత సంస్కృతిని ఇప్పటికీ కాపాడుకుంటున్నాను. శరీరాన్ని పూసలతో కప్పుతారు. దిగువ శరీరాన్ని కప్పి ఉంచే రింగా అనే చిన్న వస్త్రాన్ని ఉపయోగిస్తారు. సంప్రదాయకంగా కెరాంగా అనే చెట్టు ఫైబర్‌ను ఉపయోగించి ఆ వస్త్రాన్ని తయారు చేస్తారు. ఇప్పుడు దానిస్థానంలో పత్తి నుంచి తీసిన నూలు దారాన్ని వాడుతున్నారు.

డాక్యుమెంట్ వైపుగా..

ఇక్కడి తెగల వారితో మాట్లాడుతూ, వారితో కలిసి ఉంటున్నప్పుడు స్వచ్ఛమైన మనుషుల మధ్య నేను ఒదిగిపోతున్నాను అనిపించింది. వీరంతా చెప్పే కథలను డాక్యుమెంట్ చేస్తున్నాను. ఈ అద్భుతమైన పనితనం, ప్రత్యేకమైన కళారూపాలు ప్రపంచానికి తెలియాలి అనే ఆలోచనతో డిజైనర్లతో కలిసి పనిచేయాలనుకున్నాను. అలా ప్రయాణాలు చేస్తూ, ఆలోచిస్తూ, పనులను ఆచరణలో పెట్టడానికి ఆరునెలల సమయం పట్టింది.



సంఘాలతో కలిసి..

గిరిజన తెగల నేత పనితనాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి ముందు అక్కడి సంఘాలను కలిసి మాట్లాడాను. ఇది ఒక రోజులో జరగలేదు. మొదట్లో చాలా కష్టమైంది. తూర్పు బెల్ట్‌లోని నేత కార్మికులను కలిసినప్పుడు నా కోసం ప్రత్యేక రంగులలో చీరలను తయారుచేయగలవా అని అడిగాను. కానీ, వారి నుంచి ఎలాంటి స్పందన లేదు. దీంతో నాకూ పట్టుదల పెరిగింది. వారితో కలిసి కూర్చోవడం, మాట్లాడటం చేస్తూ వచ్చాను. నా మార్గంలోకి వారు రావాలంటే వారి సంస్కృతిని నేను పూర్తిగా అర్థం చేసుకోవాలి అని గుర్తించాను. ఒక 'రింగా' నేయడానికి బోండా కమ్యూనిటీకి చెందిన నలుగురు ఒడియా మహిళలు ఒప్పుకున్నారు.



ప్రత్యేకంగా..

కోరాపుట్‌లోని గడబా కమ్యూనిటీచే నేసిన కేరాంగ్ వస్త్రాల కోసం అన్వేషిస్తున్నాను. డిజైనర్లు, నేత కార్మికులు చర్చలు జరుపుతున్నారు. ఫాస్ట్ ఫ్యాషన్‌కు విరుద్ధంగా మేం అందించేవి తరతరాలుగా ధరించడానికి వీలైన క్లాసిక్ కళాఖండాలు. గిరిజన సంఘాలు మేం సూచించిన స్వల్ప రంగు మార్పులకు, సవాళ్లకు సిద్ధంగా ఉన్నాయి. బోయిటో నుంచి ట్రెంచ్ కోట్లు, అన్ని రకాల జాకెట్లు తయారు చేస్తున్నాం. ఇప్పుడు ఇదొక లగ్జరీ ఫ్యాషన్ బ్రాండ్‌గా పేరొందింది. మేం వీటిని అంతర్జాతీయంగా కూడా తీసుకెళుతున్నాం. మా కేటలాగ్‌లో ట్రెంచ్ కోట్లు, కిమోనో జాకెట్లు, ప్యాంటు, బేసిక్ షర్టులు, డ్రెస్సులు ఉన్నాయి. పూసలతో కూడిన బోండా జాకెట్, డోంగ్రియా డిజైన్, కోట్‌పాడ్ మోటిఫ్‌లు.. మా డిజైన్స్‌లో తీసుకువస్తున్నాం. కొన్ని నెలలుగా బోయిటోతో కలిసి పని చేయడం వల్ల నా ఆర్థిక స్థిరత్వం గణనీయంగా మెరుగుపడింది. ఇప్పుడు నాలుగైదు వారాలకు ఒకసారి నా పని కోసం సంఘాలను చేరుకుంటాను. వారికి కావల్సిన మొత్తాన్ని చెల్లిస్తూ, నాకు కావల్సిన డిజైన్లను పొందుతాను. కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం వహించే హెరిటేజ్ షోలను కూడా చేయాలని చూస్తున్నాం. ప్రతి వస్త్ర డిజైన్ వెనుక అది నేసిన విధానం గురించి కథగా కూడా అందిస్తున్నాం'' అంటూ చేస్తున్న పని, దాని వెనుక దాగున్న కృషిని వివరిస్తుంది ఈ నిరంతర అన్వేషి.



అంతర్జాతీయ క్రికెట్‌కు బౌల్ట్ గుడ్‌బై

న్యూజిలాండ్ పేస్ బౌలర్ ట్రెంట్ బౌల్ట్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. టి20 ప్రపంచకప్‌లో పాపువా న్యూగినీతో మ్యాచ్ ముగిశాక 34 ఏళ్ల బౌల్ట్ తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెల్లడించాడు. 2011లో బౌల్ట్ తొలిసారి న్యూజిలాండ్ సీనియర్ జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. తన 13 ఏళ్ల అంతర్జాతీయ కెరీర్‌లో బౌల్ట్ 78 టెస్టులు ఆడి 317 వికెట్లు, 114 వన్డేలు ఆడి 211 వికెట్లు, 61 టి20 మ్యాచ్‌లు ఆడి 83 వికెట్లు పడగొట్టాడు. ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో బౌల్ట్ రాజస్తాన్ రాయల్స్, ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్, ముంబై ఇండియన్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లకు ఆడాడు.

మూడో ర్యాంక్‌లో స్మృతి మంధాన



అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ మహిళల వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత జట్టు వైస్ కెప్టెన్ స్మృతి మంధాన రెండు స్థానాలు ఎగబాకి 715 పాయింట్లతో మూడో ర్యాంక్‌లో నిలిచింది. బెంగళూరులో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి వన్డేలో స్మృతి సెంచరీ సాధించడంతో ఆమె ర్యాంక్ మెరుగైంది. గత వారం వరకు టాప్ ర్యాంక్‌లో ఉన్న శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు 768 పాయింట్లతో రెండో ర్యాంక్‌కు పడిపోయింది.

చాంపియన్ అర్జున్



జెర్ముక్ (అర్మేనియా): స్టెపాన్ అవగ్యాన్ స్మారక అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో భారత యువ గ్రాండ్‌మాస్టర్, తెలంగాణకు చెందిన ఇరిగేశి అర్జున్ విజేతగా నిలిచాడు. పది మంది గ్రాండ్‌మాస్టర్ల మధ్య నిర్ణీత తొమ్మిది రౌండ్లపాటు ఈ టోర్నీ జరిగింది. వరంగల్ జిల్లాకు చెందిన 21 ఏళ్ల అర్జున్ 6.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. నాలుగు గేముల్లో నెగ్గిన అర్జున్, మిగతా ఐదు గేమ్‌లను 'డ్రా' చేసుకొని అజేయంగా నిలిచాడు. తాజా ప్రదర్శనతో అర్జున్ లైవ్ చెస్ రేటింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 2778.1 పాయింట్లతో ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నాలుగో స్థానానికి చేరుకోవడంతోపాటు భారత నంబర్‌వన్‌గా ఉన్నాడు.

గట్టెక్కిన ఫ్రాన్స్



డసెల్‌డార్ఫ్ (జర్మనీ): 'యూరో' కప్ ఫుట్‌బాల్ టోర్నీలో మాజీ చాంపియన్ ఫ్రాన్స్ జట్టు గెలుపు బోణీ కొట్టింది. ఆస్ట్రియా జట్టుతో మంగళవారం జరిగిన గ్రూప్ 'డి' మ్యాచ్‌లో ఫ్రాన్స్ 1–0 గోల్‌తో గెలిచింది. ఆట 38వ నిమిషంలో ఆస్ట్రియా ప్లేయర్ మాక్సిమిలన్ వొబెర్ సెల్ఫ్ గోల్ చేయడంతో ఫ్రాన్స్ ఖాతా తెరిచింది. అనంతరం రెండు జట్లు మరో గోల్ చేయడంలో విఫలమయ్యాయి. చివర్లో ఫ్రాన్స్ స్టార్ ప్లేయర్, కెప్టెన్ ఎంబాపె హెడర్ షాట్ కోసం ప్రయత్నించి ఆస్ట్రియా ప్లేయర్ కెవిన్ డాన్సోను ఢీకొట్టడంతో ఎంబాపె ముక్కుకు గాయమైంది. దాంతో ఈ టోర్నీలోని తదుపరి మ్యాచ్‌లకు ఎంబాపె అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. గ్రూప్ 'ఎఫ్'లో టర్కీ జట్టు శుభారంభం చేసింది. జార్జియాతో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో టర్కీ 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. టర్కీ తరఫున మెర్ట్ ముల్డర్ (25వ ని.లో), అర్డా గులెర్ (65వ ని.లో), కరీమ్ (90+7వ ని.లో) ఒక్కో గోల్ చేయగా... జార్జియా జట్టుకు మికాటాడ్జె (32వ ని.లో) ఏకైక గోల్ అందించాడు.

విండీస్ ధనాధన్

అఫ్గానిస్తాన్‌పై 104 పరుగులతో ఘనవిజయం

పూరన్ మెరుపు ఇన్నింగ్స్ ● 53 బంతుల్లో 6 ఫోర్లు, 8 సిక్స్‌లతో 98



పూరన్

గ్రాస్ ఐలెట్: అహా..! ఎట్టకేలకు టి20 ప్రపంచకప్ లీగ్ దశ ఆఖరి మ్యాచ్‌లో క్రికెట్ ప్రేక్షకులకు అసలైన మజా లభించింది. నామమాత్రమైన మ్యాచ్‌లో కరీబియన్ హిట్టర్ నికోలస్ పూరన్ (53 బంతుల్లో 98; 6 ఫోర్లు, 8 సిక్సర్లు) అఫ్గానిస్తాన్‌పై ఆకాశమే హద్దుగా చెలరేగాడు. అతని వీరవిహారంతో ఈ టి20 ప్రపంచకప్‌లోనే ఆతిథ్య వెస్టిండీస్ అత్యధిక స్కోరు నమోదు చేసింది. ఇప్పటికే ఇరుజట్లు తదుపరి 'సూపర్–8' దశకు అర్హత సంపాదించాయి. దీంతో గ్రూప్ 'సి'లో ఎవరికీ ఫలితంతో పని లేని ఈ మ్యాచ్‌లో విండీస్ 104 పరుగుల భారీ తేడాతో అఫ్గానిస్తాన్‌పై జయభేరి మోగించింది. టాస్ నెగ్గిన అఫ్గాన్ ఫీల్డింగ్ ఎంచుకోగా... ముందుగా బ్యాటింగ్‌కు దిగిన విండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 218 పరుగులు చేసింది.

ఒకే ఓవర్లో 36 పరుగులు...

విండీస్ ఇన్నింగ్స్ మొదలైన కాసేపటికే ఓపెనర్ బ్రాండన్ కింగ్ (7) రెండో ఓవర్లో నిష్క్రమించాడు. క్రీజులో ఉన్న మరో ఓపెనర్ జాన్సన్ చార్లెస్ (27 బంతుల్లో 43; 8 ఫోర్లు)తో జతకట్టిన పూరన్... అఫ్గాన్‌పై విధ్వంసరచన చేశాడు. దీంతో జట్టు స్కోరు కేవలం 3.1 ఓవర్లలోనే 50 దాటింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ వేసిన ఈ నాలుగో ఓవర్లోనే ఏకంగా 36 పరుగులు వచ్చాయి. ఈ ఓవర్‌ను పూర్తిగా పూరనే ఎదుర్కొని 6, నోబ్+4, వైడ్+4, 0, లెగ్‌బై 4, 4, 6, 6లతో చుక్కలు చూపించాడు. ఈ మెరుపుల తుఫాన్‌తో కరీబియన్ జట్టు పవర్ ప్లే (6 ఓవర్లు)లో 92/1 స్కోరు చేసింది. 7.4 ఓవర్లలో జట్టు స్కోరు 100 దాటాక చార్లెస్ అవుటయ్యాడు. 37 బంతుల్లో 80 పరుగుల ధనాధన్ భాగస్వామ్యానికి తెరపడింది. క్రీజులోకి షై హోప్ (17 బంతుల్లో 25; 2 సిక్స్‌లు) రావడంతో పూరన్ 31 బంతుల్లో ఫిఫ్టీ పూర్తి చేసుకున్నాడు. కాసేపటికే హోప్ అవుట్ కావడంతో కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ (15 బంతుల్లో 26; 1 ఫోర్, 2 సిక్స్‌లు) కూడా ధాటిగానే ఆడాడు. ఆఖర్లో కెప్టెన్ రషీద్ ఖాన్ వేసిన 18వ ఓవర్‌ను అసాంతం ఆడిన పూరన్ 0, 6, 4, 6, 2, 6లతో 24 పరుగులు సాధించాడు. ఈ వేగంలో విండీస్ 19వ ఓవర్లో 200 పరుగుల మైలురాయిని దాటింది. కానీ ఆఖరి ఓవర్లో సెంచరీకి 2 పరుగుల దూరంలో పూరన్ రనౌటయ్యాడు. గుల్బదిన్ నైబ్‌కు 2 వికెట్లు దక్కగా, అజ్మతుల్లా ఒమర్జాయ్, నవీనుల్ హక్ చెరో వికెట్ తీశారు.

అఫ్గాన్ టపటపా...

అనంతరం అసాధ్యమైన లక్ష్యఛేదనకు దిగిన అఫ్గానిస్తాన్ 16.2 ఓవర్లలోనే 114 పరుగులకు కుప్పకూలింది. ఓపెనర్ ఇబ్రహీమ్ జద్రాన్ (28 బంతుల్లో 38; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించగా, నాలుగో వరుస బ్యాటర్ అజ్మతుల్లా (19 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్) కాస్త మెరుగ్గా ఆడారంతే! ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోరే చేయలేదు. విండీస్ బౌలర్లలో పేసర్ ఒబెద్ మెకాయ్ 3 వికెట్లు పడగొట్టగా... స్పిన్నర్లు గుడకేశ్ మోతీ, అకిల్ హోసీన్ చెరో 2 వికెట్లు తీశారు. ఈ గెలుపుతో విండీస్ గ్రూప్ 'సి'లో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గి అజేయంగా 'సూపర్–8' పోరుకు సమాయత్తమైంది.

టి20 ప్రపంచకప్‌లో నేడు

దక్షిణాఫ్రికా X అమెరికా

వేదిక: నార్త్‌సౌండ్; రాత్రి గం. 8 నుంచి

స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం


నీరజ్ చోప్రాకు స్వర్ణ పతకం



టుర్కు (ఫిన్‌లాండ్): ఈ సీజన్‌లో తన జోరు కొనసాగిస్తూ భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా మూడో పతకాన్ని సాధించాడు. మంగళవారం జరిగిన పావో నుర్మీ గేమ్స్‌లో ప్రస్తుత ప్రపంచ, ఒలింపిక్ చాంపియన్ నీరజ్ చోప్రా విజేతగా నిలిచి స్వర్ణ పతకాన్ని దక్కించుకున్నాడు. నీరజ్ జావెలిన్‌ను 85.97 మీటర్ల దూరం విసిరి అగ్రస్థానాన్ని సంపాదించాడు. టోనీ కెరనెన్ (ఫిన్‌లాండ్; 84.19 మీటర్లు) రజతం నెగ్గగా... ఒలివెర్ హెలాండర్ (ఫిన్‌లాండ్; 83.96 మీటర్లు) కాంస్య పతకాన్ని సాధించాడు. రెండుసార్లు ప్రపంచ చాంపియన్ అండర్సన్ పీటర్స్ (గ్రెనెడా; 82.58 మీటర్లు) నాలుగో స్థానంలో నిలిచాడు. ఈ ఏడాది నీరజ్ దోహా డైమండ్ లీగ్ మీట్‌లో రెండో స్థానాన్ని పొందగా... భువనేశ్వర్‌లో జరిగిన ఫెడరేషన్ కప్ మీట్‌లో పసిడి పతకాన్ని సొంతం చేసుకున్నాడు.

ఇంటర్వ్యూకు హాజరైన గంభీర్

త్వరలోనే భారత హెడ్ కోచ్ ఎంపిక



న్యూఢిల్లీ: భారత మాజీ ఓపెనర్లు గౌతమ్ గంభీర్, డబ్ల్యూవీ రామన్ టీమిండియా హెడ్ కోచ్ పదవి కోసం క్రికెట్ అడ్వైజరీ కమిటీ (సీఏసీ) ఆన్‌లైన్‌లో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. ప్రస్తుతం జట్టుతో పాటు ఉన్న హెడ్ కోచ్, బ్యాటింగ్ దిగ్గజం రాహుల్ ద్రవిడ్ పదవీ కాలం గత ఏడాది నవంబర్‌లో ముగిసింది. అయితే అమెరికా, వెస్టిండీస్‌లలో జరుగుతున్న టి20 ప్రపంచకప్ కోసం ద్రవిడ్‌కు తాత్కాలిక పొడిగింపు ఇచ్చారు. ఈ నేపథ్యంలో కొత్త కోచ్ కోసం ఇదివరకే భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అన్వేషణ మొదలు పెట్టింది. నోటిఫికేషన్, దరఖాస్తుల స్వీకరణ, స్క్రూటినీ పూర్తయ్యాక చివరకు మిగిలిన ఇద్దరు గంభీర్, రామన్‌లలో గౌతీనే ఖాయం చేద్దామని బోర్డు సుముఖంగా ఉంది. అయితే తుది ఇంటర్వ్యూ ముగించాకే సీఏసీ సిఫార్సు మేరకు నిర్ణయం వెలువరించాలనే యోచనలో బీసీసీఐ ఉంది. మంగళవారం సీఏసీ హెడ్ అశోక్ మల్హోత్రా ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్వ్యూలో గంభీర్, రామన్‌లు తమ ప్రజెంటేషన్ ఇచ్చారు. సుమారు 40 నిమిషాల పాటు టీమిండియా కోసం వచ్చే మూడేళ్లపాటు తన అనుభవాన్ని ఎలా వెచ్చిస్తాననేది, పూర్తిస్థాయిలో ఏమేరకు అందుబాటులో ఉంటాననేది గంభీర్ తెలిపాడు.

విద్యుత్ బకాయిలు చెల్లించిన హెచ్‌సీఏ



టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీకి చెక్ అందజేస్తున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

సాక్షి, హైదరాబాద్: పదేళ్లుగా తెలంగాణ స్టేట్ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీఎస్ఎస్‌పీడీసీఎల్)తో నడుస్తున్న విద్యుత్ వివాదానికి హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) అధ్యక్షుడు అర్శనపల్లి జగన్‌మోహన్ రావు, కార్యదర్శి దేవ్‌రాజ్ నేతృత్వంలోని కార్యవర్గం ముగింపు పలికింది. 2015లో మొదలైన ఈ విద్యుత్ జగడానికి తమ కార్యవర్గం శుభం కార్డు వేసిందని జగన్‌మోహన్ రావు వెల్లడించారు. సుమారు రూ. ఒక కోటి 64 లక్షల విద్యుత్ బిల్లు బకాయిగా ఉండగా, ఐపీఎల్ సమయంలో తొలుత రూ.15 లక్షలు చెల్లించామని ఆయన చెప్పారు. మిగిలిన మొత్తం 45 వాయిదాల్లో చెల్లించాలని అనుకున్నారు. అయితే హెచ్‌సీఏ పేరు ప్రతిష్టలను దృష్టిలో పెట్టుకుని ఒకేసారి అంతా చెల్లించామని ఆయన వివరించారు. మంగళవారం టీఎస్ఎస్‌పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ అలీ ఫరూఖీకి జగన్‌మోహన్ రావు రూ.1 కోటి 48 లక్షల 94 వేల 521ల మొత్తాన్ని చెక్ రూపంలో అందించారు. ఐపీఎల్ సందర్భంగా విద్యుత్ బిల్లు పెండింగ్‌లో ఉందనే కారణంతో క్రికెటర్లు ప్రాక్టీసు చేస్తుండగా కరెంట్ తీసేసి, హైదరాబాద్, తెలంగాణ ఇమేజ్‌ను దెబ్బతీసే విధంగా ప్రవర్తించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫరూఖీని జగన్ కోరారు.

భారత ఆర్చరీ జట్లకు టాప్ సీడింగ్



జ్యోతి సురేఖ

అంటాల్యా (టర్కీ): ప్రపంచకప్ ఆర్చరీ స్టేజ్–3 టోర్నీ కాంపౌండ్ విభాగంలో భారత పురుషుల, మహిళల జట్లకు టాప్ సీడింగ్ లభించింది. మంగళవారం జరిగిన క్వాలిఫయింగ్ రౌండ్‌లో ఆసియా క్రీడల చాంపియన్, ఆంధ్రప్రదేశ్ ప్లేయర్ వెన్నం జ్యోతి సురేఖ, ప్రపంచ చాంపియన్ అదితి, పర్ణీత్ కౌర్‌లతో కూడిన భారత మహిళల జట్టు 2100 పాయింట్లు స్కోరు చేసి టాప్ ర్యాంక్‌లో నిలిచింది. ఫలితంగా టీమ్ విభాగంలో భారత జట్టు నేరుగా క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఆడుతుంది. జ్యోతి సురేఖ 705 పాయింట్లతో రెండో స్థానంలో, అదితి 699 పాయింట్లతో 10వ స్థానంలో, పర్ణీత్ 696 పాయింట్లతో 14వ స్థానంలో నిలిచారు. ప్రియాంశ్ (710 పాయింట్లు), అభిషేక్ వర్మ (710 పాయింట్లు), ప్రథమేశ్ (705 పాయింట్లు)లతో కూడిన భారత పురుషుల కాంపౌండ్ జట్టు క్వాలిఫయింగ్ రౌండ్‌లో 2125 పాయింట్లు సాధించి అగ్రస్థానాన్ని దక్కించుకుంది.

ఒలింపిక్స్‌కు భారత షాట్‌గన్ జట్టు ప్రకటన



పృథ్వీరాజ్

న్యూఢిల్లీ: వచ్చే నెలలో జరిగే పారిస్ ఒలింపిక్స్ షూటింగ్ ఈవెంట్‌లో పాల్గొనే ఐదుగురు సభ్యులతో కూడిన భారత షాట్‌గన్ జట్టును ప్రకటించారు. జట్టులోకి ఎంపికైన ఐదుగురూ తొలిసారి ఒలింపిక్స్‌లో బరిలోకి దిగనున్నారు. పురుషుల ట్రాప్ విభాగంలో పృథ్వీరాజ్ తొండైమన్... మహిళల ట్రాప్ విభాగంలో రాజేశ్వరి కుమారి... పురుషుల స్కీట్ ఈవెంట్‌లో అనంత్‌జీత్ సింగ్ నరూకా... మహిళల స్కీట్ ఈవెంట్‌లో రైజా ధిల్లాన్, మహేశ్వరి చౌహాన్ భారత్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. స్కీట్ మిక్స్‌డ్ విభాగంలో అనంత్, మహేశ్వరి పోటీపడతారు. 37 ఏళ్ల పృథ్వీరాజ్ ఇప్పటి వరకు ప్రపంచకప్ టోర్నీల్లో ఒక స్వర్ణం, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలు సాధించాడు. పారిస్ ఒలింపిక్స్ జూలై 26 నుంచి ఆగస్టు 11 వరకు జరుగుతాయి. రైఫిల్, పిస్టల్, షాట్‌గన్ విభాగాల్లో కలిపి భారత్ నుంచి మొత్తం 21 మంది షూటర్లు పారిస్ ఒలింపిక్స్‌లో పోటీపడనున్నారు.

సినిమా

తర్వాత ఏం జరుగుతుందో ఊహించలేరు

– వరుణ్ సందేశ్



''నింద' చిత్రంలోని నా పాత్రకి, నిజ జీవితంలోని నాకు అస్సలు పోలిక ఉండదు. నేను సరదాగా ఉంటాను. సీరియస్‌గా ఉండను. 'నింద'లో నా మనస్తత్వానికి భిన్నమైన పాత్ర చేశాను. ఈ చిత్రంలో ఎంతో సెటిల్డ్‌గా, మెచ్యూర్డ్‌గా కనిపిస్తాను'' అని వరుణ్ సందేశ్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'నింద'. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం వరుణ్ సందేశ్ మీడియాతో పంచుకున్న విశేషాలు.

● నా కెరీర్‌లో ఒకే తరహా సినిమాలు చేస్తూ ఉండటంతో నాకే బోరింగ్‌గా అనిపించింది. దీంతో సినిమాల నుంచి కాస్త విరామం తీసుకుని యూఎస్ వెళ్లాను. అక్కడ రాజేశ్‌గారు 'నింద' కథ చెప్పారు. నచ్చడంతో ఈ సినిమా చేశాను. 'కానిస్టేబుల్' సినిమా షూటింగ్‌లో నా కాలికి గాయమైంది. అయితే రాజేశ్ గారి డెడికేషన్ చూసి రిస్క్ చేసి ఆ గాయంతోనే 'నింద' షూటింగ్‌లో పాల్గొన్నాను. ● సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్ జానర్‌లో ఇప్పటివరకూ ఎన్నో సినిమాలు వచ్చాయి. 'నింద' స్క్రీన్‌ప్లే కొత్తగా ఉంటుంది. తర్వాత ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. నటీనటుల్లో ఎవరికీ ఈ మూవీ పూర్తి కథను చెప్పలేదు రాజేశ్‌గారు. దీంతో ఆర్టిస్టుల్లోనూ ఈ సినిమాపై ఓ క్యూరియాసిటీ పెరిగింది. కథ పరంగా అసలు నేరస్థుడు ఎవరనే విషయాన్ని నేను కూడా చెప్పలేక పోయాను. ● మా దర్శక–నిర్మాత రాజేశ్‌గారి ఫ్రెండ్ అమెరికాలో 'నింద'ని రిలీజ్ చేస్తున్నారు. ఆయన మైత్రీ మూవీస్ నవీన్‌గారికి తెలుసు. అలా మైత్రీ శశిగారు మా సినిమా చూడటం, నచ్చడంతో నైజాంలో విడుదల చేస్తున్నారు. 'నింద' తర్వాత ఓ క్రేజీ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రానున్నాను. అలాగే 'కానిస్టేబుల్' అనే సినిమాలో నటిస్తున్నాను.

ఫ్రస్ట్రేషన్ ఖలాసే...



● ప్రియదర్శి

'హను–మాన్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'డార్లింగ్'. ప్రియదర్శి, నభా నటేష్ జంటగా నటిస్తున్న ఈ చిత్రానికి అశ్విన్ రామ్ దర్శకుడు. చైతన్య సమర్పణలో ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై కె. నిరంజన్ రెడ్డి నిర్మిస్తున్నారు. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ మూవీ నుంచి 'ఖలాసే..' అంటూ సాగే తొలి పాటని రిలీజ్ చేశారు. కాసర్ల శ్యామ్ సాహిత్యం అందించిన ఈ పాటను హనుమాన్ సీహెచ్‌తో కలిసి రామ్ మిరియాల పాడారు. ''రొమాంటిక్ కామెడీగా రూపొందుతోన్న చిత్రం 'డార్లింగ్'. ఫ్రస్ట్రేషన్ ఆంథమ్‌గా ప్రమోట్ చేస్తున్న 'ఖలాసే...' పాటలో ప్రియదర్శి తన డ్యాన్సింగ్ స్కిల్స్‌తో మెస్మరైజ్ చేస్తారు. ఈ పాట ఓ కామన్‌మ్యాన్ ఫ్రస్ట్రేషన్‌ని ప్రజెంట్ చేస్తుంది'' అన్నారు మేకర్స్. ఈ సినిమాకి కెమెరా: నరేష్ రామదురై.


తేదీ తార్ మార్



● 'దేవర'లో ఎన్టీఆర్



● 'పుష్ప–2'లో అల్లు అర్జున్



● 'డబుల్ ఇస్మార్ట్'లో రామ్



● 'లక్కీ భాస్కర్'లో దుల్కర్ సల్మాన్

వచ్చేస్తున్నా అంటూ ఓ డేట్ చెప్పారు. అయితే ఆ డేట్‌కి కాకుండా కాస్త లేట్‌గా వస్తా అంటున్నారు. చెప్పిన డేట్ కన్నా ముందే వస్తా అంటున్న వారూ ఉన్నారు. ఈ మధ్య కొన్ని తెలుగు చిత్రాల విడుదల తేదీలు తారుమారయ్యాయి. ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ' అలా వాయిదాలు పడి, ఫైనల్లీ ఈ 27న థియేటర్స్‌కి వస్తోంది. ఇలా రిలీజ్ డేట్‌ను తారుమారు చేసుకున్న కొన్ని చిత్రాల గురించి తెలుసుకుందాం.

దేవర.. ఓ పెద్ద కథ

'జనతా గ్యారేజ్' వంటి హిట్ ఫిల్మ్ తర్వాత హీరో ఎన్టీఆర్, దర్శకుడు కొరటాల శివ కాంబినేషన్‌లో 'దేవర' సినిమాని ప్రకటించినప్పుడే విడుదల తేదీ (2024 ఏప్రిల్ 5న)ని కూడా ప్రకటించారు మేకర్స్. కానీ కథ పెద్దది కావడంతో ఈ సినిమాను రెండు భాగాలుగా రిలీజ్ చేస్తున్నట్లుగా ఆ తర్వాత పేర్కొన్నారు. అయితే చిత్రీకరణ ప్లాన్ చేసిన ప్రకారం జరగకపోవడంతో తొలి భాగం విడుదలను అక్టోబరు 10కి వాయిదా వేశారు. కానీ కాస్త ముందుకి వస్తున్నాడు 'దేవర'. సెప్టెంబరు 27న విడుదల చేస్తున్నట్లుగా ప్రకటించారు. ముందుగా ప్రకటించిన మరో సినిమా సెప్టెంబరు 27న రాకపోవడంతో ఈ తేదీకి 'దేవర' రావడానికి రెడీ అయ్యాడట. కల్యాణ్‌రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం ద్వారా జాన్వీ కపూర్ తెలుగు తెరకు హీరోయిన్‌గా పరిచయం కానున్నారు.

పుష్పరాజ్... సీన్ రిపీట్

'పుష్ప' ఫ్రాంచైజీ తొలి భాగం 'పుష్ప: ది రైజ్' 2021 డిసెంబరు 17న విడుదలై, మంచి విజయం సాధించింది. హీరో పుష్పరాజ్‌గా టైటిల్ రోల్ చేసిన అల్లు అర్జున్‌కి ఉత్తమ జాతీయ నటుడి అవార్డుని తెచ్చిపెట్టింది ఈ చిత్రం. సుకుమార్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో రష్మికా మందన్నా కథానాయిక. ఇక తొలి భాగం సాధించిన విజయంతో జోష్‌గా మలి భాగం 'పుష్ప: ది రూల్'ను ఆరంభించారు. కొంత చిత్రీకరణ తర్వాత ఈ సినిమాను ఆగస్టు 15న రిలీజ్ చేయనున్నట్లు ప్రకటించారు. కానీ అనుకున్న సమయానికి చిత్రీకరణ పూర్తి కాలేదు. క్వాలిటీ విషయంలో కాంప్రమైజ్ కాలేక 'పుష్ప: ది రూల్' రిలీజ్‌ను ఆగస్టు 15 నుంచి డిసెంబరు 6కు వాయిదా వేస్తున్నట్లుగా ప్రకటించారు. 'పుష్ప: ది రైజ్'ను కూడా తొలుత 2021 ఆగస్టు 13న విడుదల చేయాలనుకున్నారు. కానీ డిసెంబరులో విడుదల చేశారు. అలాగే 'పుష్ప 2: ది రూల్'ని 2024 ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకుని డిసెంబరు 6కి మార్చారు. తొలి భాగానికి జరిగిన సీన్ రిపీట్ అయింది. మైత్రీమూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్‌పై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

డబుల్ ఇస్మార్ట్ రెడీ

'ఇస్మార్ట్ శంకర్'గా హీరో రామ్‌లోని మాస్ యాంగిల్‌ని ఓ రేంజ్‌లో చూపించారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ చిత్రం 2019లో విడుదలై, సూపర్ హిట్‌గా నిలిచింది. 'ఇస్మార్ట్ శంకర్' కథలో సీక్వెల్‌కు స్కోప్ ఉండటంతో రామ్‌తోనే 'డబుల్ ఇస్మార్ట్'ను ప్రకటించారు పూరి. ఈ సినిమా ప్రకటించిన రోజునే 2024 మార్చి 18న రిలీజ్ చేయనున్నట్లు కూడా వెల్లడించారు. కానీ విడుదల కాలేదు. ఆ తర్వాత జూలైలో విడుదల కావొచ్చనే ప్రచారం సాగింది. ఈ మూవీ చిత్రీకరణ అనుకున్నట్లుగా సాగలేదట. దీంతో 'డబుల్ ఇస్మార్ట్' సినిమాను ఆగస్టు 15న రిలీజ్‌కి రెడీ చేస్తున్నట్లుగా తాజాగా ప్రకటించారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానున్న ఈ చిత్రానికి పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మాతలు.

ముందుకు రానున్న లక్కీ భాస్కర్

'మహానటి', 'సీతా రామం' వంటి సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు దగ్గరయ్యారు మలయాళ నటుడు దుల్కర్ సల్మాన్. ఈ హీరో ప్రస్తుతం చేస్తున్న సినిమా 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ సినిమాను నిర్మిస్తున్నారు. కాగా 'లక్కీ భాస్కర్'ని సెప్టెంబరు 27న విడుదల చేస్తున్నట్లుగా ఇటీవల ప్రకటించారు. కానీ ఎన్టీఆర్ 'దేవర' సినిమా అదే తేదీకి తెరపైకి రానుంది. 'లక్కీ భాస్కర్' సినిమా నిర్మాతల్లో ఒకరైన సూర్యదేవర నాగవంశీ 'దేవర' సినిమా డిస్ట్రిబ్యూషన్ హక్కులను తీసుకున్నారట. దీంతో ఒకే రోజు ఒకే బ్యానర్ నుంచి రెండు సినిమాల విడుదల ఎందుకని భావిస్తున్నారట నాగవంశీ. ఈ నేపథ్యంలో 'లక్కీ భాస్కర్'ను కాస్త ముందుగానే ఆగస్టులో విడుదల చేయాలనే ఆలోచనలో ఉన్నారని భోగట్టా. అయితే ఆగస్టు 15న ఇప్పటికే రామ్ 'ఇస్మార్ట్ శంకర్', కీర్తి సురేష్ 'రఘుతాత' సినిమాలు ఉన్నాయి. సో.. 'లక్కీ భాస్కర్' ఏ తేదీన వస్తాడో చూడాలి. ఇక దుల్కర్ సూపర్ హిట్ మూవీ 'సీతారామం' 2022 ఆగస్టు తొలివారంలో విడుదలైంది. ఈ సెంటిమెంట్‌ని అనుసరించి, 'లక్కీ భాస్కర్'ని కూడా ఆగస్టు తొలి వారంలో రిలీజ్ చేస్తారా? అనే చర్చ కూడా జరుగుతోంది.

ఈ కోవలోనే మరికొన్ని సినిమాల రిలీజ్ డేట్‌లు ముందుకు, వెనక్కు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి.

ప్రపంచంలోని అందరూ కల్కికి కనెక్ట్ అవుతారు

– నాగ్ అశ్విన్



''కల్కి 2898 ఏడీ' చిత్రకథ రాయడానికి నాకు ఐదేళ్లు పట్టింది. ఈ సైన్స్ ఫిక్షన్ మైథాలజీని చూసి ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'' అని డైరెక్టర్ నాగ్ అశ్విన్ అన్నారు. ప్రభాస్ హీరోగా నటించిన చిత్రం 'కల్కి 2898 ఏడీ'. ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ మూవీ నుంచి ఆదివారం విడుదలైన 'భైరవ ఆంథమ్' ఇండియన్స్ బిగ్గెస్ట్ సాంగ్ ఆఫ్ ది ఇయర్‌గా టాప్ చార్ట్‌లో నిలిచినట్లు మేకర్స్ తెలిపారు. కాగా 'ఎపిక్ జర్నీ ఎపిసోడ్ 1 – ది ప్రిల్యూడ్ ఆఫ్ కల్కి 2898 ఏడీ' అనే వీడియోను విడుదల చేసింది యూనిట్. ఆ వీడియోలో డైరెక్టర్ నాగ్ అశ్విన్ మాట్లాడుతూ– ''చిన్నప్పటి నుంచి నాకు పౌరాణిక చిత్రాలంటే చాలా ఇష్టం. 'పాతాళ భైరవి, భైరవ ద్వీపం, ఆదిత్య 369' ఇష్టమైన సినిమాలు. హాలీవుడ్ 'స్టార్ వార్స్' లాంటి సినిమాలు చూసినప్పుడు చాలా బాగున్నాయనిపించేది. కానీ ఇలాంటివి అక్కడే ఉండాలా? మన కథలతోనూ సినిమా తీయొచ్చు కదా అనిపించేది. ఆ ఆలోచనలోంచి పుట్టినదే 'కల్కి 2898 ఏడీ'. మన మహాభారతంలో ఎన్నో గొప్ప పాత్రలు ఉన్నాయి. కృష్ణావతారంతో అది ఎండ్ అవుతుంది. అక్కడి నుంచి కలియుగానికి ప్రవేశించినప్పుడు ఈ కథ ఎలా వెళుతుందనే ఊహతో 'కల్కి' రాశాను. కేవలం ఇండియాలోనే కాదు.. ప్రపంచంలోని అందరూ ఈ కథకు రిలేట్ అవుతారు'' అన్నారు.

ప్రేక్షకుల్ని ఆకర్షించేది టైటిలే

– దర్శకుడు తేజ



● తేజ, బాబ్జీ

''ఏ సినిమాకైనా ప్రేక్షకులను మొదట ఆకర్షించేది, వారిని థియేటర్‌కి వచ్చేలా చేసేది టైటిల్ మాత్రమే. 'పోలీస్ వారి హెచ్చరిక' అలాంటి శక్తివంతమైన మాస్ టైటిల్. చిత్ర యూనిట్‌కి ఈ సినిమా మంచి విజయాన్ని అందిస్తుంది అనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ తేజ అన్నారు. సన్నీ అఖిల్, అజయ్ ఘోష్, రవి కాలే, 'శుభలేఖ' సుధాకర్, షాయాజీ షిండే, హిమజ, జయవాహినీ, 'శంకరాభరణం' తులసి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'పోలీస్ వారి హెచ్చరిక'. బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మించిన ఈ చిత్రం టైటిల్ లోగోను తేజ విడుదల చేశారు. ఈ సందర్భంగా బెల్లి జనార్ధన్ మాట్లాడుతూ– ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రమిది'' అన్నారు. ''ప్రస్తుతం మా సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుపుకుంటోంది'' అన్నారు బాబ్జీ.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
308	92
77,301	23,558

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లష్' చూడండి

విదేశీ సూచీలు (రాత్రి రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్డాక్	17,876	▲ 40
డోజోన్స్	38,813	▲ 35
ఎఫ్టీఎస్ఈ 100	8,191	▲ 49
డాక్స్	18,132	▲ 64
షాంఘై	3,030	▲ 14
నికాయ్	38,482	▲ 380

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9 క్యారట్)	71,285
బంగారం (99.5 క్యారట్)	71,000
వెండి (కిలో)	87,553

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎసబిఐ	81.73	85.41
£	బ్రిటన్ పౌండ్	ఎసబిఐ	103.45	108.40
€	యూరో	ఎసబిఐ	87.34	91.83
¥	జపాన్ ఎన్ (100)	ఎసబిఐ	42.00	64.00
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎసబిఐ	52.78	57.63
S$	సింగపూర్ డాలర్	ఎసబిఐ	59.44	64.14
SAR	సౌదీ రియాల్	థామస్ కుక్	21.39	22.94
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్ కుక్	21.86	23.65
¥	చైనా యువాన్	థామస్ కుక్	10.40	12.47

మనోళ్లు 'మ్యాగీ' లాగించేస్తున్నారు!



• భారత్‌లోనే అత్యధికంగా వినియోగం
• కిట్‌క్యాట్‌కు టాప్–2 మార్కెట్‌గా స్థానం

న్యూఢిల్లీ: మ్యాగీ.. బహుశా భారత్‌లో ఈ పేరు తెలియనివారు ఉండరేమో. నూడుల్స్‌కు మారుపేరుగా స్థానం సంపాదించిందంటే ఎంతలా మార్కెట్లోకి చొచ్చుకుపోయిందో అర్థం చేసుకోవచ్చు. నూడుల్స్, సూప్స్ ఉత్పత్తులను ఎఫ్ఎంసీజీ దిగ్గజం నెస్లే మ్యాగీ బ్రాండ్ కింద విక్రయిస్తున్న సంగతి తెలిసిందే. అయితే ప్రపంచవ్యాప్తంగా మ్యాగీ ఉత్పత్తుల అమ్మకాల్లో భారత్ తొలి స్థానంలో నిలవడం విశేషం. 2023–24లో ఏకంగా 600 కోట్లకుపైగా సర్వింగ్స్ (ఒకరు తినగలిగే పరిమాణాన్ని ఒక సర్వింగ్‌గా పరిగణిస్తారు) స్థాయిలో అమ్మకాలు నమోదయ్యాయని కంపెనీ వెల్లడించింది. అంతేకాదు నెస్లే కిట్‌క్యాట్ బ్రాండ్‌కు టాప్–2 మార్కెట్‌గా భారత్ స్థానం సంపాదించింది. గత ఆర్థిక సంవత్సరంలో 420 కోట్ల కిట్‌క్యాట్ ఫింగర్స్ అమ్ముడయ్యాయి. ఈ విషయాలను నెస్లే ఇండియా తన 2023–24 వార్షిక నివేదికలో వెల్లడించింది. రెండంకెల వృద్ధితో నెస్లే ఇండియా వేగంగా దూసుకెళ్తున్న మార్కెట్లలో ఒకటిగా నిలిచిందని సంస్థ తెలిపింది. భారత్‌లో 10వ ప్లాంటును నెస్లే ఒడిశాలో ఏర్పాటు చేస్తోంది. ప్లాంట్ల విస్తరణ, సామర్థ్యం పెంపునకు 2020–25 మధ్య రూ.7,500 కోట్లు వెచ్చిస్తున్నట్టు నెస్లే ఇండియా సీఎండీ సురేశ్ నారాయణన్ వెల్లడించారు. గడిచిన ఎనిమిదేళ్లలో కంపెనీ భారత్‌లో 140కిపైగా ఉత్పత్తులను పరిచయం చేసింది.

ఇక్సిగో లిస్టింగ్
అధరహో!

ముంబై: ఆన్‌లైన్ ట్రావెల్ బుకింగ్ ప్లాట్‌ఫామ్‌ను నిర్వహిస్తున్న లీ ట్రావెన్యూస్ టెక్నాలజీ (ఇక్సిగో) షేరు లిస్టింగ్ సూపర్ హిట్టయ్యింది. ఇష్యూ ధర(రూ.93)తో పోలిస్తే బీఎస్ఈలో 45% ప్రీమియంతో రూ.135 వద్ద లిస్టయ్యింది. ఇన్వెస్టర్లు ఈ షేరుకు కొనేందుకు ఆసక్తి చూపడంతో రోజంతా లాభాల్లో ట్రేడైంది. చివరికి 74% పెరిగి ఇంట్రాడే గరిష్టం రూ.162 వద్ద ముగిసింది. ఎక్సేంజీల్లో మొత్తం 76.43 లక్షల షేర్లు చేతులు మారాయి. కంపెనీ మార్కెట్ విలువ రూ.6,276 కోట్లుగా నమోదైంది.



భారత్‌లో గూగుల్ 'జెమిని' యాప్

తెలుగు, హిందీలో కూడా లభ్యం

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) అసిస్టెంట్ 'జెమిని' ఆండ్రాయిడ్ యాప్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టినట్లు టెక్ దిగ్గజం గూగుల్ తెలిపింది. ఇంగ్లిష్‌తో పాటు తెలుగు, హిందీ సహా తొమ్మిది భారతీయ భాషల్లో ఇది అందుబాటులో ఉంటుందని వివరించింది. ఐఫోన్ యూజర్ల కోసం గూగుల్ యాప్ ద్వారా మరికొన్ని వారాల్లో జెమిని యాప్‌ను ప్రవేశపెడతామని పేర్కొంది. భారత్‌లో విద్యార్థుల నుంచి డెవలపర్ల వరకు వివిధ వర్గాల వారు ఉత్పాదకతను పెంచుకునేందుకు, కొత్త విషయాలు నేర్చుకునేందుకు, సృజనాత్మకతను మెరుగుపర్చుకునేందుకు దీన్ని ఉపయోగించుకుంటున్నారని జెమిని ఎక్స్‌పీరియన్సెస్ వైస్ ప్రెసిడెంట్ అమర్ సుబ్రమణ్య ఒక బ్లాగ్ పోస్ట్‌లో తెలిపారు. తాజాగా గూగుల్‌కి చెందిన లేటెస్ట్ ఏఐ మోడల్ జెమిని 1.5 ప్రో ఫీచర్లు కూడా భారత్‌లోని యూజర్లకు అందుబాటులో ఉంటాయని వివరించారు.



పాలసీ విధానంలో మార్పు 'దుస్సాహసం': శక్తికాంతదాస్



ముంబై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) అనుసరిస్తున్న ద్రవ్య పరపతి విధానంలో ఇప్పటికిప్పుడు ఏదైనా మార్పు చేస్తే అది ''చాలా ముందస్తు చర్య'' అవుతుందని గవర్నర్ శక్తికాంతదాస్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఇటువంటి ''సాహసోపేత చర్యలకు'' దూరంగా ఉండాలని కూడా ఆయన పేర్కొన్నారు. ఒక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ విభాగంలో అధిక ట్రేడింగ్ వాల్యూమ్‌లను సెబీతో పాటు రిజర్వ్ బ్యాంక్ పర్యవేక్షిస్తోందని అన్నారు. అయితే దానిపై ఏ చర్య అయినా.. మార్కెట్ రెగ్యులేటర్ సెబీ తీసుకుంటుందని దాస్ చెప్పారు.

ఎన్ఎండీసీ నూతన పరిశోధన కేంద్రం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైనింగ్ రంగ దిగ్గజం ఎన్ఎండీసీ నూతన పరిశోధన, అభివృద్ధి కేంద్రాన్ని హైదరాబాద్ సమీపంలోని పటాన్‌చెరు వద్ద ఏర్పాటు చేసింది. ఖనిజాల ప్రాసెసింగ్, ఉక్కు సాంకేతికతలో స్థిర ఆవిష్కరణలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా ఈ సెంటర్‌ను నెలకొల్పారు. రూ.50 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ కేంద్రాన్ని సంస్థ మంగళవారం ప్రారంభించింది. అయిదేళ్లలో పరిశోధన, అభివృద్ధికి రూ.150 కోట్లు ఖర్చు చేసినట్టు ఎన్ఎండీసీ సీఎండీ (అదనపు బాధ్యతలు) అమితవ ముఖర్జీ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

19-6-2024	
విశాఖ	500–00
చిత్తూరు	553–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	480–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	500–00
వరంగల్	502–00
రిటైల్ ధర	5.60

రికార్డుల ర్యాలీ

• అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూలతలు
• 77,000 స్థాయిపై ముగిసిన సెన్సెక్స్
• బ్యాంకులు, ఐటీ షేర్లకు భారీ డిమాండ్



ముంబై: అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందడంతో పాటు బ్యాంకులు, ఐటీ షేర్లు రాణించడంతో స్టాక్ సూచీల రికార్డుల ర్యాలీ మూడో రోజూ కొనసాగింది. ఉదయం లాభాలతో మొదలైన సూచీలు రోజంతా పరిమిత శ్రేణిలో కదలాడి ఇంట్రాడే, ముగింపులో సరికొత్త రికార్డులు లిఖించాయి. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పూర్తి ఆర్థిక సంవత్సరం(2024–25) కోసం వచ్చే నెలలో ప్రవేశపెట్టనున్న సమగ్ర బడ్జెట్ వృద్ధికి ప్రాధాన్యతనిస్తూనే., ప్రజారంజకంగా ఉంటుందని మార్కెట్ వర్గాలు విశ్వసిస్తున్నాయి. సెన్సెక్స్ ఉదయం 242 పాయింట్ల లాభంతో 77,235 వద్ద మొదలైంది.

ట్రేడింగ్‌లో 374 పాయింట్లు పెరిగి 77,366 వద్ద జీవితకాల గరిష్టాన్ని తాకింది. చివరికి 308 పాయింట్ల లాభంతో 77,301 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్‌లో నిఫ్టీ 113 పాయింట్లు బలపడి 23,579 వద్ద రికార్డు గరిష్టాన్ని నమోదు చేసింది. ఆఖరికి 92 పాయింట్లు 23,558 వద్ద ముగిసింది. బ్యాంకులు, ఐటీతో పాటు రియల్టీ, కన్జూమర్, యుటిలిటీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ స్మాల్, మిడ్ క్యాప్ సూచీలు 1శాతం, అరశాతం చొప్పున రాణించాయి. ఆటో, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్ షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. అమెరికా మార్కెట్లు జీవితకాల గరిష్టానికి చేరుకోవడంతో ప్రపంచ ఈక్విటీ మార్కెట్లు లాభాల్లో ట్రేడవుతున్నాయి.

ఇన్వెస్టర్ల సంపద రయ్...

సెన్సెక్స్ నాలుగోరోజూ రాణించడంతో బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మొత్తం విలువ జీవితకాల గరిష్టానికి చేరింది. మంగళవారం ఒక్క రోజే రూ.2.42 లక్షల కోట్లు పెరగడంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ మార్కెట్ క్యాప్ రూ. 437.24 లక్షల కోట్లకు చేరింది. ఈ మొత్తం 4 రోజుల్లో రూ.10.29 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది.

■ అమెరికా ఫ్యాషన్ దుస్తుల సంస్థ హానెస్ బ్రాండ్స్‌తో వ్యాపార కాంట్రాక్టు కొనసాగింపుతో పాటు జీజీఎస్‌టీతో కొత్త వ్యాపార భాగస్వామ్య ఒప్పందాన్ని కుదుర్చుకోవడంతో విప్రో షేరు 3% పెరిగి రూ.492 వద్ద ముగిసింది.

■ రక్షణ మంత్రిత్వ శాఖ నుంచి 156 తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ల కొనుగోళ్ల ఆర్డర్ దక్కించుకోవడంతో హిందుస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్(హెచ్ఏఎల్) షేరు 6 శాతం పెరిగి రూ. 5,533 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో 7% ఎగసి రూ. 5,565 వద్ద ఏడాది గరిష్టాన్ని అందుకుంది.

రూ. 20 లక్షల వరకు ఆదాయంపై పన్ను ఊరటనివ్వాలి

బడ్జెట్‌పై కేంద్రానికి సీఐఐ వినతి

న్యూఢిల్లీ: త్వరలో పెట్టబోయే పూర్తి స్థాయి బడ్జెట్‌లో వినియోగానికి ఊతమిచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కేంద్రాన్ని పరిశ్రమల సమాఖ్య సీఐఐ కోరింది. ఇందులో భాగంగా రూ. 20 లక్షల వరకు వార్షికాదాయం ఉన్న వ్యక్తులకు ఆదాయపు పన్నుపరంగా 'స్వల్ప ఊరట' ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అలాగే, పీఎం కిసాన్ స్కీము కింద ఇచ్చే మొత్తాన్ని పెంచాలని, వినియోగాన్ని ప్రోత్సహించేందుకు ఉపాధి హామీ పథకం కింద వేతనాన్ని కూడా పెంచాలని కోరింది. ఇలాంటి చర్యలతో వినియోగానికి తోడ్పాటు లభించగలదని పేర్కొంది. బడ్జెట్ ప్రతిపాదనలపై కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రాకు రాసిన లేఖలో సీఐఐ ప్రెసిడెంట్ సంజీవ్ పురి పలు అంశాలను ప్రస్తావించారు. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాలను తగ్గించడం, క్యాపిటల్ గెయిన్స్ ట్యాక్స్‌ల క్రమబద్ధీకరణ, ప్రస్తుత స్థాయిల్లోనే కార్పొరేట్ ట్యాక్స్‌లను కొనసాగించడం వీటిలో ఉన్నాయి. ఆర్‌బీఐ నుంచి లభించిన రూ. 2.11 లక్షల కోట్లలో కొంత మొత్తాన్ని ప్రభుత్వం వినియోగించుకోవచ్చని సీఐఐ సూచించింది.



గ్లాండ్ ఫార్మాలో వాటా విక్రయం

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఔషధ తయారీలో ఉన్న హైదరాబాద్ సంస్థ గ్లాండ్ ఫార్మాలో 5 శాతం వాటాను విక్రయించాలని షాంఘై ఫోసన్ ఫార్మాస్యూటికల్ గ్రూప్ కో నిర్ణయించింది. ఫోసన్‌కు గ్లాండ్ ఫార్మాలో 58 శాతం వాటా ఉంది. ఒకేసారి మొత్తం వాటాను అమ్మడం వీలుకాకపోవడంతో బ్లాక్ డీల్స్ రూపంలో వాటాలను ఉపసంహరించుకుంటోంది. తాజా డీల్ ద్వారా ఒక్కొక్కటి రూ.1,750 చొప్పున 82 లక్షల షేర్లను అమ్మనుంది. వీటి విలువ రూ.1,435 కోట్లు. గ్లాండ్ ఫార్మాలో 74 శాతం వాటాను 2017లో 1.1 బిలియన్ డాలర్లకు ఫోసన్ దక్కించుకుంది. క్రితం ముగింపుతో పోలిస్తే గ్లాండ్ ఫార్మా షేరు ధర మంగళవారం 0.49 శాతం క్షీణించి రూ.1,838.50 వద్ద స్థిరపడింది.

భవిత

ప్రభుత్వ ఉద్యోగాల సమగ్ర సమాచారం జాబ్ పాయింట్ | ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

జాబ్ పాయింట్

నార్త్ ఈస్టర్న్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్- నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్ఈఆర్ పరిధిలోని వివిధ యూనిట్లలో అప్రెంటిస్‌షిప్ శిక్షణకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 1104;
శిక్షణ వ్యవధి: ఒక ఏడాది.
» **వర్క్‌షాప్/యూనిట్:** మెకానికల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), బ్రిడ్జ్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్), మెకానికల్ వర్క్‌షాప్(ఇజ్జత్‌నగర్), డీజిల్ షెడ్(ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్ (ఇజ్జత్‌నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్(లక్నో జంక్షన్), డీజిల్ షెడ్(గోండా), క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి).
» **ట్రేడ్‌లు:** ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్.
» **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 12.06.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**11.07.2024
» **వెబ్‌సైట్:** https://ner.indianrailways.gov.in

సెబీలో 97 ఆఫీసర్ గ్రేడ్ -ఎ (అసిస్టెంట్ మేనేజర్) పోస్టులు

ముంబైలోని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా(సెబీ).. వివిధ స్ట్రీమ్‌లలో ఆఫీసర్ గ్రేడ్–ఎ(అసిస్టెంట్ మేనేజర్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 97.
» **స్ట్రీమ్:** జనరల్–62, లీగల్–05, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ–24, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్–02, రీసెర్చ్–02, అఫీషియల్ లాంగ్వేజ్–02.
» **అర్హత:** సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్/ఎల్ఎల్‌బీ/పీజీ/సీఏ/సీఎఫ్ఏ/సీఎస్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి 30 ఏళ్లు మించకూడదు.
» **పే స్కేల్:** నెలకు రూ.44,500 నుంచి రూ.89,150.
» **ఎంపిక విధానం:** ఫేజ్–1, ఫేజ్–2(పరీక్షలు), ఫేజ్–3(ఇంటర్వ్యూ), డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 11.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తు ఫీజు చెల్లింపు చివరితేది:** 30.06.2024.
» **ఫేజ్–1 ఆన్‌లైన్ పరీక్షతేది:** 27.07.2024.
» **ఫేజ్–2 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 31.08.2024.
» **ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్ట్రీమ్ ఫేజ్–2 పేపర్–2 పరీక్ష తేది:** 14.09.2024.
» **వెబ్‌సైట్:** https://www.sebi.gov.in

కాటన్ కార్పొరేషన్, నవీ ముంబైలో 214 పోస్టులు

నవీ ముంబైలోని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్..డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 214
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(లీగల్)–01, అసిస్టెంట్ మేనేజర్ (అఫీషియల్ లాంగ్వేజ్)–01, మేనేజ్‌మెంట్ ట్రైనీ(మార్కెటింగ్)–11, మేనేజ్‌మెంట్ ట్రైనీ (అకౌంట్స్)–20, జూనియర్ కమర్షియల్ ఎగ్జిక్యూటివ్–120, జూనియర్ అసిస్టెంట్(జనరల్)–20, జూనియర్ అసిస్టెంట్(అకౌంట్స్)–40, జూనియర్ అసిస్టెంట్(హిందీ ట్రాన్స్‌లేటర్)–01.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ, సీఏ/సీఎంఏ, బీఎస్సీ, బీకాం, లా డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ మేనేజర్ పోస్టులకు 32 ఏళ్లు,ఇతర పోస్టులకు 30 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ మేనేజర్ పోస్టుకు రూ.40,000 నుంచి రూ.1,40,000. మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు రూ.30,000 నుంచి రూ.1,20,000, ఇతర పోస్టులకు రూ.22,000 నుంచి రూ.90,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **పరీక్ష కేంద్రాలు:** ముంబై/నవీ ముంబై, హైదరాబాద్, న్యూఢిల్లీ, చెన్నై, లక్నో, చండీగఢ్, కోల్‌కతా, బెంగళూరు, అహ్మదాబాద్, పాట్నా, జయపుర.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 12.06.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**02.07.2024
» **వెబ్‌సైట్:** https://cotcorp.org.in

» 1,526 పోస్టులకు బీఎస్ఎఫ్ నోటిఫికేషన్
» ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలు
» బీఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఎంపిక ప్రక్రియ
» పే లెవల్ 5, 4లతో ప్రారంభ వేతనం

సాయుధ దళాల్లో.. పోలీస్ కొలువు

దేశ అంతర్గత భద్రతలో కీలకమైన సాయుధ దళాల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్.. మొత్తం 1,526 పోస్టులకు ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. ఎంపికైతే ప్రారంభంలోనే పే లెవల్ 4, 5లతో ఆకర్షణీయ వేతనం అందుకునే అవకాశం లభిస్తుంది. ఈ నేపథ్యంలో.. బీఎస్ఎఫ్ తాజాగా విడుదల చేసిన నోటిఫికేషన్ వివరాలు, ఎంపిక విధానం, రాత పరీక్ష, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ టిప్స్ తదితర సమాచారం..



పోలీస్ ఉద్యోగాలంటే యువతలో ఎంతో క్రేజ్. అందుకే ఇంటర్ మొదలు ప్రొఫెషనల్ డిగ్రీల ఉత్తీర్ణుల వరకూ.. వేల మంది పోలీస్ కొలువుల కోసం పోటీ పడుతుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో ఇంటర్మీడియెట్ అర్హతతోనే సాయుధ దళాల్లో ఉద్యోగాలు సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తోంది బీఎస్ఎఫ్ తాజా నోటిఫికేషన్.

మొత్తం పోస్టులు 1,526

▪ బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ సాయుధ దళాల్లో మొత్తం 1,526 పోస్టుల భర్తీకి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసింది. ఇందులో ఏఎస్ఐ 243 పోస్టులు, హెడ్ కానిస్టేబుల్ పోస్టులు 1,283 ఉన్నాయి.
▪ **అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్(స్టెనోగ్రాఫర్/కంబాటెంట్ స్టెనోగ్రాఫర్), వారంట్ ఆఫీసర్ (పర్సనల్ అసిస్టెంట్):** బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్(బీఎస్ఎఫ్)లో 17 పోస్టులు, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సీఆర్‌పీఎఫ్)లో 21 పోస్టులు, ఇండో టిబెటిన్ పోలీస్ ఫోర్స్(ఐటీబీపీ)లో 56 పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్(సీఐఎస్ఎఫ్)లో 146 పోస్టులు, సశస్త్ర సీమాబల్(ఎస్ఎస్‌బీ)లో 3 పోస్టులు చొప్పున భర్తీ చేయనున్నారు.
▪ **హెడ్ కానిస్టేబుల్(మినిస్టీరియల్/కంబాటెంట్ మినిస్టీరియల్), హవాల్దార్(క్లర్క్):** బీఎస్ఎఫ్‌లో 302 పోస్టులు, సీఆర్‌పీఎఫ్‌లో 282 పోస్టులు, ఐటీబీపీలో 163 పోస్టులు, సీఐఎస్ఎఫ్‌లో 496 పోస్టులు, ఎస్ఎస్‌బీలో 5 పోస్టులు, అస్సాం రైఫిల్స్‌లో 35 పోస్టులు ఉన్నాయి.

అర్హతలు

▪ ఆగస్టు 1, 2024 నాటికి ఇంటర్మీడియెట్ తత్సమాన కోర్సు ఉత్తీర్ణత ఉండాలి.
▪ **వయసు:** ఆగస్టు 1, 2024 నాటికి 18–25 ఏళ్లు ఉండాలి. గరిష్ఠ వయో పరిమితిలో ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున సడలింపు లభిస్తుంది.

మూడు దశల ఎంపిక ప్రక్రియ

ఏఎస్ఐ, హెడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి మూడు దశల ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు. అవి.. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, కంప్యూటర్ బేస్డ్ రిటెన్ టెస్ట్, స్కిల్ టెస్ట్.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

ఇందులో భాగంగా అభ్యర్థులకు నిర్దేశిత శారీరక ప్రమాణాలను పేర్కొన్నారు. పురుష అభ్యర్థులు 165 సెంటీమీటర్ల ఎత్తు, ఛాతీ విస్తీర్ణం 77 సెంటీమీటర్లు(శ్వాస తీసుకున్నప్పుడు 82 సెంటీ మీటర్లు కలిగుండాలి. మహిళా అభ్యర్థులు 150 సెంటీమీటర్లు ఎత్తు ఉండాలి. ఈ ప్రమాణాలు ఉన్న వారికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ నిర్వహిస్తారు.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

▪ పీఎస్‌టీలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా పరుగు పందెం నిర్వహిస్తారు.
▪ పురుష అభ్యర్థులు 1.6 కిలో మీటర్ల దూరాన్ని ఆరు నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు 800 మీటర్ల దూరాన్ని నాలుగు నిమిషాల 45 సెకన్లలో పూర్తి చేయాలి.

రాత పరీక్ష

▪ పీఎస్‌టీ, పీఈటీలలో ఉత్తీర్ణత సాధించిన వారికి తదుపరి దశలో కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ నిర్వహిస్తారు.
▪ మొత్తం 100 మార్కులకు నిర్వహించే ఈ పరీక్షలో అయిదు విభాగాల (హిందీ /ఇంగ్లిష్, జనరల్ ఇంటెలిజెన్స్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, క్లరికల్ ఆప్టిట్యూడ్, కంప్యూటర్ నాలెడ్జ్) నుంచి ప్రశ్నలు అడుగుతారు.
▪ ఒక్కో విభాగం నుంచి 20 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 100 ప్రశ్నలు–100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు.
▪ పరీక్షకు అందుబాటులో ఉండే సమయం 1 గంట 40 నిమిషాలు.
▪ హిందీ/ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగాలకు సంబంధించి అభ్యర్థులు తమకు ఆసక్తి ఉన్న విభాగాన్ని ఎంచుకోవచ్చు.

స్కిల్ టెస్ట్

▪ కంప్యూటర్ బేస్డ్ రాత పరీక్షలో చూపిన ప్రతిభ ఆధారంగా.. ఏఎస్ఐ పోస్టులకు 1:30 (ఒక్కో పోస్టుకు 30 మంది), హెడ్ కానిస్టేబుల్ పోస్టులకు 1:10 (ఒక్కో పోస్టుకు 10 మంది) నిష్పత్తిలో అభ్యర్థుల జాబితా రూపొందించి.. వారికి తదుపరి దశలో స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు.
▪ స్కిల్ టెస్ట్‌లో భాగంగా ఏఎస్ఐ అభ్యర్థులకు నిమిషానికి 80 పదాలు చొప్పున పది నిమిషాల వ్యవధిలో ఏదైనా అంశాన్ని డిక్టేట్ చేస్తారు. దాన్ని వారు ఇంగ్లిష్‌లో అయితే 50 నిమిషాల్లో, హిందీలో అయితే 65 నిమిషాల్లో కంప్యూటర్‌లో టైప్ చేయాల్సి ఉంటుంది.
▪ హెడ్ కానిస్టేబుల్ అభ్యర్థులు స్కిల్ టెస్ట్‌లో భాగంగా నిమిషానికి 35 పదాలు చొప్పున టైప్ చేయాల్సి ఉంటుంది.

ప్రారంభ వేతనం

పీఎస్‌టీ,పీఈటీ,కంప్యూటర్ బేస్డ్ టెస్ట్,స్కిల్ టెస్ట్, మెడికల్ ఎగ్జామినేషన్‌లలో విజయం సాధించిన వారిని తుది విజేతలుగా నిర్ణయిస్తారు.వీరికి నియామకాలు ఖరారు చేస్తారు. ఏఎస్ఐ ఉద్యోగాలకు పే లెవల్–5 (రూ.29,200–రూ.92,300); హెడ్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు పే లెవల్ 4 (రూ.25,500 –రూ.81,100)తో ప్రారంభ వేతనం అందుతుంది.

ముఖ్య సమాచారం

▪ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
▪ **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, జూలై 8.
▪ **సీబీటీ తేదీ:** 2024, అక్టోబర్‌లో నిర్వహించే అవకాశం.
▪ **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** సీఆర్‌పీఎఫ్ గ్రూప్ సెంటర్ (హైదరాబాద్).
▪ **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://rectt.bsf.gov.in

రాత పరీక్షలో రాణించేలా

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించడానికి బేసిక్ గ్రామర్‌పై అవగాహన పెంచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూట్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి.. అందులోని ముఖ్యాంశాలతో సొంత శైలిలో పరీక్షలో నిర్దేశించిన మాదిరిగా క్రోడీకరించడానికి సాధన చేయాలి.

జనరల్ ఇంటెలిజెన్స్

ఈ విభాగంలో స్కోర్ కోసం వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరిస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

న్యూమరికల్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, అల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

క్లరికల్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో స్కోర్ కోసం డేటా చెకింగ్, కంపేరిజన్, స్పెల్ చెక్, స్పాటింగ్ ద ఎర్రర్స్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

కంప్యూటర్ నాలెడ్జ్

ఈ విభాగంలో రాణించేందుకు బేసిక్ కంప్యూటర్ ఫండమెంటల్స్, కంప్యూటర్స్ వినియోగం, ఆపరేటింగ్ సిస్టమ్, ఎంఎస్ ఆఫీస్ టూల్స్, ఇంటర్నెట్ బ్రౌజింగ్, ఈ–మెయిల్ అంశాలపై దృష్టి పెట్టాలి.

ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్

రాత పరీక్ష కంటే ముందు నిర్వహించే ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో రాణించడానికి అభ్యర్థులు రాత పరీక్ష ప్రిపరేషన్ దశ నుంచే ఆ దిశగా కృషి చేయాలి. ప్రతి రోజు కనీసం రెండు గంటలు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పేర్కొన్న అంశాలను ప్రాక్టీస్ చేయాలి. ఈ ఫిజికల్ ప్రాక్టీస్ ఉదయం వేళల్లో చేస్తే శారీరక అలసటకు దూరంగా ఉండొచ్చు. ఇలా దరఖాస్తు సమయం నుంచే సన్నద్ధత పొందితే విజయావకాశాలు మెరుగవుతాయి.

క్లుప్తంగా...



ఎమ్మెల్సీ కవితను కలిసిన మాజీ మంత్రులు

సాక్షి, న్యూఢిల్లీ: న్యాయం గెలిచే వరకూ న్యాయ పోరాటం దిశగా అడుగులు వేద్దాం అంటూ ఎమ్మెల్సీ కవితకు మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ భరోసా ఇచ్చారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసులో ఆరోపణలను ఎదుర్కొంటూ తిహార్ జైల్లో ఉన్న కవితను సబితా ఇంద్రారెడ్డి, సత్యవతి రాథోడ్ మంగళవారం పరామర్శించారు. రాష్ట్ర రాజకీయాలపై కొంతసేపు కవితతో చర్చించారు. ఢిల్లీ లిక్కర్ కుంభకోణం కేసు ఆరంభం నుంచి నేటి వరకు జరిగిన పరిణామాలను విశ్లేషిస్తూ.. అధైర్యపడాల్సిన అవసరం లేదని సూచించారు. త్వరలో విడుదలై కవిత అందరి మధ్యలోకి వస్తారంటూ సబిత, సత్యవతి రాథోడ్ ఆకాంక్షించారు.

పటాన్‌చెరు, సంగారెడ్డి వరకు మెట్రోరైలు

- మెట్రోరైల్ ఎండీకి మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి



సాక్షి, హైదరాబాద్: మెట్రోరైలును మొదటిదశలో మియాపూర్ నుంచి పటాన్‌చెరు, రెండోదశలో సంగారెడ్డి వరకు పొడిగించాలని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్‌రావు విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఈ మేరకు మెట్రో రైల్ ఎండీకి వినతి పత్రం అందించారు. తమ విజ్ఞప్తిపై స్పందించిన ఎన్వీఎస్ రెడ్డి వెంటనే గ్రౌండ్ రిపోర్ట్ తెప్పిస్తామని హామీ ఇచ్చారని రఘునందన్‌రావు తెలిపారు. నెలరోజుల్లో డీపీఆర్ పూర్తిచేసి, సీఎం దృష్టికి తీసుకెళ్తామని ఎండీ చెప్పారన్నారు. ఆసియా ఖండంలో అతి పెద్ద పారిశ్రామికవాడల్లో ఒకటైన పటాన్‌చెరుకు రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ రద్దీ విపరీతంగా పెరగడంతో పాటు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా పెరుగుతాయన్నారు. తనను ఎంపీగా గెలిపిస్తే మెట్రోను పటాన్‌చెరు నుంచి సంగారెడ్డి దాకా పొడిగించేలా చేస్తానని ప్రజలకు హామీ ఇచ్చినట్లు చెప్పారు. గతంలో బీజేపీ ఆధ్వర్యంలో సంగారెడ్డిలో ఈ అంశంపై పెద్ద నిరసన కూడా చేపట్టామని రఘునందన్‌రావు గుర్తుచేశారు.

నిందితుల ఆస్తులు స్వాధీనం చేసుకోవాలి

సాక్షి, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితులుగా ఉన్న పోలీస్ అధికారులు అక్రమంగా కూడబెట్టిన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని, అనైతికంగా పొందిన పదోన్నతులను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ న్యాయవాది చలిచీమల మోహన్ మంగళవారం డీజీపీకి ఫిర్యాదు చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో నిందితులుగా ఉన్న మాజీ పోలీస్ అధికారులు రాధా కిషన్ రావు, భుజంగరావు, తిరుపతన్న, ప్రణీత్ రావుల అక్రమాస్తులపై ప్రత్యేకంగా విచారణ జరపాలని, ఇందుకు ఏసీబీ ద్వారా కేసు నమోదు చేయించి విచారణ జరపాలని కోరారు. డీజీపీకి ఫిర్యాదు చేసిన వారిలో న్యాయవాది మోహన్‌తో పాటు, మరో న్యాయవాది భాస్కరాచారి ఉన్నారు.

'ఆశ' వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

సాక్షి, హైదరాబాద్: ఆశ వర్కర్లకు వెంటనే పెండింగ్ జీతాలు చెల్లించాలని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శిల్పా రెడ్డి డిమాండ్ చేశారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన జీతాల పెంపు హామీని నిలబెట్టుకోవాలని కోరారు. ఆశ వర్కర్ల సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ కోఠిలోని డీఎంఈ కార్యాలయం ఎదుట మహిళా మోర్చా ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా నిర్వహించారు. ఆశ వర్కర్ల పెండింగ్ జీతాలు వెంటనే చెల్లించాలని, జాబ్ చార్టు వేయాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు వారి జీతాలను రూ.9 వేల నుంచి రూ.18 వేలకు పెంచాలని, వారికి ఈఎస్ఐ, పీఎఫ్ వచ్చేలా చూడాలని కోరారు. ఈ మేరకు డీఎంఈ జేడీ డాక్టర్ పద్మజకు వినతిపత్రం సమర్పించామని డాక్టర్ శిల్పారెడ్డి తెలిపారు.

తొమ్మిది గంటలు ఆలస్యంగా స్పైస్‌జెట్

శంషాబాద్: సాంకేతిక సమస్య కారణంగా హైదరాబాద్ నుంచి ఢిల్లీ మీదుగా జమ్మూ వెళ్లాల్సిన విమానం 9 గంటలు ఆలస్యంగా బయల్దేరింది. శంషాబాద్ విమానాశ్రయం నుంచి మంగళవారం ఉదయం స్పైస్‌జెట్ విమానం ఎస్‌జీ-160 విమానం ఇక్కడి నుంచి ఢిల్లీ బయల్దేరేందుకు సిద్ధమైంది. కానీ విమానంలో ఉన్న సాంకేతిక సమస్యను గుర్తించిన అధికారులు నిలిపివేశారు. ఉదయం 10 గంటలకు బయల్దేరుతుందని ప్రయాణికులకు తెలిపారు. ఎప్పటికీ బయల్దేరకపోవడంతో ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. సాంకేతిక సమస్యను పరిష్కరించిన అనంతరం మధ్యాహ్నం 2.52 గంటలకు విమానం టేకాఫ్ తీసుకుని సాయంత్రం 4.50 గంటలకు ఢిల్లీ చేరుకుంది. తిరిగి అక్కడి నుంచి జమ్మూ బయల్దేరిందని ఎయిర్‌పోర్టు వర్గాలు వెల్లడించాయి.

నాడు ఏడాదికి 2 లక్షలు.. ఇప్పుడు 60 వేలు

దేశ ఐటీ రంగంలో భారీగా తగ్గిన ఫ్రెషర్స్ నియామకాలు

- రెండు దశాబ్దాల్లోనే అతి తక్కువగా ఫ్రెషర్స్ రిక్రూట్‌మెంట్
- 10 వేల మందికి పైగా విద్యార్థులు ఆఫర్ లెటర్స్‌తో ఎదురుచూపులు
- క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ లేక ఇబ్బందుల్లో కాలేజీల యాజమాన్యాలు
- అయినా ఐటీ వైపే మొగ్గు చూపుతున్న ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్



సాక్షి, హైదరాబాద్: భారత సాఫ్ట్‌వేర్ కంపెనీలు గత రెండు దశాబ్దాల్లోనే అత్యల్పంగా... 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఫ్రెషర్స్‌కు ఉద్యోగ అవకాశాలు కల్పించాయి. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక మందగమనం, ఐటీ సేవల ఆర్డర్లు తగ్గుదలతో దేశీయ ఐటీ రంగం ఇప్పటికే ఇబ్బందుల్లో పడగా, తాజా పరిణామాలు మరింత ఆందోళన పరుస్తున్నాయి. కోవిడ్‌కు ముందు ఏడాదికి 2 లక్షల మంది ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్‌ను సాఫ్ట్‌వేర్ కంపెనీలు హైర్ చేయగా.. ఇప్పుడది 60-70 వేలకు పడిపోయింది. ఇదే కాకుండా వివిధ ఐటీ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికైన 10 వేల మందికి పైగా విద్యార్థులు ఆఫర్‌లెటర్స్‌తో ఉద్యోగాల్లో చేరేందుకు ఎదురుచూపులు చూస్తున్నారు. దేశవ్యాప్తంగా ఐఐటీలతో సహా ప్రతిష్టాత్మక కాలేజీలు, యూనివర్సిటీల్లోనూ ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్‌కు ప్లేస్‌మెంట్స్ గణనీయంగా తగ్గాయి. ఈ హైరింగ్‌లకు పెద్ద ఐటీ కంపెనీలు దూరంగా ఉండటంతో కాలేజీల యాజమాన్యాలు సైతం తీవ్ర సమస్యలు ఎదుర్కొంటున్నాయి. అయితే, ఈ పరిస్థితుల్లోనూ ఫ్రెష్ గ్రాడ్యుయేట్స్, విద్యార్థులు ఐటీ వైపే మొగ్గు చూపడం ఓ చిక్కుముడిగా మారుతోంది.

ఇదీ వాస్తవ పరిస్థితి...

దేశంలో ఐటీ రంగంలో ఫ్రెషర్స్ అవకాశాల కల్పన తగ్గుదలకు సంబంధించి ఎక్స్-ఫెనో అనే హెచ్ఆర్ సంస్థ అధ్యయనం నిర్వహించింది. క్యాంపస్ ప్లేస్‌మెంట్లకు సంబంధించి గతేడాది నుంచి అనేక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్టు వివిధ కాలేజీల యాజమాన్యాలు చెప్పాయి. పెద్ద కంపెనీలు మార్చి, ఏప్రిల్‌లో ఫ్రెషర్స్‌ను రిక్రూట్ చేసుకునే ప్రక్రియలో భాగంగా అంతకు ముందు ఏడాది జూలై, ఆగస్టుల నుంచే డిగ్రీ పూర్తిచేయబోయే విద్యార్థులకు ట్రయల్స్ నిర్వహించడం ఆనవాయితీగా ఉంది. అయితే ఈసారి క్యాంపస్‌లకు వచ్చేందుకూ కంపెనీలు సుముఖతను వ్యక్తంచేయకపోవడం యాజమాన్యాలు, విద్యార్థులను కలవరపరుస్తోంది. దాదాపు 70 శాతం విద్యార్థులు ఐటీ ఉద్యోగాలనే కోరుకుంటున్నా.. అందుకు తగ్గట్లు రిక్రూట్‌మెంట్ జరగకపోవడం వారిని నిరాశకు గురిచేస్తోంది. 2023లో కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులను కూడా కొన్ని కంపెనీలు ఇంకా ప్లేస్‌మెంట్స్‌కు పరిగణనలోకి తీసుకోలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే గతేడాదితో పోల్చితే ఈ ఏడాది 70-80 శాతం దాకా ఆన్‌క్యాంపస్ హైరింగ్ తగ్గిపోయినట్టుగా తెలుస్తోంది. అంతే కాకుండా వస్తున్న అవకాశాల్లో 85 శాతం దాకా ఏడాదికి రూ.3-6 లక్షల లోపు ప్యాకేజీల్లోనే వస్తున్నాయని చెబుతున్నారు.

మరో 6 నెలలు ఇలాగే ఉండొచ్చు..

కనీసం వచ్చే ఆరునెలల దాకా ఇదే ట్రెండ్ కొనసాగే అవకాశాలున్నాయి. ఫ్రెషర్స్‌కు డిమాండ్ పెరిగే అవకాశాలపై ఇప్పుడే చెప్పలేం. కానీ రాబోయే రోజుల్లో పరిస్థితి మెరుగయ్యే అవకాశముంది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కొనసాగింపు, ఇజ్రాయెల్- హమాస్‌ల మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగడం, వచ్చే నవంబర్‌లో అమెరికా అధ్యక్ష ఎన్నికలు, యూఎస్, ఇతర దేశాల్లో వడ్డీరేట్లు ఎక్కువగా ఉండటం అనే అంశాలు ప్రతికూల ప్రభావం చూపిస్తున్నాయి. అదీగాక, ఉద్యోగాలపై కృత్రిమమేథ (ఏఐ) పాత్ర ఎలా ఉంటుందనే విషయంపై ఇంకా పూర్తి స్పష్టత రాలేదు. 2008లోనూ ఇదే విధమైన గందరగోళ పరిస్థితులు ఎదురయ్యాయి. సాంకేతికంగా సమూలమార్పులు వస్తుండటంతో, అప్‌గ్రేడేషన్ అనేది ప్రాధాన్యత సంతరించుకుంది. ఆటోమేషన్ పెరుగుదలతో క్లౌడ్, అనలిటిక్స్ తదితరాలకు గణనీయంగా డిమాండ్ పెరిగింది.

-వెంకారెడ్డి, వైస్‌ప్రెసిడెంట్, సీనియర్ హెచ్ఆర్ లీడర్, కో ఫోర్జ్

ఇప్పట్లో కొత్త ప్రాజెక్టులు కష్టమే..

ఫ్రెషర్స్, ఇంజనీరింగ్ విద్యార్థులు తమ సమయాన్ని వృథా చేసుకోకుండా నాన్‌ఐటీ ప్రాజెక్టులు, హెల్త్‌కేర్ సర్వీసెస్, హాస్పిటల్ ఇన్సూరెన్స్ కలెక్షన్ వంటి వాటిపై దృష్టి పెట్టాలి. కంటెంట్ మోడరేషన్, మ్యాపింగ్ వంటి వాటికి డిమాండ్ పెరుగుతోంది. ఫ్రెషర్స్ 2025 సంవత్సరమంతా కూడా లర్నింగ్ జాబ్‌గా చూసుకుని, ఇండియాలోనే ఎంబీఏ, డేటా/బిజినెస్ అనలిటిక్ వంటి కోర్సులు చేస్తే మంచి అవకాశాలు వస్తాయి. అమెరికా అధ్యక్ష ఎన్నికలు ముగిశాక... వడ్డీరేట్లు తగ్గించడం మొదలుపెడితే అక్కడ ఆర్థిక మాంద్యం మొదలయ్యే సూచనలున్నాయి. అందువల్ల మరో 6 నుంచి 9 నెలల దాకా అక్కడి నుంచి కొత్త ప్రాజెక్టులు రాకపోవచ్చు. ప్రస్తుతం దేశీయ సర్వీస్ ప్రొవైడర్ సంస్థలు 'డేటా మైగ్రేషన్' ప్రాజెక్ట్‌లపై ఆధారపడుతున్నాయి. రాబోయే రోజుల్లోనూ ఈ ప్రాజెక్టులు పెద్ద ఎత్తున రాబోతున్నాయి.

-ఎస్.లావణ్యకుమార్, సహ వ్యవస్థాపకుడు, స్మార్ట్‌స్టెప్స్


ఐటీలో కోతల కాలం!


▶ మొదటి పేజీ తరువాయి

పైచిలుకు ఉద్యోగులకు ఉద్వాసన పలికినట్లు https://layoffs.fyi అనే సంస్థ వెల్లడించింది. ఉద్యోగాల కోత 2024లోనూ కొనసాగుతోంది. 2024లోమే నాటికి 326 కంపెనీలు 98 వేల మందికి కత్తెరవేశాయి. పెద్ద కంపెనీలే కాదు స్టార్టప్స్ సైతం ఇదే బాట పట్టాయి. ఇక కొన్ని కంపెనీలైతే నష్టాలను భరించలేక ఏకంగా తమ కార్యకలాపాలను నిలిపేశాయి. డెల్ కంపెనీ గత ఏడాది 13వేల మందికి పింక్ స్లిప్ ఇవ్వగా, ఈ ఏడాది 6వేల మందిని సాగనంపింది. టెస్లా కంపెనీలో ఎలాన్ మస్క్ రాత్రికి రాత్రే తమ ఉద్యోగులను ఇంటికి పంపుతున్నట్టు మెయిల్స్ పంపారు. దీంతో వందలాది మంది ఉద్యోగులు తమ ఉద్యోగాలను కోల్పోయారు. మైక్రోసాఫ్ట్ 1,900 మందికి కోతపెట్టగా, తీవ్ర నష్టాల ఊబిలో కూరుకుపోయిన బైజూస్ 500 మందిని తొలగించింది. ఇంకా యాపిల్, డెల్, సోనీ, సిస్కో, స్విగ్గీ, యూట్యూబ్, గూగుల్, డుయోలింగో కంపెనీలు కూడా తమ సిబ్బందిని తగ్గించుకున్నాయి.

ఇన్నోవేషన్ వల్లేనా..

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), మెషీన్ లెర్నింగ్ (ఎంఎల్), ఆటోమేషన్ వల్ల ఉత్పాదకత పెరుగుతుందని అందరూ భావించారు. వీటి వాడకం వల్లే ఉద్యోగాల్లో కోత పడుతోందని లేఆఫ్స్ సంస్థ విశ్లేషించింది. ఇన్నొవేషన్ మూలంగా ఉద్యోగాలపై తీవ్ర ప్రభావం చూపుతోందని అంటున్నారు. అయితే అందుకు అనుగుణంగా నైపుణ్యాలు పెంచుకుంటే ఉద్యోగ భద్రత ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా ఉద్యోగుల పనితీరును అంచనా వేసిన తర్వాతే అడ్జస్ట్‌మెంట్‌లో భాగంగా కంపెనీలు ఉద్యోగాల్లో కోత పెడతాయని అంటున్నారు.





మంచి పర్‌ఫార్మెన్స్ చూపించినా..

కంపెనీకి క్లయింట్స్ లేకపోవడంతో ఆర్థిక ఇబ్బందులున్నా కూడా తొలగించేస్తారు. ప్రాజెక్టులు లేకపోవడం కూడా ఉద్యోగులపై ప్రభావం పడుతుంది. ఎంతగా పర్‌ఫార్మెన్స్ చూపించినా కూడా వారికి అవసరం లేకపోయినా.. బడ్జెట్ లేకపోయినా ఉద్వాసన పలుకుతారు. ఎప్పుడు ఉద్యోగం తొలగిస్తారోనన్న భయంతో ఉద్యోగం చేయాల్సి వస్తోంది.

-మౌనిక, సాఫ్ట్‌వేర్ డెవలపర్, హైదరాబాద్

ఇద్దరి పని ఒక్కరిపైనే..

ఎజైల్ స్క్రమ్ మెథడాలజీ వ్యవస్థతో ఉద్యోగుల పనితీరును ప్రతి రోజూ అంచనా వేస్తుంటారు. ఇచ్చిన టార్గెట్‌ను ఎప్పటికప్పుడు పూర్తి చేయాల్సి ఉంటుంది. లేదంటే అందుకు కారణాలను పై అధికారులకు చెప్పుకోవాల్సి ఉంటుంది. ఒకటి రెండుసార్లు ఇలాగే జరిగితే చెప్పాపెట్టకుండా తొలగించేస్తారు. కంపెనీపై ఆర్థిక భారం తగ్గించుకునేందుకు ఇద్దరి ముగ్గురి పని కూడా ఒకరిపైనే వేసి.. మిగిలిన వారికి పింక్ స్లిప్ ఇస్తున్నారు.

-పల్లె నరేశ్, ప్రిన్సిపల్ ఇంజనీర్

తప్పని పరిస్థితుల్లోనే..



కాస్త ఇబ్బందికరమే అయినా కంపెనీ ఆర్థిక పరిస్థితులు, ఉద్యోగుల పనితీరు తదితర అంశాలను దృష్టిలో ఉంచుకుని లే ఆఫ్స్ ప్రకటిస్తుంటాం. ఆర్థిక మాంద్యం ప్రభావాలను తట్టుకోవడం మార్కెట్‌లో పోటీ, ఆర్థికంగా స్థిరంగా ఉండేందుకు తప్పని పరిస్థితుల్లో ఇలా చేయాల్సి వస్తుంది. సాంకేతికతకు అనుగుణంగా ఉద్యోగులు కూడా నైపుణ్యాలు నేర్చుకోకపోతే ఉద్యోగాలు కోల్పోక తప్పని పరిస్థితి ఉంది.

-కీర్తి రెడ్డి, బోల్డ్ ఫ్యూజ్ కంపెనీ వ్యవస్థాపకురాలు

రాహిల్ బెయిల్ కొట్టివేత

మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడికి చుక్కెదురు

సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ హిట్ అండ్ రన్ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు రాహిల్ దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2022, ఫిబ్రవరి 17న కేబుల్ బ్రిడ్జి మీద థార్ వాహనం ఢీకొట్టిన ఘటనలో ముగ్గురు గాయపడగా ఓ చిన్నారి మృతి చెందాడు. కారులోని ముగ్గురు యువకులు అక్కడి నుంచి పరారయ్యారు. థార్ వాహనంపై అప్పటి బోధన్ ఎమ్మెల్యే షకీల్ పేరుతో స్టిక్కర్ ఉండటం చర్చనీయాంశంగా మారింది. అయితే కారు నడిపింది తానేనంటూ ఆఫ్రాన్ అనే యువకుడు పోలీసుల ముందు లొంగిపోయాడు. బాధితుల వాంగ్మూలంతో వాహనం నడిపింది రాహిలే అని జూబ్లీహిల్స్ పోలీసులు నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలంటూ రాహిల్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎస్.తుకారాంజీ మంగళవారం విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున పీపీ వాదనలు వినిపిస్తూ.. పిటిషనర్‌కు బెయిల్ ఇస్తే తన కుటుంబానికి ఉన్న రాజకీయ, ఆర్థిక బలంతో సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని వాదించారు. ఈ దశలో బెయిల్ ఇవ్వడం సరికాదని స్పష్టం చేశారు. పీపీ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. ముందస్తు బెయిల్ నిరాకరించారు.

కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్



కడెం: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కవ్వాల్ టైగర్ జోన్‌లో ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ మంగళవారం కనిపించింది. నిర్మల్ జిల్లా కడెం మండలం ఉడుంపూర్ అటవీ రేంజ్ పరిధిలోని దోస్తనగర్ అటవీ ప్రాంతంలో దీన్ని గుర్తించినట్లు డీఆర్వో ప్రకాశ్, ఎఫ్‌బీవో ప్రసాద్ తెలిపారు. 'కలౌల పుల్ర్రా'అని పిలువబడే ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ మైక్రోహాలిడే కుటుంబంలో భాగమైన ఒక చిన్న ప్రత్యేకమైన ఉభయచర జీవి అని డీఆర్వో ప్రకాశ్ చెప్పారు. గుండ్రని శరీరం విలక్షణమైన (గోధుమ, నారింజ, లేదా పసుపు) రంగు కలిగి ఉంటుందన్నారు. ఈ కప్పలు సాధారణంగా అడవుల నుంచి వ్యవసాయ భూములు, నీటి వనరుల ఉన్న చోట ఆవాసం ఏర్పచుకుంటాయని తెలిపారు. ఈ కప్పల ప్రధాన ఆహారం కీటకాలని, ఇవి రాత్రి పూట సంచరిస్తూ జిగట నాలుకతో కీటకాలను వేటాడి ఆహారంగా తీసుకుంటాయని వివరించారు. పగలు వీటిని గుర్తించడం కష్టమన్నారు. విభిన్న వన్య ప్రాణులకు నిలయమైన కవ్వాల్ టైగర్ జోన్‌లో ఇండియన్ పెయింటెడ్ ఫ్రాగ్ కనిపించడం జీవ వైవిధ్యానికి దోహదం చేస్తుందని డీఆర్వో ప్రకాశ్ పేర్కొన్నారు.

పూర్వీకులిచ్చిన వరం 'యోగా'..

- ప్రాంతం, మతాలతో యోగాకు సంబంధం లేదు..
- మంత్రి దామోదర్ రాజనర్సింహ
- ఆయుష్ ఆధ్వర్యంలోని యోగా వాక్‌ను ప్రారంభించిన ఆరోగ్యశాఖ మంత్రి



యోగా డే కర్టెన్‌రైజర్ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దామోదర రాజనర్సింహ

సాక్షి, హైదరాబాద్: పూర్వీకులు మనకిచ్చిన గొప్ప చారిత్రక సంపద యోగ, మానసిక-శారీరక ఆరోగ్యానికి మేలు చేసే యోగాను ప్రతి ఒక్కరూ వారి దినచర్యలో భాగం చేసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖల మంత్రి దామోదర్ రాజనర్సింహ పిలుపునిచ్చారు. ప్రపంచ యోగ దినోత్సవాన్ని (జూన్ 21) పురస్కరించుకొని అయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో మంగళవారం నెక్లెస్ రోడ్ వేదికగా నిర్వహించిన కర్టెన్ రైజర్ ప్రోగ్రాంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ ఫ్లాగ్ ఆఫ్ చేసి యోగా వాక్‌ను ప్రారంభించారు. రాష్ట్ర అయుష్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ ప్రశాంతి, డైరెక్టర్ పాణికిరణ్, నేచురపతి, హోమియోపతి విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 5 వేల సంవత్సరాల మన చరిత్రకు నిదర్శనం యోగా అని అన్నారు. యోగాకు ప్రాంతం, మతంతో సంబంధం లేదన్నారు. యోగా అంటే మంచి ఆరోగ్యమని, ప్రకృతిలో ఓ భాగమని మంత్రి రాజనర్సింహ తెలిపారు. యోగాను ప్రతీ పాఠశాల, కాలేజీల్లో పాఠ్యాంశాల్లో చేర్చాలని సూచించారు. ఈ నెల 21న రాష్ట్రంలోని ప్రతీ యువత భాగస్వామ్యులై ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఘనంగా జరపాలని కోరారు. రాష్ట్ర ఆయుష్ డిపార్ట్‌మెంట్ కమిషనర్ ప్రశాంతి మాట్లాడుతూ., నగరంలో యోగాపై అవగాహన పెంచడానికి మాల్స్‌లో ఫ్లాష్ మాబ్‌లు, హైటెక్ సిటీలో ప్రత్యేక ప్రదర్శనలు చేపట్టామన్నారు. 21వ తేదీ వరకు రోజూ వివిధ ప్రాంతాల్లో యోగావాక్‌ను నిర్వహిస్తున్నామన్నారు.

శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదిరింపు

- ఎయిర్‌పోర్టు మెయిల్‌కు సందేశం

శంషాబాద్ (హైదరాబాద్): శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు పెట్టినట్టు గుర్తు తెలియని వ్యక్తి బెదిరింపు మెయిల్ పంపడం కలకలం సృష్టించింది. విమానాశ్రయం అధికారిక మెయిల్‌కు మంగళవారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఒక బెదిరింపు సందేశం వచ్చింది. శంషాబాద్ విమానాశ్రయంలో బాంబు అమర్చినట్లు.. అది త్వరలోనే పేలుతుందని ఉంది. మెయిల్ సందేశంతో అప్రమత్తమైన భద్రతాధికారులు వెంటనే భద్రతను కట్టుదిట్టడం చేసి అణువణువు జల్లెడ పట్టారు. దీనిపై వెంటనే ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇది గతంలో పలుమార్లు వచ్చిన ఆకతాయి చర్యే అయి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మెయిల్ చేసిన వ్యక్తి దేశంలోని అనేక విమానాశ్రయాలతో పాటు సుమారు వందమందికి ఈ బెదిరింపు సందేశం పంపినట్లు గుర్తించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.